అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
గురువారం 20-7-2023
సంపుటి : 9 సంచిక : 200 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar www.navatelangana.com 14 పేజీలు వెల : 6.50

ఆర్టీఐ చట్టంలో మార్పులొద్దు

- డేటా ప్రొటెక్షన్ బిల్లుకు సిద్ధమవుతున్న కేంద్రం
- నిపుణులు, విశ్లేషకుల ఆందోళన






న్యూఢిల్లీ : డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) బిల్లుకు కేంద్రం సిద్ధమవుతున్నది. ఈ బిల్లు ఆమోదం కోసం రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో బిల్లు ప్రవేశపెట్టడానికి తయారవుతున్నది. దీంతో ఈ బిల్లు విషయంలో పలు అనుమానాలు, ...6లో

తీస్తా సెతల్వాద్‌కు ఊరట



రెగ్యులర్ బెయిల్ మంజూరు..కస్టడీ విచారణ అవసరం లేదు



- గుజరాత్ హైకోర్టు తీర్పు కొట్టివేత..ఆ నిర్ణయం హేతుబద్ధంగా లేదు
- పరిశీలన సక్రమంగా లేదు.. : స్పష్టం చేసిన సుప్రీం కోర్టు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గుజరాత్ అల్లర్లు-2002కు సంబంధించి తీస్తా సెతల్వాద్‌కు రెగ్యులర్ బెయిల్ తిరస్కరిస్తూ, తక్షణం లొంగిపోవాలంటూ హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాలపై సెతల్వాద్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను బుధవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ ఎఎస్ బోపన్న, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించి గుజరాత్ హైకోర్టు ఆదేశాలను కొట్టివేసింది. కల్పిత ...13లో

ఎన్డీఏ ప్రధాన భాగస్వాములు దర్యాప్తు సంస్థలే

సమావేశానికి వారూ హాజరై ఉండాల్సింది: బృందా కరత్ ఎద్దేవా



- బీజేపీకి అధికారమే ప్రధానం
- దాని ఓటమికి అందరూ ఏకమవ్వాలి
- ఎన్డీఏలో సగం మంది ఫిరాయింపుదారులే
- యూసీసీ అంటే యూనిఫామ్ కమ్యునల్ కోడ్

న్యూఢిల్లీ : కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ, ఆదాయపన్ను శాఖలే ప్రధాన భాగస్వామ్య పక్షాలని సీపీఐ (ఎం) నేత బృందా కరత్ వ్యాఖ్యానించారు. న్యూఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భేటీకి ఆ సంస్థలు హాజరై ఉండాల్సిందని ఆమె ఎద్దేవా చేశారు. బృందా కరత్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాడి నుంచి దేశాన్ని కాపాడేందుకు తామంతా చేరువయ్యామని ...13లో

అప్రమత్తంగా ఉండాలి

ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి

- ప్రాణ నష్టం జరగకుండా చూడటం ప్రథమ కర్తవ్యం : కేటీఆర్
- వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారులతో సమీక్ష



హైదరాబాద్ జీహెచ్ఎంసీ, పురపాలక శాఖ ఉన్నతాధికారులతో మంత్రి కేటీఆర్ సమీక్ష

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రస్తుతం భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో హైదరాబాద్ నగర పరిధిలో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఐటీ పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు పురపాలక శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా నానక్‌రామ్‌గూడలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో బుధవారం జీహెచ్ఎంసీ, పురపాలక శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రెండు మూడ్రోజుల పాటు నగరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కావునా నగరపాలక సంస్థ ఇతర శాఖలన్నింటితో సమన్వయం చేసుకొని సిద్ధంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా జలమండలి, విద్యుత్ శాఖ, హైదరాబాద్ రెవెన్యూ యంత్రాంగం, ట్రాఫిక్ పోలీస్ వంటి కీలకమైన విభాగాలతో నిరంతరం సమన్వయం ...13లో



నేటి నుంచి పార్లమెంట్

ఆగస్టు 11 వరకు వర్షాకాల సమావేశాలు

- 31 బిల్లులను జాబితా చేసిన మోడీ ప్రభుత్వం
- అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీలు
- ప్రజా సమస్యలపై చర్చ చేయాలి : ప్రతిపక్షం
- మేము సిద్ధంగానే ఉన్నాం : కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి



పార్లమెంట్ అఖిలపక్ష సమావేశంలో అధికార, ప్రతిపక్ష సభ్యులు....

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నేటి నుంచి జరగనున్నాయి. గత లోక్‌సభ సమావేశాలు దేశ చరిత్రలోనే అతి తక్కువ సమయం నడిచాయి. మరి ఇలాంటి పరిస్థితుల్లో ప్రతిపక్షాలు అడిగే ప్రశ్నలకు మోడీ ప్రభుత్వం సమాధాన మిస్తుందా..లేక గతంలో మాదిరిగా దాటవేస్తుందా..అనే చర్చ నడుస్తోంది.

17 రోజుల పాటు సభా కార్యకలాపాలు...

ఆగస్టు 11 వరకు జరిగే ఈ సమావేశాల్లో 17 రోజుల పాటు సభా కార్యకలాపాల నిర్వహణ జరగనుంది. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యే ముందు రోజు సాంప్రదాయంలో భాగంగా బుధవారం పార్లమెంట్ లైబ్రరీ బిల్డింగ్‌లో ...6లో

సమస్యలపై కేంద్రాన్ని నిలదీస్తాం


- బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు



దేశంలోని అనేక సమస్యలపై వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో. బీఆర్ఎస్ పెద్ద ఎత్తున చర్చకు పట్టు బడతాం. యూనిఫాం సివిల్ కోడ్, ...6లో

ప్రజాసమస్యలపై చర్చ జరగాలి..

- ఎలమారం కరీం సీపీఐ(ఎం) ఎంపీ



ధరల పెరుగుదల, నిరుద్యోగం, ప్రయివేటీకరణ, కేంద్ర దర్యాప్తు సంస్థలు దుర్వినియోగం, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలపై గవర్నర్ల పెత్తనం, మణిపూర్ వంటి అంశాలను ...6లో

బీసీలను కించపరిస్తే బుద్ధి చెబుతాం

టీపీసీసీ చీఫ్‌తోపాటు కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలను ఖండిస్తున్నాం : శాసనమండలి చైర్మెన్ , మంత్రులు



మాట్లాడుతున్న మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్‌లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీ ప్రజాప్రతినిధులు, నాయకులను కించపరిచే విధంగా విమర్శలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని శాసనమండలి చైర్మెన్ బండ ప్రకాష్‌ముదిరాజ్, మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్‌లు హెచ్చరించారు. బుధవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తలసాని శ్రీనివాస్‌యాదవ్ కార్యాలయంలో పలువురు బీసీ ప్రజా ప్రతినిధులు, నాయకులు సమావేశమయ్యారు. బీసీ ప్రజాప్రతినిధులు, నాయకులపై ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఇతర నాయకులు చేస్తున్న విమర్శలను ముక్త కంఠంతో ఖండించారు. బీసీల్లో ఎదుగుతున్న నాయకత్వాన్ని చులకన చేస్తూ రేవంత్‌రెడ్డి అహంకారంతో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత బీసీలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లతో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని అన్నారు. బీసీల ఆత్మగౌరవాన్ని మరింత పెంచే విధంగా ఆత్మగౌరవ భవనాల నిర్మాణం కోసం కోట్ల రూపాయల విలువైన భూములను కేటాయించడంతో పాటు నిధులను కూడా ఇచ్చిందని చెప్పారు. కులవత్తులకు అనేక విధాలుగా చేయూతనందిస్తూ వస్తున్నదని వివరించారు. తమ ఎదుగుదలకు అండగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీ వెంట ...13లో



కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇంట్లో కాంగ్రెస్ సీనియర్ల మంతనాలు...

సమరానికి సై ...

కారుతో ఢీ అంటే ఢీ

- మరింత ఐక్యతను ప్రదర్శిద్దాం
- అందరి ఆమోదంతోనే చేరికలు
- ఉన్నవారికి నష్టం జరగొద్దు
- చేరిన వారికి ఇబ్బందులుండొద్దు : కాంగ్రెస్ సీనియర్ల నిర్ణయం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ఎన్నికలకు రెడీ అవుతున్నది. కారుతో ఢీ అంటే ఢీ అంటున్నది. ఎన్నికల యుద్ధానికి పార్టీని అంతర్గతంగా బలోపేతం చేసుకుంటున్నది. అందులో భాగంగా పార్టీలో చేరే వారితో స్థానికంగా తలెత్తే సమస్యలపై ఆ పార్టీ నేతలు చర్చించారు. పాత నాయకులకు, కొత్తగా పార్టీలో చేరేవారికి మధ్య పొరపొచ్చాలు రాకుండా చాక చాక్యంగా వ్యవహరించాలని సీనియర్లు నిర్ణయించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాసంలో వారు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, నేతలు ...13లో

కాంగ్రెస్‌లో చేరుతున్న నేతలు వీరే...

ముగ్గురు మహిళా జడ్పీ చైర్‌పర్సన్‌లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. రంగారెడ్డి జిల్లా చైర్‌పర్సన్ తీగల అనిత రెడ్డి, వికారాబాద్ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీత మహేందర్ రెడ్డి, గద్వాల జడ్పీ చైర్‌పర్సన్ సరితా తిరుపతయ్య కాంగ్రెస్ లో చేరనున్నారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, వేముల వీరేశంతోపాటు మందుల సామేల్, రామారావు పటేల్, కోదాడకు చెందిన శశిధర్‌రెడ్డి, ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత సునీల్ రెడ్డి తదితరులు గురువారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నారు. డాక్టర్ విజయరామారావు, యెన్నం శ్రీనివాసరెడ్డి, ఏ చంద్రశేఖర్ ప్రస్తుతం బీజేపీలో ఉన్నారు. ఆయా నియోజకవర్గాల్లో వ్యక్తగతంగా సర్వేలు చేయించుకోవడంతో అక్కడ కమలం ఓడిపోతుందని తేలినట్టు తెలిసింది. దీంతో వారు కూడా హస్తం గూటికి చేరేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

ఉత్తరాఖండ్‌లో పేలిన ట్రాన్స్‌ఫార్మర్

15 మంది మృతి..పలువురికి గాయాలు




క్షతగాత్రులను తరలిస్తున్న అధికారులు..

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో మంగళవారం రాత్రి ఘోరం చోటు చేసుకుంది. చమోలీ జిల్లాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలి 15 మంది మరణించారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. అలకనందా నది ఒడ్డున నమామి గంగా ప్రాజెక్టు సైట్‌లో ఈ విషాదం జరిగిందని అధికారులు బుధవారం తెలిపారు. మృతుల్లో ఒక పోలీసు ఎస్ఐ, ముగ్గురు హోంగార్డులు ...13లో

నటేశ్వర శర్మకు దాశరథి అవార్డు

ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రముఖ కవి, రచయిత దాశరథి కష్ణమాచార్య జయంతి సందర్భంగా ఆయన పేరిట ప్రతిఏటా ప్రకటించే ప్రతిష్టాత్మక 'శ్రీ దాశరథి కష్ణమాచార్య అవార్డు-2023'ను ప్రముఖ ...13లో

మబ్బే..మసకేసిందిలే..



విస్తారంగా వర్షాలతో రైతుకు ఊరట

- పొంగుతున్న వాగులు, చెరువులు
- వరి నాట్లు వేస్తున్న రైతులు
- ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలోకి వరద
- ప్రాజెక్టుల్లోకి భారీగా నీరు
- పెరుగుతున్న భద్రాద్రి గోదావరి నీటి మట్టం



వరినాట్లు నాటుతున్న ఎమ్మెల్యే పద్మాదేవెందర్ రెడ్డి... వరంగల్‌లో పొంగుతున్న వాగు...

రాష్ట్రవ్యాప్తంగా ముసురు పట్టింది. విస్తారంగా కురుస్తున్న వర్షాలు నెలన్నర రోజులుగా ఎదురుచూస్తున్న రైతులకు ఊరటనిచ్చాయి. బోసిపోయిన సాగునీటి ప్రాజెక్టులు జలకళను సంతరించుకుంటున్నాయి. చెరువులు, కుంటలు పొంగి పొరుతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టుల్లోకి వరద నీరు పోటెత్తుతోంది. దాంతో రైతులు నాట్లకు సిద్ధమయ్యారు. మరో పక్క రోడ్లన్నీ జలమయం అవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లు కూలాయి. లోతట్టు ప్రాంతాలు వరదనీటితో మునిగాయి. ఆయా జిల్లాల అధికారులు అప్రమత్తమై కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశారు.


నవతెలంగాణ-విలేకరులు

రాష్ట్ర వ్యాప్తంగా గత రెండు మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వానలు పడుతున్నాయి. మలుగు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో రెడ్ అలర్ట్ ప్రకటించారు. దాంతో అధికారులు అందుబాటులో ఉండాలని, రాత్రింబవళ్లు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. గోదావరి పరివాహక ప్రాంతాల వద్ద నది వరద ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తుపాకుల గుడెం సమ్మక్క సారక్క బ్యారేజ్ 45 గేట్లను ఎత్తడంతో పేరూరు వద్ద గోదావరిలో వరద ఉధృతి పెరుగుతున్నది. బోదపురంలోని జిన్నెలవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దాంతో ఏజెన్సీ గిరిజన గ్రామాలైన సీతారామపురం, కలిపాక, ముత్తారం, పెంకవాగు, కొత్తగుంపు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పాలెం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో గేట్లు ఎత్తి నీటిని గోదావరిలోకి విడిచి పెట్టారు. మైతాపురం వద్ద పాలెం ప్రాజెక్ట్ ప్రధాన కాలువకు గండి పడింది. ఎలిశెట్టిపల్లి వద్ద జంపన్నవాగు ఉప్పొంగడంతో రాకపోకలు స్తంభించాయి. దాంతో ఎలిశెట్టి పల్లికి చెందిన ఇద్దరు గర్భిణీలు.. డబ్బాకట్ల సునీత, చెరుకుల శ్రీమతి.. వాగు దాటలేక ఇబ్బంది పడుతున్న సంగతి తెలుసుకున్న జిల్లా ఎస్పీ గౌస్ ఆలం.. విపత్తు నిర్వహణా బృందానికి సమాచారం ...6లో



జనన ధ్రువీకరణ పత్రంలో... కుల, మతరహిత కాలమ్‌ను పెట్టాలి

హైకోర్టు చారిత్రాత్మక తీర్పు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర హైకోర్టు బుధవారం చారిత్రాత్మక తీర్పునిచ్చింది. హైదరాబాద్‌కు చెందిన సందేపాగు రూప, డేవిడ్ దంపతులు తమ కుమారుడు ఇవాన్ రూడేకి పుట్టుకతో కులరహిత, మతరహిత సర్టిఫికేట్‌ను ఇవ్వాలంటూతెలంగాణ హైకోర్టులో 2019 ఆగస్టు 28న నమోదు చేసిన రిట్ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ లలిత కన్నెగంటి కీలకమైన తీర్పును వెలువరించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం ఒక వ్యక్తి తనకు నచ్చిన మతాన్ని విశ్వసించే స్వేచ్ఛ ఉన్నట్టుగానే తమకు నమ్మకం లేని మతాన్ని విశ్వసించని హక్కు కూడా ఉంటుంది. ఇది భావప్రకటన స్వేచ్ఛలో భాగం కాబట్టి పిటిషనర్లు కోరినట్టుగా 'బర్త్ సర్టిఫికేట్'లో కుల రహిత, మత రహిత' కాలాన్ని పొందపరచాలని, దీని కోసం చర్యలు తీసుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది.

వివరాల్లోకి వెళితే 2019, మార్చి 23న జన్మించిన తమ కొడుకు 'ఇవాన్ రూడే' బర్త్ సర్టిఫికెట్ కోసం దంపతులు వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపాలిటీకి వెళ్లారు (బాబు జన్మించిన ప్రాంతం). జనన నమోదు ఫారంలోని కుటుంబ 'మతం' అనే కాలమ్ నింపితే తప్ప బర్త్ సర్టిఫికెట్ ఇవ్వడం కుదరదని సదరు అధికారులు చెప్పారు. దీంతో కులాంతర, మతాంతర వివాహం చేసుకున్న ఆ దంపతులు... మతాన్ని, కులాన్ని విశ్వసించడం లేదు... కాబట్టి అందులో ఉన్న 'కుటుంబ మతం' అనే కాలమ్ నింపడానికి నిరాకరించారు. ఆ కాలమ్ నింపితే తప్ప బర్త్ సర్టిఫికెట్ ఇవ్వడం కుదరని మున్సిపాల్టీ అధికారులు చెప్పడంతో జిల్లా కలెక్టర్‌తో ...6లో

రెంటికీ చెడ్డ రేవడిలా కేసీఆర్ పరిస్థితి

• రాజాసింగ్‌పై వేటును తొలగించాలని అధిష్టానాన్ని కోరుతా • బీజేపీ శ్రేణులను భయపెట్టేలా బీఆర్ఎస్ దాడులు :ఈటల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశ, రాష్ట్ర రాజకీయాల్లో సీఎం కేసీఆర్ పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారిందని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మెన్ ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికలకు కావాల్సిన డబ్బులు సమకూరుస్తానని దేశంలోని నేతల చుట్టూ తిరిగినా ఆయన్ను ఎవ్వరూ నమ్మడంలేదన్నారు. బుధవారం హైదరాబాద్‌లో బీజేపీ బహిష్కృత నేత, ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ శశికళతో ఈటల రాజేందర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వారితో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలోనూ మాట్లాడారు. రాజా సింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేత అంశాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. దీనిపై త్వరలోనే అధిష్టానం సానుకూల నిర్ణయం తీసుకుంటున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీ నాయకుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. గోషామహల్ నియోజకవర్గంలో ఎలాగైనా గెలవాలని బీజేపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారనీ, కార్పొరేటర్ శశికళపై అనేక సెక్షన్ల కింద అన్యాయంగా కేసులు నమోదు చేశారని విమర్శించారు. తమ కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. గజ్వేల్ లో అకారణంగా దాడి చేసి కొట్టించారనీ, బాధితులనే 14 రోజులు జైల్లో పెట్టించారని ఆరోపించారు. మీర్‌పేట లో ఓ యువకుడిని కత్తితో పొడిచి చంపారని వాపోయారు. హుజూరాబాద్ లో ఓ సర్పంచ్ ను కొట్టి అకారణంగా జైల్లో పెట్టి వేధించారని తెలిపారు. వీటన్నింటినీ కేంద్రం గమనిస్తుందని వ్యాఖ్యానించారు.





హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్‌లో బీఆర్ అంబేద్కర్ సచివాలయం ప్రోటోకాల్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి.

జీపీ కార్మికులను చర్చలకు పిలవకపోవడం దుష్ట రాజకీయం

సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామపంచాయతీ (జీపీ) కార్మికులను చర్చలకు పిలవకపోవడం రాష్ట్ర ప్రభుత్వ దుష్ట రాజకీయానికి నిదర్శనమని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, ఐఎఫ్‌టీయూ విమర్శించాయి. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సూర్యం బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పంచాయతీ కార్మికుల పోరాటం క్షుద్ర రాజకీయం కాదనీ, బతుకు దెరువు కోసం ఉద్యోగ భద్రత కోసం వారు పోరాటం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వమే వారి పట్ల క్షుద్రత్వం, కుటిలత్వాన్ని ప్రదర్శిస్తున్నదని పేర్కొన్నారు. 14 రోజులుగా 50 వేల మంది కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా ఉందనీ, ముందు మంత్రి ఎర్రబెల్లి, సీఎం కేసీఆర్ స్పందించి వెంటనే కార్మిక సంఘాల నాయకులను చర్చలకు పిలిచి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అప్రజాస్వామిక విధానాలను వదిలి, సమ్మెను పరిష్కరించాలని కోరారు. చట్టప్రకారం వారికి రూ.18 వేలు లేదా రూ.19 వేలు కనీస వేతనం అమలు చేయాలని సూచించారు. రూ.500, రూ.వెయ్యి బిక్షం వేసినట్టు పెంచి మనసున్న మారాజులం అంటూ గొప్పలు చెప్పడం సరైంది కాదని తెలిపారు. వారి సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ, ప్రమాద బీమా అమలు చేయాలనీ, పనిభారం తగ్గించాలని వివరించారు.

నేడు కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగుల చలో ఎస్పీడీ కార్యాలయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ (యూఆర్ఎస్), సమగ్ర శిక్ష ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం చలో ఎస్పీడీ కార్యాలయం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేజీబీవీల్లో గత 20 ఏండ్లుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ, ఉద్యోగ భద్రత కల్పించాలని, వారి సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ సిఫారసు చేసిన విధంగా ఏడాదికి రూ.1000 వార్షిక పెంపు, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఈ అంశాలపై అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో చలో ఎస్పీడీ కార్యాలయ కార్యక్రమాన్ని చేపట్టేందుకు నిర్ణయించామని తెలిపారు.

మైనార్టీ మహిళలకు 'కేసీఆర్ కానుక'

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిరుపేద మైనార్టీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం 'కేసీఆర్ కానుక'ను ప్రవేశపెట్టిందని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్‌సాగర్ తెలిపారు. అర్హత ఉండి.. కుట్టు మిషన్ నేర్చుకోవాలనుకునే మైనార్టీ మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గురువారం చివరి తేదీ కావడంతో అర్హులైనవారు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిని సంప్రదించాలని సూచించారు.

ప్రతి నెంబరూ క్రేజే..

9999 అనే కాదు సాధారణ నెంబర్లకూ డిమాండ్

- ఆన్‌లైన్ విధానంలో నేరుగా పోటీలోకి..
- రాజకీయ పైరవీలు, పై అధికారుల ఒత్తిళ్లకు అడ్డుకట్ట!
- మూడేండ్లలో గ్రేటర్ పరిధిలో భారీగా పెరిగిన ఆర్టీఏ ఆదాయం

మాధవరెడ్డి సారంపల్లి



రవాణాశాఖ తీసుకొచ్చిన ఫ్యాన్సీ నెంబర్ల ఆన్‌లైన్ విధానానికి భారీ స్పందన లభిస్తోంది. ఫ్యాన్సీ నెంబర్ల ఆన్‌లైన్ ఈ-వేలం సులభతరంగా ఉండటంతో ప్రభుత్వానికి మంచి పేరు వచ్చింది. దళారులు, రాజకీయ నేతల పైరవీలు, ఉన్నతాధికారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పోయింది. ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టక ముందు సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు, పారిశ్రామిక వేత్తలు, డబ్బున్న వారే ఎక్కువగా ప్రత్యేక నెంబర్ల కోసం పోటీ పడేవారు. అయితే ఆన్‌లైన్ విధానంలో ఫ్యాన్సీ నెంబర్ల విక్రయం ప్రవేశపెట్టాక.. నచ్చిన నంబర్ కోసం ప్రతి ఒక్కరూ పోటీ పడుతున్నారు. ఫలితంగా రవాణాశాఖ ఖజానాకు ఏటా కోట్లాది రూపాయల ఆదాయం చేరుతుండటం విశేషం.

మాన్యువల్ పద్ధతిలో ఏజెంట్లు, మధ్యవర్తుల ప్రమేయం పెరిగిందన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆర్టీఏ ఉన్నతాధికారులు ఆన్‌లైన్ బిడ్డింగ్ విధానానికి శ్రీకారం చుట్టిన విషయం విదితమే. 2020 ఫిబ్రవరి 10న ప్రయోగాత్మకంగా హైదరాబాద్‌లోని ఐదు ఆర్టీఏ కార్యాలయాల పరిధిలో ఫ్యాన్సీ నెంబర్ల ఆన్‌లైన్ బిడ్డింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇది మంచి ఫలితాన్ని ఇవ్వడంతో 2021 ఫిబ్రవరిలో రాష్ట్రమంతటా విస్తరించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ విధానంలో వాహనదారులు తమకు నచ్చిన 0099, 0009, 999, 9999, 6666, 6999, 1, వంటి అనేక నెంబర్లను ఇండ్లు, ఆఫీసు ఎక్కడి నుంచైనా పొందే వెసులుబాటు లభించింది.

నగర పరిధిలో జనవరి- డిసెంబర్ వరకు ఆదాయం ఇలా..

సంవత్సరం	రిజర్వేషన్	ఫీజుబిడ్ అమౌంట్	మొత్తం
20203	76,47,300	6,04,07,900.50	9,80,55,200.50
2021	8,26,41,500	8,11,26,482	16,37,67,382
2022	9,94,65,125	12,61,00217.25	22,55,65,342.25
2023	5,77,81,213	7,77,10,535	13,54,91,748

(2023 జనవరి నుంచి జులై 13 వరకు)

గ్రేటర్ పరిధిలో హైదరాబాద్ జేటీసీ పరిధిలోని ఖైరతాబాద్ ఆఫీసు, ఆ తర్వాత అత్తాపూర్, ఇబ్రహీంపట్నం, మేడ్చల్, ఉప్పల్, తిరుమలగిరి కార్యాలయాల పరిధిలో ఫ్యాన్సీ నెంబర్లకు పోటీ ఎక్కువగా ఉంది.

రెండింతలు పెరిగిన ఆదాయం..!

ఫ్యాన్సీ నెంబర్ల ఆన్‌లైన్ విధానం ప్రారంభమయ్యాక ప్రభుత్వ ఆదాయం పెరుగుతూ వస్తోంది. అప్పటివరకు పోటీ ఉన్న నెంబర్లకే కాకుండా సాధారణ నెంబర్లకు పోటీ పెరిగింది. దీంతో గడిచిన మూడేండ్లలో ఒక్క హైదరాబాద్ పరిధిలోనే రూ.62.28కోట్ల రాబడి వచ్చింది. ఇందులో ఈ ఏడాది జనవరి నుంచి ఈనెల 13వరకు రూ. 13.54కోట్ల ఆదాయం రావడం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా రూ.100 కోట్లకుపైగా ఆదాయం వచ్చింది. ఫ్యాన్సీ నెంబర్ల ఆదాయం రెండింతలు పెరిగిందని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.

సాధారణ నెంబర్లకు లక్షల్లో చెల్లింపు..!

క్రేజీ కోసం కొందరు.. న్యూమరాలజీ కోసం మరికొందరు ఫ్యాన్సీ నెంబర్లు తీసుకుంటున్నారు. నచ్చిన నెంబర్ కోసం ఎంత ఖర్చు పెట్టేందుకైనా వాహనదారులు వెనుకాడటం లేదు. జూన్‌లో జరిగిన ఈ వేలంలో 9999 నెంబర్‌ను ఆస్పైర్ హెూమ్స్ అండ్ ఇన్‌ఫ్రాటెక్ సంస్థ రూ.9లక్షలు వెచ్చించి సొంతం చేసుకుంది. అత్తాపూర్ ఆర్టీఏ పరిధిలో 3456 నెంబర్ కోసం ఓ వ్యక్తి 3.50లక్షలు చెల్లించగా.. గతంలో ఈ నెంబర్‌కు రూ.50వేల నుంచి లక్షలోపు ధర పలికింది. ఉప్పల్ ఆర్టీఏ పరిధిలో నాలుగైదు రోజుల కిందట ఓ వ్యక్తి 2979 నెంబర్ కోసం రూ.35 వేలకుపైనే చెల్లించి సొంతం చేసుకున్నారు. ఆన్‌లైన్‌కు ముందు ఈ నెంబర్ రూ.5వేల నుంచి పది వేలలోపే దక్కడం గమనార్హం.

పైరవీల్లేకుండా ఫ్యాన్సీ నెంబర్ల కేటాయింపు

రవాణాశాఖలో పౌరసేవలన్నీ పూర్తిపారదర్శకతతో పాటు ప్రజలకు ఇబ్బందులు లేకుండా అందించడమే లక్ష్యంగా గట్టి చర్యలు తీసుకుంటున్నాం. పైరవీలు లేకుండా పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఫ్యాన్సీ నెంబర్ల కేటాయింపు చేయడం ద్వారా ప్రభుత్వ ప్రతిష్ట పెరిగింది. వినియోగదారుల్లో రవాణాశాఖ పట్ల మంచి నమ్మకం ఏర్పడింది. ఫలితంగా ఏటేటా ప్రత్యేక నెంబర్ల ద్వారా కోట్లాది రూపాయల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరడమే ఇందుకు నిదర్శనం.



జె.పాండురంగ నాయక్,
జేటీసీ, హైదరాబాద్

ప్రత్యర్థులమైనా..దేశం కోసం ఏకమయ్యాం

ప్రజా సమస్యల పరిష్కారానికి

- ఆగస్టు 7న కలెక్టరేట్‌ల ముట్టడి
- 25న మణిపూర్ ఘటనలపై ఆందోళనలు
- 26 నుంచి 30 వరకు 'సేవ్ ఆర్టీసీ' నిరసనలు
- రాష్ట్రంలో సీపీఐ, సీపీఐ(ఎం) బలమైన స్థానాల్లో పోటీకి ఏర్పాట్లు : సీపీఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ఆయా రాష్ట్రాల్లో ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలైనప్పటికీ జాతీయ స్థాయిలో దేశ ప్రయోజనాల దృష్ట్యా ఇండియా పేరుతో కూటమిని ఏర్పాటు చేయడం హర్షదాయకం. పార్లమెంటు ఎన్నికల్లో ప్రత్యర్థులుగా ఉన్న బీజేపీయేతర పార్టీలు జాతీయస్థాయిలో పోస్ట్ పోల్ అలయన్స్‌గా రూపొందించే ప్రక్రియలో భాగమే ఇండియా కూటమి. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆగష్టు 7న అన్ని జిల్లాల్లో కలెక్టరేట్‌లను ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తాం' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బీజేపీని ఎదుర్కొనేందుకు ఏర్పాటైన ఇండియా కూటమిని ఆయన స్వాగతించారు. హైదరాబాద్ మఖ్దూంభవన్‌లో మంగళవారం జరిగిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశ నిర్ణయాలను ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు పశ్యపద్మ, ఇటి.నరసింహా, కలవేణి శంకర్‌తో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని వెల్లడించారు. బీజేపీని ఎదుర్కొనేందుకు యూపీఏ స్థానంలో ఏర్పాటైన 'ఇండియా' కూటమి పేరు నిర్ధారణలో సీపీఐ, సీపీఐ(ఎం) కీలక పాత్ర పోషించాయని తెలిపారు. ఇరు పార్టీలు సైద్ధాంతికంగా మద్దతునివ్వడం దేశ ప్రజలకు ఎంతో ఉపయోగకర'మన్నారు. ప్రతిపక్ష పార్టీల సమావేశాన్ని ప్రధాని మోడీ అవహేళన చేస్తున్నారని మండిపడ్డారు. 2024 ఎన్నికల్లో ఓటమి భయం మోడీలో కనపడుతోందన్నారు. ఎన్‌డీఏ పార్టీలతో మోడీ సమావేశం పెట్టుకోవచ్చా?, ఇతరులు మాత్రం సమావేశం కావొద్దా, ప్రతిపక్ష పార్టీల సమావేశమైతే అది స్వార్థం, కుటుంబ రాజకీయాల కోసమా? అని కూనంనేని ఆగ్రహం వ్యక్తంచేశారు.

కేరళ , బెంగాల్‌లో ప్రత్యర్థులమే

ఇండియా కూటమిలో బీఆర్ఎస్ లేకపోవడం, ఆ కూటమిలో ఉన్న కాంగ్రెస్, వామపక్షాలు రాష్ట్రంలో కలిసి పోటీ చేస్తాయా? అని విలేకరులడిగిన ప్రశ్నకు ఆయన సమాధానిస్తూ జాతీయ పార్టీలకు రాష్ట్రంలో ఉన్న పరిస్థితులకు సంబంధం లేదని చెప్పారు. మునుగోడులో బీజేపీని నిలవరించేందుకు బీఆర్ఎస్‌కు మద్దతిచ్చామని, అందులో విజయవంతమయ్యామని తెలిపారు. కేరళలో వామపక్షాలు, కాంగ్రెస్ కూటములే ప్రధాన ప్రత్యర్థులని, పశ్చిమ బెంగాల్‌లో సైతం తణమూల్ కాంగ్రెస్, వామపక్షపార్టీలు, కాంగ్రెస్ ప్రత్యర్థులని గుర్తుచేశారు. కానీ జాతీయ స్థాయిలో దేశం కోసం వీరందరూ ఇండియా కూటమిలో భాగస్వాములుగా లేరా? అని కూనంనేని ప్రశ్నించారు. ఆయా రాష్ట్రాల్లో పోరాటం ఉన్నప్పటికీ దేశ ప్రయోజనాలు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రమాదకరమైన బీజేపీని ఓడించేందుకు జాతీయ స్థాయిలో ఒకటిగా ఉన్నామని వివరించారు. కొన్ని ఎన్నికల ముందు (ప్రీ పోల్), కొన్ని ఎన్నికల అనంతరం (పోస్ట్ పోల్) పొత్తులు ఉంటాయని చెప్పారు.

బలమైన స్థానాలలో కచ్చితంగా పోటీ

సీపీఐ, సీపీఐ(ఎం) బలంగా ఉన్న నియోజకవర్గాలను గుర్తించామని, ఆయా స్థానాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పోటీ చేయడంతో పాటు, పరస్పరం మద్దతు ఇచ్చుకోవాలని ఉభయ పార్టీలు నిర్ణయించుకున్నట్టు కూనంనేని స్పష్టం చేశారు. సీపీఐ బలంగా ఉన్న చోట ఎన్నికల యంత్రాంగాన్ని సిద్ధం చేసుకుంటున్నామని, రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయని వివరించారు.

ఆర్టీసీ, ప్రజా సమస్యలపై పోరుబాట

ప్రమాదంలో పడిన ఆర్టీసీని రక్షించుకునేందుకు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు 'సేవ్ ఆర్టీసీ' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల వద్ద నిరసన కార్యక్రమాలు, సమావేశాలు, సెమినార్ నిర్వహిస్తామని కూనంనేని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఆగస్టు 7న పెద్ద ఎత్తున పోరాటం చేయనున్నట్టు వెల్లడించారు. ఇండ్లు, గుడిసెలకు పట్టాలు, అనేక సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలు, కలెక్టరేట్‌లను ముట్టడిస్తామన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

25న మణిపూర్ ప్రజలకు సంఘీభావ ప్రదర్శన

మణిపూర్ ప్రజలకు సంఘీభావంగా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అనుసరిస్తున్న మతోన్మాద, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ ఈ నెల 25న నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మణిపూర్ వెళ్లిన అనీరాజాపై కూడా కేసు నమోదు చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. మణిపూర్‌లో హిందూత్వ ప్రాతిపదికన మరింత బలోపేతమయ్యేందుకు అక్కడి పాలక బీజేపీ ప్రజల మధ్య చిచ్చు పెట్టిందని విమర్శించారు. ఇందుకు బాధ్యత వహిస్తూ మణిపూర్ సీఎం తన పదవికి రాజీనామా చేయాలని, రెండు తెగల మధ్య సఖ్యత తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంచార ముస్లింలకు రుణాల్లో ప్రాధాన్యతివ్వాలి

ఆవాజ్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తురకకాశ, ఫకీరు, బోరేవాల, గంటేవాల, బుగ్గివాల, గారడీ తదితర సంచార ముస్లిం తెగల వారికి మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాల్లో ప్రాధాన్యతనివ్వాలని ఆవాజ్ డిమాండ్ చేసింది. ఆ సంస్థ ఆధ్వర్యంలో తురకకాశ, ఫకీరు సంచార ముస్లిం తెగల సంక్షేమ సంఘం ప్రతినిధులు బుధవారం మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు.



ఈ సందర్భంగా ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో తురకకాశ, ఫకీరు, బోరేవాల, గంటేవాల, గారడీ, బుగ్గివాల తదితర సంచార ముస్లిం తెగలు ప్రభుత్వ సహాయం అందక ఆర్థికంగా సామాజికంగా వెనుకబడి ఉన్నాయని తెలిపారు. ఆవాజ్ అనేక సందర్భాల్లో ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా సంచార ముస్లిం తెగలకు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ ఇంతియాజ్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎమ్‌డీ క్రాంతి తదితరులు కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు, తురకకాశ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఇమామ్ పాషా, షేక్ మదార్, హుస్సేన్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ మరోసారి సీఎం కావాలి

- ఎంపీ వద్దిరాజు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం కేసీఆర్ నిండు నూరేండ్లు ఆయురారోగ్యాలతో జీవించాలనీ, మూడో సారి ముఖ్యమంత్రి కావాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆకాంక్షించారు. ఈ మేరకు బుధవారం శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని సందర్శించి మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. తెలంగాణను అన్ని విధాలా అభివృద్ధి చేస్తూ దేశానికి ఆదర్శంగా నిలిపిన మహానేత అని కొనియాడారు.

గుజరాత్ మోడల్ ఊకదంపుడే

- తేటతెల్లం చేసిన నిటిఅయోగ్ నివేదిక : కోలేటి దామోదర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పేదరిక నిర్మూలనలో తెలంగాణ గణనీయమైన ప్రగతిని సాధించిందని తెలంగాణ రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థ చైర్మెన్ కోలేటి దామోదర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిటిఅయోగ్ విడుదల చేసిన నివేదికతో గుజరాత్ మోడల్ ఊకదంపుడు ప్రచారమనేది తేటతెల్లమైందని ఎద్దేవా చేశారు. జాతీయ పేదరిక సగటుతో పోలిస్తే తెలంగాణలో పేదరికం మూడో వంతు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. తెలంగాణకు, గుజరాత్‌కు నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని విమర్శించారు. నిధులు, పరిశ్రమలు గుజరాత్‌కు మళ్లించుకున్నా పేదరిక నిర్మూలనలో ఆ రాష్ట్ర పరిస్థితి దయనీయంగానే ఉందని చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలో గుజరాత్ వెలవెలబోతున్నదని తెలిపారు. నిధులు కేటాయించకుండా కేంద్రం తెలంగాణ పట్ల వివక్ష చూపిస్తున్నా.... రాష్ట్ర ప్రగతిని ఆపలేకపోవడానికి సీఎం కేసీఆర్ అనుసరిస్తున్న సంపద పెంచు - ప్రజలకు పంచు నినాదం, విధానం, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలకందించడమే కారణమని వివరించారు.

24 నుంచి గురుకుల హాల్‌టికెట్లు

- ట్రిబ్ కన్వీనర్ మల్లయ్య బట్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ గురుకుల విద్యా సంస్థల రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఆర్ఈఐ-ఆర్‌బీ) జారీ చేసిన వివిధ నోటిఫికేషన్‌ల ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ ఈనెల 24 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ట్రిబ్ కన్వీనర్ డాక్టర్ మల్లయ్య బట్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అభ్యర్థులు వెబ్‌సైట్‌లో పరీక్షల తేదీలను పరిశీలించి వారు దరఖాస్తు చేసిన పరీక్షకు వారం రోజుల ముందు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల ఒకటి నుంచి 23వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించే పరీక్షల హాల్‌టికెట్లు ఈనెల 24 నుంచి అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. హాల్‌టికెట్ల కోసం www.treirb.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

సంపాదకీయం


పరిష్కారం... ప్రజామోదం...

ప్రస్తుతం రాష్ట్రమంతటా ముసురు పట్టింది. ఎక్కడ చూసినా ఒకటే వాన. అది పట్నమైనా, పల్లెయినా ఇదే పరిస్థితి. ఇదే సమయంలో తెలంగాణ వ్యాప్తంగా ఇప్పుడు సమస్యల ముసురు కూడా పట్టింది. జానెడు జాగా కోసం పేదలు, వేతనాలు పెంచాలంటూ పంచాయతీ కార్మికులు, సీఎం హామీనిచ్చిన నాటి నుంచి వేతన పెంపును అమలు చేయాలంటూ

> సర్వ రోగ నివారిణి జిందాతిలిస్మాత్ అనే రీతిలో విద్య గురించి ప్రస్తావిస్తే... గురుకులాలు, దళితులకు మూడెకరాల భూమి గురించి అడిగితే 'దళిత బంధు, వృత్తిదారుల సమస్యలపై నిలదీస్తే 'బీసీలకు ఆర్థిక సాయం' అంటూ ప్రభుత్వం తనను తాను సమర్థించుకుంటున్నదే తప్ప ఇతమిద్ధంగా ఆయా సంఘాల డిమాండ్లను పరిశీలించి పరిష్కరించేందుకు చొరవ చూపటం లేదు. ఇది ముమ్మాటికీ విధానపరమైన లోపమే.

మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, కొలువుల కొనసాగింపు నిర్ణయాలు వెలువడక గెస్టు లెక్చరర్లు, జీతాల్లేక మిషన్ భగీరథ కార్మికులు అల్లాడిపోతున్నారు. మరోవైపు ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకూ ఖాళీ పోస్టులు మనల్ని వెక్కిరిస్తున్నాయి. ఇవన్నీ తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలు, యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సిన చర్యలు.

కానీ రాష్ట్ర సర్కారు వీటిపై శీతకన్నేసింది. ఆయా సమస్యలపై అడిగితే 'సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు బ్రహ్మాండంగా అమలవుతున్నాయి...' అనే రొటీన్ సమాధానాలే మంత్రులు, అధికారుల నుంచి వస్తున్నాయి తప్పితే నిర్దిష్ట సమస్యలకు, నిర్దిష్ట పరిష్కారాలు అనే విధానాన్ని అమలు చేసేందుకు వారు ముందుకు రాకపోవటం శోచనీయం. సర్వ రోగ నివారిణి జిందాతిలిస్మాత్ అనే రీతిలో విద్య గురించి ప్రస్తావిస్తే... గురుకులాలు, దళితులకు మూడెకరాల భూమి గురించి అడిగితే 'దళిత బంధు, వృత్తిదారుల సమస్యలపై నిలదీస్తే 'బీసీలకు ఆర్థిక సాయం' అంటూ ప్రభుత్వం తనను తాను సమర్థించుకుంటున్నదే తప్ప ఇతమిద్ధంగా ఆయా సంఘాల డిమాండ్లను పరిశీలించి పరిష్కరించేందుకు చొరవ చూపటం లేదు. ఇది ముమ్మాటికీ విధానపరమైన లోపమే.



ధనిక రాష్ట్రం, మిగులు రాష్ట్రమంటూ మొన్నటిదాకా గొప్పలు చెప్పుకున్న క్రమంలో వివిధ శాఖల్లో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయటానికి ప్రభుత్వానికి ఉన్న ఇబ్బందేమిటో అర్థం కావటం లేదు. డబుల్ బెడ్ రూం ఇండ్లనిస్తామంటూ ప్రజలకు హామీనిచ్చినప్పటికీ ఇప్పటికీ అనేక జిల్లాల్లో అసలు ఇండ్లే నిర్మించలేదు. నిర్మించిన చోట వాటిని లబ్దిదారులకు అందజేయలేదు. ఈ క్రమంలోనే పేదలు ఇండ్ల జాగాల కోసం పోరు మొదలుపెట్టారు. చాకిరీ ఎక్కువ.. వేతనం తక్కువ అనే రీతిలో ఒక్కో పంచాయతీ కార్మికుడికి ఇచ్చే జీతాన్ని నలుగురైదుగురు సిబ్బంది పంచుకోవాలంటూ సూచిస్తే.. అది ఏ మూలకూ సరిపోక జీపీ కార్మికులు, సిబ్బంది సమ్మెబాట పట్టారు. వారివన్నీ గొంతెమ్మ కోర్కెలు కాదు.. తీర్చలేనివి అసలే కాదు. కానీ వాటిని పరిష్కరించటంలో సర్కారుకు చిత్తశుద్ధి కొరవడటం శోచనీయం.

ఈ క్రమంలో ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన మంత్రులు... అందుకు భిన్నంగా ఇక్కడో విచిత్రకరమైన వాదనను కూడా ముందుకు తీసుకురావటాన్ని మనం గమనించవచ్చు. తెలంగాణలోని కార్మికులు, సిబ్బంది, ఉద్యోగులు, ఉపాధ్యాయులు తదితరుల అంశాలు ముందుకొచ్చినప్పుడు ఇక్కడి ప్రభుత్వ ఆదాయం, రాష్ట్రంలోని భౌతిక పరిస్థితులు, ఉన్న వెసులుబాట్ల గురించి చెప్పి.. ఒప్పించి, మెప్పించాలి. సామరస్య పూర్వక వాతావరణంలో చర్చలు జరపటం ద్వారా ఆందోళనలు, సమ్మెలను విరమింపజేయాలి. ఇది ప్రభుత్వ గురుతర బాధ్యత. కానీ బెదిరింపులు, హెచ్చరికలు, అల్టిమేటాలు జారీ చేయటమనేది విజ్ఞత అనిపించుకోదు. పంచాయతీ కార్మికుల సమ్మె పట్ల సర్కారు ఇదే రకమైన వైఖరిని ప్రదర్శించి ప్రజాందోళనల పట్ల తన విధానాన్ని చెప్పకనే చెప్పింది.

తమ ఈతి బాధలను మానవత్వంతో అర్థం చేసుకుని, పెద్ద మనసుతో అంగీకరిస్తే అలాంటి వారిని ప్రజలు అక్కున చేర్చుకుంటారు. అలాగాక ఉద్యమాలను కించపరుస్తూ.. హక్కుల కోసం జరిగే పోరాటాలను అవమానపరుస్తామంటే మాత్రం సహించబోరు. అందువల్ల తెలంగాణ తొలి ప్రభుత్వంలో తొలి శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వాధినేత చెప్పినట్టు... అధికారంలో ఉన్నవారెవరైనా విజ్ఞత, దక్షత, బాధ్యతను పాటించాలి. వాటిని మాటల్లో చెప్పిన నేతలు.. ఇప్పుడు చేతల్లో చూపించాల్సిన తరుణం ఆసన్నమైంది. రాబోయేదంతా ఎన్నికల కాలం కాబట్టి... ప్రతిష్టకు పోకుండా లౌక్యాన్ని పాటిస్తూ ముందుకు సాగాలి. ఆ క్రమంలో 'రాజకీయంగా తమకు అవసరమైనప్పుడు, ప్రయోజనం ఉన్నప్పుడే...' సమస్యలను పరిష్కరిస్తాం.. పలు వర్గాలను సంతృప్తి పరుస్తామనే పంథాను విడనాడాలి. ప్రజలు తమ నిరసనను చెప్పుకోవటానికి ఆస్కారమివ్వాలనే ఉదాత్త మనస్సును పాలకులు కలిగుండాలి. ముమ్ముందు ప్రజామోదం పొందాలంటే ఈ రీతిలోనే పాలన కొనసాగించక తప్పదు. అలా జరిగినప్పుడే బంగారు తెలంగాణ స్వప్నం సాకారమవుతుంది.

అంగన్‌వాడీల దేశవ్యాప్త ఉద్యమం... ప్రభుత్వాలకు ఓ హెచ్చరిక!

> ఈ రోజు ఐసిడిఎస్ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కేంద్రం ఐసిడిఎస్‌కు పెట్టే ఖర్చుల వాటాను 100 నుండి 60శాతానికి తగ్గించటం. అంటే ఉదాహరణకి రూ.100 ఖర్చయితే కేంద్రం కేవలం రూ.60 మాత్రమే ఇస్తుంది. మిగిలిన 40శాతం ఖర్చులు బడ్జెట్‌ను రాష్ట్రాలు ఇవ్వాలని కేంద్రం చెపుతున్నది. రాష్ట్రాలేమో సాధ్యం కాదని చెపుతున్నాయి. ఈ విధానం ఐసిడిఎస్ ముందుకు పోవడానికి ఆటంకంగా మారింది. పక్షవాతం వచ్చిన మనిషి శరీరం సగం బాగుండీ, సగం బాగాలేక ఎలా ఉంటుందో కేంద్రం విధానాల వలన ఐసిడిఎస్ పరిస్థితి కూడా దేశవ్యాప్తంగా అలాగే ఉంది.

నేడు దేశంలో ప్రతీ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ టీచర్స్ మహిళలు, చిన్న పిల్లల అభివృద్ధిలో నిరంతర కృషి సాగిస్తున్నారు. మాతా, శిశు మరణాలను, పౌష్టికాహార లోపాన్ని తగ్గించటంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. 10వ తరగతి నుండి పి.జి. వరకు చదువుకున్న వీరు అతి తక్కువ వేతనం పైన పని చేస్తున్నారు. 40రకాల రిజిష్టర్స్, అనేక ఆన్‌లైన్ యాప్స్, ఐసిడిఎస్‌కు సంబంధంలేని అనేక అదనపు పనులు, ఎలక్షన్‌కు సంబంధించిన బి.ఎల్.ఓ తదితర అనేక పనులు, సేవల్లో ఉన్నారు. అయినా పాలకులు వీరి శ్రమను గుర్తించకుండా మరింత వెట్టిచాకిరీ చేయించుకుంటూ వీరిని పీడిస్తున్నారు. సమగ్ర శిశు అభివృద్ధి సేవ కేంద్రం (ఐసిడిఎస్)ను దాదాపు 47సంవత్సరాలు అవుతున్నది. అయినప్పటికీ ప్రభుత్వాలు అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయలేదు. కనీస వేతనం ఇవ్వడం లేదు. ఇంకా గౌరవ వేతనాలనే చెల్లిస్తున్నాయి. ఇప్పుడు కేంద్రం ఐసిడిఎస్‌కు తన వాటా బడ్జెట్‌ని తగ్గించి ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేయాలని చూస్తున్నది. నూతన జాతీయ విద్యా విధానం చట్టం ద్వారా ఈ రంగాన్ని మూసివేసి పేద ప్రజలకు పౌష్టికాహారాన్ని దూరం చేసే దుష్ట ప్రయత్నం చేస్తున్నది. ఇందులో పనిచేస్తున్న 26లక్షల మంది అంగన్‌వాడీ ఉద్యోగులను ఇంటికి పంపించాలని కుటిలయత్నం కనపడుతున్నది. ఈ విధానాలను నిరసిస్తూ ఐసిడిఎస్‌ను రక్షించుకోవడంతో పాటు, అంగన్‌వాడీ ఉద్యోగుల హక్కుల కోసం నేడు దేశవ్యాప్తంగా ఉద్యమం నడుస్తున్నది. అంగన్‌వాడీ ఉద్యోగులు ప్రభుత్వాలను కోరుతున్న అంశాలలో మొదటిది ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలని. ఎందుకంటే అన్ని సమస్యలు ఈబడ్జెట్‌తోనే ముడిపడి ఉంటాయి కాబట్టి. పక్కా భవనాలు కట్టాలన్నా, కట్టిన భవనాలకు రిపేర్లు చేయించాలన్నా, అంగన్‌వాడీ కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలు, నాణ్యమైన పౌష్టికాహారం, వంట సామాగ్రి, ప్రీస్కూల్ పిల్లల మెటీరియల్ ఇందులో పనిచేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనాలతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలన్నా, ఈ ఖర్చులకు సరిపడా బడ్జెట్ పెంపుదల ఉంటేనే ఐసిడిఎస్ సేవలు ముందుకుపోయే అవకాశం ఉంటుంది. కానీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఈ దృష్టితో ఆలోచించటం లేదు.



పి. జయలక్ష్మి
9490098605

> తెలంగాణలో మాత్రం అంగన్‌వాడీలకు ఒక్క వేతనం తప్ప ఏమీ చెల్లించటం లేదు. పర్మినెంట్, కనీస వేతనం, పి.ఎఫ్., ఇ.ఎస్.ఐ, ఉద్యోగ భద్రత లాంటి ఏ సౌకర్యాలు లేవు. కనీసం వారు చనిపోతే అంత్యక్రియల ఖర్చులు కూడా ఇవ్వడం లేదు. అరవై సంవత్సరాలు నిండి రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ.5 లక్షలు, హెల్పర్లకు రూ.3లక్షలు ప్రస్తుత వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని పదివేల మందికి పైగా అంగన్‌వాడీ ఉద్యోగులు ఎప్పటినుంచో ప్రభుత్వానికి విన్నవిస్తున్నా ఉలుకు, పలుకు లేదు.

2021-22కి గాను రూ.18,382 కోట్లు మాత్రమే కేటాయింపులు చేసింది. 2022-23కు గాను రూ.20,263 కోట్లు, 2023-24కు రూ.20,554 కోట్లు. ఈ బడ్జెట్‌లో గత సంవత్సరంపై 1.4శాతం మాత్రమే పెరు గుదల చూపారు. దీనికంటే కూడా ఈ రోజు ఐసిడిఎస్ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కేంద్రం ఐసిడిఎస్‌కు పెట్టే ఖర్చుల వాటాను 100 నుండి 60శాతానికి తగ్గించటం. అంటే ఉదాహరణకి రూ.100 ఖర్చయితే కేంద్రం కేవలం రూ.60 మాత్రమే ఇస్తుంది. మిగిలిన 40శాతం ఖర్చులు బడ్జెట్‌ను రాష్ట్రాలు ఇవ్వాలని కేంద్రం చెపుతున్నది. రాష్ట్రాలేమో సాధ్యం కాదని చెపుతున్నాయి. ఈ విధానం ఐసిడిఎస్ ముందుకు పోవడానికి ఆటంకంగా మారింది. పక్షవాతం వచ్చిన మనిషి శరీరం సగం బాగుండీ, సగం బాగాలేక ఎలా ఉంటుందో కేంద్రం విధానాల వలన ఐసిడిఎస్ పరిస్థితి కూడా దేశవ్యాప్తంగా అలాగే ఉంది.

అంగన్‌వాడీలపై కేంద్రం ఆర్థిక భారం

బడ్జెట్ తగ్గింపుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అంగన్‌వాడీ ఉద్యోగులు నలిగిపోతున్నారు. 2017 నుండి అంగన్‌వాడీ ఉద్యోగులకు టిఎ, డిఎ లు, ఇంక్రిమెంట్, ఇన్‌చార్జ్ అలవెన్స్‌లు ఇవ్వట్లేదు. 2018 నుండి పెంచిన వేతనాలూ కేంద్రం చెల్లించటం లేదు. 8 ఏండ్లు గడిచినా ఆరోగ్య లక్ష్మి మెనూ చార్జీలు పెంచటం లేదు. ఖాళీ పోస్టులు భర్తీ చేయటం లేదు. ఈవెంట్స్ తదితర అనేక కార్యక్రమాలకు ప్రభుత్వాలు డబ్బులు ఇవ్వడం లేదు. ఈ ఆర్థిక భారమంతా అంగన్‌వాడీ ఉద్యోగులే భరించాలని చెపుతున్నారు. లేకపోతే ఉద్యోగాల నుండి తొలగిస్తామని అధికారులు బెదిరిస్తున్నారు. దీనివల్ల కేంద్రం తగ్గించిన బడ్జెట్ భారమంతా అంగన్‌వాడీ ఉద్యోగులపైన పడుతుంది. అంగన్‌వాడీ ఉద్యోగులు పొందుతున్న వేతనంలో సగం వేతనం వారు నడిపే కేంద్రాలకే ఖర్చు పెడుతున్న దుర్భర పరిస్థితికి అంగన్‌వాడీ ఉద్యోగులు నెట్టబడుతున్నారు. రెండవది నూతన జాతీయ విద్యావిధానం. కరోనా సమయంలో ప్రజలందరూ చావుబతుకుల మధ్య ఉన్నప్పుడు చర్చలు లేకుండానే కేంద్రం ఈ చట్టం చేసింది. ఇది అమలైతే ఐసిడిఎస్‌ను పూర్తిగా మూసివేసి విద్యాశాఖలో కలుపుతారు. ఈ చట్టంలో ఐసిడిఎస్ ద్వారా పేద ప్రజలకు అందుతున్న సేవలకు గ్యారంటీ లేదు. ఏండ్లుగా పనిచేస్తున్న అంగన్‌వాడీల ఉద్యోగానికి గ్యారంటీ లేదు. నేడు ప్రపంచంలో 142కోట్లతో జనాభాలో చైనాను అధిగమించి మొదటి దేశంగా భారత్ అవతరించిందనే వార్తలు వస్తున్నాయి. దీన్నిబట్టి చూస్తే ఈ జనాభాలో 80శాతం మంది ప్రజలు అత్యధిక పేదరికంలో ఉన్నారు. 40కోట్ల మంది కనీస ఆహారం కూడా తీసుకోగలిగిన స్థితిలో లేరు. ప్రపంచంలో ఆకలితో అలమటించే దేశాలలో మనది 107వ స్థానం. మహిళల్లో రక్తహీనత, పిల్లల్లో పౌష్టికాహార లోపం, సరైన ఎత్తు, బరువు లేని పిల్లల సంఖ్య దేశంలో అత్యధికం. కనీసం ఉద్యోగం లేని వారి సంఖ్య 45ఏండ్ల కాలంలో ఎప్పుడూలేనంత పెరిగింది. ఈ అంశాలన్నీ దేశంలో ఐసిడిఎస్ అవసరాన్ని నొక్కి చెపుతున్నాయి. గతంలో సుప్రీంకోర్టు కాగ్ నివేదిక, యూనిసెఫ్ లాంటి జాతీయ అంతర్జాతీయ సర్వేలు కూడా ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలని సూచించాయి. కానీ కేంద్రం ఈ అంశాలను వేటిని పరిగణనలోకి తీసుకోవటం లేదు. పేద ప్రజలతో పాటు అంగన్‌వాడీ ఉద్యోగులకు నష్టం కలిగించే చర్యల్నే వేగవంతం చేస్తున్నాయి. మూడవది 45 ఐఎల్‌సి ప్రకారం



కనీస వేతనం రూ.26వేలు, ఇతర చట్టబద్ద సౌకర్యాలు కల్పించాలని కేంద్రాన్ని అంగన్‌వాడీలు డిమాండ్ చేస్తున్నారు. 2013 మే నెలలో 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశం జరిగింది. దేశవ్యాప్తంగా స్కీం వర్కర్లలో భాగమైన అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు చర్చకు వచ్చాయి. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం, పి.ఎఫ్., ఇ.ఎస్.ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని సమావేశం తీర్మానం చేసింది. పదేండ్లు గడుస్తున్నా నేటికి కేంద్రం ఈ నిర్ణయాలను అమలు చేయడం లేదు. జరిగిన నిర్ణయాలు అమలు కాకపోవటం వల్ల పదేండ్లుగా చట్టబద్ద సౌకర్యాలు లేక నష్టపోతున్నామని అంగన్‌వాడీ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. మరొక అంశం సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లింపు. గుజరాత్ రాష్ట్రంలో అంగన్‌వాడీ ఉద్యోగులు గ్రాట్యుటీ కోసం ఏండ్లుగా న్యాయపోరాటం చేశారు. ఫలితంగా 2022 ఏప్రిల్ 25న దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగులు కార్మికులేనని, 1972 గ్రాట్యుటీ చట్టం ప్రకారం లెక్కగట్టి రిటైర్మెంట్ అయిన వారికి చెల్లించాలని సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ఇచ్చింది. తీర్పు వచ్చి ఏడాది గడిచినా దీనికి కేంద్రం బడ్జెట్ కేటాయింపులు ఇంకా చేయలేదు. దీనివల్ల ఒకవైపు వయస్సు పైబడి, మరోవైపు పనిభారం పెరిగి, వట్టి చేతులతో ఇంటికి పోలేక వృద్ధాప్యంలో అనేక అవస్థల మధ్య వారి జీవితాలు కునారిల్లుతున్నాయి.

సమస్యలపై దృష్టి సారించని రాష్ట్ర ప్రభుత్వం

కేంద్రంతో పాటు రాష్ట్రం కూడా అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవటం లేదు. కేంద్రం ఐసిడిఎస్‌కు బడ్జెట్ 60శాతానికి తగ్గించినా సరే అనేక రాష్ట్రాలు అదనంగా బడ్జెట్ కేటాయించి అంగన్‌వాడీ ఉద్యోగులకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నాయి. మన పక్కనే ఉన్న తమిళనాడు, పాండిచేరిలో అంగన్‌వాడీలను పర్మినెంట్ చేశాయి. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలలో అంగన్‌వాడీ ఉద్యోగులకు 5లక్షల హెల్త్ కార్డులు అందజేశాయి. అస్సాం రాష్ట్రంలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంగన్‌వాడీలకు రూ.4 లక్షలు, మినీ టీచర్లకు 3లక్షలు, హెల్పర్లకు 2లక్షలు ఇస్తున్నాయి. కేరళ అంగన్‌వాడీ ఉద్యోగులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసింది. దీనిద్వారా పిల్లల చదువులు, వివాహాలు, గృహ నిర్మాణం తదితర అనేక అవసరాలకు ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తున్నది. పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాలుపండగ బోనస్‌లు అందిస్తున్నవి. ఇంకా అనేక రాష్ట్రాలు రిటైర్‌మెంట్ అయిన వారికి ప్రతి నెలా పెన్షన్ ఇస్తున్నాయి. కానీ తెలంగాణలో మాత్రం అంగన్‌వాడీలకు ఒక్క వేతనం తప్ప ఏమీ చెల్లించటం లేదు. పర్మినెంట్, కనీస వేతనం, పి.ఎఫ్., ఇ.ఎస్.ఐ, ఉద్యోగ భద్రత లాంటి ఏ సౌకర్యాలు లేవు. కనీసం వారు చనిపోతే అంత్యక్రియల ఖర్చులు కూడా ఇవ్వడం లేదు. అరవై సంవత్సరాలు నిండి రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ.5 లక్షలు, హెల్పర్లకు రూ.3లక్షలు ప్రస్తుత వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని పదివేల మందికి పైగా అంగన్‌వాడీ ఉద్యోగులు ఎప్పటినుంచో ప్రభుత్వానికి విన్నవిస్తున్నా ఉలుకు, పలుకు లేదు. గత ఏడేండ్ల నుండి రాష్ట్రంలో టిఎ, డిఎ లు, ఇంక్రిమెంట్, ఇన్‌చార్జ్ అలవెన్స్‌లు చెల్లించటం లేదు. ఆరేండ్ల నుండి కేంద్రం పెంచిన వేతనాలు చెల్లించటం లేదు. ఆరోగ్య లక్ష్మి మెనూ చార్జీలు గత ఎనిమిదేండ్ల నుండి పెంచటం లేదు. పక్కా భవనాలు లేవు. ఖాళీ పోస్టుల భర్తీ లేదు. సెంటర్ అద్దెలు లేవు. గ్యాస్ బిల్లులివ్వట్లేదు. ఈవెంట్స్ డబ్బులు అంతకన్నా లేవు. కేంద్రం పోషన్ ట్రాకర్ యాప్‌ను తీసుకు వస్తే రాష్ట్రం దీంతో ఆగకుండా అదనంగా ఎన్‌హెచ్‌టిఎస్, ఇసిసిఇ అని అనేక యాప్స్‌ను తెచ్చి పనిభారాన్ని పెంచుతున్నది. రాష్ట్రంలో అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీసం సంక్షేమ పథకాలు కూడా అమలు చేయట్లేదు. పైగా అంగన్‌వాడీ ఉద్యోగులకు వేతనాలు పెంచామని, బాగా చూసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వం పచ్చి అబద్దాలు చెబుతున్నది. కేంద్రం వాటాతో కలిపి రాష్ట్రం అంగన్‌వాడీ టీచర్లకు రూ.13,650లు, మినీ టీచర్లకు, హెల్పర్లకు రూ.7,800లు చెల్లిస్తున్నది. అనేక రాష్ట్రాల్లో పర్మినెంట్ చేసి సకల సౌకర్యాలు కల్పిస్తుంటే తెలంగాణలో మాత్రం ఉన్న ఉద్యోగాలకు కూడా భద్రత లేకుండా చేసే జిఓ 14ను తెచ్చింది.

అందుకే అంగన్‌వాడీ ఉద్యోగులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా దేశ వ్యాప్తంగా జూన్, జులై నెలల్లో పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించారు. జూన్ నెలలో అంగన్‌వాడీ ఉద్యోగుల రాష్ట్ర జాతాకు అన్ని జిల్లాల్లో పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జులై 10న అంగన్‌వాడీ ఆలిండియా డిమాండ్స్ డేలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో నల్లచీర, నల్ల బ్యాడ్జీలు ధరించి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 10కిలో మీటర్ల పాదయాత్ర ద్వారా తమ బాధలను నిరసనల ద్వారా తెలియజేశారు. ప్రధానంగా ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని, ఎన్‌ఇపిని రద్దు చేయాలని, 45 ఐఎల్‌సి ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఇతర చట్టబద్ద సౌకర్యాలు కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో దేశవ్యాప్తంగా మరిన్ని పోరాటాలు చేపడతామని వారు హెచ్చరిస్తున్నారు.



సూడో సైన్స్ కాదు... జనరల్ సైన్స్ కావాలి...

చంద్రయాన్-3 రాకెట్ ప్రయోగం విజయం వెనుక అనేకమంది ఇస్రో శాస్త్రవేత్తల అహర్నిశల కృషి ఉంది. అందుకే దేశమంతా వారికి అభినందనలు తెలుపుతోంది. శాస్త్ర,సాంకేతికరంగంలో మన దేశ పురోగమికి ఇదో చిహ్నం. మరిన్ని ప్రయోగాల ద్వారా దేశాన్ని అభివృద్ధి చేయడం అవసరం. కానీ చంద్రయాన్ విజయవంతం కావాలని ముందుగా ఇస్రో చైర్మన్, ఇతర సిబ్బంది ఈ నెల 13న ఏపీలోని తిరుమలలో పూజలు చేసి మెదళ్లను విగ్రహాల ముందు తాకట్టు పెట్టడం ఎంతవరకు సమంజసం? ఇది సైన్స్ సమాజానికి, రేపటి తరం శాస్త్రవేత్తలు, విద్యార్థి లోకానికి ఎలాంటి సందేశం ఇస్తున్నది ఆలోచించాల్సిన అంశంగా కనిపిస్తున్నది. హైస్కూల్లో 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థులకు సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం, గణితం అంశాల బోధనలో ప్రయోగాలు చేస్తూ ఉంటారు. సైన్స్ ప్రదర్శనలు ఏర్పాటు చేసి భవిష్యత్ తరం శాస్త్రవేత్తలకు పునాది వేస్తూ ఉంటారు. ఆ తర్వాత కళాశాల ఉన్నత విద్య ద్వారా మెదడుకు మరింత పదునుపెట్టడం అందరికీ తెలిసిందే. అయితే ఈ విద్యా వైజ్ఞానిక పరిశోధనల్లో ఎక్కడా కూడా దైవ శక్తి మహిమలు, మత విశ్వాసాలు, విగ్రహారాధన వంటి అంశాలు కనపడవు. అలాంటి విద్యార్థులు పెద్దయ్యాక గొప్ప శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, డాక్టర్లు అయ్యువారి వృత్తిలో దైనందిన జీవితంలో పూజలు, విగ్రహారాధన, మత క్రతువులు చేయడంలో అర్థం లేదు. రాకెట్ శాటిలైట్ ప్రయోగం చేసే ముందు నమూనాను తిరుమల వెంకన్న, లేదా చెంగాలమ్మ విగ్రహాల పాదాలవద్ద పెట్టి వారి మేధస్సును కూడా తాకట్టు పెట్టడం చేయాలా! హాస్పిటల్‌లో వైద్యం చేసే ముందు, గర్భిణీ కాన్పు కోసం ముహూర్తం చూడటం డాక్టర్లు సైతం దేవుడా ఈ ఆపరేషన్ సక్సెస్ కావాలి అంటూ పూజలు చేయడం, హాస్పిటల్ అవరణలో గుడి కట్టడం అక్కడక్కడ సోషల్‌మీడియాలో గుప్పుమంటున్న వార్తలే. ఇంకా పోలీసుస్టేషన్‌ల్లో, పోలీసు వాహనాలకు పూజలు చేయడం, ప్రభుత్వ అధికార దుర్వినియోగం చేస్తూ రాష్ట్రపతి, గవర్నర్, సుప్రీం కోర్టు హైకోర్టు జడ్జీలు ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు గుళ్లు గోపురాలు చుట్టూ తిరగడం సమాజానికి ఏం నేర్పుతున్నట్టు?

ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రభుత్వ కార్యక్రమాలు శంకుస్థాపన, ప్రారంభంలో పురోహిత వర్గాలతో పూజలు, పాస్టర్‌లతో ప్రార్థనలు చేయడం, కంప్యూటర్‌లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్‌లకు పూజలు చేయడం ఇదంతా ఎక్కడినుంచి వస్తున్నది.ఎవరి మెదళ్లను కలుషితం చేస్తున్నారు? ఇస్రో శాస్త్రవేత్తలు గుళ్లలో పూజలు చేయడం నుంచే కదా! ఇంజినీరింగ్, మెడికల్, సివిల్స్ వంటివి చదివే విద్యార్థులు అధికారులు సైతం కాలికి దిష్టి పేరుతో నల్ల రంగు దారాలు కట్టుకోవడం చూస్తూ ఉంటే ఈ సమాజం ఎటువైపు పోతుందో అర్థం కావడం లేదు. సైన్స్ వల్ల సమాజం మూడు అడుగులు ముందుకు వేస్తూ ఉంటే మూఢ విశ్వాసాల వల్ల ఆరు అడుగులు వెనక్కి వెళ్తుండటం ఎదుగు తున్న దేశానికి ఎంతమాత్రం సహేతుకం కాదు. హేతుబద్దత శాస్త్రీయ దృష్టి లోపించిందనే స్పష్టంగా కనిపిస్తున్నది. రాజ్యాంగంలో పొందుపరచిన ఆర్టికల్ 51ఏ (హెచ్) ప్రకారం సమాజంలో మూఢ విశ్వాసాలు పోగొట్టి ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం కల్పించడం అనే లక్ష్యాన్ని వదిలేసి పరిపాలనలో రాజ్య వ్యవస్థలో మతపరమైన జోక్యం తీసు కొస్తున్నది కేంద్రం. ఎన్‌సిఈఆర్‌టి పాఠ్యాంశాల నుండి మొఘల్ చరిత్ర, డార్విన్ సిద్ధాంతం, భగత్‌సింగ్, గాంధీ వంటి వారి చరిత్రను తొలగించారు. ఆ స్థానంలో వాస్తు, పురాణాలు, జ్యోతిష్యం గోవాల్కర్, గాడ్సే, సావర్కర్ వంటి వారి గురించి నూతన అంశాలు చొప్పిస్తున్నారు. ఇలాంటి చర్యల ద్వారా పాల కులు విద్యారంగాన్ని పూర్తిగా కాషాయకరణ చేస్తున్నారు. భవిష్యత్తులో భారతదేశం కూడా ఆఫ్ఘన్‌లో తాలిబాన్ మాదిరిగా మరొక మతఛాందస పాలనలోకి వెళ్ళిపోకుండా మేధావులు, లౌకిక శక్తులు గళం విప్పాలి, ఐక్యం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

- మోతుకూరి అరుణ్‌కుమార్, సెల్: 9948024789


శ్రీలంక, పాకిస్థాన్ ఆర్థిక సంక్షోభాలు మనకేం చెబుతున్నాయి?

గత కొంతకాలంగా ఉపఖండంలోని ముఖ్యదేశాలు అప్పుల్లో మునిగిపోతున్న పరిస్థితి మనం చూస్తున్నాం. విచక్షణా రహితంగా అప్పులు చేయడం, విశృంఖలంగా నయా ఉదార విధానాలు అమలు చేయడం వలన తీవ్ర ఆర్థిక దిగ్బంధనంలో చిక్కుకున్నాయి. అందులో మొదటగా చెప్పుకోవాల్సినది శ్రీలంక. ఆ దేశం ఆర్థిక సంక్షోభం తారాస్థాయికి చేరి ఏడాదైంది. అక్కడ తలెత్తిన సంక్షోభం వెనుక చాలా కారణాలు. వీటిలో ముఖ్యమైనది నయా ఉదారవాద విధానాలను అమలు చేయడం, ఐఎంఎఫ్ షరతులకు తలొగ్గడం. ప్రజల్లో వచ్చే వ్యతిరేకతను పక్కదోవ పట్టించడానికి మితవాదం వైపు మొగ్గడం అనే క్రమం. వీటన్నింటి కారణంగా శ్రీలంక రూపాయి విలువను తగ్గించడం, ధరలమీద నియంత్రణలు ఎత్తివేయడం, సబ్సిడీలు, వేతనాల కోత, ప్రయివేటు సంస్థలను ప్రోత్సహించడం వంటి చర్యలు అమలు చేశారు. ఫలితంగా ప్రజల జీవన ప్రమాణాలు దారుణంగా పడిపోవడం మొదల య్యాయి. తలసరి ఆహార లభ్యత తగ్గిపోయింది. ఈ షరతులను అమలు చేసిన ఫలితంగా శ్రీలంక జీడీపీ వృద్ధి రేటు 2015 నాటికి 5శాతంగా ఉన్నది కాస్తా 2019 నాటికి 2.9శాతానికి పడిపోయింది. ప్రభుత్వ ఆదాయాలూ పడిపోయాయి. ప్రభుత్వ రుణం విపరీతంగా పెరిగిపోయింది. తరువాత జరిగిన పరిణామాల కారణంగా, ఏప్రిల్ 2022లో శ్రీలంక సావరిన్ డిఫాల్ట్‌గా ప్రకటించబడింది. అప్పటి అధ్యక్షుడు దేశం విడిచి సింగపూర్‌కి పారి పోయాడు. ఆకాశాన్నంటిన నిత్యావసరాల ధరలు, వంట గ్యాస్ కొరత. కరెంటు కోతలతో ఏడాది కిందట శ్రీలంక ప్రజలు అల్లాడిపోయారు. ఆహారం, మందుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శ్రీలంక ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ ఆందోళన కర స్థితిలోనే ఉంది. నేటికీ ద్రవ్యోల్బణం 12శాతం పైనే ఉంది. సవాళ్లను, ఇబ్బందులను భరించలేక యువత దేశాన్ని వీడు తున్నది. 2022లో 3 లక్షల మంది పైగా వలసెళ్లిపోయారు. ఈ స్థాయిలో దేశాన్ని వీడి వెళ్లిపోవడం ఎన్నడూ జరగలేదు. వీరిలో డాక్టర్లు, పారామెడికల్, ఐటీ ప్రొఫెషనల్స్ ఉండటం గమనార్హం. మేధో సంపత్తి తరలి వెళ్తుండటంతో దేశ ఆర్థిక పునరుద్ధరణ ఆందోళనకరంగా మారింది.



పి. సతీష్
9441797900

శ్రీలంక తర్వాత అంతటి ఆర్థిక పరిస్థితిని పాకిస్థాన్ ఎదుర్కొంటోంది. దీన్నుంచి గట్టెక్కడం కోసం పాకిస్థాన్ అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)తో బెయిలవుట్ 6.5 బిలియన్ డాలర్ల ప్యాకేజీపై సంతకం చేసింది. కానీ ఐఎంఎఫ్ నిబంధలను సరిగా పాటించకపోవడంతో ఇప్పటి వరకూ అందులో సగం మొత్తాన్ని కూడా వాడుకోలేకపోయింది. క్రమ శిక్షణా యుతమైన ఆర్థిక విధానాలు లేకపోడం వల్లనే పాకిస్థాన్‌కు అదనపు నిధుల విడుదలలో ఐఎంఎఫ్ వల్లమాలిన జాప్యం చేస్తూ వచ్చిందని పరిశీలకులు భావిస్తున్నారు. ఆసియా ప్రాంతంలో ఐఎంఎఫ్ నుంచి అత్యంత అప్పు తీసుకున్న 4వ దేశంగా(10.4 ట్రిలియన్ డాలర్లు) పాకిస్థాన్ నిలిచింది. ఐఎంఎఫ్ ఆడమన్నట్లు ఆడి, వారి షరతుల మేరకు పెట్రోల్, గ్యాస్ ధరలను భారీగా పెంచు తోంది. దీంతో ప్రస్తుతం అక్కడ పెట్రోల్ లీటరు ధర రూ.253కి చేరుకున్నది. అదే సమయంలో ఐఎంఎఫ్ సూచన మేరకు ప్రజల నుంచి అధిక పన్నులు వసూలు చేయడానికి మినీ బడ్జెట్‌ను సైతం పాక్ ఆమోదించవలసి వచ్చింది. 639 మిలియన్ డాలర్ల అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోడానికి సాధారణ అమ్మకపు పన్నును 17శాతం నుంచి 18శాతానికి పెంచింది. జూన్, 2023 నాటికి పాక్ ద్రవ్యోల్బణం గతేడాది కంటే మూడు రెట్లు పెరిగి 38శాతానికి చేరుకొన్నది. ఆహార ధరలు ఆకాశాన్నంటాయి. ఆహార ద్రవ్యోల్బణం 48శాతం వద్ద ఉన్నది. పాక్ స్టేట్ బ్యాంకు తానిచ్చే అప్పులపై వడ్డీ రేట్లను గత 24 సంవత్సరాలలో ఎన్నడూ లేనంతగా 100 బేసిస్ పాయింట్లు పెంచివేసి 22శాతానికి ఎగబాకించింది. ప్రభుత్వం వద్ద విదేశీ మారక నిల్వలు ఎన్నడూ లేనంతగా కేవలం 3.9బిలియన్ డాలర్లకు పడిపోయాయి. వాటిని తిరిగి పెంచు కోకపోతే దిగుమతుల బిల్లును తట్టుకోడం కష్టతరమవుతుంది. సొంత కాళ్ళ మీద నిలబడడానికి బదులు బయటి నుంచి వచ్చే ఉదారపూరిత సాయం మీద, గ్రాంట్ల మీద ఆధారపడి ఆర్థిక వ్యవస్థను నడిపించే నేపథ్యమే పాకిస్థాన్‌ను ఇంతటి దురావస్థకు చేర్చింది.పూర్వపు ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ క్రమశిక్షణలేని ఆర్థిక విధానాలే ఇందుకు కారణమని విశ్లేషకుల అభిప్రాయం.



శ్రీలంక, పాకిస్థాన్ దేశాల ఆర్థిక సంక్షోభాన్ని చూసిన భారత్ తమ విధానాలను మార్చుకోవడం లేదు. దేశంలో బడా పెట్టుబడిదారుల లాభార్జనకే ఈ విధానాలను ఉపయోగిస్తున్నదని తెలుస్తోంది. అప్పుల మీద అప్పులు చేస్తూ ప్రజలపై భారాలు మోపుతోంది. ఈ ఏడాది మార్చి నాటికి మన దేశంలో కేంద్రం చేసిన అప్పు దాదాపు రూ.155.8 లక్షల కోట్ల రూపాయలు. ఇది జీడీపీలో 57.3శాతం మాత్రమే అని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెపుతున్నారు. ఇందులో ప్రస్తుత మారకపు విలువ ప్రకారం బాహ్యరుణం 7.03లక్షల కోట్ల రూపాయలు మాత్రమే అని, ఇది జీడీపీలో 2.6శాతం అని ప్రభుత్వం వాదిస్తోంది. ఇటీవలి కాలంలో భారత రూపాయితో పోలిస్తే యుఎస్ డాలర్ విలువ బాగా పెరగడం వల్ల దేశం బాహ్య రుణం చాలా భారంగా మారింది. 2023-24లో కేంద్ర ప్రభుత్వం చేయనున్న కొత్త అప్పులు రూ.16లక్షల 85వేల కోట్లు ఉండనుందనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఇప్పటికే తీసుకున్న అప్పుపై కడుతున్న వడ్డీలురూ.10లక్షల 79వేల కోట్లు ఉన్నట్టు సమాచారం. 1947-2014వరకు 67ఏండ్లలో 14మంది ప్రధానుల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వాలు చేసిన అప్పు రూ.56 లక్షల కోట్లు కాగా కేవలం తొమ్మిదేండ్ల మోడీ ఏలుబడిలో (2014-23) చేసిన అప్పు దాదాపు రూ.100లక్షల కోట్లు. 2005 నుంచి 2013 వరకు తొమ్మిదేళ్లలో యూపీఏ ప్రభుత్వం దాదాపు రూ.21లక్షల కోట్ల విదేశీ రుణం తీసుకుంది. 2014 నుంచి 2022 వరకు విదేశీ అప్పు రూ.33 లక్షల కోట్ల నుంచి రూ.50లక్షల కోట్లకు పెరిగింది. ఇంత అప్పుతో దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పేదరికం నిర్మూలన వంటివి భారీగా జరిగాయా? మరి ఈ డబ్బు అంతా ఎక్కడికి పోయింది? ఇదంతా ఎవరికి చేరిందో దేశ ప్రజలకు తెలిసిందే.

> నేడు దేశంలో దేశ ప్రజల తలసరి ఆదాయం రూ.1,97,468 అయ్యిందని, ఈ ఏడాది బడ్జెట్‌లో ఆర్థికమంత్రి చెప్పుకొచ్చారు. 2004-14 మధ్య కాలంలో తలసరి ఆదాయంలో వృద్ధి 13.1శాతం కాగా, 2014-23 మధ్య ఇది 9.1శాతంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా తలసరి ఆదాయంలో చూసుకున్నప్పుడు మన దేశం 142వ స్థానంలో, జీవన ప్రమాణాలలో (హెచ్‌డిఐ) చూస్తే 132వ స్థానంలో (191 దేశాలలో), హంగర్ ఇండెక్స్‌లలో 101స్థానం (107 దేశాలలో) ఉంది. దీన్ని అచ్చేదిన్ అందమా?

మరోవైపు, వస్తు సేవల పన్ను (జీడీపీ)లో వసూలు అవుతున్న రూ.16లక్షల కోట్లలో దాదాపు 64శాతం దిగువన ఉన్న 50శాతం జనాభా నుండి వచ్చింది, మొత్తంలో మూడు శాతం మాత్రమే టాప్ 10శాతం నుండి వచ్చిందని ఆర్థిక నిపుణులు చెపుతున్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు, కోవిడ్ మహమ్మారి కారణంగా చిన్నమధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయి. సామాన్య ప్రజల ఆదాయం గణనీయంగా దెబ్బతింది.గత తొమ్మిదేళ్లలో నగటు భారతీయుడిపై అప్పు రూ.43,124 నుంచి రూ.1,09,373కి పెరిగింది. 2014లో ఉన్నదానికంటే 2.53 రెట్లు పెరిగింది అప్పు చేసిపప్పు కూడు వలన దేశ ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా ఏమైనా పెరిగాయా అంటే లేదనే ఆర్థిక పరిస్థితిని చూస్తే అర్థమవుతుంది. నేడు దేశంలో దేశ ప్రజల తలసరి ఆదాయం రూ.1,97,468 అయ్యిందని, ఈ ఏడాది బడ్జెట్‌లో ఆర్థికమంత్రి చెప్పుకొచ్చారు. 2004-14 మధ్య కాలంలో తలసరి ఆదాయంలో వృద్ధి 13.1శాతం కాగా, 2014-23 మధ్య ఇది 9.1శాతంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా తలసరి ఆదాయంలో చూసుకున్నప్పుడు మన దేశం 142వ స్థానంలో, జీవన ప్రమాణాలలో (హెచ్‌డిఐ) చూస్తే 132వ స్థానంలో (191 దేశాలలో), హంగర్ ఇండెక్స్‌లలో 101స్థానం (107 దేశాలలో) ఉంది. దీన్ని అచ్చేదిన్ అందమా? శ్రీలంక, పాకిస్థాన్ పరిణామాలు చూసైనా మన దేశ పాలకులు గుణపాఠాలు తీసుకుంటే మంచిది. అప్పుల ఆధారంగా ఆర్థిక వ్యవస్థను నడపడం మానేసి, దేశ స్వావలంబనను, ప్రజల కొనుగోలు శక్తిని పెంచే ఆర్థిక నమూనాను అమలు చేయాలి. అప్పుడే అప్పుల ఊబిలోంచి బయటపడే అవకాశం ఉంది.

కాపలాదారే చోర్ సూత్రధారి

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- ఇండో నేపాల్ బార్డర్‌లో నిఘా
- 10మంది నిందితుల అరెస్ట్
- డైమండ్స్, బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

సికింద్రాబాద్‌లోని సింది కాలనీలో ఓ వ్యాపారి ఇంట్లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఇంటికి కాపలాదారుగా చేసిన వ్యక్తే దొంగతనంలో కీలక వ్యక్తిగా తేల్చారు. పక్కా ప్లాన్‌తో నేపాలీ గ్యాంగ్ దోపిడీ చేసిన విషయం తెలిసిందే. 13 మంది నిందితుల్లో 10 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.41,60,410, 2.8కిలోల బంగారు, డైమండ్ ఆభరణాలు, 9.56 కిలోల వెండితోపాటు 18 ఖరీదైన వాచ్‌లు, సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనం, కారును స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.5 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. బుధవారం బంజారాహిల్స్‌లోని టీఎస్ఐసీసీసీ పోలీస్ కమిషనరేట్‌లో విలేకరుల సమావేశంలో డీసీపీలు చందనాదీప్తి, రాధాకిషన్‌రావుతో కలిసి సీపీ సీవీ ఆనంద్ వివరాలు వెల్లడించారు. నేపాల్‌కు చెందిన శంకర్ మాన్‌సింగ్ సౌద్ అలియాస్ కమల్ తన భార్య పార్వతితో కలిసి రాణిగంజ్‌కి చెందిన వ్యాపారి రాహుల్ గోయేల్ ఇంట్లో ఐదేండ్లుగా వాచ్‌మెన్‌గా పనిచేశారు. ఎంతో నమ్మకంగా మెలిగారు. అదేవిధంగా, అదే దేశానికి చెందిన లాల్ సింగ్ తప్పా బేగంపేట్‌లో వాచ్‌మెన్‌గా, మోహన్ సౌద్ కేపీహెచ్‌బీలోని డీ-మార్టులో పనిచేస్తున్నారు. మిగిలిన వారు పూణే, బెంగళూర్, ముంబయ్ తదితర ప్రాంతాల్లో పని చేస్తున్నారు. వీరంతా నేపాల్‌లోని కైలాలీ జిల్లా, తిక్కపూర్ గ్రామానికి చెందినవారు. అందరూ కలిసి ఒక ముఠాగా ఏర్పడి సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. రాహుల్ గోయేల్ ఇంట్లో కాపలాదారునిగా పని చేసిన కమల్ చోరీకి పథకం వేశాడు. ఈ నెల 9న యజమాని రాహుల్ కుటుంబ సమేతంగా వేరే ప్రాంతానికి వెళ్తున్నాడని, రెండు మూడ్రోజులపాటు రావడం లేదని తెలుసుకున్నాడు. ఈ మేరకు కమల్ పూణే, బెంగళూర్, ముంబైలోని వారి వారిని అలర్ట్ చేశాడు. ఈ నెల 9న 11మంది నిందితులు సికింద్రాబాద్‌కు వచ్చారు. అదే రోజు రాత్రి వ్యాపారి ఇంట్లో చొరబడి అల్మారా, లాకర్ తాళాలు తొలిగించి డైమండ్, బంగారు ఆభరణాలు, వెండి వస్తువులతోపాటు రూ.45లక్షలు ఎత్తుకెళ్లారు. మొత్తం రూ.5.5 కోట్ల వస్తువులను చోరీ చేశారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు రాంగోపాల్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసులకు చిక్కకుండా మూడు గ్రూపులుగా..

నిందితులు పోలీసులకు చిక్కకుండా మూడు గ్రూపులుగా విడిపోయి వేర్వేరు మార్గాల్లో నేపాల్‌కు చేరుకోవాలని నిర్ణయించుకున్నారు. ఓ గ్రూపు బెంగళూర్‌కు, మరో గ్రూపు లక్నో, మరికొందరు ముంబయ్‌కి బస్సుల్లో వెళ్లారు. చోరీ కేసు సంచలనం రేపడంతో సివిల్, టాస్క్‌ఫోర్సు పోలీసులు బృందాలుగా ఏర్పడి విమానాలు, రైలు మార్గాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ముందుగా 'ఇండో నేపాల్' బార్డర్ వద్దకు ఓ బృందాన్ని పంపించి అక్కడి వారిని అలర్ట్ చేశారు. పోలీసులు ప్రత్యేక నిఘా వేశారు. పోలీసులు వెంటాడుతున్నారని గ్రహించిన నిందితులు వివిధ మార్గాల్లో నేపాల్‌కు పారిపోయేందుకు అన్ని విధాలుగా ప్రయత్నించారు. సెల్‌ఫోన్లు స్విచ్చాఫ్ చేశారు. సీసీ ఫుటేజీలు, టవర్ లోకేషన్, ఇతర టెక్నికల్ ఆధారాలతో చివరకు ఇండో నేపాల్ బార్డర్‌లో ఓ గ్రూపు పోలీసులకు చిక్కింది. 10 మందిని అరెస్టు చేసిన పోలీసులు పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. ఇండియా, నేపాల్‌కు మంచి సంబంధాలున్నాయని, కొందరు నేపాల్‌కు చెందిన వారు నేరాలకు పాల్పడటంతో సంబంధాలకు ముప్పురావడంతోపాటు, నేపాలియన్స్‌పై అనుమానాలు మొదలవుతాయని సీపీ అన్నారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ సయ్యద్ రఫీక్యూ, ఏసీపీ బీ.రమేష్, ఇన్‌స్పెక్టర్లు లింగేశ్వర్‌రావు, టి.శ్రీనాథ్‌రెడ్డి, కె.శ్రీకాంత్, ఎం.అంజయ్య, ఎస్ఐ బి.అశోక్ రెడ్డి, ఘనదీప్, అవినాష్ బాబు, కె.లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ అకౌంట్స్ విభాగం కేంద్రీకరించొద్దు

- కార్మికులకు, సంస్థకూ నష్టమే...
- బీఎస్ఎన్ఎల్ సిమ్‌లు కొనసాగించాలి: ఆ స్థానంలో ప్రయివేటు సిమ్‌లు వద్దు
- టీఎస్‌ఆర్టీసీ చైర్మెన్, ఎమ్‌డీకి ఎస్‌డబ్ల్యూఎఫ్ వినతి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో అక్కౌంట్స్ విభాగాన్ని పునర్వవస్థీకరణ పేరుతో కేంద్రీకరించవద్దని టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) కోరింది. దీనివల్ల కార్మికులకు, సంస్థకూ నష్టమేనని విశ్లేషించింది. అలాగే సంస్థ తరఫున కార్మికులకు ఇచ్చిన బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డుల స్థానంలో ప్రయివేటు సంస్థ ఎయిర్‌టెల్ సిమ్‌లు తీసుకోవాలని ఇచ్చిన ఉత్తర్వులను కూడా వెనక్కి తీసుకోవాలని కోరింది. ఈ మేరకు ఆ సంస్థ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్‌కు వినతిపత్రాలు సమర్పించినట్టు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని హైదరాబాద్, సికింద్రాబాద్ రీజియన్ల అక్కౌంట్స్ ఆఫీసుల్ని జోనల్ స్థాయిలో ఒకే చోటకి కేంద్రీకరిస్తూ టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ఈనెల 6వ తేదీ ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. దానిలో పైలట్ ప్రాజెక్ట్ అని పేర్కొన్నా, మిగిలిన రీజియన్లను జోనల్ పరిధిలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశించారని చెప్పారు. పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం 33 జిల్లాలు, చిన్న రెవెన్యూ డివిజన్లు, చిన్న మండలాలను ఏర్పాటు చేసి, అక్కడ పనిచేసేందుకు ఉద్యోగులను రిక్రూట్ చేస్తుంటే, ఆర్టీసీలో అందుకు భిన్నంగా వికేంద్రీకరణలో ఉన్న విభాగాలను కేంద్రీకరించడం ఏంటని ప్రశ్నించారు. దీనివల్ల ఆర్టీసీ కార్మికులు ప్రతి చిన్న సమస్య పరిష్కారానికీ జోనల్ స్థాయికి వెళ్లాల్సి వస్తుందనీ, ఫైళ్లు అక్కడికీ, ఇక్కడికీ తిప్పడం వల్ల కాలయాపన జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికార కేంద్రీకరణ జరిపి, గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో క్లర్కులు, సూపర్‌వైజర్లు అదనంగా ఉన్నట్టు తేల్చారనీ, మిగిలిన జోన్లలోనూ ఇదే తరహాలో మిగులు సిబ్బంది అంటూ యాజమాన్యం కార్మికుల ఉద్యోగ భద్రతను హరించే అవకాశాలు లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యం తక్షణం ఈ తరహా ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఎయిర్‌టెల్ వద్దు..

ప్రభుత్వరంగంలో ఉన్న టీఎస్‌ఆర్టీసీ ప్రయివేటు సంస్థ ఎయిర్‌టెల్‌ను ప్రోత్సహించడాన్ని ఎస్‌డబ్ల్యూఎఫ్ తప్పుపట్టింది. సంస్థలోని కార్మికులకు బీఎస్ఎన్ఎల్ ఇచ్చిన సిమ్స్ స్థానంలో ఎయిర్‌టెల్ సిమ్స్ తీసుకోవాలని ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది.

ఈ మేరకు సంస్థ ఎమ్‌డీ, చైర్మెన్‌లకు వినతిపత్రాలు సమర్పించినట్టు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు తెలిపారు. గ్రూప్ కాల్ సౌకర్యంలో భాగంగా రూ.36 లతో బీఎస్ఎన్ఎల్ ప్రతి ఆర్టీసీ కార్మికుని కుటుంబానికి యాడ్‌ఆన్‌గా ఐదు సిమ్‌కార్డులు ఇచ్చిందనీ, ఇప్పుడు వాటిని కాదని ఎయిర్ టెల్ సంస్థ ద్వారా కేవలం రెండు సిమ్‌లు ఇస్తూ, అంతకంటే ఎక్కువ టారిఫ్ చెల్లించేలా ఒప్పందం చేసుకోవడం సరికాదని పేర్కొన్నారు. 5జీ పేరుతో ఎయిర్‌టెల్ రెండు సిమ్‌లు ఇస్తే, దానికోసం 5జీ సపోర్ట్ చేసే ఫోన్లను కూడా కొనాల్సి వస్తుందని వివరించారు.

ఆర్టీసీ కార్మికుల పీఎఫ్ సహా అన్నింటికీ బీఎస్ఎన్ఎల్ నెంబర్లే యాడ్ అయ్యి ఉన్నాయనీ, దాన్ని పోర్ట్ చేసుకొనే వెసులుబాటు లేదన్నారు. కార్మికులపై ఆర్థికభారం మోపే ఇలాంటి చర్యల్ని తమ సంఘం వ్యతిరేకిస్తుందని తెలిపారు. ఆ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని కోరారు.

సాంకేతిక సమస్య వల్లే..

- బయోటెక్నాలజీ సీట్లన్నీ ఎంపీసీ అభ్యర్థులకు కేటాయింపు
- బైపీసీ వారికోసం జేఎన్టీయూహెచ్‌లో 33, సీబీఐటీలో 23 సీట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా జేఎన్టీయూ హైదరాబాద్, సీబీఐటీలో అందించే బయోటెక్నాలజీ కోర్సులోని అన్ని సీట్లనూ ఎంసెట్ కౌన్సెలింగ్ మొదటి విడతలో ఎంపీసీ విభాగం అభ్యర్థులకు కేటాయించామనిసాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే చేరిన వారి సంఖ్యను పరిగణనలోకి తీసుకుని బైపీసీ విభాగం అభ్యర్థుల కోసం సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. జేఎన్టీయూ హైదరాబాద్‌లో 33 సీట్లు, సీబీఐటీలో 23 సీట్లు కలిపి 56 సీట్లు అలాగే ఉన్నాయని వివరించారు. బైపీసీ విభాగం అభ్యర్థుల కోసం నిర్వహించే కౌన్సెలింగ్ అవి అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు.

ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్

- ఉద్యోగుల సమస్య పరిష్కారం కోసం....
- ఆగస్టు 10 నుంచి సమ్మె : ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పథకంలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 10 నుంచి సమ్మె చేయనున్నట్టు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ తెలిపారు. బుధవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్ హెచ్ఎం స్కీం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమా రాజేష్ కన్నా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ ఎన్‌హెచ్ఎంలో పని చేస్తున్న మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులు తదితర కేడర్ల సర్వీసులను క్రమబద్ధీకరించాలనీ, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. వారి పట్ల ప్రభుత్వం కాంట్రాక్టు నిబంధనలను సరిగా పాటించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు ఎస్.రేవతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

నీట్ విద్యార్థులకు మెరిట్ కౌన్సెలింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీట్-2024 కోసం సిద్ధమవుతున్న విద్యార్థులకు ర్యాంకు సాధించడమే లక్ష్యంగా ప్రారంభిస్తున్న సూపర్ 30 బ్యాచ్‌కు ఉచిత మెరిట్ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నట్టు మెటామైండ్ అకాడమి డైరెక్టర్ మనోజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని ఈనెల 21వ తేదీ ఉదయం పది గంటల నుంచి ఉపయోగించుకోవాలని సూచించారు. మెటామైండ్ నీట్ అకాడమి, రామకృష్ణ మఠం పక్కన, దోమల్‌గూడ, హైదరాబాద్ కార్యాలయంలో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలనీ, ఇతర వివరాలకు 7032264910, 8522958575 నెంబర్లను సంప్రదించాలని కోరారు.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 60,650	▲ 550
22 క్యారెట్లు	- 55,600	▲ 500
కిలో వెండి	- 82,000	▲ 600

ఫౌండర్స్ ల్యాబ్‌ను ప్రారంభించిన మంత్రి కేటీఆర్



హైదరాబాద్: విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసి వారిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి ఏర్పాటైన ఫౌండర్స్ ల్యాబ్ సంస్థను హైదరాబాద్ గ్రోత్ కారిడార్ కార్యాలయంలో ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న విద్యాసంస్థలు యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కాలేజీలలో ఈ సంస్థ కార్యకలాపాలు కొనసాగించనున్నది. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ స్టార్టప్ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని రాష్ట్రంలో యువతను ఈ దిశగా ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఇప్పటికే టి-హబ్, టి- వర్క్స్, అగ్రి హబ్, వి- హబ్ వంటి అనేక వేదికలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఫౌండర్స్ ల్యాబ్ సంస్థ కాలేజీ స్థాయి నుండే విద్యార్థులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే విధంగా వారికి శిక్షణ అందించడం ఒక మంచి పరిణామం అన్నారు. ఫౌండర్స్ ల్యాబ్ సంస్థ వ్యవస్థాపకులు సిఇఒ శకుంతల కాసరగడ్డ మాట్లాడుతూ ఫార్మా, అగ్రికల్చర్, మేనేజ్మెంట్ రంగాలను ఇంజనీరింగ్ రంగాలతో అనుసంధానం చేస్తూ సమాజానికి అవసరమైన అనేక ఆవిష్కరణలు విద్యార్థుల ద్వారా వెలికితీసే అవకాశం ఉందన్నారు.

ఈ క్రమంలో విద్యాసంస్థల మరియు ప్రభుత్వ సహకారంతో వారికి కావాల్సిన అన్ని అంశాల్లో సంస్థ పూర్తి సహకారం అందజేసి వారిని అత్యుత్తమ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి అవసరమైన అన్ని విధాలా సేవలను అతమ సంస్థ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖా ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్, ఎమ్మెల్యేలు నన్నపనేని నరేందర్, పైలెట్ రోహిత్ రెడ్డి, ఆ సంస్థ డైరెక్టర్ సత్య ప్రసాద్ పెద్దపెల్లి పాల్గొన్నారు.

ఐసీఐసీఐ లాంబర్డ్‌కు రూ.390 కోట్ల లాభాలు

హైదరాబాద్: ఐసీఐసీఐ లాంబార్డ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 12 శాతం వృద్ధితో రూ.390 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.349 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ1లో సంస్థ స్థూల ప్రత్యక్ష ప్రీమియం ఆదాయం (జిడిపిఐ) 19 శాతం పెరిగి రూ.6,387 కోట్లుగా చోటు చేసుకుంది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.5,370 కోట్ల ఆదాయాన్ని ప్రకటించింది. పెట్టుబడులపై ఆదాయం 27 శాతం పెరిగి రూ.621 కోట్లుగా నమోదయ్యింది.

ఆర్టీఐ చట్టంలో మార్పులొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్రం సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టాన్ని నీరుగార్చే యత్నం చేస్తున్నదని ఆందోళన వ్యక్తమవుతున్నది.

గతేడాది నవంబర్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖచే సంప్రదింపుల కోసం పంపిణీ చేయబడిన బిల్లు ముసాయిదా సమస్యలతో నిండి ఉన్నది. అప్పట్లో ఈ బిల్లులోని లోపాలపై సామాజిక కార్యకర్తలు పెదవి విరిచారు. గోప్యత హక్కు కోసం ప్రచారం చేసే వారి ద్వారా ఈ బిల్లు విమర్శలకు కేంద్ర బిందువైంది. చివరకు బిల్లు క్యాబినెట్ ఆమోదం పొందింది. కానీ ఈ బిల్లు పబ్లిక్ డొమైన్‌లో లేకపోవటం గమనార్హం. అయితే, డేటా రక్షణ చట్టం మునుపటి ముసాయిదాలో ఉన్న లోపాలతో కూడినట్టుగా ఉండకూడదని నిపుణులు, విశ్లేషకులు తెలిపారు.

2005లో చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి లక్షలాది మంది భారతీయ పౌరులకు సాధికారత కల్పించిన సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టంలోని నిబంధనలను పలుచన చేయకూడదని సూచించారు. ప్రజాస్వామ్యంలో తమ ప్రభుత్వాలను సమర్థవంతంగా జవాబుదారీగా ఉంచడానికి, వ్యక్తులు వివిధ వర్గాల వ్యక్తిగత డేటాతో సహా సమాచారాన్ని పొందాలని తెలిపారు.

ఉదాహరణకు, ఉద్దేశపూర్వక ఎగవేతదారుల పేర్లు, ప్రభుత్వ రంగ బ్యాంకుల నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) వివరాలను తెలుసుకునే హక్కు పౌరులకు ఉందని సుప్రీంకోర్టు పేర్కొన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

భారతదేశంలో ఆర్టీఐ చట్టాన్ని ఉపయోగించిన అనుభవం, ప్రజలు, ముఖ్యంగా పేదలు, అట్టడుగు వర్గాలకు ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలను పొందాలనే ఆశ ఉంటే, వారు సంబంధిత, గ్రాన్యులర్ సమాచారాన్ని పొందగలగాలని తెలిపారు.

ఉదాహరణకు, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (పీడీఎస్) కంట్రోల్ ఆర్డర్ పీడీఎస్ యొక్క పబ్లిక్ స్క్రూటినీ, సోషల్ ఆడిట్‌లను ప్రారంభించడానికి రేషన్ కార్డ్ హోల్డర్ల వివరాలను, రేషన్ షాపుల రికార్డులను పబ్లిక్ డొమైన్‌లో ఉంచవలసిన అవసరాన్ని గుర్తిస్తుంది. అటువంటి పబ్లిక్‌గా యాక్సెస్ చేయగల వ్యక్తిగత డేటా లేనప్పుడు, ఉద్దేశించిన లబ్ధిదారులు వారి ఆహార ధాన్యాల హక్కును పొందగలగటం అసాధ్యమని వివరించారు.

2022 డేటా ప్రొటెక్షన్ బిల్లు దాని పరిధిని విస్తరించడానికి సెక్షన్ 8(1)(జే) ఆర్టీఐ చట్టం పరిధి నుంచి మొత్తం వ్యక్తిగత సమాచారాన్ని మినహాయించే నిబంధనను కలిగి ఉంది. ఇది దేశంలోని పారదర్శక పాలనకు పెద్ద దెబ్బే అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సమాచార రక్షణ బిల్లు తప్పనిసరిగా ఆర్టీఐ చట్టంలోని నిబంధనలు, లక్ష్యాలకు అనుగుణంగా ఉండాలన్నారు. గోప్యత హక్కును గుర్తించడం లేదా డేటా రక్షణ చట్టాన్ని అమలు చేయడం కోసం ప్రస్తుత ఆర్టీఐ చట్టానికి ఎలాంటి సవరణ అవసరం లేదని తెలిపారు.

ఇక ప్రభుత్వం అతిపెద్ద డేటా రిపోజిటరీ అయినందున, చట్టం కార్యనిర్వాహక వర్గానికి విస్తృత విచక్షణాధికారాలను ఇవ్వకూడదని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వ సంస్థలచే చట్టాన్ని ఉల్లంఘించినప్పుడు చర్య తీసుకోవడానికి చట్టం కింద ఏర్పాటు చేయబడిన పర్యవేక్షణ సంస్థ తగినంత స్వతంత్రంగా ఉండటం అత్యవసరమని తెలిపారు. బాధిత వ్యక్తులు పర్యవేక్షక సంస్థను సంప్రదించడానికి చట్టం అందుబాటులో ఉండే, ప్రజలకు అనుకూలమైన ఫిర్యాదుల పరిష్కారాన్ని అందించాలన్నారు. చివరగా, డేటా ఉల్లంఘన విషయంలో, బాధితుడు తప్పనిసరిగా ద్రవ్య పరిహారం పొందగలగాలని నిపుణులు తెలిపారు. డేటా ప్రొటెక్షన్ బిల్లులో ఏ రూపంలోనైనా పరిహారం పొందే అవకాశం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

మబ్బే..మసకేసిందిలే..

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారు. దాంతో వారు వాగు వద్దకు చేరుకొని అత్యాధునిక రబ్బర్ బోట్ సహాయంతో గర్భిణీలను రక్షించి ఏటూరు నాగారం ఆస్పత్రికి తరలించారు. పేరూరు వద్ద గోదావరి నీటి మట్టం బుధవారం 11.50 అడుగులకు చేరింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. మట్టి రోడ్లపై కనీసం కాలినడకన వెళ్లలేని పరిస్థితి నెలకొంది. లోతట్టు ప్రాంతాలు వరదనీటితో మునిగాయి. కొన్ని ప్రాంతాల్లో వాగులు వంకలు పారుతున్నాయి. గజ్వేల్ బస్టాండ్ పూర్తిగా బురద మయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. దుబ్బాకలో శిథిలావస్థకు చేరిన ఇండ్లు కూలాయి. ఖమ్మం జిల్లాలో బుధవారం 523 మి.మీ, భద్రాద్రి కొత్తగూడెంలో 1184 మి.మీ వర్షంపాతం నమోదు అయింది. దాంతో స్థానిక మంత్రి అజయ్.. హైదరాబాద్ నుంచి టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. గోదావరి, ఖమ్మం శివారు మున్నేరు నీటి మట్టాలపై ఆరా తీశారు. ఉమ్మడి మహ బూబ్‌నగర్ జిల్లాలో ఖరీఫ్ మొదలై రెండు నెలలు కావస్తున్నా ఎగువనున్న కర్నాటక, మహారాష్ట్రల్లో వర్షాలు లేకపోవడంతో శ్రీశైలం, జూరాల రిజర్వాయర్లకు చుక్క నీరు రాలేదు. ఈ రిజర్వాయర్ల మీద ఆధారపడిన కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ రిజర్వాయర్లు వెలవెలబోతున్నాయి. హైదరాబాద్‌లో కురుస్తున్న ముసురుతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. దాంతో ట్రాఫిక్ పెరిగింది. లోతట్టు ప్రాంతాలు వరదల మయమవుతున్నాయి. పలుచోట్ల విద్యుత్ అంతరాయం నెలకొంది.

యాదాద్రి భువనగిరి జిల్లాలో నారాయణపురం మండలం జనగామ గ్రామంలో 27.4 మిల్లీమీటర్లు, బొమ్మలరామారం మండలంలో 22.8 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది. నల్లగొండ జిల్లాలోని మునుగోడులో 28.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాగా, జిల్లాలో జూన్ 1 నుంచి నేటి వరకు 158.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావలసి ఉండగా 137.1 నమోదు అయింది. ఇప్పటికీ 14 శాతం లోటు వర్షపాతం నమోదైంది. నిజా మాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల ధాటికి నిజామాబాద్ నగర శివారులో గూపన్‌పల్లి ఉన్నత పాఠశాల చెరువును తలపిస్తోంది. పాఠశాల మొత్తం నీటితో నిండి పోయి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో 150 మంది విద్యార్థు లుండగా.. కేవలం 30 మంది హాజరవు తున్నారు. వరం గల్ జిల్లాలో ఇల్లు కూలి మహిళ మృతి చెందిం ది.

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ఇన్నాండ్లు లోటు వర్షపాతం నమోదు కాగా తాజాగా కురుస్తున్న వర్షాలతో వర్షపాతం సాధారణ స్థితికి చేరుకుంది. 10 మండలాల్లో సాధారణం కంటే అధికంగా కురవగా, మరో 10 మండలాల్లో మాత్రం తక్కువగా కురిసింది. మిగతా 50 మండలాల్లో సాధారణానికి చేరు కుంది. ఇప్పటి వరకు కురిసిన వర్షాలు పంటలకు ప్రయోజనం చేకూర్చగా.. మరికొన్ని రోజులు నిరంతరంగా ఉంటాయని వాతావరణశాఖ చెబుతోంది. గోదావరి, ప్రాణహిత నదులకు వరద ఉధృతి పెరుగుతోంది. ప్రాణహిత నదీ ప్రవాహం పుష్కరఘాట్‌ల మెట్లను తాకుతూ వెళ్తోంది. ప్రస్తుతం కాళేశ్వరం వద్ద 9 మీటర్ల మేర నీటి మట్టం నమోదైంది. కడెం, ఎల్లంపల్లి, కుమురం భీం(అడ), సాత్నాల, మత్తడివాగు, స్వర్ణ, వట్టివాగు తదితర ప్రాజెక్టులు కొత్త నీటి తో నిండుకుంటున్నాయి. బుధవారం రాత్రి కడెం ప్రాజెక్టు 9వ గేట్‌ను రెండు ఫీట్ల మేర ఎత్తారు. అవుట్ ఫ్లో 2,865 క్యూసెక్కులు కాగా ఇన్‌ఫ్లో 8699 క్యూసెక్కులని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

'బొగత'కు పర్యాటకుల సందర్శన నిలిపివేత

ములుగు జిల్లా వాజేడులోని బొగత జలపాతం 50 అడుగుల ఎత్తుతో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ అటవీ ప్రాంతంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి.. బొగతలోకి భారీగా వరద పోటెత్తు తోంది. వచ్చే మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించడంతో బొగత జలపాతానికి సందర్శకులను నిలిపి వేశారు. పెరిగిన భద్రాద్రి గోదావరి నీటి మట్టం ఎగువన ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం భారీగా పెరుగుతోంది. ఎగువన కాళేశ్వరం, ఇంద్రావతి, తాలిపేరు నదుల నుంచి వచ్చే వరదల వల్ల బుధవారం రాత్రికి భద్రాచలం వద్ద 35 అడుగులకు నీటిమట్టం చేరవచ్చని కలెక్టర్ ప్రియాంక అలా తెలిపారు. కాళేశ్వరం నుంచి 2.35 లక్షలు, ఇంద్రావతి నుంచి 2.15 లక్షల క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. పేరూరు వద్ద 5.3 లక్షల క్యూసెక్కుల నీరు గోదావరిలో ప్రవహిస్తోంది. తాలిపేరు ప్రాజెక్టు నుంచి 60వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండటంతో మొదటి ప్రమాద హెచ్చరిక దిశగా గోదావరి పరుగులు తీస్తోంది. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యంత్రాంగం సూచించింది. మరోవైపు పాల్వంచ సమీపంలోని కిన్నెరసానికి భారీగా వరద నీరు చేరుతోంది. దీని సామర్థ్యం 407 అడుగులు, ప్రస్తుతానికి 398.50 అడుగులకు చేరింది 4,074 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.

జలమయమైన ఎల్కతుర్తి కేజీబీవీ

- ట్రాక్టర్‌లో విద్యార్థులను తరలించిన ట్రైనీ ఐపీఎస్

నవతెలంగాణ-ఎల్కతుర్తి



రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాల పూర్తిగా నీటితో నిండిపోయింది. సుమారు 200 మంది విద్యార్థులు అవస్థలు పడుతుండటంతో గమనించిన ఎల్కతుర్తి ట్రైనీ ఐపీఎస్ అధికారి అంకిత్ శర్వాంకర్, ఎస్ఐ రాజకుమార్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు కడారి రాజు, సర్పంచ్ నిరంజన్ రెడ్డి ట్రాక్టర్లతో విద్యార్థులను బయటకు తీసుకువచ్చి, ప్రయివేటు బస్సుల ద్వారా, మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు తరలించారు. విద్యార్థులకు తన సొంత ఖర్చులతో ట్రైనీ ఐపీఎస్ అధికారి బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. అలాగే వారికి భోజన సదుపాయాలను అందించాలని ఎంపీటీసీ రాజును ఆదేశించారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ శంకర్, సిబ్బంది, బక్కయ్య వెంకన్న నిరంజన్. వీఆర్ఏ బొంకూరి రవీందర్, అల్లకొండ రాజు ఉన్నారు.

వరినాటు వేసిన మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

నవతెలంగాణ హవేలీ ఘనపూర్

మెదక్ జిల్లా హవేళీఘనపూర్ మండలంలోని చౌట్లపల్లి గ్రామంలో వరి నాటు వేసే కూలీలతో కలిసి ఎమెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి నాట్లు వేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే.. ప్రజా సమస్యలతో పాటు వర్షాలతో కలుగుతున్న ఇబ్బందులను అధికారులను ఆదేశించి అప్రమత్తం చేస్తున్నారు. పంట పొలాల వద్దకు వెళ్లి కూలీలు, రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు.

హవేళిఘనాపూర్ మండ ల పరిధిలోని చౌట్లపల్లి, శుక్లాల్‌పేట్ గ్రామ శివారులో బుధవారం మహిళా కూలీలతో కలిసి బురదలో దిగి వరినాట్లు వేశారు. మహిళలు పాటలకు వారితో గొంతు కలిపారు. మహిళా కూలీలతో కలిసి నాటు వేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.

మూడ్రోజులు భారీ నుంచి అతి భారీ వర్ష సూచన

- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ
- కామారెడ్డి జిల్లా గాంధారిలో 10.7 సెంటీమీటర్ల వాన
- 919 ప్రాంతాల్లో వర్షపాతం నమోదు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళికా సంస్థ నివేదిక ప్రకారం రాష్ట్రంలో బుధవారం రాత్రి 11 గంటల వరకు 919 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. 27 చోట్ల భారీ వర్షం, 382 ప్రాంతాల్లో మోస్తరు వానలు పడ్డాయి. కామారెడ్డి జిల్లా గాంధారిలో 10.7 సెంటీమీటర్లు, జనగామ జిల్లా జాఫర్‌గఢ్‌లో 10.4 సెంటీమీటర్లు, సిద్దిపేట జిల్లా రాంపూర్‌లో 10.1 సెంటీమీటర్ల భారీ వర్షం పడింది. తెలంగాణ మీదుగా ఉధృతంగా నైరుతి రుతుపవనాలు కొనసాగుతున్న నేపథ్యంలో వచ్చే మూడు రోజుల పాటు కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. ఎక్కువ ప్రాంతాల్లో మోస్తరు వానలు పడే సూచనలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. గురువారం నాడు ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశమున్న నేపథ్యంలో ఆరెంజ్ హెచ్చరికను వాతావరణ శాఖ జారీ చేసింది. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడే సూచనలున్నాయని తెలిపింది. 21,22 తేదీల్లో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడే అవకాశముందని పేర్కొంది.

నేటి నుంచి పార్లమెంట్

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 34 పార్టీల నుంచి 44 మంది నేతలు హాజరయ్యారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, కుల గణన, మహిళా రిజర్వేషన్ బిల్లు, మణిపూర్ అల్లర్లు, బాలసోర్ రైలు ప్రమాదం, ప్రతిపక్షాలపై ఈడీ, సీబీఐ దుర్వినియోగం, ఎన్నికైన ప్రభుత్వాలపై గవర్నర్ల ఆధిపత్యం, సమాఖ్యవాదంపై దాడి, ఢిల్లీ ఆర్డినెన్స్ వంటి అంశాలను ప్రతిపక్షాలు లేవనెత్తాయి. అలాగే మణిపూర్‌పై చర్చ జరపాలని, ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేశారు.

31 బిల్లుల జాబితా

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో 31 బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం జాబితా చేసింది. గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ (సవరణ) బిల్లు, అటవీ సంరక్షణ సవరణ బిల్లు, డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు, జీవ వైవిధ్య (సవరణ) బిల్లు వంటి 31 బిల్లులు ఈ జాబితాలో ఉన్నాయి.

కాంగ్రెస్ లోక్‌సభ పక్షనేత అధిర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ సమావేశాల్లో పలు అంశాలను లేవనెత్తడానికి ప్రతిపక్షాలను అనుమతించాలని కోరినట్టు చెప్పారు. ఎస్పీ ఎంపీ ఎస్‌టి హసన్ మాట్లాడుతూ యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ)పై చర్చ జరపాలని కోరినట్టు తెలిపారు. ఒడిశాకు ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరినట్టు బీజేపీ ఎంపీ సస్మిత్ పాత్ర అన్నారు. అఖిలపక్ష సమావేశానికి 34 పార్టీలు, 44 మంది నేతలు హాజరయ్యారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ప్రతిపక్షాల నుంచి తాము చాలా ముఖ్యమైన సలహాలు పొందామని, 31 బిల్లులను జాబితా చేశామని అన్నారు. మణిపూర్ అల్లర్లపై ఎక్కువ మంది సభ్యులు లేవనెత్తారని, దానిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా నిర్వహించేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కోరామన్నారు.

సమావేశంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రులు అర్జున్ రాం మేఘ్వాల్, మురళీధరన్, జైరాం రమేష్, ప్రమోద్ తివారీ (కాంగ్రెస్), టిఆర్ బాలు, తిరుచ్చి శివ (డీఎంకే), ఎలమారం కరీం, పిఆర్ నటరాజన్ (సీపీఐ(ఎం), కె.కేశవరావు, నామా నాగేశ్వరరావు (బిఆర్ఎస్), విజయసాయి రెడ్డి (వైసీపీ), గల్లా జయదేవ్, కనకమేడల రవీంద్ర కుమార్ (టీడీపీ), సంజయ్ సింగ్ (ఆప్), రామ్ గోపాల్ యాదవ్ (ఎస్‌పీ), మనోజ్ కుమార్ ఝా (ఆర్జేడీ), సంతోష్ కుమార్ (సీపీఐ), ఎన్‌కె ప్రేమ్ చంద్రన్ (ఆర్ఎస్‌పీ), తంబిదొరై (అన్నాడీఎంకే), ఈటి మహ్మద్ బషీర్ (ఐయూఎంఎల్) తదితర నేతలు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై చర్చ జరగాలి..

(మొదటిపేజీ తరువాయి)

అఖిలపక్షంలో లేవనెత్తుతాం. అలాగే పార్లమెంట్‌కు ప్రధాన మంత్రి గైర్హాజరుపై కూడా ప్రశ్నించాం. ప్రధాన మంత్రి సభకు హాజరై, మణిపూర్‌పై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాం. దీనిపై వాయిదా తీర్మాన నోటీసు కూడా ఇస్తాం.. ఇలాంటి అంశాలను పార్లమెంట్‌లో ప్రజల తరపున గళమెత్తుతాం.

సమస్యలపై కేంద్రాన్ని నిలదీస్తాం

మణిపూర్ అంశంపైనా పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రాన్ని నిలదీస్తాం. మణిపూర్ అల్లర్లపై ప్రధాని స్టేట్మెంట్ ఇవ్వాలని, ఆ అంశంపై చర్చ చేపట్టాలని కోరాం. గవర్నర్ల అంశంపై కూడా చర్చ చేపట్టాలని, ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్ల తీరుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని చెప్పి రిపేర్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసిన అంశాలపైనా కూడా పార్లమెంట్‌లో కేంద్రాన్ని నిలదీస్తాం. తెలంగాణకు సంబంధించిన పెండింగ్ అంశాలతోపాటు బకాయిలపై కూడా చర్చకు అవకాశం ఇవ్వాలని అఖిల పక్ష సమావేశంలో కోరాం. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టులు, సమస్యల సాధనకు పెద్ద ఎత్తున పార్లమెంట్ సమావేశాల్లో లెవనెత్తుతాం.

రఫేల్‌పై కొనసాగుతున్న సంప్రదింపులు

- ఇంకా ఖరారు కాని ఒప్పందం

న్యూఢిల్లీ : ఫ్రాన్స్ నుండి 26 రఫేల్-ఎం యుద్ధ విమానాలు, మూడు స్కార్పేన్ జలాంతర్గాముల కొనుగోలుకు సంబంధించి సంప్రదింపులు కొనసాగుతున్నాయి. ధరను, సాంకేతిక-వాణిజ్య వివరాలను ఖరారు చేసే ప్రక్రియ ఇంకా ఓ కొలిక్కి రాలేదు. జలాంతర్గాముల ప్రాజెక్టుకు సంబంధించి మన దేశానికి చెందిన ప్రభుత్వ రంగ నౌకా నిర్మాణ సంస్థ మజగాన్ డాక్ లిమిటెడ్, ఫ్రాన్స్‌కు చెందిన నౌకాదళ గ్రూపు ఈ నెల 6న ఒక ఒప్పందాన్ని ఖరారు చేశాయి. అయితే ధర, సాంకేతిక వివరాలపై జరుగుతున్న చర్చలు ఇంకా పూర్తి కాలేదు. రఫేల్ విమానాల సేకరణకు సంబంధించి సైతం సాంకేతిక, వాణిజ్య వివరాలను ఖరారు చేయాల్సి ఉంది. రఫేల్ విమానాలు, జలాంతర్గాముల కొనుగోలుకు సంబంధించి భారత నౌకాదళం చేసిన ప్రతిపాదనకు ఈ నెల 13న ఫ్రాన్స్ రక్షణ సేకరణ మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. అదే రోజు ప్రధాని నరేంద్ర మోడీ తన రెండు రోజుల ఫ్రాన్స్ పర్యటనను ప్రారంభించారు. ఆ పర్యటనలోనే కొనుగోలు ఒప్పందాలపై ప్రకటన వెలువడుతుందని భావించారు. అయితే మోడీ పర్యటన సందర్భంగా రూపొందించిన ప్రణాళికలో దీనిని చేర్చలేదు. ధర పైన, యుద్ధ విమానాలు, జలాంతర్గాములను అందజేసే తేదీ పైన సంప్రదింపులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ధర నిర్ణయం కానప్పటికీ 9-10 బిలియన్ యూరోల మధ్య ఉండవచ్చునని అంచనా.

తెలంగాణ హైకోర్టు సీజేగా జస్టిస్ అలోక్ అరాధే

- రాష్ట్రపతి ఆమోద ముద్ర

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ హైకోర్టు సీజేగా జస్టిస్ అలోక్ అరాధే నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు.అలాగే ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.సామ్ కోశిను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేశారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. జస్టిస్ అలోక్ అరాధే ప్రస్తుతం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.జూలై 5న సీజేఐ జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు కొలీజియం జస్టిస్ అరాధే,జస్టిస్ పి.సామ్ కోశిని సిఫారసు చేసింది.

నితీశ్ అసంతృప్తిగా లేరు !

- స్పష్టం చేసిన జేడీయూ
- ఇండియా కన్వీనర్‌గా వుండాలనే కోరిక లేదన్న నితీశ్



పాట్నా : ఇటీవల బెంగళూరులో జరిగిన ప్రతిపక్షాల సమావేశం పట్ల బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అసంతృప్తిగా లేరని జనతాదళ్ (యునైటెడ్) చెప్పింది. నితీశ్ అసంతృప్తిగా వున్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో పార్టీ ఈ ప్రకటన చేసింది. అనంతరం నితీశ్ కుమార్ మాట్లాడుతూ, తాను సంతోషంగా లేనని వచ్చిన వార్తలను తోసిపుచ్చారు. బెంగళూరు సమావేశంలో జరిగిం దంతా కరక్టగానే వుందని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల కూటమికి కన్వీనర్ గా వుండాలనే కోరిక తనకు లేదని కుమార్ మీడియాకు చెప్పారు. బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్షాలను సమైక్యంగా వుంచాలన్నదే తన ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. నలందా జిల్లాలోని రాజ్‌గృహ వద్ద మల్మాస్ మేళాను ఆయన ప్రారంభించిన తర్వాత మీడియాతో మాట్లాడారు. జేడీయూ జాతీయ అధ్యక్షుడు లలన్ సింగ్ అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ, నితీశ్ అసంతృప్తిపై వస్తున్న వార్తలను తోసిపుచ్చారు. అవన్నీ బూటకమని అన్నారు. ఉద్దేశపూర్వకంగానే అటువంటి పుకార్లను వ్యాప్తి చేస్తున్నారని అన్నారు. ప్రతిపక్షాల ఐక్యత పట్ల బీజేపీ అగ్ర నేతలు భయపడుతున్నారని, అందుకే ఇలాంటి వదతులు వ్యాప్తి చేస్తున్నారని అన్నారు. ఇటీవల కాలంలో ఇలాంటి పుకార్లు చాలా వస్తున్నాయన్నారు. జేడీయూ చీలిక అంచున వుందని, జేడీయూ, ఆర్జేడీ మధ్య విభేదాలు పెరుగుతున్నాయని, ఇప్పుడు నితీశ్ అసంతృప్తిగా వున్నారని - ఇవన్నీ వారి దుష్ప్రచారంలో భాగమేనని అన్నారు. ఇండియాకు సూత్రధారి నితీశ్ అని, ఆయన కొనసాగుతారని చెప్పారు. ఇండియా పేరును అందరూ ఏకగ్రీవంగానే ఖరారు చేశారని చెప్పారు. పైగా కన్వీనర్‌గా చేయనందుకు నితీశ్ అసంతృప్తిగా వున్నారన్న వార్తలను ఖండించారు. ముంబయిలో జరిగే తదుపరి సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

జనన ధ్రువీకరణ పత్రంలో... కుల, మతరహిత కాలమ్‌ను పెట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

పాటు ఉన్నతాధికారులను ఆశ్రయించారు. అప్పటికీ తాము కోరిన పద్ధతుల్లో బర్త్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో హైకోర్టులో పిల్‌ను దాఖలు (2019, ఆగస్టు 28న) చేశారు. గతంలో ఈకేసులో విచారించిన జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్, జస్టిస్ ఎ.అభిషేక్ రెడ్డిలతో కూడిన ధర్మాసనం వారి డిమాండ్ పై కౌంటర్ దాఖలు చేయమని కోరుతూ జనన, మరణ ధ్రువీకరణ అధికారులకు (రిజిస్ట్రార్ ఆఫ్ సైన్సెస్), రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శికి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శికి, కొత్తకోట మున్సిపాల్టీ అధికారులకు నోటీసులను జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాల గడువు విధించింది. అయితే సంవత్సరాలు గడుస్తున్నా... ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేయకపోగా, మరింత సమయాన్ని కోరుతూ వాయిదా వేస్తూ వచ్చారు.

ఐదేండ్లలోపు బర్త్ సర్టిఫికేట్ తీసుకోవాలంటూ ప్రభుత్వ నియమాలు ఉన్న నేపథ్యంలో, బర్త్ సర్టిఫికేట్ లేని కారణంగా ఆధార్ కార్డు ఇవ్వకపోవడం, స్కూల్లో చేర్చుకోవడానికి విద్యాసంస్థలు నిరాకరించడంతో అత్యవసరంగా తీర్పు ఇవ్వాలని పిటిషనర్ల తరపున న్యాయవాదులు ఎస్. వెంకన్న, డి. సురేష్ కుమార్‌లు కోర్టును కోరడంతో తీర్పు వెలువరించింది.

తీర్పుపట్ల దంపతులు హర్షం....

తాము కోరినట్టుగా జస్టిస్ లలిత కన్నెగంటి తీర్పు ఇవ్వడం పట్ల డేవిడ్, రూప దంపతులు హర్షం వ్యక్తం చేశారు. మూడేండ్ల తమ పోరాటం ఫలించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. చారిత్రాత్మకమైన ఈ తీర్పు ఎంతో మందికి దారి చూపుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ దేశంలో కుల,మతాలకు అతీతంగా జీవిస్తున్న వారు ఎందరో ఉన్నారని, వీటికి వ్యతిరేకంగా సుదీర్ఘ పోరాట చరిత్ర కూడా ఉందని తెలిపారు. మతాన్ని, కులాన్ని వదులుకునేందుకు ఎవరైనా ముందుకు వస్తే వ్యక్తిగత స్థాయిల్లో ఏదో సర్దుబాటు చేస్తూ పరిష్కారం చూపుతున్నారే తప్ప... చట్టం చేయడానికి మాత్రం ప్రభుత్వం వెనుకడుగు వేస్తున్న తరుణంలో శాశ్వత పరిష్కారాన్ని చూపుతూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనదని హర్షం వ్యక్తం చేశారు.

తమిళనాడుకు చెందిన న్యాయవాది 'ఎం. స్నేహ' తనకు ఇచ్చే సర్టిఫికెట్‌లో నో క్యాస్ట్, నో రిలీజన్ అనే ఆప్షన్ ఉండాలని పోరాడితే ఎట్టకేలకు స్థానిక కలెక్టర్ ఆమెకు సర్టిఫికెట్ అందజేశారు కానీ ఆన్‌లైన్‌లో ఏదైనా దరఖాస్తు చేసుకోవాలన్నా మళ్ళీ సమస్యను ఎదుర్కోవాల్సి వస్తోంది. అలాగే హైదరాబాద్‌కు చెందిన డి.వి.రామకృష్ణ రావు, ఎస్. క్లారెన్స్ కృపాళిని దంపతులు కూడా ఇదే డిమాండ్ పై కోర్టును ఆశ్రయించారు. తమ పిల్లల అడ్మిషన్ సందర్భంగా మతం అనే కాలమ్ నింపితే తప్ప అడ్మిషన్ ఇవ్వమని స్కూల్ యాజమాన్యం చెప్పడంతో వాళ్ళు కోర్టును ఆశ్రయించారు.

మతం చెప్పడానికి నిరాకరించిన కారణంగా అడ్మిషన్ ఇవ్వకపోవడం సరైనది కాదని కోర్టు చివాట్లు పెట్టడంతో స్కూల్ యాజమాన్యం ఎట్టకేలకు అడ్మిషన్ ఇచ్చింది. కానీ ఆన్ లైన్ వ్యవహారాల్లో మతం, కులం అనే కాలం ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది.... కాబట్టి శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు కావాలంటూ కోర్టు ఆదేశించాలని రూపా, డేవిడ్ దంపతులు కోరారు. మతాన్ని నమ్మే హక్కు ఎలాగైతే ఉందో, వాటిని నమ్మకుండా ఉండే హక్కు కూడా రాజ్యాంగమే కల్పించింది కాబట్టి తమ లాంటి వారి డిమాండ్‌ను పరిగణలోకి తీసుకుని జస్టిస్ లలిత కన్నెగంటి ఇచ్చిన తీర్పు న్యాయం చేస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

అదానీకి ఎదురు దెబ్బ

నోయిడాలో గ్యాస్ సరఫరాకు అనుమతి నిరాకరణ



న్యూఢిల్లీ : రాజధాని న్యూఢిల్లీ శివారులోని నోయిడాలో నివాస గృహాలకు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేసేందుకు అదానీ గ్రూప్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇందుకోసం అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ పెట్టుకున్న దరఖాస్తును కేంద్ర పెట్రోలియం, సహజవాయువు రెగ్యులేటరీ బోర్డు (పీఎన్‌జీఆర్‌బీ) తోసిపుచ్చింది. ఆటో మొబైల్స్‌కు సీఎన్‌జీ లైసెన్స్ కోసం చేసిన అభ్యర్థనను కూడా తిరస్కరించింది.

చట్ట నిబంధనలను అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ పాటించలేదని, అందుకే దరఖాస్తును తిరస్కరించామని ఈ నెల 14న ఇచ్చిన ఆదేశాలలో రెగ్యులేటరీ బోర్డు వివరించింది. రాజధాని పొరుగున ఉన్న నగరాలలో సిటీ గ్యాస్ పంపిణీ (సీజీడీ) లైసెన్స్ కోసం అదానీ రెండు దశాబ్దాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. రెగ్యులేటరీ బోర్డు లేదా కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతి పొందిన సంస్థ మాత్రమే ఏ నగరంలో అయినా పైప్‌లైన్ ద్వారా సహజ వాయువును సరఫరా చేయగలదు. ప్రభుత్వ రంగంలోని సంస్థలు ఉమ్మడి భాగస్వామ్యంలో ఏర్పాటు చేసిన ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ (ఐజీఎల్) 1990వ దశకం నుండీ రాజధానిలో గ్యాస్ సరఫరా చేస్తోంది. సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సంస్థకు సిటీ గ్యాస్ లైసెన్స్ మంజూరు చేశారు. పరిసర నగరాలలో కూడా తానే ఈ సేవలు అందిస్తానని ఆ కంపెనీ ప్రతిపాదించగా అదానీ గ్రూపు వ్యతిరేకించింది.

సుప్రీంలో చుక్కెదురు

నోయిడాలో గ్యాస్ సరఫరాకు కేంద్ర ప్రభుత్వం 2004 ఏప్రిల్ 8వ తేదీనే ఐజీఎల్‌కు అనుమతి ఇచ్చింది. అయితే నోయిడా భౌగోళిక ప్రాంతంలో సహజవాయువు పంపిణీ వ్యవస్థను అభివృద్ధి చేసే అధికారం తనకే ఉన్నదని 2008 జూన్ 25న అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ ప్రకటించింది. అయితే ఆ కంపెనీ దరఖాస్తును రెగ్యులేటరీ బోర్డు అనుమతించలేదు. దీంతో వ్యవహారం సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. వివాదాన్ని పరిష్కరించే అధికారం బోర్డుకే ఉన్నదని సుప్రీంకోర్టు గత సంవత్సరం సెప్టెంబర్‌లో తీర్పు ఇచ్చింది. దీంతో అదానీ కంపెనీ దరఖాస్తును మరోసారి పరిశీలించిన రెగ్యులేటరీ బోర్డు, తాజాగా దానిని తోసిపుచ్చింది. నిర్ణాయక కమిటీలోని ముగ్గురు సభ్యులలో ఇద్దరు ఆ దరఖాస్తును వ్యతిరేకించారు.

రాష్ట్రంలో ఐదుగురు ఐపీఎస్ అధికారుల బదిలీ

- నార్కోటిక్ డ్రగ్స్ విభాగం డైరెక్టర్‌గా కమలాసన్‌రెడ్డి

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో ఐదుగురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర పోలీసు పర్సనల్ విభాగం ఐజీ కమలాసన్‌రెడ్డిని రాష్ట్ర నార్కోటిక్ కంట్రోల్ విభాగం డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. అలాగే, పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న అదనపు డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రాకు పోలీసు పర్సనల్ విభాగాన్ని అప్పగించారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న మరో డీఐజీ అంబర్ కిషోర్ ఝాను రాష్ట్ర హోంగార్డ్స్ డైరెక్టర్‌గా నియమించారు. అలాగే, నగర అదనపు పోలీసు కమిషనర్ (క్రైమ్) ఎ.ఆర్ శ్రీనివాస్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డైరెక్టర్‌గా బదిలీ చేశారు. నగర నేర పరిశోధక విభాగం డీసీపీ శంబరీశ్‌ను మేడ్చల్ డీసీపీగా బదిలీ చేశారు.

ఉమ్మడి ఖమ్మంలో నువ్వా?నేనా??

పధాన పార్టీల వ్యూహ ప్రతివ్యూహాలు

- బీఆర్ఎస్‌లో మెజారిటీ సీట్లలో సిట్టింగ్‌లకే పెద్దపీట..!
- కాంగ్రెస్‌లో ఒక్కోచోట రెండు నుంచి పదిమంది ఆశావహులు
- అత్యంత కీలకంగా కమ్యూనిస్టులు
- ఏడు స్థానాలపై కేంద్రీకరణ

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయాలు ప్రధాన పార్టీల మధ్య నువ్వా నేనా అన్నట్టు ఉన్నాయి. ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో రాజకీయ సమీకరణాలు మారాయి. బీఆర్ఎస్ గతం కంటే మెరుగైనా... పొంగులేటి పార్టీ వీడిన నేపథ్యంలో కమ్యూనిస్టుల బలం తోడైతేనే 'కారు' ముందుకు సాగే పరిస్థితి ఉందని విశ్లేషకుల అంచనా. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్కొక్క స్థానానికి మాత్రమే పరిమితమైంది. ఈ నేపథ్యంలో మెరుగైన ఫలితాల సాధనకు ఏ పార్టీకైనా కమ్యూనిస్టుల ప్రస్తావన లేకుండా ముందుకు అడుగు వేయలేని పరిస్థితి అనివార్యంగా కనిపిస్తోంది. ఈ విషయాన్ని తెలంగాణ ఆవిర్భావం తర్వాత వచ్చిన రెండు అసెంబ్లీ ఎన్నికలు నిరూపించాయి. ఈసారి ఎన్నికల్లోనూ కమ్యూనిస్టుల బలం ఎవరివైపు ఉంటే వారికి విజయం కచ్చితంగా ఉంటుంది. సీపీఐ(ఎం), సీపీఐ కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు నియోజకవర్గాలలో పోటీ చేసేందుకు కేంద్రీకరించి పని చేస్తున్నాయి. పొత్తులు ఖరారైతే అవగాహనను బట్టి సంఖ్య మారే అవకాశం ఉంది.

పొత్తు ఖరారైతే ఒకలా.. కాకుంటే మరోలా!

ఒకటి, రెండు నియోజకవర్గాలు తప్ప మిగిలిన చోట్ల సిట్టింగ్‌లకే బీఆర్ఎస్ పెద్దపీట వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. కమ్యూనిస్టులతో ఎన్నికల పొత్తులు ఖరారైతే ఆ పార్టీ అభ్యర్థుల్లో పెద్దగా మార్పు ఉండకపోవచ్చు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన నలుగురు (కందాల ఉపేందర్‌రెడ్డి(పాలేరు), హరిప్రియ (ఇల్లెందు), రేగా కాంతారావు (పినపాక), వనమా వెంకటేశ్వర్లు (కొత్తగూడెం)), టీడీపీ నుంచి గెలిచిన ఇద్దరు (సండ్ర వెంకటవీరయ్య (సత్తుపల్లి), మెచ్చా నాగేశ్వరరావు (అశ్వారావుపేట)) ఎమ్మెల్యేలు ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. పాలేరు టిక్కెట్ విషయంలో సందిగ్ధం నెలకొంది. వైరాలో స్వతంత్ర ఎమ్మెల్యేగా గెలిచిన రాములునాయక్, మాజీ ఎమ్మెల్యేలు బాణోత్ మదన్‌లాల్, చంద్రావతి, లకావత్ గిరిబాబు బీఆర్ఎస్ టిక్కెట్ ఆశిస్తున్నారు. భద్రాద్రి జిల్లా జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య కాంగ్రెస్‌లో చేరికతో ఇల్లెందు బీఆర్ఎస్ టిక్కెట్ హరిప్రియకు ఖాయమైనట్టేనని ప్రచారం జరుగుతోంది. కొత్తగూడెంలో వనమాకు పోటీగా గడల శ్రీనివాసరావు, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పేర్లు వినిపిస్తున్నా.. ఇంకా ఎవరనేది తెలియదు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్న జలగం వెంకట్రావు వేచిచూస్తున్నారు. భద్రాచలం నుంచి చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య, 2014లో టీఆర్ఎస్ అభ్యర్థి మానె రామకృష్ణ, చర్ల సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు బీఆర్ఎస్ నుంచి టిక్కెట్ ఆశిస్తున్నారు. మధిర నుంచి జడ్పీచైర్మన్ లింగాల కమలరాజ్, బమ్మెర రామ్మూర్తి మధ్య పోటీ నెలకొంది. ఖమ్మంలో పువ్వాడ అజయ్‌కుమార్, సత్తుపల్లిలో సండ్ర వెంకటవీరయ్య, పినపాక నుంచి రేగా కాంతారావు, అశ్వారావుపేట మెచ్చా నాగేశ్వరరావులకు టిక్కెట్ విషయంలో పోటీ ఉండకపోవచ్చు.





కాంగ్రెస్‌కు కొత్త, పాత చిక్కులు...

సీఎల్పీ నేత భట్టివిక్రమార్క, కేంద్రమాజీ మంత్రి రేణుకాచౌదరి వర్గీయులుగా విడిపోయి ఉన్న కాంగ్రెస్‌కు పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేరికతో జోష్ పెరిగినా...'కొత్త' చిక్కులు వచ్చిపడ్డాయి. టిక్కెట్ల విషయంలో పోటీ తీవ్రంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. పొంగులేటి, భట్టి పోటీ చేసే నియోజకవర్గాలు మినహా మిగిలిన అన్ని చోట్ల తుది రేసులో ఎవరు ఉంటారో తెలియని అయోమయ స్థితి నెలకొంది. పార్టీ అంతర్గత సర్వే ఆధారంగా టిక్కెట్లు ఇస్తామని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటిస్తున్న నేపథ్యంలో అంతిమంగా ఎవరు అభ్యర్థులనేది తేలేందుకు మరింత సమయం పట్టవచ్చు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక్కో నియోజకవర్గంలో రెండు నుంచి పదిమంది వరకు ఆశావహులు ఉన్నారు. ఖమ్మం లేదా కొత్తగూడెం నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మధిర నుంచి మల్లు భట్టివిక్రమార్క ఏకైక అభ్యర్థులైనా ఈ సెగ్మెంట్ల నుంచి కూడా టికెట్లు ఆశించేవారు లేకపోలేదు. ఖమ్మం నుంచి మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మానుకొండ రాధాకిషోర్, కొత్తగూడెం ఎడవల్లి కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు (పార్టీ మారితే), పొంగులేటి పోటీ చేయని పక్షంలో ఊకంటి గోపాల్‌రావు టికెట్లు ఆశించేవారిలో ఉన్నారు. మధిరలో డాక్టర్ కోట రాంబాబు ఆశిస్తున్నారు. భద్రాచలంలో సిట్టింగ్ ఎమ్మెల్యే పోడెం వీరయ్యకు తోడు పొంగులేటి అనుచరుడు డాక్టర్ తెల్లం వెంకట్రావు పోటీపడుతున్నారు. అత్యధికంగా ఇల్లెందు నుంచి 10 మంది కోరం కనకయ్య, చీమల వెంకటేశ్వర్లు, బాణోత్ విజయలక్ష్మి, గుగులోత్ కిషన్‌నాయక్, డాక్టర్ రామచంద్రనాయక్, ఉపాధ్యాయసంఘం నేత లక్ష్మణ్‌నాయక్, కిషన్‌నాయక్, గుండెబోయిన నాగమణి, డాక్టర్ రవిబాబునాయక్, సేవాలాల్ సమితి వ్యవస్థాపకులు భూక్యా సంజీవ్‌నాయక్ టిక్కెట్ ఆశిస్తున్నారు. పినపాక నుంచి మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సర్పంచ్ పోలెబోయిన శ్రీవాణి, విజయ్‌గాంధీ, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య కుమారుడు సంతోష్, ములుగు ఎమ్మెల్యే సీతక్క కుమారుడు ధనసరి సూర్య, కాటిబోయిన నాగేశ్వరరావు, కణితి లక్ష్మణ్‌రావు ఏడుగురు పోటీపడుతున్నారు. అశ్వారావుపేట నుంచి మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, పొంగులేటి వర్గీయుడు జారె ఆదినారాయణ, సున్నం నాగమణి, టీచర్ ధంజునాయక్, మాజీ ఎమ్మెల్యే వగ్గెల మిత్రసేన బంధువు వగ్గెల పూజ ఐదుగురి మధ్య టిక్కెట్ పోటీ నెలకొంది. సత్తుపల్లిలో మట్టా దయానంద్, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, కొండూరు సుధాకర్, కోటూరు మానవతారాయ్, వైరా నుంచి విజయాబాయి, రాందాస్‌నాయక్, రామ్మూర్తినాయక్ టిక్కెట్ రేసులో ఉన్నారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లోకి వస్తే పాలేరు నుంచి ఆమె పేరు కూడా వినిపిస్తోంది. ఇంకా పొంగులేటి వియ్యంకుడు రామసహాయం రఘురాంరెడ్డి, రాయల నాగేశ్వరరావు, రామసహాయం మాధవీరెడ్డి, మద్ది శ్రీనివాసరెడ్డి, బెల్లం శ్రీనివాస్, రామసహాయం నరేష్‌రెడ్డి...ఇలా పలువురు టిక్కెట్ ఆశిస్తున్నారు. మాజీ మంత్రి రామిరెడ్డి వెంకటరెడ్డి కుటుంబీకులు ఎవరైనా బరిలో ఉండొచ్చంటున్నారు. ంగ్రెస్ మద్దతు ఉంటే టీడీపీ తరపున వైరా నుంచి ఆరెం రామయ్య పోటీ చేస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇల్లెందులో బీఎస్పీ నుంచి బాదావత్ ప్రతాప్, మధిరలో రాంబాబు టిక్కెట్‌రాని పక్షంలో బీఎస్పీ నుంచి పోటీ చేసే అవకాశాలున్నాయి.

బలమైన శక్తిగా కమ్యూనిస్టులు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది నియోజకవర్గాలు ఉండగా దీనిలో ఏడు సెగ్మెంట్లపై ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలు కేంద్రీకరించాయి. దీనిలో సీపీఐ(ఎం) ఐదు నియోజకవర్గాలు పాలేరు, మధిర, వైరా, భద్రాచలం సీట్లపై, సీపీఐ వైరా, కొత్తగూడెం, పినపాక నియోజకవర్గాలపై కేంద్రీకరించి పని చేస్తున్నాయి. భవిష్యత్తులో పొత్తులు, సీట్ల సర్దుబాటును బట్టి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలు ఐదు స్థానాలకు తగ్గకుండా పోటీ చేయాలని భావిస్తున్నాయి. అలా చేయాల్సి వస్తే సీపీఐ (ఎం) పాలేరు, మధిర, భద్రాచలం, సీపీఐ కొత్తగూడెం, వైరా స్థానాలలో పోటీ చేసే అవకాశం ఉంది. కమ్యూనిస్టుల మద్దతు, పోటీ అంశాలపైనే ఉమ్మడి జిల్లా రాజకీయ ముఖచిత్రం ఆధారపడి ఉంటుందని విశ్లేషకుల అంచనా.

99 లక్షల మంది పిల్లలకు డీ వార్మింగ్

- నులిపురుగుల నివారణకు ట్యాబ్లెట్ల పంపిణీ
- నేడు ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 99 లక్షల మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లను పంపిణీ చేయనున్నారు. రాష్ట్రంలోని 1-19 ఏండ్ల మధ్య వయసున్న వారికి ట్యాబ్లెట్ల పంపిణీని కార్యక్రమాన్ని హైదరాబాద్ నారాయణగూడలోని మాడపాటి హనుమంతరావు బాలికల ఉన్నత పాఠశాల వేదికగా వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. ఏదైనా కారణం వల్ల గురువారం ట్యాబ్లెట్లు తీసుకోలేని విద్యార్థుల కోసం ఈ నెల 27వ తేదీన మరోసారి డీవార్మింగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. గతేడాది 96.47 లక్షల మందికి ట్యాబ్లెట్లు పంపిణీ చేయగా.. ఈ సారి అదనంగా సుమారు 2.5 లక్షల మంది పిల్లలు పెరిగారు. అంగన్వాడీలు, ప్రభుత్వ, ప్రయివేట్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, ఇంటర్ కాలేజీల్లో డీవార్మింగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. స్కూల్ బయట ఉన్న పిల్లలకు ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ హెల్పర్ల సాయంతో ఆయా కేంద్రాల్లో ట్యాబ్లెట్లు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 41,337 మంది టీచర్లకు, 35,700 మంది అంగన్‌వాడీలకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చింది.

నులి పురుగులు ఇలా...

పిల్లల శరీరాల్లోకి వివిధ మార్గాల ద్వారా నులిపురుగులు చేరతాయి. కలుషిత ప్రాంతాల్లో చెప్పులు లేకుండా నడవడం, కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం చేతులు శుభ్రం చేసుకోకుండా తినడంతోపాటు సరిగా ఉడకని మాంసం ద్వారా, పెంపుడు జంతువుల ద్వారా ఇవి శరీరంలోకి చేరుతాయని నిపుణులు చెబుతున్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఇవి పొట్టలోకి చేరుతాయి. పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, శారీరక, మానసిక ఎదుగుదల సరిగా లేకపోవడం, తరుచూ తీవ్రమైన కడుపునొప్పి రావడం వంటి సమస్యలకు దారి తీస్తాయి. ఈ సమస్యల బారి నుంచి పిల్లలను రక్షించేందుకు ప్రభుత్వం ఏటా 'డీ వార్మింగ్ డే'ను నిర్వహిస్తున్నది. తీపి పదార్థాలు తినాలనే కోరిక పెరగడం, తరుచూ కడుపు నొప్పి, ఎక్కువగా ఆకలి కావడం, తలనొప్పి, మట్టి తినడం, తలలో పేలు పెరగడం వంటివన్నీ నులిపురుగులు ఉన్నాయనడానికి సంకేతాలని నిపుణులు పేర్కొంటున్నారు. వీటి నివారణకు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లు వేయడం ఉత్తమ మార్గమని, ప్రపంచవ్యాప్తంగా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారని వారు తెలిపారు.

వయస్సు ఆధారంగా డోసు

ఈ టాబ్లెట్లను వయస్సు ఆధారంగా వేయనున్నారు. 1-2 ఏండ్ల పిల్లలకు సగం ట్యాబ్లెట్‌ను పొడిగా మార్చి నీళ్లలో కలిపి ఇస్తారు. 2-3 ఏండ్లవారికి ఒక ట్యాబ్లెట్‌ను పొడిగా మార్చి, నీళ్లలో కలిపి తాగిస్తారు. 3-19 ఏండ్ల వారికి ట్యాబ్లెట్‌ను చప్పరించాలని సూచిస్తారు. ఈ ప్రక్రియ మొత్తం టీచర్ల పర్యవేక్షణలో జరుగుతుంది. ఖాళీ కడుపుతో ఉన్న విద్యార్థులకు ట్యాబ్లెట్ ఇవ్వరు. ఈ ట్యాబ్లెట్ వల్ల దుష్ప్రభావాలు దాదాపు ఉండవు. నులిపురుగులు ఎక్కువగా ఉన్న కొందరు విద్యార్థుల్లో మాత్రం కాస్త నీరసం, వాంతి వంటి లక్షణాలు కనిపిస్తాయని అధికారులు చెబుతున్నారు.

వర్షాకాలం... బస్సులు జాగ్రత్తగా నడపండి

- డ్రైవర్లకు టీఎస్ఆర్టీసీ చైర్మెన్ సూచనలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నందున్న డ్రైవర్లు బస్సుల్ని జాగ్రత్తగా నడుపుతూ, ప్రమాదాలను నివారించాలని టీఎస్ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విధి నిర్వహణలో ఏమాత్రం అలసత్వం వహించవద్దని హెచ్చరించారు. వారం రోజులపాటు రాష్ట్రంలో భారీ, అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినందున తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వేగనియంత్రణ పాటిస్తూ, మలుపుల వద్ద ఇండికేటర్‌ను ఉపయోగించాలని సూచించారు. ముందు వెళ్ళే వాహనాలతో సురక్షిత దూరాన్ని పాటిస్తూ, వర్షం ఎక్కువగా ఉన్నచోట వైపర్ వాడుతూ హారన్ కొట్టాలని తెలిపారు. చెరువులు కుంటలు నిండిన చోట నీటి ప్రవాహాన్ని పరిశీలించి జాగ్రత్తగా వాహనాన్ని నడపాలనీ, నదులు, కల్వర్టుల వద్ద ఎక్కువ నీటి ప్రవాహం ఉంటే ఎట్టి పరిస్థితుల్లోనూ దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. డ్యూటీకి బయలుదేరేటప్పుడే వైపర్, హెడ్‌లైట్స్‌ను పరిశీలించుకోవాలనీ, డ్యూటికి వచ్చే ముందు తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. వర్షంలో ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేయడం, అకస్మాత్తుగా సడన్ బ్రేక్ వేయడం వంటివి చేయొద్దని చెప్పారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఒంటిచేత్తో డ్రైవింగ్ చేయొద్దని హెచ్చరించారు.

అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటూ ప్రయాణీకులకు సురక్షిత రవాణాను అందించాల్సిన బాధ్యత డ్రైవర్లదేనని తెలిపారు.

శ్రీశైలంకు ఆర్టీసీ టూర్ ప్యాకేజీ

ప్రముఖ దర్శనీయప్రాంతం శ్రీశైలం వెళ్లే యాత్రీకుల కోసం ప్రత్యేక టూర్ ప్యాకేజీని అమల్లోకి తెస్తున్నట్టు టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. ప్రతి వారాంతాల్లో సికింద్రాబాద్ జూబ్లీ బస్టేషన్ నుంచి ఈ ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించామన్నారు. రెండ్రోజుల ఈ టూర్ ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభమవుతుందన్నారు. ప్యాకేజీలో భాగంగా శ్రీశైలంలోని మల్లికార్జున స్వామి, భ్రమరాంబాదేవి, సాక్షి గణపతి, పాతాళగంగా, పాలధార, పంచధార, శిఖరం, శ్రీశైలం డ్యాం తదితర ప్రాంతాలను సందర్శించవచ్చు. ఈ ప్యాకేజీలో పెద్దలకు రూ.2,700, పిల్లలకు రూ.1,570 టిక్కెట్ ధరగా నిర్ణయించినట్టు తెలిపారు. ప్రతి శనివారం ఉదయం ఈ టూర్ ప్రారంభమవుతుందనీ, హైదరాబాద్‌లోని జేబీఎస్ నుంచి ఉదయం 7 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరి, 8 గంటలకు ఎంజీబీఎస్ చేరుకుంటుంది. అక్కడి నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు శ్రీశైలానికి చేరుకుని.. బస కోసం నేరుగా హెూటల్‌కు వెళ్తుంది. మధ్యాహ్న భోజనం పూర్తయ్యాక.. 3 గంటలకు పాతాళగంగకు ప్రయాణికులను తీసుకెళ్తారు. కృష్ణానదిలో బోటింగ్ కూడా చేయిస్తారు. సాయంత్రం 5 గంటలకు శ్రీ మల్లికార్జున స్వామి, శ్రీ భ్రమరాంబిక అమ్మ వారి దర్శనాన్ని భక్తులు చేసుకోవాలి. శీఘ్ర దర్శన సదుపాయం అక్కడ అందుబాటులో ఉంటుంది. రాత్రి భోజనం తర్వాత శ్రీశైలంలోనే హెూటల్‌లో బస ఉంటుంది.

రెండో రోజు ఉదయం 5 నుంచి 8 గంటల వరకు భక్తులు ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేసుకోవచ్చు. అనంతరం.. టిఫిన్ పూర్తవగానే హెూటల్ చెక్‌అవుట్ చేయాలి. అక్కడి నుంచి శివాజి స్ఫూర్తి కేంద్రం, చెంచులక్ష్మి ట్రైబల్ మ్యూజియం సందర్శన ఉంటుంది. సాక్షి గణపతి ఆలయ దర్శనంతో పాటు పాలధార, పంచధార, శిఖరం, శ్రీశైలం డ్యాం, తదితర ప్రాంతాలను సందర్శిస్తారు. మార్గమధ్యంలో మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత రాత్రి 7.30 గంటలకు ఎంజీబీఎస్‌కు, 8.30 గంటలకు జేబీఎస్‌కు బస్సు చేరుకుంటుంది. రవాణా, వసతి, ఆలయ శీఘ్ర దర్శనం, శిఖరం ప్రవేశ రుసుం ప్యాకేజీలో చేర్చబడింది. ఆహారం, ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు, ఇతర ఖర్చులను ప్రయాణికులే భరించాలని తెలిపారు. "హైదరాబాద్ నుంచి ప్రతి రోజు శ్రీశైలానికి 40 సర్వీసులను టీఎస్ఆర్టీసీ నడుపుతోంది. వీకెండ్‌లో యాత్రీకుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలోనే శ్రీశైలం వెళ్లాలనుకునే వారికోసం ప్రత్యేకంగా టూర్ ప్యాకేజీని అందిస్తున్నట్టు వివరించారు. ముందస్తు రిజర్వేషన్, ఇతర వివరాలకు టీఎస్ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ ంఱ్‌ఎశీఅశ్రీఱఅవ.ఱఅ లో చూడవచ్చు. ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033లో కూడా సంప్రదించవచ్చని తెలిపారు.

వర్షంలోనూ జీపీ కార్మికుల సమ్మె

- పలువురి మద్దతు
- ఆసిఫాబాద్‌లో పారిశుధ్యంపై కళారూపాలతో ప్రజలకు అవగాహన

నవతెలంగాణ- విలేకరులు

గ్రామపంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం చేపట్టిన సమ్మెను బుధవారం వర్షంలోనూ కొనసాగించారు. వేతనాలు పెంచి తమ బతుకులు బాగు చేయాలని పాలకులకు విన్నవించారు. ఆసిఫాబాద్ జిల్లాలో కళారూపాల ద్వారా పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సమ్మెకు పలువురు నాయకులు, ఉపాధ్యాయులు మద్దతు తెలిపారు.

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో జీపీ కార్మికుల సమ్మెకు ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి శంకర్‌తో పాటు పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. నార్నూర్ మండలం తాడిహత్నూర్‌లో ఉపసర్పంచ్ విష్ణు పారిశుధ్య కార్మికుడిగా, డ్రైవర్‌గా మారారు. చెత్తను ట్రాక్టర్‌లో డంపింగ్ యార్డుకు తరలించారు. దహెగాం మండలంలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సమ్మె కొనసాగించారు. జన్నారం మండల కేంద్రంలో జీపీ కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌక్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని ముత్యంపేట గ్రామంలో పారిశుధ్యంపై కళాజాత నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

యాదాద్రిభువనగిరి జిల్లా వలిగిగొండ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెకు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మద్దతు తెలిపారు. కార్మికులకు అనిల్‌కుమార్‌రెడ్డి రూ.50వేల సాయం అందజేశారు. ఆలేరులో పంచాయతీ కార్మికుల సమ్మెకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బీర్ల ఐలయ్య మద్దతు తెలిపి, రూ.10వేల సహాయం అందజేశారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు వర్షంలోనూ సమ్మె కొనసాగించారు. నల్లగొండ జిల్లా పెద్దవూరలో ఒంటికాలిపై జీపీ కార్మికులు నిరసన తెలిపారు

భగీరథ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

- మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)



నవతెలంగాణ-సంగారెడ్డి

మిషన్ భగీరథ కార్మికులకు 5 నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) సంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో ఎస్ఈ కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కార్మికులు అధిక సంఖ్యలో హాజరై తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు మాట్లాడుతూ.. మిషన్ భగీరథ స్కీంలో పనిచేస్తున్న పంపు ఆపరేటర్స్, లైన్‌మెన్, ఫిట్టర్, ఎలక్ట్రిషన్, స్వీపర్, ల్యాబ్ కార్మికులకు 5 నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో.. వారి కుటుంబాలు గడవడం కష్టంగా ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, వారికి పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్‌లు, వారాంతపు సెలవులు, రక్షణ పరికరాలు తదితర సౌకర్యాలు అమలు కావడం లేదన్నారు. జిల్లాలో మిషన్ భగీరథ స్కీంను ప్రభుత్వం నిర్వహించకుండా కేఎల్ఎస్ఆర్, జీవీఆర్, ఎవరెస్ట్, రాఘవ, ప్రీమియర్, మెగా ఎల్ఎన్‌టి తదితర కాంట్రాక్టర్లకు అప్పగించడంతో ఒక్కొక్క కంపెనీ ఒక్కో రకమైన వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. నెలకు రూ.7500 నుంచి రూ.10వేల వరకు చెల్లిస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం కాంట్రాక్టర్లకు నెలకు రూ.18000 చెల్లిస్తే.. కార్మికులకు మాత్రం ఇలా అరకొర వేతనమివ్వడం సరికాదన్నారు. ఇంటింటికి నీటిని సరఫరా చేస్తూ దేశానికే రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తున్నదని సీఎం చెబుతున్నప్పటికీ.. అందుకు రాత్రింబవళ్లు కష్టపడుతున్న కార్మికులను మాత్రం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. భగీరథ కార్మికులతో 8 గంటల పనిని 12 గంటలు చేయించుకుంటూ అదనపు పనికి అదనపు వేతనం కూడా చెల్లించడం లేదన్నారు. వేతనం, సౌకర్యాల గురించి అడిగిన కార్మికులను ఉద్యోగం నుంచి తొలగించడం, వేధింపులకు గురి చేయడం లాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.26,000 కనీస వేతనం ఇవ్వాలని, అప్పటివరకు ప్రభుత్వం కాంట్రాక్టులకు ఇస్తున్న రూ.18,000 అయినా చెల్లించాలని కోరారు. చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయని కాంట్రాక్టుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించుకుంటే పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ముట్టడి అనంతరం మిషన్ భగీరథ ఈఈ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్, సిహెచ్. రాములు, కార్మికులు కృష్ణ, కే.రాములు, ప్రభాకర్, శ్రీనివాస్, నర్సింలు, సిద్ధప్ప, వీరారెడ్డి, లింగం, సుదర్శన్, వెంకటేష్, బిచ్చప్ప, అజయ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

పేద, సామాన్య ప్రజలు జీవించలేని పరిస్థితి

- దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టిన మోడీ
- యువతకు ఉద్యోగాలివ్వక రోడ్డున పడేశారు : అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



నవతెలంగాణ-నాగార్జునసాగర్

విద్య, వైద్యాన్ని, దేశ సంపదను మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టిందని, సామాన్య ప్రజల జీవన విధానం దెబ్బతింటుందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ్ విహార్ సమావేశ మందిరంలో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశం 2వ రోజు కొనసాగింది. ముగింపు కార్యక్రమంలో వెంకట్ మాట్లాడారు.

పేద ప్రజలు ఆహార పదార్థాలను కొని తినే పరిస్థితి లేదని, దీనికి కారణం మోడీ ప్రభుత్వ విధానాలేనని చెప్పారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం అనేక రేట్లు పెరిగిందని, ఉపాధి అవకాశాలు లేక యువత అల్లాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఉపాధిహామీ చట్టంలో 7 కోట్ల పని దినాలకు తగ్గించి కష్టజీవులు, బడుగులు బలహీన వర్గాల ప్రజలను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు. ప్రతి బడ్జెట్‌లోనూ ఉపాధి హామీచట్టానికి నిధులు తగ్గిస్తూ పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టానికి రెండు లక్షల అరవై వేల కోట్లు కేటాయించి, ఉపాధి కార్మికులకు భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ప్రతిఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ యువతను నడిరోడ్డున పడేశారని విమర్శించారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం దళితులకు మూడెకరాలు భూమి ఇస్తామన్న హామీ విఫలమైందన్నారు. ధరల పెరుగుదల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. వ్యవసాయ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై జాతీయ సమావేశంలో చర్చించినట్టు తెలిపారు.

నాగార్జున కొండను సందర్శించిన కేంద్ర కమిటీ సభ్యులు

నాగార్జునసాగర్ విజయ విహార్‌లో రెండ్రోజులు జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు బుధవారంతో ముగిశాయి. అనంతరం 22 రాష్ట్రాల ప్రతినిధులు నాగార్జునసాగర్‌లో లాంచ్‌పై వెళ్లి నాగార్జునకొండను సందర్శించారు. బుద్ధవనాలను సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అల్ ఇండియా అధ్యక్షులు విజయరాఘవన్, సహాయ కార్యదర్శులు శివదాసన్, విక్రమ్ సింగ్, కేంద్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య, రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట్ రాములు, సీఐటీయూ రాష్ట్ర నాయకులు కేవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొప్ప పద్మ జిల్లా అధ్యక్షులు బొజ్జ చిన్న వెంకట్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కూన్‌రెడ్డి నాగిరెడ్డి, కంబాలపల్లి ఆనందు, కత్తుల లింగస్వామి, అవుత సైదయ్య, కుంకుమూరి కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు రైతుల్ని ప్రోత్సహించండి

- రాయితీలన్నింటినీ అందిద్దాం : మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 32 జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగుకు అనుకూల పరిస్థితులున్నాయని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. అందువల్ల ఆ పంటను వేసేందుకు వీలుగా రైతులను ప్రోత్సహించాలంటూ ఆయన అధికారులకు సూచించారు. వారికి ప్రభుత్వం వైపు నుంచి ఇవ్వాల్సిన రాయితీలన్నింటినీ అందిస్తామని వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయిల్ పామ్ సాగుకు ఎంపిక చేసిన జిల్లాలకు ఇతర జిల్లాల్లోని నర్సరీల నుంచి మొక్కలు తెప్పించాలని కోరారు. ఇప్పటికే 11 వేల ఎకరాల్లో మొక్కలు నాటటం పూర్తయిందనీ, మొత్తం 75 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలను నాటుకోవటానికి రైతులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వివరించారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలనీ, ముఖ్యంగా స్వల్పకాలిక పంటల సాగుపై వారికి చైతన్యం కల్పించాలని కోరారు. శాస్త్రవేత్తల సూచన ప్రకారం కంది, పత్తి పంటలను మరో వారం రోజుల వరకూ విత్తుకోవచ్చని వివరించారు. మొక్కజొన్న పంట సాగుకు ఈ నెలాఖరు వరకూ వాతావరణం అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం ఆశాజనకంగానే ఉందని తెలిపారు. వర్షాలు కాస్త ఆలస్యమైనా సాగుకు సహకరిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

సెమిస్టర్ పరీక్షలపై ఓయూ విద్యార్థుల ఆందోళన

- సిలబస్ కాకుండా పరీక్షలెలా పెడతారని ఆగ్రహం
- ఇంటర్నల్స్ బహిష్కరణ
- వర్షంలోనే రోడ్డుపై బైటాయింపు
- పరిపాలన భవన్ వైపు దూసుకెళ్లిన వారి అరెస్ట్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 2వ, 4వ, సెమిస్టర్స్ పరీక్షలు వాయిదా వేయాలని విద్యార్థులు కొన్ని రోజుల నుంచి ఉద్యమిస్తున్నారు. అయితే అధికారులు స్పందించకపోవడంతో విద్యార్థులు ఆందోళనను ఉధృతం చేశారు. బుధవారం ఓయూ సెంటినరీ హాస్టల్ విద్యార్థినులు ఇంటర్నల్స్ రాయబోం అంటూ ప్రధాన గేట్‌కు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఉదయం 11 గంటల సమయంలో ర్యాలీగా వెళ్లి ఓయూ లేడీస్ హాస్టల్ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. మరికొందరు విద్యార్థులు వర్సిటీ ప్రధాన రోడ్డుపై బైటాయించారు. వర్షాన్ని కూడా లెక్కచేయకుండా తడుస్తూనే నిరసన కొనసాగించారు. ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీనారాయణ అక్కడకు వచ్చి నచ్చజెప్పినా.. తమకు న్యాయం చేయాలంటూ పట్టుబట్టారు. సిలబస్ పూర్తి కాకుండానే పరీక్షలు ఎలా నిర్వహిస్తారని నిలదీశారు. ఈ నెల 28 నుంచి జరగాల్సిన రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసే వరకు ఊరుకునేది లేదన్నారు. ప్రిన్సిపాల్స్‌తో సమావేశం పెట్టి నిర్ణయం తీసుకుంటామన్నా విద్యార్థులు ససేమిరా అన్నారు. పాఠాలు సరిగ్గా చెప్పకుండానే పరీక్షలు నిర్వహిస్తే ఎలా రాయాలని విద్యార్థులు ప్రశ్నించారు. యూజీసీ నిబంధనల ప్రకారం ప్రతి సెమిస్టర్‌కూ కనీసం 120 పని దినాల తర్వాతే పరీక్ష నిర్వహించాల్సి ఉంటుందన్నారు. రెండు నెలలు కూడా పాఠాలు చెప్పకుండానే ఓయూ అధికారులు పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణపై వర్సిటీ వీసీ ప్రొ.రవీందర్‌కు వారం రోజుల కిందట వినతిపత్రం ఇచ్చినా స్పందన లేదన్నారు. వీసీ రావాలంటూ నినాదలు చేశారు. పీటీపీ ద్వారా పాఠాలు చెబుతున్నారని, ఉదయం నుంచి కొందరు ఆన్‌లైన్ తరగతులు బోధిస్తున్నారని, ఇంకా కొన్ని విభాగాల్లో ఇప్పుడే యూనిట్స్ బోధిస్తునట్టు విద్యార్థులు తెలిపారు. ల్యాబ్స్‌లో అన్ని సౌకర్యాలు లేవని, కాంట్రాక్టు, పార్ట్ టైమ్ అధ్యాపకులతో ల్యాబ్స్ చేయిస్తున్నారని అన్నారు. ఇలా ప్రశ్నిస్తే ఏదో ఒక రూపంలో తమను టార్గెట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెమిస్టర్స్ వాయిదా వేసే వరకు ఉద్యమిస్తాం అంటూ హెచ్చరించారు. దాంతో రిజిస్ట్రార్ వెనుతిరిగి వెళ్లిపోయారు. అనంతరం సాయంత్రం పరిపాలన భవన్ వైపు దూసుకుపోతున్న 10 మంది విద్యార్థులను పోలీసులు అరెస్టు చేసి అంబర్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరొక వైపు బుధవారం జరిగిన ఇంటర్నల్స్‌ను ఎక్కువ శాతం విద్యార్థులు బహిష్కరించారు.

ఎల్బీనగర్ ఏసీపీగా జానకీ రెడ్డి



నవతెలంగాణ-హయత్ నగర్

ఎల్బీనగర్ డివిజన్ ఏసీపీగా జానకీ రెడ్డి బుధవారం భాద్యతలు స్వీకరించారు. ఇతను 1998 బ్యాచ్‌కి చెందిన ఇన్‌స్పెక్టర్. జానకీ రెడ్డి గతంలో చైతన్య పురి, యాదగిరిగుట్ట నుండి సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఇన్ స్పెక్టర్‌గా ఉన్న తరుణంలో ఏసీపీగా పదోన్నతి రావడంతో..ఎల్బీనగర్ ఏసీపీ గా భాద్యతలు స్వీకరించారు. ఇటీవల ఏసీపీ గా ఎల్బీనగర్‌లో పనిచేసిన శ్రీధర్ రెడ్డి డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. అనంతరం నూతన ఏసీపీ మాట్లాడుతూ వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన భాద్యత అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ శాంతి భద్రతల విషయంలో పోలీసులకు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని..ఎవరికి అవసరం ఉన్నా ఈ 8712662029 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

మీర్‌పేట్ కమిషనర్‌గా వాణిరెడ్డి



నవతెలంగాణ-మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా అల్లూరి వాణిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నాగారం మున్సిపాలిటీ కమిషనర్‌గా విధులు నిర్వహించిన వాణిరెడ్డి.. గ్రేట్ టు నుండి స్పెషల్ గ్రేడ్ కమిషనర్ గా ప్రమోషన్‌లో మీర్ పేట్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. మీర్‌పేట్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన సీఎచ్ నాగేశ్వర్ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు.

వికలాంగులకు డబుల్ ఇండ్లు ఇప్పిస్తా

- ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి





నవతెలంగాణ-ఎల్బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఉన్న ప్రతీ ఒక్క వికలాంగుడికి డబుల్ బెడ్ రూం ఇండ్లు వచ్చే విధంగా తన వంతు కృషి చేస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వికలాంగులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం సంబంధిత ఉన్నత అధికారులు, పోలీస్ శాఖతో కలిసి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో వికలాంగుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని అన్నారు. ఇటీవల రూ.3016 ఉన్న వికలాంగుల పింఛన్ రూ.4016కు సీఎం కేసీఆర్ పెంచడం హర్షణీయమన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్లలో వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించిందని తెలిపారు. అన్ని సంక్షేమ పథకాలలో వికలాంగులకు ప్రత్యేకంగా కోట కేటాయించినట్లు వివరించారు. అర్హులైన వికలాంగులు వినియోగించుకోవాలని సూచించారు. వికలాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమే అని కొనియాడారు. దళితులలో వికలాంగులుంటే వెంటనే దళిత బంధు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2016 చట్టం ప్రకారం వికలాంగులకు రావాల్సిన న్యాయమైన కోటాను తన నియోజకవర్గ పరిధిలో అమలు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాలతో పాటు నామినేటెడ్ పోస్టుల్లో సైతం వికలాంగులకు అవకాశం కల్పించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. త్వరలో వికలాంగులు, సంబంధిత అధికారులతో కలిసి ఒకరోజు వర్క్ షాపు నిర్వహించేందుకు, వికలాంగుల చట్టంపై కూడా అందరికీ అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాజేశ్వర్ రెడ్డి, విక్రాంత్, రాజేష్, బలరాం, అశ్విని కుమారి, హయత్ నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, వికలాంగుల సంఘాల ప్రతినిధులు మద్దెల గంగారాం, చెరుకు నాగభూషణం, అందే రాం బాబు, నారా నాగేశ్వరరావు, పూల నాగరాజు, వంశరాజ్ రామచందర్, వేణు, కోటి, శ్రీనివాస్, విద్య, సుజాత, విజయ, స్వప్న, అనసూయ పాల్గొన్నారు.

కోతల రాయుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- బీఆర్ఎస్‌లో చేరిన దాదాపు 800మంది కాంగ్రెస్ కార్యకర్తలు



నవతెలంగాణ-తుర్కయాంజల్

కోతల రాయుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి అని, కేంద్రం నుండి రూ.420కోట్లు తెస్తానని చెప్పి.. నాలుగు రూపాయలు కూడా తేలేదు అని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఈ మేరకు బుధవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సుమారు 800 మంది కాంగ్రెస్ కార్యకర్తలు.. రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంచిరెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ-హయత్ నగర్ మండలం రొక్కం భీం రెడ్డి, సీనియర్ నాయకులు జక్కా రామ్ రెడ్డి, బొక్క మన్మోహన్ రెడ్డి, గుర్రం చంద్ర శేఖర్ రెడ్డి, తుర్కయాంజల్ మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యులు, పోరెడ్డి నర్సింహ రెడ్డి, మరియమ్మ చెన్నయ్య, తుర్కయాంజల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు రొక్కం అనితా చంద్ర శేఖర్ రెడ్డి, మర్రి మాధవి మహేందర్ రెడ్డి, నారని కవిత శేఖర్ గౌడ్, బొక్క శ్రీలత గౌతమ్ రెడ్డి, బొక్క రవీందర్ రెడ్డి, కొండ్రు మల్లేష్, మాజీ సర్పంచులు మేతరి అంజయ్య, బొర్ర భిక్షపతి యాదవ్, పొలిశెట్టి జేమ్స్, మాజీ వార్డు సభ్యులు పల్సమ్ బుచ్చయ్య గౌడ్ లతో పాటు దాదాపు 800 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు వివరించారు.

రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. గడిచిన 9 ఏండ్లలో నియోజకవర్గ అభివృద్ధికి రూ.2931 కోట్ల నిధులు అందజేసినట్లు తెలిపారు. మంత్రి కేటీఆర్ సమక్షంలో సాఫ్ట్ వెర్ అభివృద్ధి చెందింది పేర్కొన్నారు. వెలిమినేడులో 600, తాళ్లగూడెంలో 400, 9400 ఎకరాల భూమిని సేకరించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే ఏమిచ్చిండు అనడం సరికాదని, ఎమ్మెల్యే అంటేనే ప్రభుత్వం అని పేర్కొన్నారు. పాత, కొత్త నాయకులను సమన్వయంతో అభివృద్ధిలో ముందుకు పోతామని చెప్పారు. గడిచిన నాలుగున్నర ఏండ్లలో దాదాపు 11 వందల మందికి ఎంకేఆర్ ఫౌండేషన్ ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చే విధంగా కృషి చేశామని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు క్యామ మల్లేష్, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకట రమణా రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ మాజీ చైర్మన్ కందాడ ముత్యం రెడ్డి, మాజీ సర్పంచ్ కందాడ లక్ష్మారెడ్డి, మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వేముల అమరేందర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు సుదర్శన్ రెడ్డి, బొడ్డు శ్రీనివాస్, గుండ్ల రాజిరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నల్సా స్కీంతో న్యాయపరమైన సేవలు

- సీనియర్ సివిల్ జడ్జి



నవతెలంగాణ-హయత్ నగర్

నల్సా స్కీం ద్వారా న్యాయ పరమైన సేవలను పొందడానికి అవకాశం ఉంటుందని సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ జిల్లా న్యాయ సేవా సంస్థ ఇందిరా అన్నారు. హయత్ నగర్ మండల కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నల్సా స్కీంను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల కోసం 9 రకాల స్కీం లను తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, ఎంపీడీఓ మమత, మధ్యజ రమణ, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు వేణు గోపాల్, మంజుల, శ్యామల, సుదర్శన్, ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, పవన్ కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవాన్య నెయిల్ అకాడమీ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎంతో ఖర్చు పెట్టి విదేశాల్లో నేర్చుకునే నెయిల్ ఆర్ట్ ఇప్పుడు మన హైదరాబాద్ అమీర్‌పేటలో అతి తక్కువ ఖర్చుతో అందరికీ అందుబాటులో, అన్ని భాషల్లో శిక్షణ అందిస్తుంది. ఈ అవన్య నెయిల్ అకాడమీని బేబీ మూవీ డైరెక్టర్ సాయి రాజేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు లావణ్య వేణుగోపాల్ మాట్లాడుతూ నెయిల్‌లో శిక్షణ పొందాలంటే విదేశాలకు వెళ్లాలి.. రూ.లక్షల్లో లక్షల్లో ఖర్చు అవుతుందన్నారు. మన దగ్గర నెయిల్ ఆర్ట్ జాబ్ చేసేవారు కూడా బయట నుంచి వచ్చి చేసేవారే ఉన్నారని తెలిపారు. ఇప్పుడు అతి తక్కువ ఫీజుతో అన్ని భాషల్లో అవన్య నెయి ల్ అకాడమీలో వీక్ డేస్ ట్రెనింగ్, వీక్ ఎండ్ ట్రెనింగ్, 10 డేస్ ట్రె నింగ్, ఇంకా చాలా కోర్సులు అందిస్తున్నట్టు తెలిపారు. శరీర అందాన్ని మెరిపించడంలో గోళ్లు అత్యంత ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని, విభిన్న రకాల సౌందర్య పోషణ సేవల్లో నెయిల్ బ్యూటీ కూడా ఎంతో ప్రధానమైనదన్నారు. చర్మ సౌందర్యం కేశాలంకరణతో పాటు గోళ్ళకు సైతం అదే రకంగా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పదేండ్లుగా ఈ రంగంలో ఉన్న అనుభవంతో దీన్ని ఏర్పాటు చేశామనీ, తమ దగ్గర నిపుణులైన, సుశిక్షితులైన సిబ్బంది ఉన్నారని తెలిపారు. వినియో గదారులకు అత్యుత్తమ సేవలను అందించడమే లక్ష్యంగా అవాన్య నెయిల్ అకాడమీని ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ఓటరు కార్డు నమోదు చేసుకోవాలి

- కార్పొరేటర్ సంరెడ్డి స్వప్న వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

18 ఏండ్లు నిండిన యువతి, యువకులు కొత్త ఓటరు గుర్తింపు కార్డును నమోదు చేసుకోవాలని కార్పొరేటర్ సంరెడ్డి స్వప్న వెంకట్ రెడ్డి కోరారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్‌లో బుధవారం కార్పొరేటర్ కొత్త ఓటర్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రజాస్వామిక వ్యవస్థలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వంలో మార్పు తెచ్చే అవకాశం నేటి యువత చేతిలోనే ఉందన్నారు. 18 సంత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటరు గుర్తింపు కార్డును నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలోని తీగల బుచ్చిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బడంగ్ పేట్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిగిరింత నర్సింహా రెడ్డి బుధవారం మృతుడి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తీగల బుచ్చిరెడ్డి కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ కందాడి శ్రీరాంరెడ్డి, ఆనంద్ రెడ్డి, మర్రి తిరుపతి రెడ్డి ఉన్నారు.



నవతెలంగాణ - ధూల్ పేట్

ఇటీవల జరిగిన పాతనగర బోనాల జాతరను ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను బుధవారం హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయ కమిటీ మర్యాదపూర్వకంగా కలిసింది. తర్వాత శాలువా కప్పి, గజ మాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాందేవ్ అగర్వాల్, కోశాధికారి ఏ.సతీష్ కుమార్, కార్యనిర్వహక కార్యదర్శి ఎస్.పి.క్రాంతి కుమార్, సభ్యులు ఏ.రజత్, కే.సాయినాథ్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

టీచర్స్ కాలనీలో షోరూం ప్రారంభం



నవతెలంగాణ- వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధి లోని టీచర్స్ కాలనీ ఫేస్ 2లో శ్రీ విజయ దుర్గ ఓం డెకార్స్ వేల్స్ పాండ్ స్పెసెస్ నూతన షోరూంను బుధ వారం బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందాల శ్రీరాములు యాదవ్, బడంగ్ పేట్ 5వ డివిజన్ కార్పొరేటర్ దీపికా శేఖర్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యజమాని జంగా రెడ్డి, భూపాల్ రెడ్డి, చైతన్య నగర్ కాలనీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, టీచర్స్ కాలనీ మాజీ అధ్యక్షులు నరసింహారెడ్డి, నాయకులు పవన్ రెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలతో విద్యార్థి ఆత్మహత్య



నవతెలంగాణ-చైతన్యపురి

అనారోగ్య సమస్యలతో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ లక్ష్మణ్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం..మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పవన్(21) హోటల్ మేనేజ్మెంట్ చదువుతున్నాడు. పోటీ పరీక్షల కోసం నగరానికి వచ్చి దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓయో లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్నాడు. అనారోగ్య సమస్యల వలన ఆత్మహత్య చేసుకున్నట్లు సూసైడ్ నోట్ రాసి పెట్టాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా

- బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



నవతెలంగాణ-వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని విజయశ్రీ నగర్ సంక్షేమ సంఘం సభ్యులు కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలోని ప్రధాన సమస్యలైన రోడ్లు, డ్రైనేజీ, పైపులైన్, వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు యాదగిరి, ప్రధాన కార్యదర్శి షేక్ ఇజావుద్దీన్, కార్యవర్గ సభ్యులు మహేందర్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక అధ్యాపకుల దరఖాస్తుల స్వీకరణ

- ప్రిన్సిపాల్ డా.రాధిక

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని డిగ్రీ కళాశాలలో తాత్కాలిక అధ్యాపకుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.రాధిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న దరఖాస్తు చేసుకొని.. ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. బంధిత సబ్జెక్టులో బీఈడీ పీజీ, పీహెచ్ డీ విద్యార్హత కలిగి ఉండాలని తెలిపారు. అందులో ఆంగ్లం, మేథ మేటిక్స్, వృక్ష శాస్త్రము, భౌతకశాస్త్రం, చరిత్ర, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, వాణిజ్య శాస్త్రం.. మొత్తం 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, పీజీలో 55 శాతం మార్కులు కల్గి ఉండాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులు, నెట్, సెట్ కల్గి ఉండాలని అందులో పీజీ, పీహెచ్ డీ, మొదటి ప్రాధన్యత పీహెచ్ డీ, లేని పక్షంలో పీజీ అభ్యర్థులకు అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇంటర్వ్యూ చేయు స్థలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్ రంగారెడ్డి జిల్లాలో ఉంటుందని, ఓరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు.

'రిమాండ్ ఖైదీపై దాడి అవాస్తవం'

నవతెలంగాణ- సంతోష్‌నగర్

చంచల్‌గూడ జైల్లో విచారణ ఖైదీపై దాడి అవాస్తవమని జైలు అధికారులు తెలిపారు. ఈ మేరకు బుధవారం జైలు పర్యవేక్షణాధికారి నవాబు శివకుమార్ గౌడు మాట్లాడుతూ విచారణ ఖైదీగా ఉంటున్న బబూన సహాపై ఖైదీలు, జైలు అధికారులు దాడి చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని వివరించారు. అత్యాచారం కేసులో అరెస్టు అయిన బబూన సహా జైలుకు వచ్చిన సమయంలోనే చేతికి నొప్పి ఉన్నట్లు తెలపడంతో ఉస్మానియా ఆసుపత్రికి చికిత్స కోసం పంపించామని తెలిపారు. సమాచార లోపంతో అతని తండ్రి న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిసిందన్నారు.

భిక్షమెత్తిన పంచాయతీ కార్మికులు



నవతెలంగాణ-హయత్‌నగర్

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఈ.నర్సింహా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు చాలీ చాలని వేతనాలు ఇస్తూ.. వారితో వెట్టి చాకిరి చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు సమయానికి రాక..పెరిగిన ధరలు, వచ్చిన వేతనాలు సరిపోక అనేక ఇబ్బందులు పడు తున్నారని చెప్పారు. అయినా ప్రభుత్వం ఏ మాత్రం పట్టిం చుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ నాయకులు కనకయ్య, నర్సింహా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గుండె శివకుమార్, అంజయ్య, సంపూర్ణ, సుశీల, లలిత తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వ్యతిరేకించండి'



నవతెలంగాణ-తుర్కయాంజల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, విద్య, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ యూఎస్‌పీసీ దశల వారీ పోరాట కార్యక్రమంలో భాగంగా ఎన్‌పీ ఎస్ (సీపీఎస్), ఎన్ ఈ పీ - 2020 లను రద్దు చేయాలని ఎస్‌టీఎఫ్ఐ దేశవ్యాప్త క్యాంపెన్‌లో భాగంగా బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని, జిల్లా పరిషత్ హై స్కూల్‌లలో ఇంజాపూర్, పెద్ద అంబర్పేట్, కోహెడ, హయత్ నగర్ మండలంలోని వనస్థలిపురం, సాహెబ్ నగర్, హయత్ నగర్ పాఠశాలలు తిరిగి..బైక్ ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీ ఎఫ్ రాష్ట్ర కార్య దర్శి ఈ. గాలయ్య మాట్లాడుతూ సీజన్‌లో విత్తనాలు వేస్తే పంటలు వస్తాయి.. అదే విధంగా ఎన్నికల సీజన్‌లోవ ప్రభు త్వంపై ఒత్తిడి తెస్తేనే మనం అనుకున్న ఐఆర్, పీఆర్‌సీలు వస్తాయని, సీపీఎస్ రద్దయి మన సమస్యలు నెరవేరు తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని, ఐక్య ఉద్యమాలకు ప్రతి ఒక్కరూ కదిలి రావాలని పిలుపు నిచ్చారు. కేంద్ర నూతన పీ ఆర్ సీకి అనుగుణంగా డీ.ఏ రేటు సవరించి మూడు డీఏలను ప్రకటించాలని, గత నాలుగు డీఏ ల ఏరియార్స్ వెంటేనే జమ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలోనే సెమీ గురుకులాలను ఏర్పాటు చేయాలని, విదేశీ యూనివర్శిటీలను ఉపసంహరించుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా విద్యాసంస్థల్లో ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్, టీఎస్ పీటీఏ జిల్లా అధ్యక్షుడు ఎన్. రామలింగం, టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యక్షురాలు జె.కల్పన, టీఎస్ యూటీఎఫ్ అబ్దుల్లాపూర్ మెట్ అధ్యక్షుడు ఏ.చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి మహిపాల్ కరం టోతు, టీఎస్ యూటీఎఫ్ సీనియర్ నాయకులు ఎమ్.యాదయ్య, ఉపాధ్యాయులు విజేందర్, సందీప్, గణేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ఎంపీకి కౌన్సిలర్ల అభినందనలు



నవతెలంగాణ- బడంగ్‌పేట్

చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు జి.రంజిత్ రెడ్డిని బుధవారం ఆయన నివాసంలో కౌన్సిలర్లు పుష్పమ్మ కొండల్ యాదవ్, దస్తగిర్‌లు మర్యాదపూర్వకంగా కలిసి, పూల బోకే అందజేసి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న పహాడి షరీఫ్‌లోని పలు కాలనీలలో సీసీ, డ్రైనేజీ, బీటీ రోడ్ల నిర్మాణం కోసం ఎంపీ రంజిత్ రెడ్డి ప్రత్యేక నిధులు మంజూరు చేయించారని కొనియాడారు.రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. అంతేకాకుండా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి సైతం మున్సిపల్ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి పనులను పూర్తి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెరాజ్ ఖాన్, నాయకులు సూర్య కుమార్ గౌడ్, సతీష్ కుమార్, విశాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యష్ జోషికి 'పీఆర్‌సీఐ ఇంపాక్ట్' అవార్డు



నవతెలంగాణ-సిటీబ్యూరో

యష్ జోషికి 'పీఆర్‌సీఐ ఇంపాక్ట్' అవార్డు లభించింది. పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌సీఐ) దేశ వ్యాప్తంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వ్యాపార వేత్తలకు బెంగళూరులోని మారియట్ హోటల్‌లో 'పీఆర్‌సీఐ ఇంపాక్ట్ అవార్డు-2023)ను ప్రదానం చేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ఈవెంట్ అండ్ వెడ్డింగ్ ప్లానింగ్ కంపెనీ వైడీఐ ఈవెంట్స్ వ్యవస్థాపకులు యష్ జోషికి కర్ణాటక న్యాయమూర్తి కష్ణ ఎస్.దీక్షిత్, ప్రపంచ విద్యా సదస్సు అండ్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ప్రభాత్ రంజన్ చేతుల మీదుగా రైజింగ్ స్టార్ ఆఫ్ ది ఇయర్ 2023 పేరుతో అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పింకీ జొహ్రీ, డాక్టర్ కెఆర్.వేణుగోపాల్, ప్రవీణ్ షిరియన్నవర్, గీతా శంకర్, అర్.రవీంద్రన్, యూఎస్. కుట్టి పాల్గొన్నారు.

బిర్యానీ సెంటర్‌ను ప్రారంభించిన మాజీ మేయర్



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గం చర్లపల్లి డివిజన్ కుషాయిగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్‌యూటీకే బకెట్ బిర్యానీ పాయింట్‌ను మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బిర్యాని సెంటర్ యజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్, బీఆర్ఎస్ నాయకులు స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడలో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ బుధవారం కుషాయిగూడ పర్యటించారు. వేంకటేశ్వర స్వామి ఆలయం పక్కన వీధిలో డ్రయినేజీ మ్యాన్ హెూల్, ఎలక్ట్రిక్ పోల్ రోడ్డుకు అడ్డుగా ఉన్నాయని స్థానికులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందితో వెళ్లి ఆయా పనులను ప్రారంభించారు. పనులను త్వరగా పూర్తి అయ్యేలా కృషి చేసిన కార్పొరేటర్ శ్రీదేవియాదవ్‌కు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

బస్తీ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

బస్తీ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పాదయాత్ర చేస్తున్నానని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే చేపట్టిన పాదయాత్ర బుధవారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ భజన మందిరం, శివ సాయినగర్, లక్ష్మీ నరసింహ కాలనీ, సోనియా గాంధీ నగర్, గణేష్ నగర్, మారుతి కాలనీ, టీచర్స్ కాలనీ, సీతా రామ కాలనీ, చర్లపల్లి బస్తీలలో తిరుగుతూ ప్రజల సమ స్యలను తెలుసుకు న్నారు. వెంటనే జీహెచ్ఎంసీ అధికారులతో పరిష్కారానికి బాటలు వేశారు. కుషాయిగూడలో తాగునీరు, డ్రయినేజీ, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేకు తెలిపారు. విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరా రు. కుషాయిగూడ డీమార్ట్ రోడ్డు, గాంధీనగర్ కల్వర్టులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల న్నారు. గాంధీనగర్‌లో కల్వర్టు పనులను పూర్తి చేసి రిటర్నింగ్ వాల్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. పురాతన మ్యాన్ హెూల్స్‌పై కప్పులు వేయాలని, లోతట్టు ప్రదేశాల్లో నీరు నిలవకుండా చేసి ఆసరా పెన్షన్లు ఇప్పించాలన్నా రు. మధురానగర్ కాలనీ, ద్వారకపురి కాలనీలలో డ్రయినేజీ, సీసీరోడ్లు, ఎలక్ట్రికల్ స్తంభాలు ఏర్పా టు చేయాలన్నారు. లక్ష్మీ నరసింహ కాలనీలోలో తాగునీరు సమస్యను పరిష్కరించాలని కోరారు. సోని యాగాంధీ నగర్ కమ్యూనిటీ హాల్ పనులు పూర్తి, త్రీ ఫేస్ కరెంటు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, విద్యుత్ దీపాలు, అంగన్వాడీ సెంటర్, రేషన్ షాపు పెట్టించాలని ఎమ్మెల్యేకి వినతి పత్రా లు అందజేశారు. అందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యల ను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించా రు. అనంతరం వాసవీ, శివనగర్ కన్యకా పరమేశ్వరి దేవాలయం ఆవరణంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ పాదయాత్రలో, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, గంప కృష్ణ పాల్గొన్నారు.

చినుకుపడితే చిత్తడిగా ఉప్పల్ ప్రధాన రహదారి

- గుంతలు గుంతలుగా రోడ్డు
- వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టింపులేని పాలకులు.. స్పందించని అధికారులు





నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ వెళ్లాలంటే వామ్మో.. తిప్పలు తప్పవు అనే చందంగా మారింది ప్రధాన రహదారి. అడుగు అడుగునా గుంతలు ఉండడంతో వాహనదారులు, పాదాచారులు ఈ రోడ్డుకు దండం అంటూ బెంబేలెత్తుతున్నారు. చినుకు పడితే చిత్తడి..ఎండ కొడితే దుమ్ము దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి నల్లచెరువు వరకు వెళ్లాలంటే సుమారు గంట సమయం ట్రాఫిక్‌లో ఉండాల్సిందే. రోడ్డు గుంతలు ఉండడంతో వాహనాలపై ఉద్యోగాలకు వెళ్లే వారు, పాఠశాల విద్యార్థులు ప్రయాణించే వాహనదారులకు ఉప్పల్ ప్రధాన రహదారి తలనొప్పిగా మారింది. సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలకు ముందు నోయ్యి వెనుక గొయ్యి అనే చందంగా తయారైంది.

పట్టింపులేని పాలకులు..స్పందించని అధికారులు

ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి నల్లచెరువు వరకు ఉప్పల్ వరంగల్ రహదారి అధ్వానంగా మారినా ఇక్కడి పాలకులు పట్టించుకోవడంలేదని, అధికారులు స్పందించడం లేదంటూ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలు పట్టించుకోని పాలకులు ఎందుకు ఎన్నికవుతారని వాహనదారులు ప్రజలు వాపోతున్నారు. ఉప్పల్ జీహెచ్ఎంసీ అధికారులు కనీసం రోడ్డుపై పడిన గుంతలను పూడ్చలేని పరిస్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను వివరించాలని అధికారులకు ఫోన్ చేస్తే స్పందించడం లేదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాలకులు మారారే తప్పా.. సమస్యలు తీరడం లేదు

ఉప్పల్ రింగ్ నుంచి చెంగిచెర్ల ఎక్స్ రోడ్డు వరకు 2018 సంవత్సరంలో సుమారు రూ.175 కోట్ల వ్యయంతో ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు చేసి ఉప్పల్‌లో ట్రాఫిక్ సమస్య తీరుస్తామని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చెప్పారు. కానీ ఎలివేటెడ్ కారిడార్ పనులు ఎక్కడికక్కడే అసంపూర్తిగానే ఉన్నాయి. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చినా ఉప్పల్ రోడ్డు మాత్రం గుంతలుగానే ఉంది. పాలకులు మారుతున్నారు తప్పా సమస్య మాత్రం పరిష్కరించడం లేదంటూ ప్రజలు వాపోతున్నారు.

ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఉప్పల్ వరంగల్ ప్రధాన రహదారి పూర్తిగా గుంతలుగా మారింది. చినుకులు పడటంతో చిత్తడిగా అవుతుంది. ఎన్నాళ్లు ఈ అవస్తలు అనుభవించాలి. కేంద్ర ప్రభుత్వం రోడ్ల నిర్మాణం కోసం కోట్లు ఖర్చు పెట్టామని కాగితాలు లెక్కలు చెబుతుంది. కానీ ఉప్పల్ ప్రధాన రహదారి పరిస్థితి ఇక్కడ ఉన్న కేంద్ర ప్రభుత్వ నాయకులకు కనిపించడం లేదా? రోడ్డుపై వెళ్లాలంటే ప్రజల్లో భయాందోళనకు గురవుతున్నారు.

-సీఐటీయూ నాయకులు వెంకన్న

పురోహితుడికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ ఎల్లారెడ్డి గూడకు చెందిన పురోహితుడు కాశీవజ్జల శేషాచార్యులు మూడు సంవత్సరాల నుంచి పక్షవాతంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి సైనిక్‌పూరిలోని తన కార్యాలయంలో కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణితో కలిసి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా తమ ట్రస్టు ద్వారా అనేక సేవా సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి బైరి నవీన్‌గౌడ్, గూడ ఇంద్రయ్య, ఇందిరాగౌడ్, పవన్, నర్సింహా, శేషాచార్యులు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

తొట్టెల ఊరేగింపులో కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గం చక్రిపురం మారుతీనగర్‌లో చందన్‌నాయక్ ఆధ్వర్యంలో ఆషాఢ మాసం బోనాల సంద ర్భంగా ఫలారం బండి ఊరేగింపు కార్యక్రమానికి ముఖ్యఅ తిథిగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి హాజరైయ్యారు. డప్పు వైద్యాలతో రాగిడి లక్ష్మారెడ్డిని ఘనంగా ఆహ్వానించారు. ఫలారం బండి పూజ కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజ చేశారు. అనంతరం చందన్ నాయక్ రాగిడి లక్ష్మారెడ్డికి తీర్థ ప్రసాదా లు అందించి ఘనంగా శాలువాతో సత్కరించారు. కార్యక్ర మంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎస్సీసెల్ ఛైర్మెన్ పత్తి కుమార్, చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, కంటెస్టెండ్ కార్పొరేటర్ గడ్డం యాదగిరి, హౌసింగ్ బోర్డ్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ పాలిపాక అంజయ్య, టీపీసీసీ మైనార్టీ జనరల్ సెక్రటరీ సంజయ్ జైన్, పలకల నరసింహారెడ్డి, చర్లపల్లి డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్ యాదవ్, హీరాలాల్ నాయక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంజరి సంతోష్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రటరీ సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ- కాప్రా

ఉప్పల్ నియోజకవర్గం చర్లపల్లి డివిజన్ వైష్ణవి ఎంక్లేవ్‌లో బుధవారం ఫలహారం బండి ఊరేగింపు కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, కమిటీ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

రొట్టె కాలిస్తే వాసన, పొగ వస్తుందని కర్రీ పాయింట్ సీజ్





- ఆందోళనకు సిద్ధమైన బుద్ధనగర్ చిరు వ్యాపారులు

నవతెలంగాణ-బోడుప్పల్

కర్రీ పాయింట్ నిర్వహించుకుంటున్న ఓ వ్యక్తిపై కార్పొరేటర్ కన్నెర్ర చేసిన సంఘటన మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ నగరంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పీర్జాదిగూడ నగరం పాలక సంస్థ పరిధిలోని 11 వ డివిజన్ బుద్దానగర్‌లో మల్లికార్జున్, మాధవిలు ఓ కర్రీ పాయింట్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. స్థానిక కార్పొరేటర్ మద్ది యుగంధర్ రెడ్డి కర్రీ పాయింట్‌తో ఇబ్బంది అవుతుందని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసి బుధవారం కార్పొరేషన్ సిబ్బందితో బలవంతంగా కర్రీ పాయింట్‌ను మూసివేయించారని తెలిపారు. కర్రీ పాయింట్‌లో రొట్టెలు చేస్తుంటే చూట్టు పక్కల వారితో పాటు తన ఇంట్లోకి పొగ, వాసన వస్తుందని బెదిరించాడని ఆందోళన వ్యక్తం చేశారు. "డబ్బు ఇవ్వకపోతే నీ..కర్రీ పాయింట్ మూసి వేయిస్తానని బెదిరింపులకు దిగడంతో బుధవారం పొద్దున్నే కార్పొరేటర్ ఇంటికి వెళ్లి కాళ్లు..వేళ్లు పట్టుకున్నాని వాపోయారు.

గత కార్పొరేషన్ ఎన్నికలలో సప్లై చేసిన ఫుడ్ డబ్బు అడిగినందుకే..

మద్ది యుగంధర్‌రెడ్డి గత కార్పొరేషన్ ఎన్నికల సమయంలో తన కర్రీ పాయింట్ నుంచి ఫుడ్ సప్లై చేసుకున్నాడని తెలిపారు. ఆ డబ్బు అడిగినందుకే యుగంధర్ రెడ్డి కర్రీ పాయింట్‌పై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని నిర్వాహకుడు మల్లికార్జున్ ఆందోళన వ్యక్తం చేశాడు.

చిరు వ్యాపారులపై పెత్తనం సరికాదు : దర్గా సుధాకర్‌రెడ్డి

కార్పొరేటర్‌గా గెలుపొందిన మద్ది యుగంధర్‌రెడ్డి ప్రజలకు సేవా చేయాలి. కానీ ఇలా చిరు వ్యాపారులపై పెత్తనం చేయడం సరికాదు. వ్యాపారం చేయడంతో కార్పొరేషన్ అభివృద్ధి చెందింది. అలాంటిది వారిపై పెత్తనం చేయడం కరెక్ట్ కాదు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి చిరు వ్యాపారులకు న్యాయం చేయాలి.

నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను అందించాలి



నవతెలంగాణ-ఉప్పల్

నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను వినియోగదారులకు అందించాలని నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ అన్నారు. బుధవారం చిల్కానగర్ డివిజన్ అన్నపూర్ణ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆగ్రా స్వీట్‌హౌస్‌ను బీఆర్ఎస్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి, బోనాల ప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, మేకల హనుమంతారెడ్డి, గంధం నాగేశ్వరరావు, నందికొండ శ్రీనివాస్ రెడ్డి, షఫీ, ఎండీ.గౌస్, శేఖర్, బాలు తదితరులున్నారు.

అభివృద్ధి చూసే బీఆర్ఎస్‌లోకి చేరికలు



- కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి

నవతెలంగాణ-శామీర్‌పేట

సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండల కేంద్రంలో బుధవారం మండల కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ ర్యాకల నీరజ్‌గౌడ్, కేశ్వాపూర్ గ్రామ ఉపసర్పంచ్ రంగపురం పోచమ్మ, వార్డు సభ్యులు తిమ్మాపురం గణేష్ మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారితో పాటు కాంగ్రెస్ నాయకులు సాయిగౌడ్, హరిబాబు, శ్రీకాంత్, రాజు, సాయి, ఓంకార్, రజనీకాంత్, చింటు, రాజేష్, టింకు, సలీం, కాశీం, ఉస్మాన్, షరీఫ్, కాశీం, సాల్మాన్, నాజర్, లడ్డు, టిల్లు, అస్మత్ హైదర్, కిరణ్, రాకేష్, నరేష్, కరుణాకర్, సతీష్, అంకిత్, సిద్దు రాజు, మహేష్, సాయి, అజయ్, చారికి మంత్రి మల్లారెడ్డి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి చామకూర మహేందర్ రెడ్డి , ఎంపీపీ హారిక మురళీగౌడ్, డీసీఎంఎస్ వైస్ ఛైర్మెన్ మధుకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మెన్ శ్రీకాంత్‌రెడ్డి, మండలాధ్యక్షులు మల్లేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి అనిల్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు జాము రవి, సింగం ఆంజనేయులు, ఎంపీటీసీలు పారుపల్లి నాగరాజు, గ్రామ శాఖ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ ఉప్పల్

ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో ఉప కమిషనర్ అరుణకుమార్ అధ్యక్షతన బుధవారం ఉప్పల్‌లోని వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ఈవీఎంలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పద్దతి శేఖర్‌రెడ్డి , సీఐటీయూ నాయకులు వెంకన్న, బీఎస్పీ నాయకులు ఎడ్ల పరమేశ్వర్ తదితరులు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ అరుణకుమారి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఈవీఎంలపై ఎలా ఓటు వేయాలో ఆమె ఆయా రాజకీయ పార్టీ నాయకులకు సూచించారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కల్పించుకునేలా రాజకీయ పార్టీ నాయకులు సైతం అవగాహన కల్పించాలని కోరారు. మరణించిన వారి ఓట్లని తొలగిస్తామన్నారు. ఇంటింటికి సర్వే నిర్వహించి కొత్త ఓటు నమోదులో పక్రియలో రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని కోరారు.

బీఆర్‌టీయూ జెండా ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో/మేడ్చల్

కార్మికులకు చెందాల్సిన హక్కులను బీఆర్‌టీయూ తరపున పోరాటం చేసి వారికి వచ్చేలా చేస్తామని బీఆర్ఎస్ కంటోన్మెంట్ అసెంబ్లీ, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మయోర ఇండియా ప్రయివేటు లిమిటెడ్ ప్రెసిడెంట్ మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాల్టీ పరిధిలోని మయోర ఇండియా ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ వద్ద మేడ్చల్ జిల్లా బీఆర్‌టీయూ అధ్యక్షులు, మయోర ఇండియా ప్రయివేటు లిమిటెడ్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంబు ప్రభాకర్ ఆధ్వర్యంలో బీఆర్‌టీయూ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు మర్రి రాజశేఖర్‌రెడ్డి గుండ్ల పోచంపల్లిలోని నల్ల పోచమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం నుంచి కంపెనీ వరకు యూనియన్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికులకు ఏ కష్టం వచ్చినా బీఆర్‌టీయూ పోరాడుతుందని హామీనిచ్చారు. మయోర ఇండియా ప్రయివేటు లిమిటెడ్ కంపెనీలో యూనియన్ ఏర్పాటుకు కృషి చేసిన ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, మయోర ఇండియా ప్రయివేటు లిమిటెడ్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంబు ప్రభాకర్, జనరల్ సెక్రెటరీ సంతోష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ మల్లేష్, నరసింహ, మధుసూదన్ రెడ్డి, సీహెచ్ ప్రసాద్ రావు, మహేష్, అమెన్ జనరల్ సెక్రెటరీ నరసింహచారి, స్లీప్వెల్ జనరల్ సెక్రెటరీ సిరాజుద్దీన్, కార్మిక సంఘం నాయకులు శేషాద్రి, శ్రీను, వెంకట్రావు, సురేష్, వీరాంజనేయులు, కిషోర్, ఢిల్లేశ్వర్ రావు, ఫణీంద్ర, సుజిత్‌రెడ్డి, వాసుదేవరావు, నాగార్జునరెడ్డి, ఖాదరవల్లి, రాము, సంతోష్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్‌గా విజయేంద్రారెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా విజయేంద్రారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన నర్సింహారెడ్డి బదిలీ కాగా ఆయన స్థానంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హెూదాలో గజ్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా విధులు నిర్వహించిన విజయేంద్రారెడ్డికి పదోన్నతితో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలను స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి చంద్రావతి, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్లు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-జవహర్‌నగర్

మాదిగలు విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా కో కన్వీనర్ వడ్డేపల్లి శివకుమార్ అన్నారు. బుధవారం కార్పొరేషన్‌లోని దళితభవన్‌లో జవహర్ నగర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కొయ్యడ వెంకటేష్ ఆధ్వర్యంలో విశ్వరూప మహాసభ కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ...ఎస్సీ వర్గీకరణ కోసం మాదగలంతా కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. ఘట్కేసర్‌లో ఈ నెల 21న నిర్వహించచున్న మాదిగల విశ్వరూప మహాసభకు మాదిగ బిడ్డ స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చుక్క ఐలయ్య, వెంకటేష్, మొగిలిపాక వెంకటేష్, మల్లేష్ తదితరులున్నారు.

ఎన్ఐఎన్ కాలనీకి బస్సు ఏర్పాటు



నవతెలంగాణ-బోడుప్పల్

ప్రయాణికుల సౌకర్యం కోసం ఆర్టీసీ బస్సును పునః ప్రారంభించిన అధికారులకు బోడుప్పల్ ఐదో డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని ఎన్ఐఎన్ కాలనీ, ఐఐసిటీకాలనీ, అనఘాపురి కాలనీ, లెక్చరర్స్ కాలనీల ప్రయాణికులు ఆర్టీసీ బస్సు లేక పడుతున్న కష్టాలను గుర్తించిన కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి బస్సు ఏర్పాటు చేయాలని టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు వినతి పత్రం అందజేశారు. వినతిపత్రాన్ని పరిశీలించిన సజ్జనార్ బస్సు కాలనీలకు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగానే బుధవారం బస్సును పునఃప్రారంభం చేశారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



నవతెలంగాణ-ఘట్కేసర్

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలో వస్తుందని పలువురు కాంగ్రెస్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనరెడ్డి నేతృత్వంలో బుధవారం ఘట్కేసర్ మండలాధ్యక్షుడు వినోద్ ఆధ్వర్యంలో చౌదరగూడ గ్రామంలో డోర్ టూ డోర్ క్యాంపెయినింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేషనల్ కో ఆర్డినేటర్ తమిళనాడు యువజన కాంగ్రెస్ కార్యదర్శి సింధూజ, రాష్ట్ర యువజన కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి రుక్మువర్ధన్‌రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి కార్యదర్శి బండ్లగూడ క్రాంతిగౌడ్, మేడ్చల్ అసెంబ్లీ అధ్యక్షుడు కొత్త శశాంత్‌గౌడ్‌తో కలిసి డోర్ టూ డోర్ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నా రు. వృద్దులకు రూ.4వేల పెన్షన్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తుందన్నారు. అమరవీరుల కుటుంబానికి రూ.25 వేల అందజేస్తుందని పేర్కొన్నారు. కౌలు రైతులకు ఏడాదికి రూ.15వేలు ఇస్తుందని వెల్లడిం చారు. అనంతరం సింధూజ రెండు లక్షల ప్రమాద బీమా కార్డును పలువురికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి చౌదరిగూడ అధ్యక్షులు కట్ట ఆంజనేయులుగౌడ్, వార్డు సభ్యులు భోజిరెడ్డి, నర్సింగ్‌రావు, దావీదు రెడ్డి, గణేష్ నాయక్, వంశీ యాదవ్, భాస్కర్, ధనరాజ్, మంచాల క్రాంతి వంశీ, సాయి, పాండు, చారి, శ్రావణ్ నాయక్, భాను ప్రకాష్, నరేష్, తదితరులున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-శామీర్‌పేట

మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 11గంటల 30నిమిషాలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ దాసరి ఎల్లూ భాయిబాబు, ఎంపీడీవో వాణీగరుదాస్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా ప్రతి నిధులు, అధికారులు సకాలంలో విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించిన జీవీఆర్

నవతెలంగాణ-కూకట్‌పల్లి



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును గొట్టిముక్కల వెంకటేశ్వర్ రావు (జీవీఆర్) బుధవారం బాధిత మహిళకు అందజేశారు. కూకట్‌పల్లి గ్రామం రామాలయం వీధిలో నివసించే, శామీర్ పేట్ సుహాసిని రవీందర్ అనే మహిళ గుండెకు సంబంధించి అనారోగ్యానికి గురై ఒమ్ని హాస్పిటల్‌లో చేరి హార్ట్‌కి స్టంట్ వేయించుకున్నారు. చికిత్స అనంతరం కూకట్‌పల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి వచ్చి సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వర రావును సంప్రదించారు. వారు ముఖ్యమంత్రి సహాయనిధికి ధరఖాస్తు చేయించి, ప్రభుత్వ సహకారంతో, రూ. 60 వేలు మంజూరు చేయించా రు. దానికి సంబంధించిన చెక్కును జీవీఆర్ బుధవారం పార్టీ కార్యాలయంలో సుహాసినికి అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, జీవీఆర్‌కు బాధిత మహిళకు కృతజ్ఞతలు తెలిపారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో నివసించే గ్యార విజయ్ కుమార్, సంధ్య దంపతులు కులాంతర వివాహం చేసుకున్నందుకు డా.బీఆర్ అంబెడ్కర్ ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ పథకం, ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన రూ. 2.5 లక్షల చెక్కును బుధవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ వారి నివాసం వద్ద కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి టీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. కులాంతర వివాహం చేసుకున్న యువతీ, యువకులు ఈ పథకాన్ని సద్వినియోగ పరుచుకోవాలని, వారికీ ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి కె.శ్రీకర్ రెడ్డి, వసతి గృహ సంక్షేమ అధికారులు నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పిలుస్తోంది..!

- రెగ్యులర్‌గా చదువుకోలేని వారికి సువర్ణావకాశం
- దూరవిద్యలో టెన్త్, ఇంటర్ విద్యాభ్యాసం..
- హైదరాబాద్ జిల్లావ్యాప్తంగా 106 అధ్యయన కేంద్రాలు
- వచ్చేనెల చివరి వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం
- విద్యాశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రత్యేక డ్రైవ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

కుటుంబ పరిస్థితులు బాగోలేక.. ఆర్థికపరమైన ఇబ్బందులు, పలు కారణాలతో చదవాలనే ఆశ ఉండి అవకాశం లేక మానేసిన వారు ఎందరో ఉన్నారు. అలాంటి వారిలో ఉన్న ఆసక్తి.. ఇష్టాన్ని కొనసాగించే విధంగా తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్) చదువుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞానం, వృత్తి విద్యా సంబంధమైన కోర్సులను ప్రవేశపెట్టింది. ఈ విద్యా సంవత్సరానికి(2023-24) పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు పొందేందుకు ఆగస్టు 10వరకు అవకాశం కల్పించింది. 14 ఏండ్లు నిండిన వారందరికీ దూరవిద్య ద్వారా పదో తరగతి, ఇంటర్ చదువుకునే వెసులుబాటు కల్పించింది. ప్రవేశాల నమోదుకు సంబంధించిన ప్రత్యేక డ్రైవ్‌ను అధికారులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ జిల్లావ్యాప్తంగా 106 అధ్యయన కేంద్రాలున్నాయి. విద్య పై మక్కువ, ఉన్నత విద్యను అభ్యసించాలనే కోరిక, ఏదోక వృత్తిలో స్థిరపడి ఉన్నత స్థానాలను పొందలేకపోతున్నవారికి ఓపెన్ స్కూళ్లు ఒక వరంగా మారాయి. ప్రతీ అదివారం, ప్రతీ రెండో శనివారాల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులతో విద్యార్థులకు పాఠాలను బోధిస్తారు. ఉచితంగా పుస్తకాలను అందిస్తారు. వీటిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇంటింటికి తిరుగుతూ మహిళలు, గృహిణీలు, ఉద్యోగులతో పాటు మా ర్కెట్లు, వాణిజ్య సముదాయాల్లో పనిచేసే వారికి బ్రోచర్ అంది స్తూ.. అవగాహన కల్పిస్తున్నారు. ఇదిలావుంటే ఓపెన్ స్కూల్ విధానంలో చదువుకొన్న చాలా మంది ప్రభుత్వ ఉద్యోగాలు



సా ధించి, ఉన్నత స్థాయిల్లో ఉన్నారు. ప్రభుత్వ పథకాల్లో లబ్ది పొందే ందుకు కనీసం పదోతరగతి ఉత్తీర్ణత అడుగుతున్న నేపథ్యంలో సా ర్వత్రిక విద్య ప్రాధాన్యత సంతరించుకున్నది. గత విద్యాసంవత్స రంలో(2022-23) హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా పది, ఇంటర్ కలిపి 12,442 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందగా.. 6,295 మంది పదోతరగతిలో, 6147 మంది ఇంటర్‌లో అడ్మిషన్స్ తీసుకున్నారు.

31 ఆగస్టు వరకు దరఖాస్తు గడువు

ఓపెన్ స్కూల్ విద్యలో ప్రవేశం పొందాలనుకునే వారు వచ్చేనెల 10వ తేదీ వరకు దరఖాస్తులు స్థానిక అధ్యయన కేంద్రాలలో సమర్పించవచ్చు. అపరాధ రుసుంతో ఆగస్టు 11- 31 వరకు చెల్లించవచ్చు.www.telanganaopenschools.org దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తుదారులు మీ-సేవ, టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాలలో రుసుం చెల్లించాలి. టెన్త్‌లో చేరేందుకు 2023 నాటికి 14 ఏండ్లు నిండి ఉండాలి. దరఖాస్తు ఫీజు రూ.150, జనరల్ కేటగిరి రూ.1400, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగులు, మైనార్టీలు రూ.1000, చెల్లించాలి. ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి 15ఏండ్లు ఉండాలి. ఇంటర్‌లో జనరల్ పురుషులకు రూ.1500, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగులకు రూ.1200 చెల్లించాల్సి ఉంటుంది.రుసుం చెల్లించిన తర్వాత సమీపంలోని అధ్యయన కేంద్రంలో దరఖాస్తులు సమర్పించాలి. మరిన్ని వివరాలు, జిల్లా కో-ఆర్డినేటర్‌ను ఫోన్ నెంబర్ 8008403516లో సంప్రదించవచ్చు.

అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలి

సమన్వయకర్త ప్రభాకర్ రెడ్డి జిల్లావ్యా ప్తంగా 106 పాఠశాలల్లో సార్వత్రిక టెన్త్, ఇంటర్ స్టడీ సెంటర్లు ఉన్నాయి. చదువుకోవాలనుకునే వారికి అక్కడి ప్రధానోపాధ్యాయు లు, సమన్వ యకర్తలు అన్ని విషయాలు వివరిస్తారు. వివిధ కారణాలతో మధ్యలో చదువు ఆపేసిన యువత, గృహిణులు, చిరు ఉద్యోగులకు ఇదో మంచి అవకాశం. ఎలాంటి విద్యార్హత లేని వారు పదో తరగతిలో చేరవచ్చు. అర్హులైన వారు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

డీఈవో ఆర్.రోహిణి,

వర్షాకాలం దృష్ట్యా చర్యలు చేపట్టాలి

- సీపీఐ(ఎం) బాచుపల్లి మండల కమీటీ డిమాండ్



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బస్తీలలో, ప్రగతి నగర్ కాకతీయ హిల్స్ శ్రీ కృష్ణ గార్డెన్ దగ్గర డివిజన్‌లో డ్రయినేజీలు రోడ్లపై ప్రవహిస్తున్నాయి. ప్రయాణికులు, స్కూల్‌కి వెళ్లే పిల్లలు ,ప్రజలు, ఇబ్బందులకు గురవుతున్నారని అధికారులు చర్యలు చేపట్టాలని బాచుపల్లి మండలం సీపీఐ(ఎం)కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేర కు బుధవారం ప్రగతి నగర్‌లోని పలు ప్రధాన రోడ్లలో పర్య టించి, ఇబ్బందికరంగా మారిన రోడ్లలో వర్షాకాలం దృష్ట్యా, అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వెంటనే చర్యలు చే పట్టాలని కోరారు. సిపిఐ(ఎం)మండల కార్యదర్శి బి.వెంకటరామయ్య, జి.వెంకటరాజులు మాట్లా డుతూ కార్పొరేషన్‌లో అభివృద్ధి కోసం రూ. 150 కోట్లు బడ్జెట్ కేటాయించడం జరిగిందని తెలిపారు. కానీ ఎక్కడేసిన గొంగడి అక్కడే ఉన్నట్లు ఉందన్నారు. పాలకులు అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్నా అభివృద్ధి లేదనడానికి రోడ్లపై ప్రవహిస్తున్న డ్రయినేజీనే నిదర్శనం అని స్థానిక ప్రజలు అంటున్నారన్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే నీరు ఎక్కడ నిలువ ఉంటే అక్కడ నీటిని తొలగించి మురుగునీరు ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్ వేయించే చర్యలు చేపట్టాలన్నారు. అలాగే డెంగ్యూ మలేరియా నుండి ప్రజల ఆరోగ్యా లు కాపాడాలని, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) బాచుపల్లి మండల కమిటీ డిమాండ్ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు బాలపీర్ స్వామి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కొద్దిపాటి వర్షానికి రోడ్లన్నీ గుంతల మాయం

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



సూరారం 129 డివిజన్ పరిధిలోని శ్రీరామ నగర్ నుండి కృష్ణ నగర్‌కి వెళ్లే రోడ్లు గతంలోనే అస్తవ్యస్తంగా ఉండగా ప్రస్తుతం వరుసగా కురుస్తున్న కొద్దిపా టి వర్షాలకు మరింత దెబ్బతిన్నాయి. అడుగులోతు గుంతలలో వాహనదారులు ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది. పనులకు వెళ్లే పాదాచారుల పరిస్థితి మరి దారుణంగా మారింది. దీంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కాలనీలలో రోడ్ల పరిస్థితి మరి దారుణంగా ఉంది. మట్టి రోడ్లు చిత్తడిగా మారి కనీసం నడవలేని పరిస్థితి నెలకొంది. సకాలంలో రోడ్లకు మరమ్మతులు చేపట్టవలసిన అధికారులు నిర్లక్ష్యంతోనే పరిస్థితి ఇలా మారిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వానకాలం ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే మునుముందు పరిస్థితులపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోని సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గర్భిణులు, నవజాత శిశువులకు అన్ని సౌకర్యాలు..

- ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్

నవతెలంగాణ-సిటీబ్యూరో



మంత్రి హరీశ్‌రావు మార్గదర్శకత్వంలో గర్భిణులు, నవజాత శిశువులకు అన్ని ఆరోగ్య సౌకర్యాల్లో నాణ్యతను మెరుగుపర్చాలనే ప్రాథమిక లక్ష్యానికి కట్టుబడి ఉన్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తెలిపారు. లక్ష్య అసెస్‌మెంట్‌లో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మల్కాజిగిరి ఏరియా హాస్పిటల్‌లో జరిగిన ముగింపు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. డా.కోట్యానాయక్, జిల్లా కో-ఆర్డినేటర్ హెల్త్ సర్వీసెస్, డాక్టర్ ప్రసాద్, సూపరింటెండెంట్ మల్కాజిగిరి ఏరియా హాస్పిటల్, కేంద్ర ఎక్సటర్నల్ అసెసర్స్ డాక్టర్ అనిత చౌరాసియా, డాక్టర్ షాలినీ చావ్ సత్కరించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రసూతి సంరక్షణకు అవసరమైన ప్రమాణాలకు అనుగుణంగా లేబర్ రూంలు, ప్రసూతి వార్డులను అప్‌గ్రేడ్ చేసినట్టు తెలిపారు. వైద్యులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందితో సహా ఆరోగ్య సంరక్షణ ప్రధాతలకు, ప్రసూతి అందించడంలో వారి నైపుణ్యాలను పెంపొందించడానికి శిక్షణ ఇవ్వడం, ప్రసవ నిర్వహణలో ఏకరూపత, ఉత్తమ పద్ధతులను నిర్ధారించడానికి ప్రామాణిక ప్రోటోకాల్స్, మార్గదర్శకాలను అమలు చేయడం, ప్రసవ సమయంలో తల్లులు, నవజాత శిశువుల భద్రత, శ్రేయస్సును నిర్ధారించడానికి రోగి-కేంద్రీకత సంరక్షణ విధానాలను ప్రోత్సహించడం, ప్రసవ ప్రక్రియ అంతటా గర్భిణులు, వారి కుటుంబాల పట్ల గౌరవప్రదంగా వ్యవ హరించాలని సూచించాలని తెలిపారు. ఆరోగ్య సదుపా యాల్లో అందించే సంరక్షణ నాణ్యతను క్రమం తప్పకుండా అంచనా వేయడం, ఎక్సటర్నల్ అసెసర్స్ అందించిన ఫీడ్ బ్యాక్, డేటా ఆధారంగా మెరుగుదలలు చేయడం ద్వారా అందరూ రోగుల సంరక్షణకు సేవల నాణ్యతను మెరుగు పరచవచ్చు అని తెలిపారు. మొత్తం మూల్యాంకన వ్యవధి లో సమయానుకూల ప్రతిస్పందన కోసం మొత్తం వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, సహాయక సిబ్బందికి ఎక్సట ర్నల్ అసెసర్స్‌ను అభినందించి, ధన్యవాదాలు తెలిపారు.

21న ఖాళీల భర్తీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్‌తో నిర్వహించనున్న టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ జేసీ(బీ), ఉప్పల్ కాలేజీలో బీపీసీ, టీఅండ్‌హెచ్ఎం ఒకేషనల్ కోర్సుల్లో మిగిలిపోయిన ఖాళీలను భర్తీ చేయడానికి ఈ నెల 21వ తేదీన ఉదయం 10 గంటలకు పదో తరగతి జీపీఏపై ప్రవేశాలు కల్పిస్తున్నట్టు యాదాద్రి రీజినల్ సమన్వయ అధికారి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సమన్వయ అధికారి, ఉప్పల్ కాలేజీ ప్రిన్సిపాల్ పి.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పల్ బాలుర కాలేజీలో ఉన్న ఖాళీల భర్తీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఖాళీల భర్తీని ఘట్‌కేసర్ మండలం, ఎదులాబాద్ కేఐటీఈ కాలేజీలో చేపట్టనున్నట్టు తెలిపారు.

ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేత



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను తన నివాసం వద్ద కలిసి పలు సమస్యలపై వినతి పత్రాలు, ఆహ్వాన పత్రికలు అందజేశారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పరిసరాల పరిశుభ్రతకు గుడ్ మార్నింగ్ ఆల్విన్



- దొడ్ల రామకృష్ణ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

గుడ్ మార్నింగ్ ఆల్విన్ కాలనీ మూడవ విడత కార్యక్రమంలో భాగంగా, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ ఆల్విన్ కాలని డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని శివమ్మ కాలనీలో, బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పర్యటించి, స్థానిక సమస్యలను కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా వీధులలో చెత్త వేయకుండా ప్రజలలో అవగాహ న తీసుకు రావాలనే ముఖ్య ఉద్దేశంతో, గుడ్ మార్నింగ్ ఆల్విన్ కాలనీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంద న్నారు. శివమ్మ కాలనీలో 95 శాతం అభివృద్ధి పనులన్నీ పూర్తయ్యాయని, చిన్న చిన్న సమస్యలు ఉన్నా కూడా వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తామని అన్నారు. కాలనీలో ముఖ్యంగా డ్రయినేజీ లైన్‌లకు, లోపల వైపు ప్లాస్టింగ్ లేకపోవడ ంతో మట్టి పూడుకపోయి నిండిపోతుందన్నారు. మూడు చోట్ల కరెంట్ స్తంబాలు అవసరమున్న విషయాన్ని, ఎమ్మె ల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌ల దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, సిద్దయ్య, షౌక త్ అలీ మున్నా, సంగమేష్, కూర్మయ్య సంతోష్ బిరాదర్, జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌బీటీ ఫ్యాషన్ హబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వినియోగదారులకు నాణ్యతతో కూడిన దుస్తులను అందుబాటులోకి తెస్తే వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. ఓల్డ్ అల్వాల్‌లోని అంబేద్కర్ నగర్‌లో షేక్ గౌస్ కుమారులు నూతనంగా ఏర్పాటు చేసుకున్న హెచ్‌బీటీ ఫ్యాషన్ హబ్‌ను బుధవారం ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..ట్రెండ్‌కు తగిన దుస్తులను స్వల్ప ధరలకు అందుబాటులోకి తెస్తే వినియోగదారుల ఆదరణ మరింత పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ బొబ్బిలి సురేందర్ రెడ్డి, బలవంత రెడ్డి, నాగేశ్వర రావు, మహేష్, శ్రీనివాస్ గౌడ్ శ్రీశైలం యాదవ్, ఢిల్లీ పరమేష్ అతిక్ పాష ,అక్రమ్ పాష, మధు పాల్గొన్నారు.

ఫలహారం బండి ఉత్సవాల్లో పాల్గొన్న సిల్వర్ మనీష్, రామకృష్ణ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి



ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలో తులసినగర్ కాలనీలో బోనాల ఉత్సవాల సందర్భంగా గోపిచారి నిర్వహించిన, ఫలహారపు బండి ఉత్సవాల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, తెలంగాణ ఉద్యమ కారుడు సిల్వర్ మనీష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిల్వర్ మనీష్ మాట్లాడుతూ.. అమ్మవారి కరుణా కటాక్షాలు ప్రజలందరి పై ఉండాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిలాష రావు, షౌకత్ అలీ, మున్నా, వాసుదేవరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అన్ని డివిజన్‌లలో సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్‌లలో అభివృద్ధి పనులతో పాటు అన్ని సమస్యలు పరిష్కరించాలని మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం మేయర్, అధ్యక్షతన కమిషనర్ రామకృష్ణ రావు, ఎస్. ఈ సత్యనారాయణతో కలిసి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎన్ఎంసీ ఆయా విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనులు, పెండిగ్‌లో ఉన్న నిర్మాణ పనులు, అవసరమైన మౌలిక సదుపాయాల గురించి చర్చాలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి, పెండింగ్ దశలో ఉన్న నిర్మాణ, అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. అదే విధంగా వర్షా కాలం దృష్ట్యా కార్పొరేషన్ పరిధిలో రోడ్లు, డ్రైనేజ్‌లు, ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనులు పూర్తి, ట్రాఫిక్ ఇబ్బందులు, రోడ్ ప్యాచ్ వర్క్స్ ,పెరిగిన చెట్లు, విద్యుత్ తీగలు, స్తంభాలు, వరద నీటి తొలగింపు చర్యలు, ఆయా విభాగాల అధికారులతో సుదీర్ఘంగా చర్చించి, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ సురేష్ రెడ్డి, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది, ఇతర ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



కూకట్‌పల్లి నియోజకవర్గంలో వీధి కుక్కలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, సమస్యలను పరిష్కరించాలని జనసేన పార్టీ రాష్ట్ర , కూకట్‌పల్లి ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్ అన్నారు. రెండు రోజుల క్రితం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో ఉన్న దయ్యార్ గూడా రూప సెంటర్‌లో మయాంక్ అనే 9 ఏండ్ల బాలుడు ఆడుకుంటున్న సమయంలో కుక్కలు దాడి చేసి బాలుడి ఎడమచంప, దవడ, చెవి భాగా లను తీవ్రంగా గాయపరిచాయి. దీంతో బుధవారం కూక ట్‌పల్లి జోనల్ కమిషనర్ మమతను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూక ట్‌పల్లి నియోజకవర్గంలో వీధి కుక్కల దాడిలు అధికమ య్యావని అన్నారు. గతంలో కూడా కూకట్‌పల్లి నియోజక వర్గంలో మూసాపేట్ డివిజన్‌లో ఉన్న యాదవ బస్తీ, కబీ ర్ నగర్, ఫతేనగర్ డివిజన్‌లో, భవాని నగర్‌లో కుక్కల దాడుల వల్ల ప్రజలు మహిళలు, చిన్నారులు గాయపడ్డారన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఉన్న అన్ని డివిజన్‌లో వీధి కుక్కలు అధిక సంఖ్యల ఉండటంతో అవి మను షుల మీద పడి దాడి చేస్తున్నాయన్నారు. వెంటనే వీటి పైన చర్యలు తీసుకొని నియోజకవర్గంలో వీధి కుక్కలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూక ట్‌పల్లి నియోజక వ ర్గం జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, వేముల మ హేష్, నాగేంద్ర, వెంకటేశ్వరరావు, కిషోర్ నాగరాజు, కలి గినీడి ప్రసాద్, రాము పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి లోని మగ్దుం నగర్‌లో,(బొడ్రాయి నాభి శిలా) ప్రథమ వార్షి కోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని తెలిపారు. బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించిన కమిటీ సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీని యర్ నాయకులు బండి సత్యనారాయణ, బొడ్డు ఉమా మహేశ్వరరావు, నారా నరేందర్, విట్టల్ గౌడ్, ఆశప్ప, మునిపల్లి జనార్ధన్, నర్సింగ్ రావు, లింగారెడ్డి శ్రీనివాస్, రాజు, వీర్రాజు, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

బీవీఆర్ఐటీహెచ్ ప్రిన్సిపాల్‌కు ప్రశంసా పత్రం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని బీవీఆర్ఐటీ హైదరాబాద్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ కళాశాలలో ట్రిబుల్ ఈ, ఇసీఇ, విభాగాలు, మ్యాట్ ల్యాబ్ సిమూ లింక్ ప్రమాణాలను విజయవంతంగా చేరుకున్నందుకు ఉపకరణాలను, పాఠ్యాంశాలు, విద్యార్థి ప్రాజెక్ట్‌లలోకి చేర్చినందుకు ప్రశంసా పత్రాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్ సునీతకు అందుకున్నారు. మ్యాథ్‌వర్క్స్ బృందం ఇండియా ఎడ్యుకేషన్ టెక్నికల్ టీమ్ మేనేజర్ విజు రవిచంద్రన్, ఏపీ, ఏఎంపి, టీఎస్ అకౌంట్ మేనేజర్ మోనికా నమ్మి, సీనియర్ ఇంజనీర్ రమణారెడ్డిలతో కలిసి బీవీఆర్ఐటీహెచ్ ప్రిన్సిపాల్ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఇన్ చార్జి అకడమిక్స్ డా. జె. నాగ విష్ణు వర్ధన్, ఇసిఇ విభాగా ధిపతి డాక్టర్ అన్వర్ భాషా పట్టాన్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ సతీష్ చంద్ర, అసోసియేట్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా చిల్ల రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రముఖ పారిశ్రామిక వేత్త, సీతా రామాంజనేయ స్వామి, సాయిబాబా ఆలయ అధ్యక్షులు, సంఘ సేవకులు, లయన్ చిల్లా రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్ పంచశీల కాలనీలో గల రాజ్యలక్ష్మీ ఇండస్ట్రీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు అభిమానులు, లయన్స్ క్లబ్ సభ్యులు, కార్మికులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని చిల్లా రాజశేఖర్ రెడ్డి చేత కేక్ కట్ చేయించి, పుష్పగుచ్చం అందజేసి, శాలువాలతో పూలమాలలతో ఘనంగా సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలు అం దరి మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలి పారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మున్ముందు మరింత ఘనంగా జరుపు కుని సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవివాకిటి రామిరెడ్డి, సంఘ సేవకులు జింకల వెంకటేష్ ముదిరాజ్, జీవీఆర్ సంస్థ అధ్యక్షులు గుడిబండ వెంకట్ రెడ్డి, యువ కలవాహిని ఉపాధ్యక్షులు ఎంఎ హమీద్, సెవెన్ హిల్స్ అధ్యక్షులు ఏడు కొండలు, ఆధ్యాత్మిక గురువు శ్రీశైలం, శివాజీ మనె, జయ రామ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కులాంతర వివాహ జంటలకు అండగా ఉంటాం



- ఎమ్మెల్యే కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కులాంతర వివాహం చేసుకున్న జంటలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే కృష్ణా రావు అన్నారు. ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో, కూకట్‌పల్లి నియోజకవర్గంకు చెందిన వెన్నెముల గోపి కులాంతర వివాహం చేసుకున్న సందర్భంగా, ఆ జంటకు ప్రభుత్వం తరపున రూ. 2 లక్షల 50 వేల చెక్కును ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, సమాజంలో అన్ని కులాలు, మతాల వారిని సమన్యాయంతో, కులాంతర వివాహం చేసుకున్న నిరుపేదలకు కూడా వారికి అండగా నిలుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యుత్ బకాయి చెల్లించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



యాప్రాల్‌లోని మండల ప్రజా పరిషత్ పాఠశాలను బుధవారం కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ సందర్శించారు. ఈ పాఠశాల విద్యుత్ బ కాయిలు పేరుకు పోయిన కారణంగా అధికారులు విద్యు త్ సరఫరా నిలిపివేశారు. దీంతో కరెంట్ సౌకర్యం లేక పా ఠశాల విద్యార్థులు, సిబ్బంది అనేక ఇబ్బందులను ఎదుర్కొ ంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేత నం దికంటి శ్రీధర్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆ పాఠశాలకు వెళ్లి, అక్కడ వారి ఇబ్బందులను తెలుసుకున్నా రు. వెంటనే ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరా తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. వి ద్యుత్ బకాయి తక్షణ చెల్లింపుల నిమిత్తం నందికంటి శ్రీధ ర్, ఆయన మిత్ర బృందం చాకో, యస్‌వీయస్ ప్రసాద్, వే ణు (ప్రైజ్ హై స్కూల్), మధుసూదన్ రెడ్డి, రమేష్, పాం డు, సంతోష్, కే. శివనాయుడు, యశ్వంత్ యాదవ్, అమల్ కుమార్ రెడ్డి, ధన్ రాజ్ అందరూ కలసి తమ స్వంతంగా రూ.75,000 స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు జయమ్మకి అందజేశారు. ఈ కార్యక్ర మంలో రాజలింగం, చంద్రశేఖర్, వైయన్నార్, బాలరాజు, ప్రవీణ్ కుమార్, మండల సతీష్, లల్లా, రాజు తదితరులు పాల్గొన్నారు.

లోహియానగర్‌లో పర్యటించిన కార్పొరేటర్ దీపిక



నవతెలంగాణ-కంటోన్మెంట్

మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక బుధవారం డివిజన్ లోని మారేడ్ పల్లి లోహియానగర్ ఉప్పలమ్మ దేవాలయ ప్రాంతంలో పర్యటించారు. వర్షం వల్ల పడుతున్న ఇబ్బందులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా స్థానికులు రోడ్డు సమస్యలు తెలిపారు. కార్పొరేటర్ దీపిక మాట్లాడుతూ వర్షం తగ్గిన వెంటనే ప్యాచ్ వర్క్ చేయించడంతో పాటు డ్రయినేజీ సమస్యను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకుపోయి పరిష్కరించాలని కోరారు.

మంత్రి తలసానిని కలిసిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనుదీప్ దురిశెట్టి బుధవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి కలెక్టర్ మొక్కను అందజేశారు. మంత్రి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆ సమయంలో అక్కడే ఉన్న శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్ ముదిరాజ్, రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్‌లను మంత్రి శ్రీనివాస్ యాదవ్ కలెక్టర్‌కు పరిచయం చేశారు.

'డబుల్' ఇండ్ల పంపిణీకి జీహెచ్ఎంసీ కసరత్తు

- ఆగస్టు నుంచి అక్టోబర్ మూడో వారం నాటికి దాదాపు 70 వేల ఇండ్ల పంపిణీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగర పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన లబ్దిదారులకు అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో లక్ష ఇండ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకొని వాటిని వేగంగా పూర్తి చేస్తున్నది. ఇప్పటికే అత్యధిక భాగం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తయ్యాయి. మిగిలిన చోట్ల నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయి. నిర్మాణం పూర్తి చేసుకొని పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్దిదారులకు అందించేందుకు జీహెచ్ఎంసీ ఒక షెడ్యూల్ సిద్ధం చేసింది. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం లబ్దిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా ఉండాలని, ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన లబ్దిదారులకే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు అందేలా చూడాలని పురపాలక శాఖ మంత్రి కే.తారక రామారావు జీహెచ్ఎంసీ అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో లబ్దిదారుల ఎంపికకు సంబంధించి జీహెచ్ఎంసీ అధికారులు రెవెన్యూ శాఖ సమన్వయంతో ముందుకెళ్తున్నారు. ఎంపిక ప్రక్రియను పకడ్బందీగా చేపట్టేందుకు కసరత్తు చేసిన అధికారులు షెడ్యూల్‌ను సిద్ధం



చేసింది. ఇప్పటిదాకా నాలుగువేల ఇండ్లకు పైగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు అందించిన విషయం తెలిసిందే. జీహెచ్ఎంసీ రూపొందించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు మొదటి వారంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ ప్రారంభం అవుతుంది. అక్టోబర్ మూడవ వారం వరకు కొనసాగుతుందని తెలిసింది. దాదాపు 6 దశల్లో ఇప్పటికే పూర్తయిన సుమారు 65 వేలకు పైగా పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు అందిస్తారు. వీటికి అదనంగా నిర్మాణం తుది దశలో ఉన్న ఇండ్లను కూడా ఎప్పటికప్పుడు ఈ పంపిణీ కార్యక్రమానికి అదనంగా జత చేసే అవకాశం ఉన్నది.

కళాకారులను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం : నిరుద్యోగ కళాకారులు



నవతెలంగాణ-ఓయూ

మలి దశ తెలంగాణ ఉద్యమంలో పాటే ప్రాణంగా మలచుకొని రాష్ట్ర సాధన దిశగా తమ వంతు పోరాటం చేసిన కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని నిరుద్యోగ కళాకారులు మండిపడ్డారు. తమ చదువులు వదిలి, జీవితాలు పణంగా పెట్టి పాటే ప్రాణంగా పాటుపడిన కళాకారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉద్యమ నిరుద్యోగ కళాకారులు బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ఊరూరా తిరిగి పాటలు పాడి ప్రజల్లో ఉత్తేజం నింపిన తమ బతుకుల్లో చీకట్లే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ గద్దె ఎక్కే వరకు తమని వాడుకొని వదిలేశాడని ఆరోపించారు. వారికి అనుకూలంగా ఉండే కొంతమందికే పదవులు, ఉద్యోగాలు దక్కాయని చెప్పారు. అసలైన కళాకారులు రోడ్డున పడ్డారని మండిపడ్డారు. త్వరలోనే రాష్ట్రం అంతటా కళా ఉద్యమ చైతన్య యాత్రను నిర్వహించి కేసీఆర్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఓయూ సాక్షిగా ఉద్యమిస్తాం అన్నారు. గిరిజన శక్తి అధ్యక్షుడు శరత్ నాయిక్ వీరికి మద్దతుగా నిలిచారు. కార్యక్రమంలో అనోవోజు వెంకటేశం ,భూక్య గంగాధర్ నాయక్, కొండకూరి రాజు, కుమార స్వామి గౌడ్ ,రవి గౌడ్, పున్న రమేష్ ,సదానందం, లక్ష్మీనారాయణ ,యాదగిరి, కుమార్ ,మధు ,అహమద్, భూమయ్య ,శ్రీశైలం, కొంద్ర కుమార్ ,మధుకర్ ,సునీత, నర్మదా, స్వరూప ,ప్రణీత, రాణి, షహనా, మంగ ,పద్మ, వాణి ,అంజలి పాల్గొన్నారు.



అడ్వకేట్ అయిల మధుగౌడ్ ఆధ్వర్యంలో బల్కంపేటలో ఫలారం బండి ఊరేగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు డా. రవీందర్ గౌడ్ హాజరయ్యారు. ఆకుల రామచందర్ షాబాద్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-బేగంపేట

నగరంలో డిజాస్టర్ బృందాల పనితీరు భేష్

- ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తున్న డిజాస్టర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణలో నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశవ ఖందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించిన నేపథ్యం లో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. గత మూడు రోజులుగా నగరంలో కురుస్తున్న వర్షాలతో నగరం అతలాకుతలం అయింది. ఈ నేపథ్యంలో వివిధ సమస్యలపై నగర వాసుల నుంచి జీహెచ్ఎంసీకి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. పలు చోట్ల నాలాలు పొంగిపొర్లుతున్నాయని, మరికొన్ని చోట్ల చెట్లకొమ్మలు విరిగిపడ్డాయని ఇంకొన్ని ప్రాంతాలల్లో వర్షం నీరు రోడ్లపై నిలిచిపోయి ప్రమాదకంగా మారిందంటూ పలువురు నగర వాసులు జీహెచ్ఎంసీ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఈవీ అండ్ డీఎం)కు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు కేవలం మూడు రోజుల్లోనే దాదాపు 92కుపైగా ఫిర్యాదు వచ్చాయి. అలాగే నగరంలో వివిధ ప్రాంతాలల్లో అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. అగ్నిప్రమాదాలను నివారించేందుకు డీఆర్ఎఫ్ బృందాలు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాలల్లో ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తున్న డీఆర్ఎఫ్ బృందాలు సమస్యను పరిష్కరించాయి. గత సోమవారం బాల్‌నగర్, గుడిమల్కాపూర్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్ వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ఫిర్యాదులకు వెంటనే స్పందించిన డీఆర్ఎఫ్ బృందాలు పడిపోయిన చెట్టుకొమ్మలను తొలిగించారు. ఓ వ్యక్తి ప్రాణాలను రక్షించారు. మంగళవారం సైతం దాదాపు 8 ఫిర్యాదులు వచ్చాయి. యాకుత్‌పురాలోని అగ్నిప్రమాదం చోటుచేసుకుందని సమాచారం రావడంతో వెంటనే స్పందించిన డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. విద్యానగర్, మలక్‌పేట్, సైదాబాద్ వివిధ ప్రాంతాలల్లో చెట్లకొమ్మలు



పడిపోయి ప్రమాదకరంగా మారడం తోపాటు ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలియ డంతో డీఆర్ఎఫ్ బృందాలు సమస్యలను పరిష్కరించారు. 19న వివిధ సమస్యలపై నగర వాసుల నుంచి ఫిర్యాదులు అందడంతో వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించడంతో నగర వాసులు, అధికారులు డీఆర్ఎఫ్ బృందాలను ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

సీపీ సీవీ ఆనంద్‌కు నల్లా శంకర్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో నిర్వహించిన బక్రీద్, బోనాలు ఉత్సావాలు ప్రశాంత వాతావరణంలో పూర్తి కావడంలో సీపీ సీవీ ఆనంద్ ప్రత్యేక ప్రణాళిక కారణమని హైదరాబాద్ సీటీ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు నల్లా శంకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం బంజారాహిల్స్‌లోని టీఎస్ఐసీసీసీలో సీపీ సీవీ ఆనంద్‌ను సంఘం సభ్యులతో కలిసి ఆయన కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ జంటనగరాల్లో బోనాలు, బక్రీదు ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసిన సందర్భంగా సీపీని కలిశామని తెలిపారు. సీపీ ఆదేశాలతో ఉత్సావాల్లో పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారని, ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోలేదని గుర్తు చేశారు. సీపీ ప్రోత్సాహంతో పోలీస్ అధికారులు, సిబ్బంది మరింత ఉత్సాహంగా పనిచేస్తున్నారని అభిప్రాయపడ్డారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన డిప్యూటీ మేయర్

నవతెలంగాణ-ఓయూ



తార్నాక డివిజన్, లాలాపేట్ లో నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పలు లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ రానున్న రోజులలో భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జీహెచ్ఎంసీ అధికారులు మాన్ సూన్ ఎమర్జెన్సీ టీం ద్వారా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నాలాలో ఉన్న పూడికలు తీసివేయాలని, డ్రయినేజీ మూతలను, బాక్స్ డ్రైన్ దగ్గర ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రాణ నష్టం జరగకుండా అనునిత్యం తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఏఈ వెంకటేష్, సూపర్వైజర్ మిస్బా, బీఆర్ఎస్ నాయకులు శివశంకర్, వనజలక్ష్మి, విజయ, కారంపూడి పద్మ కాజా పాషా, ఫయాజ్, పవన్, నాను నాయక్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు 8 రోజుల జైలు శిక్ష

నవతెలంగాణ - జూబ్లీహిల్స్

రెండు రోజుల క్రితం తన ఆటోలో ఎక్కించుకున్న ఒక మహిళ ప్రయాణికురాలితో అసభ్యంగా ప్రవర్తించిన సయ్యద్ అల్తాఫ్ అనే ఆటో డ్రైవర్‌కు నాంపల్లి కోర్టు 8 రోజుల జైలు శిక్ష విధించింది. నిందితుడిపై పెట్టి కేసు పెట్టి కోర్టులో హాజరు పరచగా కేసు పరిశీలించిన మేజిస్ట్రేట్.. నిందితుడికి ఎనిమిది రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు. దాంతో అతన్ని చంచలగూడ జైలుకు తరలించారు. ఆటో డ్రైవర్లు మహిళలతో సత్ప్రవర్తనతో మెలగాలని, ఎవరైనా మహిళల పట్ల అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినట్టయితే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని, బోరబండ సీఐ రవికుమార్ ఈ సందర్భంగా తెలియజేశారు.

సికింద్రాబాద్ డీసీగా ఎన్.సుధాంష్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఓయూ



నగర వ్యాప్తంగా డిప్యూటీ కమిషనర్స్ బదిలీలు అయిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా సికింద్రాబాద్ సర్కిల్ - 29 డీసీ గా ఎన్.సుధాంష్ నియమితులయ్యారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. పలువురు ఆఫీసర్లు, ఉద్యోగులు, నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక ప్రజాప్రతినిధుల, ఉద్యోగుల, స్థానిక ప్రజల సహాయ సహకారంతో సర్కిల్ 29 అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

PUBLIC NOTICE

The general public hereby informed that **ILYAS AHMED S/o. LAL MOHAMMED.** aged about 48 years, Occ: Service Abroad, R/o. H.No.11-6-825/2, Red Hills, Hyderabad., has approached the Shriram Finance Ltd., Balanagar Branch, Hyderabad., by put his documents by way of mortgage in respect of Schedule of Property to secure the future Liability towards Loan amount. If any person or person's having any objections. Right, claim, title, interest over the Schedule of Property shall approach the undersigned with supportoftheirclaim within seven days, failing which the loan amount shall be sanctioned **ILYAS AHMED S/O. LAL MOHAMMED** and no claim or no objection of any kind thereafter will be entertained.

SCHEDULE OF THE PROPERTY

All that the House Property Municipal No.11-6-825/7, admeasuring 230.0 Sq. Yds., Situated at Jangam Basti, Red Hills, Hyderabad and bounded by:
NORTH: House of Ilyas. **SOUTH**: 23' Feet Wide Road. **EAST**: 14' Feet Wide Road. **WEST**: House No.11-6-836/2 of Farzana Begum.

By
R. VENKATESHWAR RAO
Advocate, & Panel Advocate of SHRIRAM FINANCE LTD.
5-3-29, Near Ramalayam Temple, Kukatpaly, Hyderabad - 72.
Cell.: 9391093566, 8519985749
Email : Venkateshwarraoadv@gmail.com

IN THE COURT OF THE HON'BLE XI ADDL.CHIEF JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD
I.A.NO.825 OF 2023
IN
O.S.NO.131 OF 2023

Between:
Mohammed Muzammil & another ... Plaintiffs
And
1. Abdul Mehraj S/o Abdul Rafeeq Khan
2. Rafeeqa Begum W/o Abdul Rafeeq Khan,
3. Abdul Rafeeq Khan S/o Abdul Rasheed Khan,
All r/o. 12-2-386/125, Syed Ali Guda, Asif nagar, Hyderabad. .....Defendants

NOTICE

The Plaintiffs have filed I.A.No.825 of 2023 in O.S.No.131 of 2023 for recovery of amount and the suit I.A.No.825 of 2023 in O.S.No.131 of 2023 is posted on 27-7-2023 at 10.30 a.m. for your appearance as otherwise the Hon'ble Court will proceed as per law.

//BY ORDER OF THE HON'BLE COURT//
AHMED KHAN
Advocate
12-2-97/1, Ground floor, Muradnagar, Mehdipatnam, Hyderabad -500 028
Cell : 9885492594

BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CUM X ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT AT : HYDERABAD
MV.O.P.NO.1680 OF 2019

Between:-
Bollu Sayamma & Others
...PETITIONERS/PETITIONERS
AND
P.Mohan Reddy & Another
...RESPONDENTS/RESPONDENTS

To,
P.Mohan Reddy., Not Known to the petitioners, Aged: Major, Occ:Owner of JCB no. AP22M6766, R/o.Plot.No.557, SKD NAGAR, Vansthalipuram,R.R.District.

Whereas the petitioners filed the above OP against you for compensation under section 166 of MVACT. You are hereby required to appear before this court on **21-8-2023 at 10:30A.M.** in person or by an advocate, if you fail to attend the court the matter may be decided Ex Parte.

//BY ORDER OF THE COURT//
B.VEKAT REDDY
ADVOCATE
44/SRT, MUNCIPAL COLONY MALAKPET, HYDERABAD-500036
CELL:9391032800

IN THE COURT OF THE HON'BLE XI ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD
O.S.NO.131 OF 2023

Between:
Mohammed Muzammil & another ... Plaintiffs
And
1. Abdul Mehraj S/o Abdul Rafeeq Khan
2. Rafeeqa Begum W/o Abdul Rafeeq Khan,
3. Abdul Rafeeq Khan S/o Abdul Rasheed Khan,
All r/o. 12-2-386/125, Syed Ali Guda, Asif nagar, Hyderabad. .....Defendants

NOTICE

The Plaintiffs have filed suit for recovery of amount and the suit O.S.No.131 of 2023 is posted on 27-07-2023 at 10.30 a.m. for your appearance as otherwise the Hon'ble Court will proceed as per law.

//BY ORDER OF THE HON'BLE COURT//
AHMED KHAN
Advocate
12-2-97/1, Ground floor, Muradnagar, Mehdipatnam, Hyderabad -500 028
Cell : 9885492594

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE CUM XIV ADDL.METROPOLITAN MAGISTRATE RANGA REDDY DISTRICT AT: HAYATNAGAR
OS.NO. 236 OF 2022

BETWEEN:-
Smt.P.Jayaprada .....PLAINTIFF
AND
Suryaprakash and others ....DEFENDANT NO. 1 & 2

To
Akshya Giri, S/o Mukund Giri, Aged 46 years, Occ: Business, Resident of: 14-10-1193, Lower Dhulpet, Hyderabad. (Defendant No.2)

Please take notice that my Client Smt. P.Jayaprada filed the suit in O.S.No. 236/2022 against you on the file of Pri.Junior Civil Judge cum XIV Addl. Metropolitan Magistrate, Ranga Reddy District, at Hayatnagar.
The said case stands posted to 3rd August, 2023 for your appearance.
You are required to appear either in person or through your duly authorised Advocate at **10.30 A.M. on 3rd August, 2023** before the above mentioned court, failing wich the case shall be decided ex-parte.

"BY ORDER OF THE COURT"
S.V.ASSOCIATES
K.Sridevi
S. RAGHURAM
S. SHRUTI
ADVOCATES
11 & 12 GROUND FLOOR, SHOBHA PAVANI ARCADE, 1-9-1114 To 1117; Opp.DURGABAI DESHMUKH HOSPITAL. VIDYANAGAR, HYDERABAD -500044,
Cell: 9949185000

PUBLIC NOTICE

The general public are hereby informed that **SRI. CHAKKALA GOPI KRISHNA MUDIRAJ, S/O LATE C. YADAGIRI, R/o H-No: 18-2-340/4, JANGAMMET, FALAKNUMA, HYDERABAD, Telangana - 500053** has approached M/s Shriram Finance Ltd , Attapur Branch Hyderabad for depositing her title deeds by way of equitable mortgage in respect of schedule property for securing her future liability towards the loan amount. If any person or persons are having any objections, right, claim, title, interest over the schedule property they shall approach the undersigned with certified copies of documents in support of their claim within (7) seven days from today, failing which the loan amount will be sanctioned to **SRI. CHAKKALA GOPI KRISHNA MUDIRAJ, S/O LATE C. YADAGIRI,** and no claim or no objection of any nature thereafter will be entertained thereafter. Hence the notice.

SCHEDULE OF THE PROPERTY

All that the HOUSE bearing Municipal Nos.18-2-339 & 340, admeasuring 109.55 Square Yards or equivalent to 92.02 Square Meters, situated at JANGAMMET, FALAKNUMA, HYDERABAD, Telangana state and bounded by:
BOUNDERIES OF PROPERTY
NORTH : HOUSE NO.18-2-339
SOUTH : HOUSE NO.18-2-341
EAST : ROAD.
WEST : Neighbour's Property.

For NomosVistas, The Lawyers, Govardhan Venu, Advocate & CEO
C-701 Skyline & Sterling Residency, Basheerbagh, Hyderabad 29.
Mob:-9849091266

IN THE COURT OF HON'BLE II ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT AT : HYDERABAD
O.P.NO.3008 OF 2021

BETWEEN:
Bolle Varun kumar ....Petitioner
AND
Bujji Prakash and others .....Respondent

To,
1) Bujji Prakash, S/o. B.Krishna Rao, age:Major,Occ:Bussiness, R/o.Plot No-c-123, C Block, H.No:4-41-392/5/C, papireddy nagar, Jagadgiri gutta, Kukatpally, Hyderabad. R1
2) Yadhanala Chandar, S/o. Yadhanala Mallaiah,aged: 28 years, Occ: Bus Driver, R/o: 37-377, somalah nagar,Jagadgiri gutta, Balanagar, Kukatpally, RR.Dist, Hyderabad.... ....R3

Please take Notice that the above named Petitioner filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on 26 -07-2023.at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)
M. Raman Goud,
Advocate
Sri Sai Nagar, Phase-II, Nadargul, Balapoor, R.R.Dist.

IN THE COURT OF JUNIOR CIVIL JUDGE, CHEVELLA, R. R. DISTRICT At: CHEVELLA.
O.S.No: 23 Of 2021.

Between:
Thalla Chandramohan Goud ...**Plaintiffs**
Vs.
Smt Gangi Geetha and another
...**Defendants**

NOTICE / SUMMONS

To,
1. Smt Gangi Geetha, W/o Gangi Laxmikanth Reddy, aged about 35 years, Occ: Business, R/o. Plot No. 196, Road No. 7, Vandanapuri Colony, Bheeramguda, Sanga Reddy Dist.
2. Sri Dharani Vittalaiah, S/o Dharani Bheeraiah, aged about 45 years, Occ: Agriculture, R/o. Donthanpally village, Shankerpally Mandal, Ranga Reddy Dist.

Sir, Please take notice/summon that the above named plaintiffs has filed the above Suit for declaration, cancellation of sale deed dated 24-1-2018 bearing document No. 2903 of 2018 and consequential relief of Perpetual Injunction in respect of plaint schedule described suit lands bearing Sy.No. 150/EE1 adm. Ac. 1-00 guntas, Sy.No. 163/AA adm. Ac. 1-00 guntas and Sy.No. 163/4 adm. Ac.1-00 guntas situated at Donthanpally village, Shankerpally Mandal, Ranga Reddy Dist. In the above case you are the defendant No. 1 and 2 and it is posted on 29-08-2023 for your appearance.

Therefore, make it convenient to present yourself either in person or through authorized agent before the above mentioned court at 10-30 AM on 29-08-2023. Otherwise the matter will be decided in ex-parte.

(BY ORDER OF THE COURT)
B. GURUVAREDDY B.Com., LL.B., Advocate
Plot No: 2/P, opp: Dwaraka Restaurant, Near Bandalgua "X" Road, Gandamguda (V), Rajendranagar (M), R.R.Dist. **Mobile: 9390492354**

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE CUM XIV ADDL. METROPOLITAN MAGISTRATE, RANGA REDDY DISTRICT, AT: HAYATH NAGAR
O.S.NO.564 OF 2023

Between:
SRI MUNUGALA RAVINDER REDDY .....Plaintiff
AND
SMT M.PADMINI and others ....Defendants no.1 to 6

To,
All concerned
(Defendant no.6)

NOTICE

Please take notice that the above suit filed against you before this Hon'ble Court Vide O.S.No. 564 of 2023. The above suit is posted on 28-07-2023 for your appearance make it convenient to appear on the said date at 10.30 A.M. either in person or through your counsel failing which the matter will be decided in your absence.

SCHEDULE OF PROPERTY-A

All the piece and parcel of land bearing Plot No.303, admeasuring 200 Sq. Yards of 167.23 sq.mtr, in Survey No.172, 174 and 175, situated at Srinivasa Nagar Phase-I, Kohed Village Hayth Nagar Revenue Mandal, Ranga Reddy District, Under Koheda Grampanchayath, Under Registration Sub District PeddaAmberpet and bounded By : **North**: Plot No.309, **South**: 30 feet wide road, **East**: Plot No.302, **West**: Plot No.304

SCHEDULE OF PROPERTY-B

All the piece and parcel of land bearing Plot No.109/1, admeasuring 200 Sq. Yards of 167.23 sq.mtr, in Survey No.172,174 and 175,siruated at Srinivasa Nagar Phase-I, Kohed Village Hayth Nagar Revenue Mandal, Ranga Reddy District, Under Koheda Grampanchayath, Registration Sub District Pedda Amberpet and bounded By: **North**: Plot No.136/1, **South**: 30 feet wide road, **East**: Plot No.109/2, **West**: Plot No.109

SCHEDULE OF PROPERTY-C

All the piece and parcel of land bearing Plot No.85,admeasurign 200 Sq.Yards of 167.23 sq.mtr, in Survey No.122, siruated at , Kohed Village Hayth Nagar Revenue Mandal, Ranga Reddy District, Under Koheda Grampanchayath, Under Registration Sub District Pedda Amberpet and bounded by: **North**: Plot No.86, **South**: Plot No.84, **East**: Neighbours Land, **West**: 30 feet wide road

//BY ORDER OF THE COURT//
M.PRABHAKAR
Advocate
H.No.4-9-592/6, Vinayak Nagar Colony, Hayath Nagar, Ranga Reddy District-501505. Cell 9848884442

SUMMON TO LEGAL REPRESENTATIVE OF DECEASED DEFENDANT
IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT JANGAON
I.A.NO. 1468 OF 2021
IN
O.S.NO. 294 OF 2016

Between:-
Gunda Butchaiah ...**Petitioner/Plaintiff**
AND
Pinninti Sanjeeva Reddy and Another ...**Respondents/Defendants**

To,
R3: Smt. Pathuri Sabitha W/o Santhosh Reddy, aged about: 37 years, Occupation: Household, R/o. Flat No. 403, SVS, AVN Residency, Madhura Enclave, near Select Talkies, Macha Bollaram, Thirumalagiri, Hyderabad.

That Gunda Butchaiah filed a suit in this court vide O.S. No. 294/ 2016 against Pinninti Sanjeeva Reddy and Galamma. Since Pinninti Sanjeeva Reddy died. The plaintiff made an application alleging you are one of legal representatives of said Sanjeeva Reddy, and desiring you be made one of defendants with Order 2 Rule 4. Since the notices issued to you by the court and through post were returned un served stating no such person in the given address. Thus the court ordered to serve the summons by publishing the same in news paper.

You are hereby summoned to attend in the above said court on 10-08-2023 at 10.30 AM to defend the said application, in default of your appearance on the above specified date, the petition will be decided in your absence.

//BY ORDER OF COURT//
M. JAN REDDY
Advocate,
Date: 15-07-2023 **Jangaon**

SUMMON TO LEGAL REPRESENTATIVE OF DECEASED DEFENDANT
IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT JANGAON
I.A.NO. 1467 OF 2021
IN
O.S.NO. 294 OF 2016

Between:-
Gunda Butchaiah ...**Petitioner/Plaintiff**
AND
Pinninti Sanjeeva Reddy and Another ...**Respondents/Defendants**

To,
R3: Smt. Pathuri Sabitha W/o Santhosh Reddy, aged about: 37 years, Occupation: Household, R/o. Flat No. 403, SVS, AVN Residency, Madhura Enclave, near Select Talkies, Macha Bollaram, Thirumala giri, Hyderabad.

That Gunda Butchaiah filed a suit in this court vide O.S. No. 294/ 2016 against Pinninti Sanjeeva Reddy and Galamma. Since Pinninti Sanjeeva Reddy died. The plaintiff made an application alleging you are one of legal representatives of said Sanjeeva Reddy, and desiring you be made one of defendants with Limitation Peition. Since the notices issued to you by the court and through post were returned un served stating no such person in the given address. Thus the court ordered to serve the summons by publishing the same in news paper.

You are hereby summoned to attend in the above said court on 10-08-2023 at 10.30 AM to defend the said application, in default of your appearance on the above specified date, the petition will be decided in your absence.

//BY ORDER OF COURT//
M. JAN REDDY
Advocate,
Date: 15-07-2023 **Jangaon**

SUMMON TO LEGAL REPRESENTATIVE OF DECEASED DEFENDANT
IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT JANGAON
I.A.NO. 1466 OF 2021
IN
O.S.NO. 294 OF 2016

Between:-
Gunda Butchaiah ...**Petitioner/Plaintiff**
AND
Pinninti Sanjeeva Reddy and Another ...**Respondents/Defendants**

To,
R3: Smt. Pathuri Sabitha W/o Santhosh Reddy, aged about: 37 years, Occupation: Household, R/o. Flat No. 403, SVS, AVN Residency, Madhura Enclave, near Select Talkies, Macha Bollaram, Thirumala giri, Hyderabad.

That Gunda Butchaiah filed a suit in this court vide O.S. No. 294/ 2016 against Pinninti Sanjeeva Reddy and Galamma. Since Pinninti Sanjeeva Reddy died. The plaintiff made an application alleging you are one of legal representatives of said Sanjeeva Reddy, and desiring you be made one of defendants with order 22 Rule 9 CPC Petition Since the notices issued to you by the court and through post were returned un served stating no such person in the given address. Thus the court ordered to serve the summons by publishing the same in news paper.

You are hereby summoned to attend in the above said court on 10-08-2023 at 10.30 AM to defend the said application, in default of your appearance on the above specified date, the petition will be decided in your absence.

//BY ORDER OF COURT//
M. JAN REDDY
Advocate,
Date: 15-07-2023 **Jangaon**

IN THE COURT OF HON'BLE 12- XI ADDL. DISTRICT AND SESSIONS JUDGECUM- XI ADDL. METROPOLITAN SESSIONS JUDGE, RANGA REDDY DISTRICT :: AT L.B.NAGAR
M.V.O.P. No.174 of 2019

Between:
J. Chaitanya S/o. J. Ravinder. Aged about: 22 years, Occ: Student, R/o. Plot No. 38/A4-59/2, Kismathpura Near Water Tank (Jagir), R.R.District, TS-30,
.....Petitioner/Petitioner
AND
1) Mohd. Shahid Nawaz S/o. Mohd Rasheed, R/o. H.No. 2-6-7/101, Flat No. 2, Golden Height Happy Home Colony, Hyderabad.
2) Liberty Videocon General Insurance Company Ltd, R/o. D.No. 6-3-885/7, 3rd Floor, Sapphire, Square Road, Gandhi Circle, Panjagutta, Hyderabad, TS-82
.....Respondents/Respondents

NOTICE

Whereas the above named Petitioner has filed above MVOP No. 174 of 2019 for Claim petition for compensation U/sec. 166 of the M.V.Act 1988 & R.455 of A.P.M.V rile 1989 R/w. Sec 140 (c) of A.P.M.V. ACT 1988 against Respondent No. 1 and the same has been posted on 10.08.2023. If any person having any objection or claims, they may appear on 10.08.2023 at 10.30 A.M. either in person or through advocate, otherwise the matter will be decided basing the documents available on records

// By Order of the court //
N. BAL KIRTHI RANI
Advocate
H.No. 5-5-1128, Plot No. 8/1, Sri Sainath Colony, Panama Godown, Vanasthalipuram, Hyderabad-70
cell: 9000250569

IN THE COURT OF HON'BLE 12- XI ADDL. DISTRICT AND SESSIONS JUDGECUM- XI ADDL. METROPOLITAN SESSIONS JUDGE, RANGA REDDY DISTRICT :: AT L.B.NAGAR
M.V.O.P. No.182 of 2019

Between:
Deepak Kujur S/o. K. Budh Ram Aged about: 26 years, Occ: Labour, R/o. Karmanghat, L.B.Nagar, Hyderabad
.....Petitioner/Petitioner
AND
1) Mohd. Habeebuodin S/o. Mohd Sarfuodin, Aged about: 42 years, Occ: Driver, R/o. H.No. 17-1-247/11, Santhosh Nagar Colony, Hyderabad-53
2) New Sahara Travels Rep. by Rawoofuddin, R/o. H.No. 19-4-280/3/2/1, Tadban Near Sha Function Hall, Bahadurpura, Hyderabad, TS-53
(Owner of the crime vehicle Mahindra Xylo bearing No. TS 12 UB 3271)
3) The New India Assurance Co.Ltd, R/o. Malakpet Do (612800), Flat No. 101, 1st Floor, Tirumala Towers, Judges Colony, Hyderabad, TS-36
.....Respondents/Respondents

NOTICE

Whereas the above named Petitioner has filed above MVOP No. 182 of 2019 for Claim petition for compensation U/sec. 166 of the M.V.Act 1988 & R.455 of A.P.M.V rile 1989 R/w. Sec 140 (c) of A.P.M.V. ACT 1988 against Respondent No. 1 & 2 and the same has been posted on 10.08.2023. If any person having any objection or claims, they may appear on 10.08.2023 at 10.30 A.M. either in person or through advocate, otherwise the matter will be decided basing the documents available on records

// By Order of the court //
N. BAL KIRTHI RANI
Advocate
H.No. 5-5-1128, Plot No. 8/1, Sri Sainath Colony, Panama Godown, Vanasthalipuram, Hyderabad-70
cell: 9000250569

గుర్తు తెలియని యాచకుడు మృతి

నవతెలంగాణ-అడిక్‌మెట్



గుర్తుతెలియని యాచకుడు మృతి చెందిన ఘటన దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అశోక్ నగర్ లక్ష్మీ బాలాజీ బాయ్స్ హాస్టల్ సమీపంలో బిక్షటన చేస్తూ జీవితం కొనసాగిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెంది పడి ఉన్నాడు. స్థానికులు ఇది గమనించి పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. యాచకుడు వివరాలను ఆరా తీస్తున్నారు. చనిపోయిన వ్యక్తి తెలుపు రంగు నల్లటి మచ్చలు కలిగిన చొక్కా, నలుపు రంగు పెయింట్ ధరించాడు. మెడ భాగంలో అమ్మ అనే పచ్చ బోటు ఉంది అని తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-అడిక్‌మెట్



వ్యక్తి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లకుంట పద్మ కాలనీ లో బి నరసింహ తన భార్య, కుమారునితో కలిసి వుంటున్నాడు. నరసింహ భార్య నిర్మల పని మీద బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూడగా తన భర్త ఇంట్లో కనిపించలేదు ఇంట్లో మొత్తం వెతకగా తన భర్త బట్టలు బ్యాగు కనిపించకపోవడంతో తన కుమారుడు ఉపేంద్రకు సమాచారం అందించింది. చుట్టుపక్కన వాళ్లను బంధువులను ఆరా తీసినా ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో స్థానిక నల్లకుంట పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్‌లో ఎడతెరిపిలేని వర్షం

హైదరాబాద్‌లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ సూచించింది. నగరంలో కురుస్తున్న భారీ వర్షాలతో పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పిల్లలు తడుస్తూనే స్కూళ్లకు వెళ్లారు. మరోవైపు పండ్లు, కూరగాయాల వ్యాపారులు తమ వ్యాపారం జరగక ఇబ్బందులు పడ్డారు.











వరద ముంపు సమస్యను పరిష్కరించాం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

బేగంపేట వాసుల ఎన్నో సంవత్సరాల వరద ముంపు సమస్యను పరిష్కరించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా బేగంపేట డివిజన్ లోని కట్టెల మండి లో రూ. 8.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీవరేజ్ పైప్ లైన్ పనులు, బ్రాహ్మణవాడిలో రూ. 13 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీవరేజ్ పైప్ లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వికార్‌నగర్‌లో స్థానికులు పలు సమస్యలను మంత్రి దష్టికి తీసుకురాగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీవరేజ్, వాటర్ లైన్ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తదనంతరం అన్ని రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం బ్రాహ్మణ వాడలో పనులు ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ అన్ని లైన్‌లలో సీవరేజ్ లైన్ పనులు చేపడుతున్నామని, ఈ పనులు పూర్తయిన అనంతరం రోడ్ల నిర్మాణం జరుగుతుందని వివరించారు. 50 సంవత్సరాల నుంచి ఈ ప్రాంత ప్రజలు వరదనీటి ముంపుతో పడుతున్న గోసను మంత్రి కేటీఆర్ చొరవతో తీర్చినట్టు చెప్పారు. సమగ్ర నాలా అభివృద్ధి కార్యక్రమం కింద 45 కోట్ల రూపాయల వ్యయంతో బేగంపేట నాలా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, పనులు త్వరలోనే పూర్తవుతాయని అన్నారు. నాలా వెంట ఉన్న కాలనీలలో కూడా వర్షాకాలంలో నీరు నిలవకుండా సీవరేజ్ లైన్ నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే సీసీ రోడ్లను నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ పనులతో వరద ముంపు సమస్య నుంచి ఈ ప్రాంత ప్రజలు శాశ్వత విముక్తి కలిగినట్లేనన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, జోనల్ కమిషనర్ రవి కిరణ్, ఈఈ సుదర్శన్, వాటర్ వర్క్స్ సీజీఎం ప్రభు, మేనేజర్ శశాంక్, శానిటరీ డీఈ శ్రీనివాస్, ఎలెక్ట్రికల్ డీఈ సుదీర్, స్ట్రీట్ లైట్ ఏఈ భరత్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీహరి, నరేందర్ రావు, శేఖర్, అఖిల్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ కోసం ఓయూలో పార్ట్ టైమ్ టీచర్ల ర్యాలీ

నవతెలంగాణ-ఓయూ



రాష్ట్రంలోని 13 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం టీచర్లు అందర్నీ రెగ్యులరైజ్ చేయాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేస్తూ బుధవారం ఓయూలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ ఓ యూ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని ఇంజనీరింగ్ కళాశాల వద్ద డీన్ యూజీసీ ప్రొ. మల్లేశం, ఓయూ టీచర్స్ అసోసి యేషన్ వైస్ ప్రెసిడెంట్, ఓయూ టీచర్స్ అసోసియేషన్ ట్రెజరర్ చలమల్ల. వెంకటేశ్వర్లు, సీపీఎస్ సాధన కమిటీ అధ్యక్షులు ప్రొ. శ్రీనివాసులు ప్రారంభించారు. ర్యాలీలో ఓయూ తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం, శాతవా హన యూనివర్సిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు యూని వర్సిటీ, మహాత్మా గాంధీ యూనివర్సిటీ, తెలంగాణ యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీ,పాలమూరు యూనివర్సిటీ, మొదలగు యూనివర్సిటీల పార్ట్ టైం టీచర్లు భారీగా పాల్గొన్నారు. కేవలం సంవత్సరంలో 6 నెలలు మాత్రమే వేతనాలు వచ్చే ఏకైక ఉద్యోగులు పార్ట్ టైం టీచర్లని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి పరిగణలోకి తీసుకొని వెంటనే పార్ట్ టైం టీచర్లను రెగ్యులరైజ్ చేయా లని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోమేశ్వర్ బోనకుర్తి విజ్ఞప్తి చేశారు. పార్ట్ టైం టీచర్లం దరూ అన్ని అర్హతలతోని పూర్తిస్థాయిలో యూనివర్సి టీలలో పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం యూనివర్సిటీ అధికారులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవడం లేదని, దయచేసి విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ నాగేశ్వర్ జూలు కోరారు. పార్ట్ టైం టీచర్లు ఆరు నెలల జీతాలతో అనేక ఒత్తిళ్లకు గురవుతూ సరియైన పద్ధతిలో తన కుటుంబాలను నడపలేని పరిస్థితిలో ఉన్నారని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆరుట్ల జానకి రెడ్డి తెలి పారు.ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ ప్రెసి డెంట్ డాక్టర్ పరుశురాం తెలంగాణ మహిళ విశ్వవిద్యా లయం ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్ వరలక్ష్మి, డాక్టర్ యుగేం దర్, డాక్టర్ స్వప్న జ్యోతి, డాక్టర్ భారతి, డాక్టర్ ఎర్రం నాగేందర్ డాక్టర్ మధు,డాక్టర్ అశోక్,బాల పద్మ, డాక్టర్ పావని, డాక్టర్ వనిత డాక్టర్ శ్రీదేవి,డాక్టర్ వీరు యాదవ్ డాక్టర్ మహేందర్ డాక్టర్ అజ్మత్ అలీ,డాక్టర్ కవిత డాక్టర్ దివ్య,డాక్టర్ దేవేంద్ర డాక్టర్ ఎం ఎం చారి, పాల్గొన్నారు.

బీరు బాటిల్‌తో భార్యపై దాడి చేసిన భర్త

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

భార్యపై భర్త బీరు బాటిల్‌తో దాడి చేసి తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఉప్పల్‌లో దంపతులు గొల్ల ఆనంద్, నవీన గొడవల కారణంగా ఇద్దరు విడిపోయి జీవిస్తున్నారు. నవీన జూబ్లీహిల్స్‌లో ప్రయివేటు ఉద్యోగం చేస్తూ హాస్టల్లో ఉంటుంది. బుధవారం జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి సమీపంలో భార్య రోడ్డుపై వెళ్తుండగా భర్త ఆటోలో వచ్చి బీరు బాటిల్ తో తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు వెంటనే గాయపడిన నవీనాను సమీపంలోని అపోలో హాస్పిటల్‌కు తరలించి వైద్యం చేయిస్తున్నారు. గాయపడిన నవీన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారని, కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నామని, నిందితుడిని త్వరలో అరెస్టు చేస్తామని జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపారు.

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన కట్ట హరి ప్రసాద్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ఏసీపీగా కట్ట హరి ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. 1996లో ఎస్సైగా చేరి ఎక్కువ కాలం కరీంనగర్ జిల్లాలో పనిచేశారు. గత ఆరు సంవత్సరాల నుంచి వెస్ట్ జోన్‌లో ఇంటిలిజెన్స్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసి ఇటీవల ఏసీపీగా ప్రమోషన్ పొంది జూబ్లీహిల్స్‌లో బాధ్యతలు చేపట్టారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరు ఎలాంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు. నాయకులు, ప్రజలు పోలీసులకు సహ కరించాలని కోరారు. పోలీసులు 24 గంటలు అందుబాటులో ఉంటారని, బాధి తులు ఎవరైనా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగించుకోవాలి

- ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మెన్ మన్నె క్రిశాంక్



నవతెలంగాణ-కంటోన్మెంట్

మహిళలను, యువతులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దేందుకు గాను రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మెన్ మన్నె క్రిశాంక్ కంటోన్మెంట్ పరిధిలోని మూడో వార్డు బాలంరాయిలో 6వ విడత షీ టాక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో 45 మంది యువతులు పాల్గొని మాట్లాడారు. బహుళజాతి కంపెనీలలో ఉపాధి అవకాశాలు, వ్యవస్థాపకత, స్వయం ఉపాధి మహిళా సాధికారత గురించి చర్చించారు.. అలాగే వారి ప్రాంతంలో ఉన్న సమస్యలను క్రిశాంక్ దృష్టికి తీసుకొచ్చారు. కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ సమస్య గురించి తెలియజేశారు. వినతి పత్రాన్ని అందజేశారు. క్రిశాంక్ వెంటనే విద్యుత్ శాఖ డీఈకి ఫోన్ ద్వారా సమస్యను త్వరగా పరిష్కరించాలని చెప్పారు. మహిళా సమస్యల పరిష్కారం కోసం ఇంతవరకు ఏ నాయకులూ ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదని క్రిశాంక్‌ను అభినందించారు. అనంతరం క్రిశాంక్ మాట్లాడుతూ మహిళలలో చైతన్యం తెచ్చేందుకు గాను తాను షీ టాక్స్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఉన్నత చదువులు చదువుకున్న మహిళలు యువతులు కూడా ఇంటికి పరిమితం కాకుండా రాజకీయంగా ఆర్థికంగా ఎదగటానికి ఇలాంటి కార్యక్రమాలను ఉపయోగపడతాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల కోసం చేస్తున్న అనేక పథకాలను కూడా ఈ సందర్భంగా వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో అఖిల, సరిత, శైలజ, మౌనిక, రవళి, రాధిక, వరలక్ష్మి, మాధవి, సౌజన్య, కీర్తన, అప్పు పాల్గొన్నారు.

పార్టీ పేరును మారిస్తే అక్రమాలు సక్రమం కావు

- అమరుల ఆశయాల సాధన జేఏసీ నాయకులు



నవతెలంగాణ-బంజారాహిల్స్

అమరుల త్యాగల ఫలితంగా ఏర్పడ్డ రాష్ట్రంలో పార్టీ పేరును సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ గా మార్చినంత మాత్రాన అవినీతి అక్రమాలు సక్రమం కావనిఅమరుల ఆశయాల సాధన జేఏసీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి రవీందర్ నాయక్, మాజీ ఎమ్మెల్యే మత్యుంజయ కటకం, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, బింగీ రాములు, సొధం భుమన్న యాదవ్ సర్పంచ్ సంఘం అధ్యక్షులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం 1500 మంది అమ రులు బలిదానం చేసుకుంటే ఏర్పడ్డ రాష్ట్రంలో 500 మంది డాటా మాత్రమే లభించడం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్యమ నాయకులు లేని మంత్రివర్గం ప్రొఫెసర్ జయశం కర్ కొండ లక్ష్మణ్ బాపూజీ సాధనలకు తూట్లు పొడిచిం దన్నారు. రూ. 30 లక్షల కోట్లు దోచుకుని తెలంగాణ ప్రజలను అప్పుల పాలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌ది అన్నారు. సబ్బండ వర్గాలను ఎదగనివ్వకుండా కేవలం ఆయన కుటుంబీకులు ఐదుగురికి మంత్రి పదవులు ఇచ్చి ఉద్యమ నాయకులను ఉద్యమ కుటుంబాలను గాలికి వదిలేశారన్నారు. కార్పొరేషన్ చైర్మెన్‌లు, సంస్థలు కేవలం లోన్లు తీసుకోవడానికి తప్ప పరిపాలనకు పనికి రాకుండా చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. ప్రధానమంత్రి మోడీ బహిరంగ సభలో దేశంలో ఎక్కడా లేని అవినీతి తెలంగాణ రాష్ట్రంలో జరిగిందన్నారు.. కానీ ప్రభుత్వ సంస్థ లను ఉపయోగించి నిజ నిర్ధారణలు చేసి దోషులను ఎం దుకు శిక్షించడం లేదో ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు.ప్రతీ జిల్లాలో, మండలాల్లో పర్యటించి భారీ బహి రంగ సభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ జేఏసి పనిచేస్తుందని తెలిపారు. ఈ కె.వి ప్రతాప్, రామ్ రెడ్డి, యాదగిరి, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే పోలీస్ నియామకాలు చేపట్టాలి

- జీవో 46ను వెంటనే రద్దు చేయాలి
- మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్



నవతెలంగాణ-అడిక్‌మెట్

పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల నియామకాల్లో పాత పద్ధతిని చేపట్టాలని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ డిమాండ్ చేశారు. టీఎస్ఎస్‌పీ పోస్టులను రాష్ట్రస్థాయి కేడర్ పోస్టులుగా పరిగణించి అభ్యర్థులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులతో కలిసి నిరసన దీక్ష చేపట్టారు. ఈ నిరసన దీక్షకు మద్దతుగా మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ మాట్లాడుతూ పోలీసు బోర్డ్ నియామకం ప్రకారం.. క్వాలిఫై అయిన వాళ్లకు ఈ జీవో వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 46 ప్రకారం ఫలితాలు ప్రకటిస్తే రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకునే అవకాశం ఉందన్నారు. జీవో 46తో తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల్లో కేవలం ఉమ్మడి హైదరాబాద్ జిల్లాకు 53 శాతం రిజర్వేషన్ కల్పించి, మిగతా 26 జిల్లాలకు 47 శాతం కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతంలో అర్హత సాధించిన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. హైదరాబాద్ జిల్లాలో 30కి పైగా మార్కులు సాధిస్తే వచ్చే ఉద్యోగం.. జిల్లాల గ్రామీణ అభ్యర్థులకు 130పైగా మార్కులు తెచ్చుకున్నా రాదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 46 రద్దు చేయకుంటే తీవ్ర పరిణామం ఎదురుకొక తప్పదని హెచ్చరించారు. ఈ నిరసన దీక్షలో బీజేపీ సీనియర్ నాయకులు ప్రఫుల్ రామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు పాల్గొన్నారు.



గ్రూప్ 2 వాయిదాకు ఓయూలో ర్యాలీ

నవతెలంగాణ-ఓయూ

గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థులు బుధవారం ఓయూలో డా.బి.ఆర్.అంబేద్కర్ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 23 వరకు గురుకుల బోర్డు పరీక్ష, ఆగస్టు 8న, అర్బన్ డెవలప్మెంట్ ఏఓ పరీక్ష ఉన్నాయి అని, ఆగస్టు 29, 30 తేదీలలో గ్రూప్-2 పరీక్ష ఉందని ఓకే నెలలో ఇన్ని పరీక్షలు ఎలా రాయాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా గ్రూప్-2 మూడో పేపర్ ఎకానమీ లో 70 శాతం సిలబస్ అదనంగా పెట్టారని.. పేపర్ లికేజ్ వల్ల 3 నెలల సమయం వధా కావడంతో మానసికంగా చదవలేకపోయాం అని తెలిపారు. అందుకే ఈ అంశాలను దష్టిలో పెట్టుకొని మానవతా దక్పథంతో గ్రూప్ - 2 పరీక్షను నవంబరులో నిర్వహించాలని గ్రూప్-2 అభ్యర్థులు ప్రభుత్వాన్ని, టీఎస్‌పీఎస్సీని డిమాండ్ చేస్తున్నామన్నారు. మళ్ళీ గ్రూప్-2 సిలబస్, గురుకుల సిలబస్ వేరు వేరు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

చట్ట సభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- 21న పార్లమెంటు వద్ద భారీ ప్రదర్శన
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్ కృష్ణయ్య



నవతెలంగాణ-అడిక్‌మెట్

పార్లమెంటులో బి.సి బిల్లు పెట్టి చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, కేంద్రంలో బి.సి లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టాలని , 21న పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య అన్నారు. సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యర్యంలో బుధవారం విద్యా నగర్ బీసీ భవన్‌లో 16 బి.సి సంఘాల సంఘీభావ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ - పార్లమెంట్ ఎన్నికలలో బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు 50 శాతం టికెట్లు ఇవ్వాలని కోరారు. బి.సిలకు అన్యాయం చేసే పార్టీల భరతం పడతామని హెచ్చరించారు. బి.సి కులాలకు ఈ 75 సంవత్సరాల కాలంలో విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ సామాజికాభివద్ధి జరుగలేదన్నారు. రాజకీయ పార్టీల జెండాలు మోసుకుంటు, జిందాబాద్‌ల నినాదాలు ఇచ్చేలా బీసీలను వాడుకుంటున్నారని అన్నారు.కేంద్రంలోని 72 ప్రభుత్వ శాఖలలో, 245 ప్రభుత్వ రంగ సంస్థలలో 16 లక్షలు ఖాళీలు ఉన్నాయన్నారు . ఒక రైల్వే శాఖలో 3 లక్షల 53 వేల ఉద్యోగాలు వివిధ బ్యాంకులలో ఒక లక్ష 30 వేల ఉద్యోగాలు, రక్షణ రంగ సంస్థలలో నాలుగు లక్షల 30 వేల ఉద్యోగాలు, ఇలా వివిధ శాఖలలో మొత్తం 16 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వీటి భర్తీకి చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రిని కోరారు. 21న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో బీసీలు పెద్ద ఎత్తున హాజరై పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లపల్లి అంజి, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు

నానోస్కోపీ టెక్నాలజీతో కత్తి గాటు లేదు.. స్టీచెస్ లేవు..

- దేశంలోనే మొట్టమొదటి సారి నానోస్కోపీ టెక్నాలజీ ద్వారా ఫ్రోజన్ షోల్డర్ సర్జరీ
- కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో డాక్టర్ల అరుదైన శస్త్రచికిత్స



నవతెలంగాణ-బేగంపేట్

అన్ని రంగాల్లో వస్తున్న ఆధునిక టెక్నాలజీలాగే వైద్య రంగంలో వస్తున్న ఆధునిక టెక్నాలజీని ఎప్పటికప్పుడు అందివచ్చుకుంటూ వైద్య రంగంలో నూతన ఓరవడి శ్రీకారం చుడుతున్నారు కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ వైద్యులు. దేశంలోనే మొట్ట మొదటి సారిగా నానోస్కోపీ టెక్నాలజీ ద్వారా ఫ్రోజన్ షోల్డర్ శస్త్రచికిత్సను నిర్వహించి నూతన విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టారు.

చర్మంపై ఎలాంటి కత్తిగాటు అవసరం లేకుండా 2 మిల్లీ మీటర్ల కంటే తక్కువ సైజులో ఉండే నీడిల్ కెమెరా ను కేవలం రోగికి ఇంజక్షన్ ఇచ్చినట్టుగా భుజం జాయింట్‌లోకి ప్రవేశపెట్టి నేరుగా టీవీ స్క్రీన్‌పై జాయింట్ లోపలి భాగాన్ని చూడవచ్చు. దీని సూక్ష్మ పరిజ్ఞానాన్ని నానోస్కోపీ అంటారు. దీని ద్వారా జాయిం ట్‌లోని వివిధ రకాల గాయాలను గుర్తించవచ్చు. దెబ్బతిన్న భాగాలను నానోస్కోపీ సహాయంతో సరిచేయవచ్చు. బుధవారం సికింద్రాబాద్ కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ షోల్డర్ సర్జరీ, ఆర్థోస్కోపీ, స్పోర్ట్ సర్జరీ స్పెషలిస్ట్ డాక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ ప్రక్రియ మొత్తం లోకల్ అనస్థీషియా ద్వారానే చేయవచ్చని, రోగిని అదే రోజు డిశ్చార్జి చేసేందుకు అవకాశముంటుందని తెలిపారు. రాబోయే రోజుల్లో క్రీడల్లో అయ్యే గాయాలకు, మోకాలు, యాంకిల్, హిప్ జాయింట్‌లకు కూడా ఈ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువస్తామని, ప్రస్తుతం షోల్డర్ రొటేట్ కఫ్, మజిల్ టియర్ రిపేర్ సమస్యలకు ఈ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. "నానోస్కోప్"తో షోల్డర్ సర్జరీలో విప్లవాత్మక మార్పులకు ఈ విధానం నాంది పలుకుతుందని, భారత దేశంలోనే మొట్టమొదటి సారిగా ఈ శస్త్రచికిత్సను నిర్వహించిన ఘనత కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌కు దక్కుతుందన్నారు. గత రెండు సంవత్సరాల నుంచి నానోస్కోపీని ఉపయోగించడం ప్రారంభించామని, నిరంతర పరిశోధన కారణంగా ప్రస్తుతం నానోస్కోపీతో సంక్లిష్టమైన భుజం శస్త్రచికిత్సలను చేయగలుగుతున్నామని తెలిపారు.

ఎస్‌బీజేఐ కింద 30 మంది ఆర్థోపెడిక్ సర్జన్స్ ఒకే గొడుకు కింద పనివేయడం దేశంలోనే మరెక్కడ లేదన్నారు. శరీరంలోని ప్రతీ జాయింట్‌కు ఓ స్పెషలిస్ట్ సర్జన్ ఇక్కడ ఉంటారని, వైద్య రంగంలో గ్రూప్‌గా పనిచేయడం వల్ల ఎన్నో అద్భుతాలు సాధించవచ్చన్నారు. ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ ఆర్థోపెడిక్ సర్జన్స్‌లో ఎస్‌బీజేఐ సభ్యత్వం ఉండటం గర్వకారణమని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా రోబోటిక్ సర్జరీలు ఎక్కువ సంఖ్యలో చేసిన ఘనత కూడా సాధించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఇటీవల ప్రారంభించిన సర్వేజనా ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద వారికి తక్కువ ఖర్చుతో మోకాలు మార్పిడి శస్త్రచికిత్సలు చేస్తున్నామని, రాబోయే రోజుల్లో ఈ సేవలను మరింత విస్తతం చేస్తామని డాక్టర్ గురవారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నానో స్కోపీతో శస్త్రచికిత్స చేయించుకున్న వి.లక్ష్మి ఆనంత్ రెడ్డిలు మాట్లాడుతూ ఈ శస్త్రచికిత్స ద్వారా ఒకే రోజుల్లో డిశ్చార్జి అయ్యామని, ఇప్పుడు ఎలాంటి సమస్య లేదని సంతోషం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ కుషాల్, కన్సల్టెంట్ ఆర్థోపెటిక్ సర్జన్ డాక్టర్ సామ అనూప్ రెడ్డి, ఆర్‌సీ ఓ ఓ సౌరబ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



చేనేత వస్త్రాల సూత్ర ఎగ్జిబిషన్ షురూ

నవతెలంగాణ-బంజారాహిల్స్

సూత్ర రెండు రోజులా ఫ్యాషన్ అండ్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ బుధవారం బంజారాహిల్స్ తాజ్ కష్ణ హోటల్‌లో మొదలైంది. ఈ ఈవెంట్‌ను ప్రముఖ మోడళ్ల జ్యోతి ప్రజ్వలనాతో ప్రారంభించారు. ఫ్యాషన్ డిజైనర్లు, నగల తయారీదారులు, గృహోపకరణాల విక్రేతలు మరిన్నింటితో సహా అనేక రకాల ప్రదర్శనకారులు ఉంటయాని, ప్రస్తుత జీవనశైలికి మారుతున్న కాలానికి అనుగుణమైన అన్ని రకాల వస్తువులు ఈ ప్రదర్శనలో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. చేనేత వస్త్ర ఇతర వస్తువుల యజమాన్యాలు కాశ్వి చేనేత కోల్‌కతా, ఆది సృష్టి,ఇనారా ముంబై, ఖుసీ,సాయి ఇన్నోవేషన్, అలంకత్, వేఫ్ - కోల్‌కతా, శ్రద్ధా అగర్వాల్ ద్వారా సాన్వి, క్రియేటివ్ హబ్ సూత్ర ఎగ్జిబిషన్ కంపెనీలు ఈ ప్రదర్శనలో ఉంటాయని, అవకాశాన్ని నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని తెలిపారు.



టీడీపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావు నగర్ డివిజన్ ప్రెసిడెంట్‌గా ప్రశాంతి చౌదరి నియమితులయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో టీడీపీని బలపరిచి, నియోజకవర్గంలో వచ్చే ఎన్నికలలో ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించి టీడీపీ జెండా ఎగరవేస్తామని అన్నారు. ఈరోజు నుంచి ప్రతీ టీడీపీ కార్యకర్త ఇంటికి వెళ్లి కలుస్తానని, వెంగళరావు నగర్ డివిజన్లో త్వరలో టీడీపీ జెండా స్థూపాలు ఏర్పాటు చేసి జెండాలు ఎగరవేస్తామని అన్నారు.

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

'ఐ.ఎన్.డి.ఐ.ఏ కూటమి ఆగమనం మోడీ సర్కార్ అంతానికే

- ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

నవతెలంగాణ-హిమాయత్ నగర్



ఆమ్ ఆద్మీ పార్టీతో సహా దేశంలోని 26 లౌకిక రాజకీ య పార్టీలు ఏర్పాటు చేసిన ఐ.ఎన్.డి.ఐ.ఏ (ఇండియా) కూటమి ఆగమనం మోడీ సర్కార్ అంతనికే అని ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరంకుశ అధికార నేషనల్ డెమోక్రాటిక్ అల్లైన్స్ (ఎన్.డి.ఏ)ను ఎదుర్కోవడానికి 26 ప్రతిపక్ష పార్టీలు 2024 లోక్ సభ ఎన్నికలలో తమ ప్రచారానికి కూటమిని ఏర్పాటు చేయడం మైలురాయి నిర్ణయమని తెలిపారు. బీజేపీ దుశ్చర్యలను అరికట్టడానికి, మతతత్వం పేరుతో, దేశభక్తి ముసుగులో దేశాన్ని ముక్కలు చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దెదింపడానికి ఇండియా కూటమి పోరాడుతుందన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తూ పౌరులు ప్రశ్నిస్తే అర్బన్ నక్సల్స్ అని, దేశద్రోహులని ముద్రలు వేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి తిప్పికొట్టడానికి 26 ప్రతిపక్ష పార్టీలు బెంగళూరులో సమావేశమయ్యాయని ఆయన పేర్కొన్నారు. భూగర్భ ఘనులు, రోడ్లు, ఎయిర్ పోర్టులు, బ్యాంకులు, రైల్వేలు, ఇన్సూరెన్సు, రక్షణ, ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు, బడా కార్పొరేట్ సంస్థలకు హోల్ సేల్ గా బీజేపీ ప్రభుత్వం అమ్ముకుంటున్నదన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేసి, కనీస మద్దతు ధర కల్పిస్తామని, నిరుద్యోగ యువతకు ఏడాదికి 2 కోట్ల ఉపాధి కల్పిస్తామని మోడీ సర్కార్ హామీలు ఏమయ్యాయని దుయ్యబట్టారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తూ, మతతత్వ విధానాలతో దేశాన్ని ముక్కలు చేస్తున్న నియంతత్వ మోడీ ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి ఇండియా కూటమి పటిష్టమైన ప్రణాళిక రూపొందిస్తుందని, వచ్చే లోక్ సభ ఎన్నికలలో ఖచ్చితంగా విజయం సాధించి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, సామాజిక న్యాయాన్ని రక్షించుకుంటామని దిడ్డి సుధాకర్ తెలిపారు.

పొదుపు చేస్తున్నారా?



ఎంత ఎక్కువ సంపాదించినా సరే.. నెలాఖరుకు ఖర్చు పెట్టడానికి డబ్బు మిగలదు. అందుకే పొదుపు చేయాలని చాలా ఆలోచిస్తాం. కానీ ఆచరణలో సాధ్యం కాక ఆర్థిక ఇబ్బందులకు గురవుతాం. తీరా డబ్బంతా ఖర్చయ్యాక ఇక నెలాఖరులో అది కొనకుండా ఉంటే బాగుండేది, ఈ ఖర్చు పెట్టకుండా ఉంటే బాగుండేది అని మనల్ని మనం నిందించుకోవడం సాధారణం. ఓ సర్వే ప్రకారం మన దేశంలో పొదుపు చేసేవారి శాతం గత కొన్నేండ్లుగా తగ్గుతూ వస్తోందట. అందుకే డబ్బు మిగుల్చుకుని చేయడం అలవర్చుకోవాలి. మన రోజువారీ అలవాట్లలో ఎలాంటి మార్పులు చేస్తే డబ్బు పొదుపు అవుతుందో ఈ రోజు తెలుసుకుందాం...

ఖర్చులు అన్ని అయిపోయిన తర్వాత ఇంకెంత పొదుపు చేద్దాం అని ఆలోచిస్తుంటారు. ఇది తప్పు. ముందు పొదుపు చేసేందుకు కొంత డబ్బు పక్కకు పెట్టి, తర్వాత మాత్రమే ఖర్చులు పెట్టుకోవాలి. సంపాదనలో కనీసం నలభై శాతం పొదుపు చేయడం వల్ల భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు ఎదురు కాకుండా చూసుకోవచ్చు. ఖర్చు కోసం ఓ బడ్జెట్ రాసి పెట్టుకోవడం వల్ల అనవసరమైన ఖర్చులు అదుపు చేసుకోవచ్చు. ఇందులోనే ఓ 20 శాతం అత్యవసర ఖర్చులకు కూడా పెట్టుకోవడం మంచిది.



యాప్స్ ద్వారా

లగ్జరీలకు పెట్టే మొత్తాన్ని తగ్గిస్తేనే పొదుపు చేయడానికి డబ్బు మిగులుతుందని తెలుసుకోవాలి. చాలా యాప్స్ మనకు డబ్బు పొదుపు చేయడం ఎలాగో చెప్పడంతో పాటు మన నెలవారీ ఖర్చులను, పొదుపు చేసిన మొత్తాన్ని చూపిస్తూ ఖర్చులు తగ్గించుకోవడం మనకు సులువయ్యేలా చేస్తుంటాయి. మరికొన్ని యాప్స్ హోటల్ ఫుడ్ పై ఆఫర్లు, డీల్స్ అందిస్తాయి. వాటిని డౌన్‌లోడ్ చేసుకుంటే కొద్దిగా డబ్బు మిగులుతుంది. బయట భోజనం వీలైనంత వరకు తగ్గించుకోవాలి.

పాత వస్తువులనే...

రీసైకిల్ చేసిన వస్తువులను ఉపయోగించడం వల్ల చాలా వరకూ ఖర్చులు తగ్గించుకోవచ్చు. చాలామంది ఇంటిని డెకరేట్ చేయడానికి రకరకాల వస్తువులు కొంటూ ఉంటారు. దీనికి బదులుగా మీరు ఉపయోగించిన సీసాలతో ఫ్లవర్ వేజ్‌లు, ఐస్ క్రీం పుల్లలతో అలంకరణ వస్తువులు, టిష్యూ పేపర్లు, ప్లాస్టిక్ కవర్లతో పువ్వులు వంటివి తయారు చేసుకోవచ్చు. ఆలోచించాలే కానీ టైం పాస్‌తో పాటు అందంగా, ఆకర్షణీయంగా ఉండే డెకరేటివ్ వస్తువులు ఎన్నో తయారు చేసుకోవచ్చు. డబ్బు కూడా ఆదా అవుతుంది.

నడక మంచిదే..

నడవడం వల్ల ఆరోగ్యానికి ఎంత మంచిదో మనందరికీ తెలిసిందే. అయితే నడక అంటే ఉదయమో, సాయంత్రమో చేయాల్సిన అవసరం లేదు. వీలున్నప్పుడల్లా నడిచేయడం మంచిదే. ఒక్కోసారి తక్కువ దూరాలకు కూడా ఆటోలు, క్యాబ్‌లు తీసుకుంటూ ఉంటాం. స్నేహితులతో కలిసి మాట్లాడుకుంటూ నడిచి వెళ్తే ఆరోగ్యంతో పాటు డబ్బు కూడా ఆదా అవుతుంది. ఇలా ఆదా చేసిన డబ్బును వేరే వాటికి ఉపయోగించుకోవచ్చు అనే ఆలోచన పక్కకు పెట్టి దాచి ఉంచుకోవాలి.

వ్యక్తిగత అలవాట్ల వల్ల..

ఏదైనా అలవాటు మానుకోవాలనుకుంటే, ఆ అలవాటు మానడం వల్ల మీకు వ్యక్తిగతంగా లేదా ఆరోగ్యపరంగా.. ఆర్థికంగా కూడా ప్రయోజనం అందే ప్రయత్నం చేయండి. ఇందుకు మీరు మార్చాలనుకుంటున్న అలవాటును పాటించని ప్రతిసారి కొంత మొత్తాన్ని ఓ డబ్బాలో దాచి ఉంచండి. ఉదాహరణకు జంక్‌ఫుడ్ ఆరోగ్యానికి అంత మంచిది కాదు, ఆ అలవాటు మానుకునేందుకు ప్రయత్నిస్తే.. ఆ ఫుడ్ తిన్న ప్రతిసారీ దానికి అయ్యే ఖర్చు డబ్బును వేరేగా పొదుపు చేసి చూడండి.. మీరెంత డబ్బు ఖర్చు పెట్టి అనారోగ్యాన్ని తెచ్చుకుంటున్నారో అర్థం అవుతుంది. ఆ అలవాటును మార్చుకునేందుకు మనసు మళ్ళించేందుకు అవకాశం ఉంటుంది. అప్పటికీ అలవాటు మార్చుకోలేకపోతే ఈ మొత్తాన్ని రెట్టింపు చేయండి. ఆ మేరకు మీ ఖర్చులు తగ్గించుకోవాల్సి ఉంటుంది. తగ్గించిన ఖర్చులతో గడపడం కాస్త ఇబ్బందే కాబట్టి తొందరగానే ఆ అలవాటును మార్చుకుంటారు.

డిస్కౌంట్స్...

పొదుపు చేయమని చెబితే అస్సలు ఖర్చు పెట్టవద్దని కాదు.. కాస్త ఆలోచించి తెలివిగా ఖర్చు చేయాలని దాని అర్థం. ఉదాహరణకు ఆన్‌లైన్ షాపింగ్ సైట్‌లో ఓ డ్రెస్ నచ్చితే, దాన్ని వెంటనే కొనేయకుండా కార్ట్‌లో వేసుకొని అలా ఉంచుకోండి. కొన్నాళ్లకు ఏదైనా సేల్ ఉన్నప్పుడు అది మామూలు కంటే తక్కువ ధరకే లభిస్తుంది.

చెక్ చేసుకుంటూ...

ఏసీ ఆన్‌లో ఉన్నప్పుడు గాలి బయటకు పోవడం వల్ల అది మరింత పని చేయాల్సి ఉంటుంది. తద్వారా ఎలక్ట్రిసిటీ బిల్ కూడా పెరుగుతుంది. అన్నీ తలుపులు, కిటికీలు మూయడం వల్ల గది తొందరగా చల్లారుతుంది. అలాగే ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు అన్ని స్విచ్చులూ ఆపారా? లేదా? చెక్ చేసుకోండి. ఇలా చేయడం వల్ల డబ్బు ఆదా చేసుకోవచ్చు.

క్రిస్పీగా... టేస్టీగా...

మొక్కజొన్న ఆరోగ్యానికి ఎంతో మంచిది. చినుకులు రాలుతున్నప్పుడు కాల్చిన మొక్కజొన్న పొత్తులు తింటుంటే భలే రుచిగా ఉంటాయి. అయితే పిల్లలు, కొంతమంది పెద్దవారు వీటిని తినడానికి అంతగా ఇష్టపడరు. ఈ కాలంలో బేబీకార్న్ కూడా ఎక్కువగా దొరుకుతాయి. ఇవి తినడానికి చాలా రుచిగా ఉంటాయి. వీటితో కొన్ని రకాల స్నాక్స్ చేసి పెడితే ఎంతో ఇష్టంగా తింటారు. అలాంటి కొన్ని రకాల స్నాక్స్ గురించి ఈ రోజు తెలుసుకుందాం...



బేబీ కార్న్‌లో ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఎ, ఐరన్, విటమిన్ సి సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల వీటితో శారీరక, మానసిక ఆరోగ్యం. కేలరీలు కూడా తక్కువగా ఉంటాయి. బరువు తగ్గాలనుకొనే వారికి చాలా మంచిది. పీచు పదార్థం సమృద్ధిగా ఉండటం వల్ల రక్తంలో చక్కర స్థాయిలు నియంత్రించేందుకు సాయం చేస్తుంది. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగవుతుంది. ఇందులోని కెరోటినాయిడ్స్ కంటి సమస్యలను తగ్గిస్తుంది. ఫోలేట్ అనే పోషక పదార్థం సమృద్ధిగా ఉండుట వల్ల గర్భస్థ శిశువు ఎదుగుదలకు దోహదం చేస్తుంది.

మంచూరియా

కావాల్సిన పదార్థాలు : బేబీ కార్న్లు - 12, మైదా - మూడు చెంచాలు, కార్న్‌ఫ్లోర్ - రెండు చెంచాలు, ఉల్లిగడ్డ - ఒకటి, ఉల్లికాడల తరుగు - చెంచా, అల్లంవెల్లుల్లి ముద్ద - రెండు చెంచాలు, కారం - చెంచా, వెల్లుల్లి తరుగు - అర చెంచా, ఉప్పు - రుచికి సరిపడా, చిల్లీ సాస్ - చెంచా, సోయా సాస్, టమాటా సాస్ - రెండు చెంచాల చొప్పున, నూనె - వేయించడానికి సరిపడా.

తయారు చేసే విధానం : ఒక గిన్నెలో బేబీ కార్న్లు, ఉప్పు, కారం, అల్లం వెల్లుల్లి ముద్ద, మైదా, కార్న్‌ఫ్లోర్ వేసి, సరిపడా నీళ్ళు పోసి బాగా కలపాలి. తర్వాత బేబీ కార్న్లను నూనెలో పకోడీల మాదిరిగా వేసి దోరగా వేగించాలి. ఆ తర్వాత ఒక ఫ్రయింగ్ పాన్‌లో అర చెంచా నూనె వేసి పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ ముక్కలు, వెల్లుల్లి తరుగులను వేగించాలి. తర్వాత చిల్లీ సాస్, సోయా సాస్, టమాటా సాస్, కొద్దిగా ఉప్పు కూడా వేసి రెండు నిమిషాలు ఉడికించాలి. ఆ తర్వాత బేబీ కార్న్, ఉల్లికాడల తరుగు కూడా వేసి బాగా కలిపి దించేయాలి.



గోల్డ్ ఫింగర్స్

కావాల్సిన పదార్థాలు : బేబీ కార్న్లు - పది, - శెనగపిండి, బియ్యప్పిండి - పావు కప్పు చొప్పున, కారం - అర చెంచా, వంటసోడా - పావు చెంచా, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - వేగించడానికి సరిపడా.

తయారు చేసే విధానం : ఒక్కో బేబీ కార్న్‌ను నిలువుగా సగానికి కోసి రెండు ముక్కలు చేయాలి. తర్వాత ఒక గిన్నెలో శెనగపిండి, బియ్యప్పిండి, కారం, ఉప్పు, వంట సోడా వేసి, సరిపడా నీళ్ళు పోసి బజ్జీల పిండిలా కలుపుకోవాలి. తర్వాత కడాయిలో నూనె పోసి అది వేడయ్యాక బేబీ కార్న్ ముక్కల్ని బజ్జీల పిండిలో ముంచి, పిండి బాగా పట్టాక, నూనెలో వేసి బంగారు రంగు వచ్చే వరకూ వేయించాలి.



స్పైసీ బేబీ కార్న్

కావాల్సిన పదార్థాలు : బేబీ కార్న్లు - పది, పెరుగు - పావు కప్పు, కార్న్‌ఫ్లోర్, నూనె - 5 చెంచాలు, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్ట్ - పావు చెంచా చొప్పున, కారం, చాట్ మసాల, గరం మసాలా - అర చెంచా చొప్పున, ఉప్పు - రుచికి సరిపడా, నిమ్మరసం - చెంచా.

తయారు చేసే విధానం : బేబీ కార్న్లను కుక్కర్‌లో వేసి ఒక విజిల్ వచ్చే వరకు ఉడికించి తీయాలి. తర్వాత ఒక గిన్నెలో కార్న్‌ఫ్లోర్, పెరుగు, పసుపు, కారం ఉప్పు, నిమ్మరసం, అల్లంవెల్లుల్లి పేస్ట్, గరంమసాల, బేబీ కార్న్లు వేసి బాగా కలిపి ఒక గంట సేపు నానబెట్టాలి. తర్వాత ఒక పెనం మీద నూనె వేసి బేబీ కార్న్లను అన్ని వైపులా దోరగా వేయించాలి.



లాలీపాప్స్

కావాల్సిన పదార్థాలు : పనీర్ - రెండు వందల గ్రాములు, క్యాప్సికం - ఒకటి, బేబీ కార్న్లు - పది, గరంమసాల, తేనె - అర టీ స్పూను చొప్పున, నిమ్మరసం - టీ స్పూను, నూనె - రెండు టేబుల్ స్పూన్లు, చాట్ మసాల, కారం - పావు టీ స్పూను, ఉప్పు - రుచికి సరిపడా, టూత్‌పిక్‌లు - ఇరవై.

తయారు చేసే విధానం : బేబీ కార్న్లను అడ్డంగా సగానికి కోయాలి. తర్వాత పనీర్, క్యాప్సికంలను కూడా అంగుళం మేర ముక్కలుగా కోయాలి. ఆ ముక్కలన్నింటినీ ఒక గిన్నెలో వేసి ఉప్పు, కారం, నిమ్మరసం, గరంమసాల, తేనె వేసి బాగా కలిపి అరగంట నాననివ్వాలి. తర్వాత టూత్‌పిక్‌లకు క్యాప్సికం, పనీర్ ముక్కలను గుచ్చి, చివరిలో బేబీ కార్న్లను నిలువుగా గుచ్చాలి. ఆ తర్వాత వీటిని ఒక పెనం మీద ఉంచి కొద్దికొద్దిగా నూనె వేస్తూ దోరగా అన్ని వైపులా వేగించాలి. చివర్లో చాట్ మసాల చల్లి దించేయాలి.



బీసీలను కించపరిస్తే బుద్ధి చెబుతాం

(మొదటిపేజీ తరువాయి)

బీసీలు ఉన్నారని, దీన్ని జీర్ణించుకోలేక బీసీల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ పార్టీ నేతలు మాట్లాడుతున్నారని అన్నారు. వారు అధికారంలో ఉన్నంతకాలం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశారని, వారి అభివద్ధిని విస్మరించిందని విమర్శించారు. బీసీల జోలికొస్తే బీసీ నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తారని హెచ్చరించారు. రాజకీయాల్లో విమర్శ, ప్రతి విమర్శ సహజంగా ఉంటాయని, అయితే ఈ విధమైన వ్యక్తిగత, నోటికొచ్చిన పదాలను వాడటం సరైన విధానం కాదని హితవు పలికారు. బీసీ ప్రజాప్రతినిధులు, నాయకులపై కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న కించపరిచే విధంగా చేస్తున్న వ్యాఖ్యలు వ్యక్తిగతమా? లేక ఆ పార్టీ విధానమా? అనేది కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. వైఖరిని మార్చుకోకుంటే రానున్న రోజులలో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతం వరకు గల అన్ని బీసీ సామాజిక వర్గాలతో సమావేశం నిర్వహించి ఏకం చేస్తామని, త్వరలోనే తమ భవిష్యత్ కార్యాచరణను రూపొందించి ప్రకటిస్తామని వెల్లడించారు. గ్రామాల్లో తిరగనీయకుండా అడ్డుకుంటామని అన్నారు. బీసీలను అణిచివేయాలనే లక్ష్యంతో నాయకత్వాన్ని ఎదగనీయకుండా కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నుతున్నదని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, యెగ్గె మల్లేశం, ఎల్.రమణ, బస్వరాజ్‌సారయ్య, శంభీపూర్‌రాజు, శాసనసభ్యులు దానంనాగేందర్, కాలేరువెంకటేష్, ముఠాగోపాల్, గంపాగోవర్ధన్, ఎంపీలు బడుగుల లింగయ్యయాదవ్, వద్దిరాజురవిచంద్ర, బీబీ పాటిల్, కార్పొరేషన్ చైర్మెన్ చింతాప్రభాకర్, సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్‌లతో ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమరానికి సై...

(మొదటిపేజీ తరువాయి)

మహేశ్‌కుమార్ గౌడ్, పొన్నాల లక్ష్మయ్య, కోదండరెడ్డి, షబ్బీర్ అలీ, జూపల్లి కృష్ణారావు, అంజన్‌కుమార్ యాదవ్, సంపత్‌కుమార్‌తో పాటు పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు. తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ అంతర్గత పరిస్థితులు, పార్టీలో చేరుతున్న వారి రాజకీయ భవిష్యత్తుకు భరోసా, పార్టీలో చేరికలు, అగ్రనేతల పర్యటనలు, ఎన్నికల హామీలు, ప్రచారాంశాలపై చర్చించారు. త్వరలో పీఏసీ సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించాలని నిర్ణయించారు. 'విబేధాలను పక్కన పెట్టి కలిసి పనిచేద్దాం.. కర్నాటక తరహాలో రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొద్దాం' అని నిర్ణయించారు. పార్టీలోకి ఎవరొచ్చినా అందరి ఆమోదంతోనే చేర్చుకోవాలని వారు నిర్ణయించినట్టు తెలిసింది. కొత్త, పాత నేతల కలయికతోనే ఎన్నికలకు సిద్ధం కావాలని అభిప్రాయపడ్డారు. సమావేశానంతరం కోమటిరెడ్డి వెంకటొరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ... ఎన్నికల యుద్దానికి ఇక వంద రోజులే మిగిలి ఉందన్నారు. ఈ యుద్ధంలో ప్రజలు గెలవాలని పిలుపునిచ్చారు. పార్టీలో చిన్న చిన్న సమస్యలు ఉన్నా అందరం కలిసి పరిష్కరించుకోవాలని కోరారు. త్వరలో బస్ యాత్ర చేపడతామన్నారు.

30న కొల్లాపూర్‌లో భారీ బహిరంగ సభ ప్రియాంక హాజరు

ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీ ఈనెల 30న కొల్లాపూర్‌కు రానున్నారు. ఆ సభలో మహిళా డిక్లరేషన్ ప్రకటిస్తామని కోమటిరెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబం తప్ప ఎవరు బాగుపడలేదన్నారు. కేసీఆర్‌కు దమ్ముంటే వచ్చే ఎన్నికల్లో బీసీని సీఎం చేస్తానని ప్రకటించాలని డిమాండ్ చేశారు. తలసాని ఓ విగ్గ్‌రాజ్...ఆయన ఎప్పుడేం మాట్లాడుతారో ఆయనకే తెలియదని ఎద్దేవా చేశారు. పీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై చర్చించామన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా 26 పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయని గుర్తు చేశారు. ఓబీసీ జనగణన చేపట్టేందుకు రాహుల్ ఇప్పటికే హామీ ఇచ్చారని తెలిపారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మిత్ర పక్షాలను చీల్చడం, బలహీన పరచడమే బీజేపీ పనిగా పెట్టుకుందని విమర్శించారు. మోడీ ఫోటోతో దేశం అభివృద్ధి కాదన్నారు.

తీస్తా సెతల్వాద్‌కు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

సాక్ష్యాలను సృష్టించారన్న ఆరోపణల కేసులో హక్కుల ఉద్యమకారిణి తీస్తా సెతల్వాద్‌కు అత్యున్నత న్యాయస్థానం రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. తీస్తా సెతల్వాద్‌పై చార్జిషీటు దాఖలు చేసినందున కస్టడీ విచారణ అవసరం లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

"గుజరాత్ హైకోర్టు నిర్ణయం హేతుబద్ధంగా లేదు. బెయిల్ నిరాకరణలో హైకోర్టు పరిశీలన సక్రమంగా లేదు. హైకోర్టు వాదనను అంగీకరిస్తే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 226, 32, సీఆర్‌పీసీలోని సెక్షన్ 482 కింద చార్జిషీట్‌ను సవాలు చేయకపోతే, దాని ఆధారంగా ఎటువంటి బెయిల్ పిటిషన్‌ను నిర్ణయించకూడదు. హైకోర్టు పరిశీలన రాజ్యాంగ వ్యతిరేకంగా, విరుద్ధంగా ఉంది. కస్టడీలో ఉన్నప్పుడే తీస్తా సెతల్వాద్ తమ పాస్‌పోర్ట్‌ను సెషన్స్ కోర్టుకు సరెండర్ చేశారు. రెగ్యులర్ బెయిలు మంజూరు చేస్తున్నందున సాక్ష్యాలను తారుమారు చేసే ఎలాంటి ప్రయత్నాలు చేయరాదు" అని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. సాక్ష్యాలను ప్రభావితం చేసే ఎలాంటి ప్రయత్నాలు జరిగినా గుజరాత్ పోలీసులు అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకురావచ్చని కూడా తెలిపింది.

తీస్తా సెతల్వాద్ తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) సెక్షన్ 482 కింద పిటిషన్ దాఖలు చేయనందున గుజరాత్ హైకోర్టు బెయిల్ నిరాకరించిందని అన్నారు. బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించడానికి అటువంటి కారణం మొత్తం న్యాయశాస్త్రాన్ని తలకిందులు చేస్తుందని పేర్కొన్నారు. చాలా గుజరాత్ అల్లర్ల కేసుల్లో దోషులకు ఎలా శిక్షలు పడ్డాయో, ఆ కేసులను విచారించడానికి సుప్రీంకోర్టు స్వయంగా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఎలా ఏర్పాటు చేసిందో కూడా సిబల్ ప్రస్తావించారు. సుప్రీంకోర్టు 2022 జూన్ తీర్పులో సాక్ష్యాధారాల కల్పనపై ఎలాంటి నిర్ధారణ చేయలేదని, సిట్ ఎప్పుడూ వాదించలేదని కూడా సిబల్ అన్నారు. గుజరాత్ రాష్ట్రమే వీరిని సాక్షులని కోర్టు ముందు సమర్పించిందని తెలిపారు. తీర్పు వెలువడిన వెంటనే సెతల్వాద్‌ను అరెస్టు చేసిన తీరును కూడా ఆయన ప్రశ్నించారు.

గుజరాత్ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ (ఎస్‌జీ) తుషార్ మెహతా, అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఎఎస్‌జీ)ఎస్‌వి రాజు మాట్లాడుతూ, బెయిల్ ఇస్తే సెతల్వాద్ సాక్షులను ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. అదంతా రికార్డులో ఉన్నందున సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం లేదని ధర్మాసనం పేర్కొంది.

సెతల్వాద్ కస్టడీ అవసరాన్ని కూడా ధర్మాసనం ప్రశ్నించింది. సాక్ష్యానికి సంబంధించి రాష్ట్ర వాదనను అంగీకరిస్తే, చట్టంలోని సాక్ష్యాల నిర్వచనాన్ని 'డస్ట్‌బిన్ (చెత్తబుట్ట)లో పడవేయవలసి ఉంటుంది' అని వ్యాఖ్యానించింది. జ్యుడీషియల్ కస్టడీకి పంపే ముందు సెతల్వాద్ ఏడు రోజుల పాటు కస్టడీ విచారణకు సహకరించారని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన తరువాత ఆమెను ఎప్పుడూ విచారణకు పిలవలేదని కూడా పేర్కొంది. అంతేకాకుండా, చాలా వరకు సాక్ష్యాలు డాక్యుమెంటరీ అని, చార్జిషీట్ దాఖలు చేయబడిందని, అందువల్ల సెతల్వాద్‌ని కస్టడీలో విచారించాల్సిన అవసరం లేదని ధర్మాసనం పేర్కొంది. దీంతో సెతల్వాద్‌కు బెయిల్ మంజూరు చేసింది.

ఎన్డీఏ ప్రధాన భాగస్వాములు దర్యాప్తు సంస్థలే

(మొదటిపేజీ తరువాయి)


ప్రతిపక్ష పార్టీలు ప్రజలకు నమ్మకం కలిగించాలని సూచించారు. రాష్ట్రాలలో నెలకొన్న స్థానిక రాజకీయాల నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికలలో బీజేపీని ఢీకొనే బలం ప్రతిపక్షాలకు ఉన్నదని భావిస్తున్నారా అని అడిగిన ప్రశ్నకు ఆమె జవాబిస్తూ రాజకీయ పార్టీలు మాత్రమే కాకుండా సామాజిక శక్తులు, ఉద్యమాలు కూడా చేతులు కలపాలని పిలుపునిచ్చారు. భారత లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థ నాశనం కాకుండా అడ్డుకోవాలంటే అందరూ ఏకం కావాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. 'ప్రతి రాష్ట్రంలోనూ రాజకీయ వైరుధ్యాలు ఉన్నాయి. దీనిపై రాష్ట్ర స్థాయిలో ముందుగా కసరత్తు జరగాల్సి ఉంది. జాతీయ స్థాయిలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ దాడి నుంచి దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ఉమ్మడి లక్ష్యంతో ఉన్నామన్న నమ్మకాన్ని కలిగించాల్సిన అవసరం ఉంది' అని అన్నారు.

ప్రతిపక్షాలకు కుటుంబమే ముఖ్యమని, ఆ తర్వాతే దేశం గురించి ఆలోచిస్తాయని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యపై బృందా కరత్ మండిపడుతూ మోడీ, బీజేపీలకు అధికారమే ముఖ్యమని, విలువలు, ప్రజలు ఆ తర్వాతేనని వ్యంగ్యంగా అన్నారు.

ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశానికి హాజరైన వారిలో సగం మంది పార్టీ ఫిరాయింపుదారులేనని, వారు ఈడీ, సీబీఐ, ఐటీ దృష్టిలో మర్యాదస్తులని ఎద్దేవా చేశారు. మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండపై ప్రధాని ఎందుకు మౌనం వహిస్తున్నారని ఆమె ప్రశ్నించారు. మహారాష్ట్ర పరిణామాలపై మాట్లాడుతూ బీజేపీ ఎవరి పైన అయితే అవినీతి ఆరోపణలు చేసిందో వారే ఇప్పుడు ఆ పార్టీకి అత్యంత సన్నిహితులైన భాగస్వాములయ్యారని చెప్పారు. ఇది బీజేపీ కపటత్వాన్ని బయటపెడుతోందని అన్నారు.

ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని ప్రస్తావిస్తూ వాస్తవానికి అది ఉమ్మడి మతతత్వ కోడ్ (యూనిఫామ్ కమ్యునల్ కోడ్-యూసీసీ) అని బృందా కరత్ వ్యాఖ్యానించారు. వివిధ మతాలకు చెందిన నాయకులతో చర్చించి వ్యక్తిగత చట్టాలకు సవరణలు చేయాలని 21వ లా కమిషన్ సూచించిందని, అయితే ప్రభుత్వం తన మతతత్వ అజెండా కారణంగా దీనిని పట్టించుకోలేదని ఆమె అన్నారు. ప్రస్తుతం యూసీసీ వాంఛనీయం కాదని, దాని అవసరమూ లేదని లా కమిషన్ స్పష్టం చేసిందని బృందా కరత్ గుర్తు చేశారు.

అప్రమత్తంగా ఉండాలి



చేసుకోవాలన్నారు. ఇప్పటికే భారీ వర్షాలను సైతం ఎదుర్కొనేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసుకుని సంసిద్ధంగా ఉన్నట్టు జీహెచ్‌ఎంసీ అధికారులు వివరించారు. లోతట్టు ప్రాంతాలు, జలమయం అయ్యే ప్రధాన రహదారులు వంటి చోట్ల డివాటరింగ్ పంపులు, సిబ్బంది మోహరింపు వంటి ప్రాథమిక కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. జీహెచ్‌ఎంసీ చేపట్టిన ఎస్ఎన్‌డీపీ కార్యక్రమంలో భాగంగా నాలాలను బలోపేతం చేయడం వల్ల వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇబ్బందులు తప్పుతాయన్న విశ్వాసాన్ని ఈ సందర్భంగా అధికారులు వ్యక్తం చేశారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ వర్షాల వల్ల ప్రాణ నష్టం జరగకూడదన్న ఏకైక లక్ష్యంతో పని చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

పారిశుధ్య నిర్వహణపై చర్చ

హైదరాబాద్ నగర పారిశుధ్య నిర్వహణకు సంబంధించి సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. నగర పారిశుధ్య నిర్వహణ గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం మంచి ఫలితాలను ఇస్తుందని, అయితే దీంతోనే సంతృప్తి చెందకుండా మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కేటీఆర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. హైదరాబాద్ నగరం వేగంగా విస్తరించడం, జనాభా పెరగడం వంటి అంశాల వల్ల చెత్త ఉత్పత్తి పెరుగుతున్నదని, ఈ మేరకు పారిశుధ్య నిర్వహణ ప్రణాళికలను సైతం ఎప్పటికప్పుడూ నిర్దేశించుకుంటూ ముందుకు పోవాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు తక్షణ, స్వల్పకాలిక పారిశుధ్య ప్రణాళికలను వివరించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, జోనల్ కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నటేశ్వర శర్మకు దాశరథి అవార్డు

(మొదటిపేజీ తరువాయి)

రచయిత, సంస్కృతాంధ్ర కవి, శతావధాని, కామారెడ్డి జిల్లాకు చెందిన అయాచితం నటేశ్వర శర్మకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ నిర్ణయం మేరకు సంబంధిత ఉత్తర్వులు జారీ చేశారు. అవార్డుతో పాటు రూ.1.01,116 నగదును, శాలువా, జ్ఞాపికను ఆయనకు ప్రదానం చేస్తారు. ఈ నెల 22వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే కృష్ణమాచార్య జయంతి ఉత్సవాల సందర్భంగా అవార్డు గ్రహీతకు వాటిని అందజేయనున్నారు. ఈ సందర్భంగా నటేశ్వరశర్మకు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తరాఖండ్‌లో పేలిన ట్రాన్స్‌ఫార్మర్

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. వంతెనపై ఒక వ్యక్తి విద్యుదాఘాతంతో మరణించినట్టు సమాచారం రావడంతో నివేదిక తయారు చేయడం కోసం పోలీసు బృందం అక్కడకు వెళ్లిందని, అదే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ పేలి అక్కడ ఉన్న వంతెనకు విద్యుత్ ప్రవహించి మరణాలకు, గాయాలకు కారణమయిందని అధికారులు చెప్పారు. గాయపడిన వారిలో కొందరిని జిల్లా ఆస్పత్రికి, మరికొందరిని వాయుమార్గంలో రుషికేశ్‌లోని ఎయిమ్స్‌కు తరలించారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జ్యుడిషియల్ విచారణకు ఆదేశించారు. మరోవైపు, విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగానే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం కేంద్రమిచ్చింది రూ.17 వేల కోట్లు : చింతల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం 2,83,000 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం కోసం వివిధ రూపాల్లో రూ.17 వేల కోట్ల రూపాయలను ఇచ్చిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 6,10,000 ఇండ్ల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందని తెలిపారు. కేంద్ర నిధుల నుంచి ఒక్కో బెడ్ రూమ్‌కి రూ.6 లక్షలు ఖర్చు చేసినా 2 లక్షల 83 వేల ఇండ్లు పూర్తయ్యేవని తెలిపారు. ఆ డబ్బులు ఎక్కడకు పోయాయని ప్రశ్నించారు. సోషల్ ఆడిట్ ఇన్స్పెక్షన్ పేరుతో తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బాటసింగారంలో గురువారం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలిస్తామన్నారు. ఈనెల 24న కలెక్టరేట్ల వద్ద, 25న ఇందిరాపార్కు వద్ద డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం ధర్నాలు చేస్తామన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో రూ.9 వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజాకోర్టులో నిలబెడతామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రగతిభవన్, సెక్రటేరియట్, కలెక్టరేట్లు, బీఆర్ఎస్ కార్యాలయాల నిర్మాణాలు పూర్తిచేశారుగానీ, పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో తప్ప 10 జిల్లాల్లో ఒక్క ఇల్లు కూడా లబ్దిదారులకు ఇవ్వలేదని ఆరోపించారు. తొమ్మిదేండ్లలో రాష్ట్ర వ్యాప్తంగా లబ్ది దారులకు ఇచ్చిన ఇండ్లు 28వేలు మాత్రమేనన్నారు.

రైళ్లపై రాళ్లదాడి..85 మంది అరెస్ట్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఈ ఏడాదిలో పలు రైళ్లపై రాళ్లతో దాడి చేసిన 85 మందిని అరెస్టు చేసి, జైళ్లకు పంపినట్టు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) అధికారులు తెలిపారు. ఈ మేరకు బుధవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాళ్ల దాడుల నివారణ కోసం సున్నిత ప్రాంతాలను గుర్తించి, సమీప గ్రామాల ప్రజలు, యువకులకు అవగాహన కల్పించామన్నారు. రాళ్ళు రువ్విన ఘటనల్లో రైల్వే ఆస్తులు ధ్వంసం కావడంతో పాటు ప్రయాణీకులకు ప్రాణాపాయం కలిగిందని తెలిపారు. రైల్వే ట్రాక్‌ల వెంట నిఘా కెమేరాలు, స్థానిక గూఢచారులను నియమించుకోవడంతో నేరస్తుల ఆచూకీ సులభంగా తెలిసిందని చెప్పారు. ఆకతాయి చర్యలకు ఎవరు పాల్పడినా, కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ హెచ్చరించారు.



శక్తివంతమైన భావోద్వేగాల సమాహారం

పవన్ కళ్యాణ్, సాయిధరమ్ తేజ్ కాంబినేషన్‌లో సముద్రఖని దర్శకత్వం వహించిన చిత్రం 'బ్రో'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వివేక్ కూచిబొట్ల సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. కేతిక శర్మ, ప్రియా ప్రకాష్ వారియర్ నటించిన ఈ సినిమా ఈనెల 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మీడియాతో ముచ్చటించారు..

పవర్‌స్టార్ రాకతో పెరిగిన సినిమా స్థాయి..

మేం ఒక మంచి ప్రాజెక్ట్ కోసం ఎదురు చూస్తున్న సమయంలో త్రివిక్రమ్ తమిళంలో 'వినోదయ సితం' చిత్రాన్ని చూసి తెలుగులో చేస్తే బాగుంటుందని సూచించారు. అలా ఈ 'బ్రో' ప్రాజెక్ట్ స్టార్ట్ అయ్యింది. మాతృకతో పోలిస్తే ఇది భారీగా ఉంటుంది. కథలోని ఆత్మ అలాగే ఉంటుంది. కానీ స్క్రీన్ ప్లే పరంగా, కమర్షియల్ ఎలిమెంట్స్ పరంగా కొత్తగా ఉంటుంది. బలమైన ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు, కమర్షియల్ ఎలిమెంట్స్ ఉంటాయి. సందేశం ఉంటుంది కానీ పూర్తి సందేశాత్మక చిత్రం కాదు. మాతృక చూసిన వారికి కూడా ఈ సినిమా కొత్త అనుభూతిని ఇస్తుంది. దర్శకుడు సముద్రఖని తమిళంలోనూ ఈ సినిమాని చాలా చక్కగా తీశారు. అయితే ఇక్కడ పవన్ కళ్యాణ్ రాకతో సినిమా స్థాయి ఎన్నో రెట్లు పెరిగింది. పవన్ కళ్యాణ్, సాయి తేజ్ పాత్రలు ప్రేక్షకులను హత్తుకుంటాయి.


టికెట్ రేట్లు పెంచే ఆలోచన లేదు

టికెట్ ధరలు పెంచే ఆలోచన లేదు. టికెట్ ధరలు పెంచాలని మేము రెండు రాష్ట్ర ప్రభుత్వాలని కోరలేదు. ఇప్పుడున్న ధరలతోనే విడుదల చేయాలనుకుంటున్నాం. అలాగే ప్రీమియర్ షోలు వేసే ఆలోచన కూడా ఇప్పటికి లేదు. అయితే అభిమానుల నుంచి ఒత్తిడి వస్తే చెప్పలేం. అప్పటి పరిస్థితులను బట్టి ప్రీమియర్ షోలపై నిర్ణయం తీసుకుంటాం. సినిమా అవుట్‌పుట్ పట్ల, బిజినెస్ పరంగా మేం చాలా సంతృప్తిగా ఉన్నాం. ఈ సినిమా మీద ఉన్న నమ్మకంతో మేమే సొంతంగా విడుదల చేయాలని ఓవర్సీస్ హక్కులను ఎవరికీ ఇవ్వలేదు.

చిరంజీవితో సినిమా చేయాలనేది డ్రీమ్


వేగంగా వంద సినిమాలు నిర్మించాలనేది మా లక్ష్యం. 'బ్రో' అనేది మా 25వ సినిమా. ప్రస్తుతం 15-20 సినిమాలు నిర్మాణ దశలో ఉన్నాయి. అలాగే ఓటీటీ సినిమాలు కూడా చేయబోతున్నాం. బాలీవుడ్‌లోనూ సినిమాలు చేసే ఆలోచనలు ఉన్నాయి. త్వరలోనే ముంబైలో ఆఫీస్ ఓపెన్ చేయాలని అనుకుంటున్నాం. ప్రభాస్ లాంటి స్టార్‌తో సినిమా చేస్తున్నప్పటికీ ఇంతవరకు ఎందుకు అధికారికంగా ప్రకటించలేదని చాలా మంది అడుగుతున్నారు. ప్రతి సినిమాకి ఒక స్ట్రాటజీ ఉంటుంది. టైం వచ్చినప్పుడు వాటి గురించి ఖచ్చితంగా చెప్తాం. మా సంస్థలో అందరి హీరోలతో సినిమాలు చేయాలని ఉంది. ఆ దిశగానే అడుగులు సాగుతున్నాయి. అయితే నా డ్రీమ్ హీరో మాత్రం చిరంజీవి. చిన్నప్పటి నుంచి నేను ఆయనకు వీరాభిమానిని. ఆయనతో సినిమా చేయడం నాకు ప్రత్యేకంగా ఉంటుంది.

మిథునం కథా రచయిత శ్రీరమణ ఇకలేరు



ప్రముఖ కథకుడు, రచయిత, జర్నలిస్ట్ శ్రీరమణ (కామరాజ రామారావు) (71) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం తెల్లవారు జామున 5 గంటలకు హైదరాబాద్‌లోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. పేరడీ రచనలు, వ్యంగ్య హాస్య భరితమైన కాలమిస్టుగా, కథకుడిగా, సాహిత్య, కళా రంగాల్లో శ్రీరమణకి మంచి పేరుంది.

ఎస్.పి బాలసుబ్రమణ్యం, లక్ష్మి నటించిన 'మిథునం' చిత్రానికి శ్రీ రమణ కథ అందించారు. విశేష ప్రేక్షకాదరణ పొందిన ఈ సినిమాతో రచయితగా శ్రీరమణ, దర్శకుడిగా తనికెళ్ళభరణికి మంచి పేరు లభించింది. బాపు, రమణ వంటి పలువురు ప్రముఖులతో పనిచేసిన శ్రీ రమణ పేరు సాహితీ ప్రపంచంలో విననివారు ఉండరంటే అతిశయోక్తి కాదు. పేరడీలు, శ్రీకాలమ్, శ్రీఛానెల్, చిలకల పందిరి, హాస్యజ్యోతి, మొగలిరేకులు వంటి తదితర ఎన్నో శీర్షికలతో పాటు పలు పుస్తక రచనలతో పాఠకులను అలరించారు. అలాగే ఆంధ్రజ్యోతి నవ్య, సాక్షి. వంటి పలు పత్రికలకు పని చేశారు. శ్రీరమణ మృతి పట్ల సినీ, సాహితీ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.



ప్రభాస్ ఫ్యాన్స్‌కి సర్‌ప్రైజ్

సైన్స్ ఫిక్షన్ చిత్రం 'ప్రాజెక్ట్ కె' కోసం ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రేక్షకులను, ప్రభాస్ అభిమానులను వైజయంతీ మూవీస్ మరోసారి సర్‌ప్రైజ్ చేసింది.

మంగళ వారం దీపికాపదుకొనె లుక్‌ని రిలీజ్ చేసిన మేకర్స్ బుధవారం ప్రభాస్ లుక్‌ని విడుదల చేశారు. సెపియా టోన్డ్ క్యాప్టివేటింగ్ ఇమేజ్‌లో ప్రభాస్ పవర్ ఫుల్ ఫస్ట్ లుక్ అందర్నీ మెస్మరైజ్ చేస్తోంది. అద్భుతంగా రూపొందించిన ఫస్ట్ లుక్ విజువల్ ఈ చిత్ర అత్యద్భుత నిర్మాణ విలువలకు నిదర్శనంగా నిలుస్తోంది.

'ప్రాజెక్ట్ కె' శాన్ డియాగో కామిక్-కాన్‌లోని ప్రతిష్టాత్మకమైన హెచ్ హాల్‌లో లాంచ్ అవ్వడానికి సిద్ధంగా ఉంది. ఈ మహత్తరమైన ఈవెంట్‌లో క్రియేటర్‌లు సినిమా టైటిల్, టీజర్‌ను రివీల్ చేయ బోతున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపికా పదుకొణె, దిశా పటానీ వంటి హేమా హేమీలు నటిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ఈ పాన్ ఇండియా చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేస్తున్నారు.

నవచిత్రం

లియోతో పంపిణీ రంగంలోకి ఎంట్రీ



వైవిధ్యభరిత, ఆసక్తికర చిత్రాలను నిర్మిస్తూ ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ టాలీవుడ్‌లో ఓ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుంది. ఇటీవల ధనుష్ 'సార్' (వాతి)తో తమిళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి అక్కడ కూడా విజయవంతమైన సంస్థగా పేరు తెచ్చుకుంది. ఇక తాజాగా విజయ్, దర్శకుడు లోకేష్ కనగరాజ్ కలయికలో భారీ అంచనాలతో రూపొందుతున్న 'లియో'లో భాగస్వామి కాబోతోంది.

ఈ చిత్రంతో పంపిణీ రంగంలోకి అడుగు పెడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. విజయ్, త్రిష కృష్ణన్, అర్జున్ సర్జా, సంజయ్ దత్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ యాక్షన్ ఎపిక్‌లో గౌతమ్ వాసుదేవ్ మీనన్, మిస్కిన్ వంటి ప్రముఖ దర్శకులు కూడా నటిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 19న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో తమ సంస్థ ద్వారా ఇలాంటి క్రేజీ భారీ చిత్రాన్ని గ్రాండ్‌గా రెండు తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేస్తున్నందుకు సంతోషంగా ఉందని, ఇది తమ సంస్థకు మరింత పేరు తెస్తుందని అధినేతలు నమ్మకం వ్యక్తం చేశారు.

భారత్, విండీస్ వంద సవాల్



భారత్, విండీస్ 'వంద' సమరానికి సిద్ధమయ్యాయి. 1948లో మొదలైన ఇరు జట్ల టెస్టు సవాల్.. 2023లో వంద సవాల్‌కు చేరుకుంది. మైలురాయి మ్యాచ్‌లో పుంజుకుని సిరీస్ సమం చేయాలని కరీబియన్లు, వంద టెస్టులో మరో ఏకపక్ష విజయం సాధించి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని టీమ్ ఇండియా భావిస్తున్నాయి. సిరీస్‌తో పాటు విలువైన డబ్ల్యూటీసీ పాయింట్లపై కన్నేసిన రోహిత్ సేన నేడు క్వీన్స్‌పార్క్‌లో ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. భారత్, వెస్టిండీస్ రెండో టెస్టు నేటి ఆరంభం.

- క్వీన్స్ పార్క్‌లో ఇరు జట్ల మైలురాయి టెస్టు
- క్లీన్‌స్వీప్‌పై భారత్, సమంపై విండీస్ గురి

- నేటి నుంచి రెండో టెస్టు పోరు
- రాత్రి 7.30 నుంచి డిడి స్పోర్ట్స్‌లో

నవతెలంగాణ-పోర్ట్ ఆఫ్ స్పెయిన్

చారిత్రక వందో టెస్టుకు రంగం సిద్ధం. డొమినికాలో స్పిన్ మాయ నడువగా.. క్వీన్స్‌పార్క్‌లో పూర్తిగా పేస్ హవా కనిపించనుంది. క్వీన్స్‌పార్క్ మైదానంలో భారత్, వెస్టిండీస్ ముఖాముఖి వందో టెస్టుకు సిద్ధమవగా.. బ్యాటింగ్ మాంత్రికుడు విరాట్ కోహ్లి కెరీర్ 500వ మ్యాచ్‌కు సన్నద్ధమవుతున్నాడు. మూడు ఫార్మాట్లలో కలిపి విరాట్ కోహ్లికి ఇది 500వ మ్యాచ్ కానుంది. దీంతో కోహ్లి స్పెషల్ మ్యాచ్‌లో ప్రత్యేక ప్రదర్శన చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు. తొలి టెస్టులో తేలిపోయిన కరీబియన్లు రెండో టెస్టులోనైనా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాలని భావిస్తుంది. పేస్‌కు అనుకూలించే పిచ్‌పై టెస్టు మ్యాచ్ మూడు రోజుల్లోనే ముగుస్తుందా? ఐదు రోజుల పోటీ కనిపిస్తుందా? ఆసక్తికరం.

100 భారత్, వెస్టిండీస్‌కు టెస్టుల్లో ఇది 100వ ముఖాముఖి పోరు. కరీబియన్లు 30, టీం ఇండియా 23 టెస్టుల్లో నెగ్గగా.. 46 మ్యాచులు డ్రాగా ముగిశాయి.

కోహ్లిపైనే ఫోకస్

భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి కెరీర్ 500వ మ్యాచ్ ఆడనున్నాడు. దీంతో నేటి టెస్టులో ఫోకస్ మొత్తం కోహ్లిపైనే నెలకొంది. డొమినికాలో అర్థ సెంచరీ సాధించిన కోహ్లి.. మరీ నెమ్మదిగా ఆడాడు. మరి క్వీన్స్‌పార్క్‌లో ఎప్పటి నుంచో ఊరిస్తున్న శతకాన్ని పూరిస్తాడేమో చూడాలి. యువ బ్యాటర్లు శుభ్‌మన్ గిల్, ఇషాన్ కిషన్‌లకు తొలి టెస్టులో మెరిసే అవకాశం రాలేదు. ఈ ఇద్దరు బ్యాటర్లు క్రీజులో నిలవాలని జట్టు మేనేజ్‌మెంట్ కోరుకుంటుంది. అవసరమైతే కిషన్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు పంపించినా ఆశ్చర్యం లేదు. విండీస్ టూర్ ముగిసిన ఐదు నెలల తర్వాత భారత్ మరో టెస్టు ఆడనుంది. దక్షిణాఫ్రికా పర్యటన రేసులో నిలవాలంటే అజింక్య రహానె ఓ మంచి ఇన్నింగ్స్ ఆడాల్సిన అవసరం ఉంది. లేదంటే, సఫారీ పర్యటనకు రహానెకు చోటు కష్టమే!. స్పిన్‌కు అనుకూలించిన పిచ్‌పై అశ్విన్, జడేజా మాయ చేయగా.. ఇప్పుడు రెండో టెస్టులో పేసర్ల వంతు. మహ్మద్ సిరాజ్, జైదేవ్ ఉనద్కత్, శార్దుల్ ఠాకూర్‌లపై వికెట్ల వేట బాధ్యత ఉండనుంది. ఈ సవాల్‌ను పేసర్లు ఏ మేరకు తీసుకుంటారో చూడాలి.

గట్టి పోటీ ఇవ్వాలని..

తొలి టెస్టులో తేలిపోయిన ఆతిథ్య వెస్టిండీస్.. వైట్‌వాష్ ప్రమాదంలో పడింది. భారత స్పిన్నర్లను విండీస్ బ్యాటర్లు ఎదుర్కొలేకపోయారు. విండీస్ స్పిన్నర్లు భారత బ్యాటర్లకు సవాల్ విసరలేకపోయారు. అయితే క్వీన్స్‌పార్క్ పేస్ స్వర్గధామం కావటం.. విండీస్‌కు అనుభవజ్ఞులైన పేసర్లు ఉండటంతో రెండో టెస్టులో గట్టి పోటీ ఇచ్చేందుకు ఎదురు చూస్తుంది. యువ బ్యాటర్ అలిక్ అతానెజ్ తొలి



టెస్టులో రాణించాడు. కఠిన పరిస్థితుల్లో 47, 28 పరుగుల ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. చివరి టెస్టులో అతానెజ్ విండీస్ బ్యాటింగ్‌కు సారథ్యం వహించనున్నాడు. బ్రాత్‌వేట్, చందర్‌పాల్, బ్లాక్‌వుడ్, కిర్క్ మెకెంజె, హోల్డర్ సైతం అంచనాల మేరకు రాణిస్తే కరీబియన్లు గట్టి పోటీ ఇవ్వగలరు.

తుది జట్లు (అంచనా) :

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, అజింక్య రహానె, రవీంద్ర జడేజా, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, శార్దుల్ ఠాకూర్, జైదేవ్ ఉనద్కత్, మహ్మద్ సిరాజ్.

వెస్టిండీస్ : క్రెయిగ్ బ్రాత్‌వేట్ (కెప్టెన్), చందర్‌పాల్, అలిక్ అతానెజ్, జెర్మైన్ బ్లాక్‌వుడ్, కిర్క్ మెకెంజె, జేసన్ హోల్డర్, జోషువ డ సిల్వ (వికెట్ కీపర్), రహీం కార్న్‌వాల్/కెవిన్, అల్జారీ జోసెఫ్, కీమర్ రోచ్, షానన్ గాబ్రియల్.

500 విరాట్ కోహ్లికి ఇది కెరీర్ 500వ మ్యాచ్ కానుంది. కోహ్లి 110 టెస్టులు, 274 వన్డేలు, 115 టీ20ల్లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించాడు. కెరీర్ ఐదొందల మ్యాచ్‌ను నేడు విండీస్‌పై ఆడనున్నాడు.

21 భారత్‌పై వెస్టిండీస్ ఓ టెస్టు విజయం సాధించి 21 ఏండ్లు అవుతోంది. చివరగా 2002లో కరీబియన్లు భారత్‌పై టెస్టులో నెగ్గారు. ఆ తర్వాత ఇరు జట్లు 24 టెస్టుల్లో తలపడగా భారత్ 15 విజయాలు సాధించింది. 9 టెస్టులు డ్రాగా ముగిశాయి.

ఆటలు

భారత్, పాక్ ఢీ సెప్టెంబర్ 2న

- ఆసియా కప్ 2023 షెడ్యూల్ విడుదల



ముంబయి : ఆసియా కప్ షెడ్యూల్ ఖరారు. భారత్, పాకిస్థాన్ సెప్టెంబర్ 2న కాండీలోని పల్లెకల్ స్టేడియంలో తలపడనున్నాయి. సూపర్-4 దశలో సెప్టెంబర్ 10న మరోసారి దాయాదులు ఢీకొట్టనున్నాయి. ఆగస్టు 30న ముల్తాన్ (పాక్)లో పాక్, నేపాల్ మ్యాచ్ ఆసియా కప్ ఆరంభం కానుంది. ఆరు జట్లు పోటీపడుతున్న 13 మ్యాచుల రీజినల్ ఈవెంట్ సెప్టెంబర్ 17న కొలంబోలో ఫైనల్‌తో ముగియనుంది. గ్రూప్ దశలో భారత్, నేపాల్ మ్యాచ్ కాండీలోనే సెప్టెంబర్ 4న జరుగనుంది. సూపర్-4లో భారత్ సెప్టెంబర్ 12, 15న మిగతా మ్యాచులు ఆడనుంది. ఈ మేరకు ఆసియా క్రికెట్ కౌన్సిల్ ప్రెసిడెంట్ జై షా బుధవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు.

కోచ్ మారినా..ఓటమే!

- తొలి రౌండ్లోనే సింధు పరాజయం
- ప్రణయ్, ప్రియాన్షు ముందంజ
- కొరియా ఓపెన్ బ్యాడ్మింటన్



యోషు (కొరియా) : ప్రపంచ ర్యాంకింగ్స్‌లో పదేండ్ల కనిష్టానికి చేరుకున్న భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి షట్లర్ పి.వి సింధు.. కోచ్‌ను మార్చినా ఆట మెరుగుపడలేదు!. కొరియా ఓపెన్ తొలి రౌండ్లోనే పరాజయం పాలైన సింధు..చైనీస్ తైపీ షట్లర్ చేతిలో 1-2తో ఓటమి చెందింది. మహిళల సింగిల్స్‌లో పై యు పో (చైనీస్ తైపీ) చేతిలో 18-21, 21-10, 13-21తో మూడు గేముల మ్యాచ్‌లో నిరాశపరిచింది. వ్యక్తిగత కోచ్ హఫీజ్ శిక్షణ సారథ్యంలో పోటీపడిన తొలి టోర్నీలోనే సింధు పేలవ ప్రదర్శన చేసింది. మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్ 12-21, 17-21తో, తాన్య హేమంత్ 11-21, 17-21తో, అష్మిత చాలిహ 13-21, 12-21తో, మాళవిక బాన్సోద్ 17-21, 7-21తో, తస్నిం మిర్ 11-21, 18-21తో వరుస గేముల్లో పరాయం పాలయ్యారు. మహిళల సింగిల్స్‌లో తొలి రౌండ్లోనే భారత షట్లర్లు కంగుతినగా.. ఈ విభాగంలో పతక ఆశలు ఆవిరయ్యాయి.

పురుషుల సింగిల్స్‌లో హెచ్.ఎస్ ప్రణయ్, ప్రియాన్షు రజావత్ ముందంజ వేశారు. బెల్జియం షట్లర్ జులియన్‌పై 21-13, 21-17తో ప్రణయ్ వరుస గేముల్లో అలవోక విజయం సాధించాడు. కొరియా షట్లర్ చో జి హూన్‌పై 21-15, 21-19తో ప్రియాన్షు రజావత్ మెరిశాడు. మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్ మూడు గేముల పోరులో జపాన్ స్టార్ కెంటో మెమోటా చేతిలో ఓడాడు. 21-12, 22-24, 17-21తో హోరాహోరీ పోరులో శ్రీకాంత్ పోరాడి ఓడాడు. కిరణ్ జార్జ్ 17-21, 9-21తో, మిథున్ మంజునాథ్ 11-21, 4-21తో పరాజయం పాలయ్యారు. మెన్స్ డబుల్స్‌లో సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ 21-16, 21-14తో తొలి రౌండ్లో అలవోక విజయం సాధించింది. బల్గేరియా జోడీ వాకోవర్‌తో గాయత్రి, ట్రెసా జంట మహిళల డబుల్స్‌లో ముందంజ వేసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్, సిక్కి రెడ్డి 21-17, 21-17తో ఫిలిప్పిన్స్ జోడీపై వరుస గేముల్లో గెలుపొంది ప్రీ క్వార్టర్స్‌లో కాలుమోపారు.

తెలంగాణ సెయిలర్ల సత్తా

14వ మాన్‌సూన్ రెగట్టా



హైదరాబాద్ : 14వ మాన్‌సూన్ రెగట్టా పోటీల రెండో రోజు తెలంగాణ సెయిలర్లు సత్తా చాటారు. అండర్-19 ఇంటర్నేషనల్ 420 క్లాస్‌లో ధరణి, మల్లేశ్ జోడీ ముందంజలో నిలిచారు. అగ్రస్థానంలో నిలిచి 9 పాయింట్లు సాధించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన జోడీలు తర్వాతి రెండు స్థానాల్లో నిలిచారు. అండర్-15 ఆప్టిమిస్ట క్లాస్ గర్ల్స్‌లో దీక్షిత (తెలంగాణ) టాప్ లేపింది. షాగున్ ఝా (మధ్యప్రదేశ్), శ్రేయ కృష్ణ (తమిళనాడు) టాప్-3లో ఉన్నారు. అండర్-15 ఆప్టిమిస్ట్ క్లాస్ బాయ్స్‌లో ఏకలవ్య, శరణ్య యాదవ్, ఆకాశ్‌లు రాణించారు.

రొడ్రిగస్ ఆల్‌రౌండ్ షో

బంగ్లాపై భారత్ గెలుపు



మీర్పూర్ : జెమీమా రొడ్రిగస్ (86, 4/3) ఆల్‌రౌండ్ షోతో రెండో వన్డేలో బంగ్లాదేశ్‌పై భారత మహిళల జట్టు 108 పరుగుల తేడాతో గెలుపొందింది. హర్మన్‌ప్రీత్ (52), మంధాన (36), జెమీమా రాణించగా తొలుత భారత్ 228/8 పరుగులు చేసింది. ఛేదనలో బంగ్లాదేశ్ 35.1 ఓవర్లలో 120 పరుగులకే కుప్పకూలింది. ఓ దశలో 106/3తో గెలుపు దిశగా సాగిన బంగ్లాదేశ్.. జెమీమా మాయతో14 పరుగుల వ్యవధిలో చివరి ఏడు వికెట్లు చేజార్చుకుంది. నిర్ణయాత్మక మూడో వన్డే శనివారం జరుగనుంది.



తైక్వాండోలో పతకాల పంట : బ్యాంకాక్‌లో జరిగిన కెడిఎం ఇంటర్నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్స్‌లో హైదరాబాద్ క్రీడాకారులు సత్తా చాటారు. గ్రాండ్‌మాస్టర్ విజయ్ సోమ సారథ్యంలో పోటీపడిన జట్టు ఏకంగా 36 పతకాలు సాధించింది. ఇందులో ఏడు పసిడి, పది రజతం, 19 కాంస్య పతకాలు ఉన్నాయి. ప్రిశా పాగె, స్వాతి, మైత్రి రామనాథం, అశ్విక, ఆవిశ్ చౌదరి, మాహిర్ యశ్వంత్, సుబ్బారావు, వినోద్ చౌదరి, ఆదితి విజయ్ మల్టీపుల్ మెడల్స్ సాధించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

పునాది విద్యే భవితకు ప్రాణం

'దేశం కోసం సైన్స్'
'ప్రజల కోసం సైన్స్'
'శాంతి కోసం సైన్స్'

ఈ నినాదాలతో భారత జన విజ్ఞాన సమితి (బిజివిఎస్) 1987లో దేశవ్యాప్తంగా శాస్త్ర కళాజాత నిర్వహించింది. పాఠశాలలు, కళాశాలల్లో, బహిరంగ ప్రజానీకంలో కళారూపాలు ద్వారా శాస్త్ర విషయాలను ఆ సందర్భంగా ముమ్మర ప్రచారం గావించింది. కేరళ శాస్త్ర సాహిత్య పరిషత్ (కె.ఎస్.ఎస్.పి.) ఇందుకు తన విశేష అనుభవంతో ఈ మహత్తర ప్రచార ఉద్యమానికి పునాదిగా నిలిచింది. ఆ ఏడు అక్టోబరు 2న (గాంధీ జయంతి) దేశంలోని వివిధ మూలల నుండి ప్రారంభమైన ఈ ఐదు ప్రధాన కళాయాత్రలు భిన్న భాషల్లో వేలాది ప్రదర్శనలు ఇచ్చుకుంటూ లక్షలాదిగా ప్రజలను కలుసుకుంటూ నవంబర్ 14న (నెహ్రూ జయంతి) మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ నగరానికి చేరుకున్నారు. అక్కడ బహుళజాతి కంపెనీ యూనియన్ కార్బైడ్ అంతకుముందు చేసిన అమానుష దురాగతాన్ని (గ్యాస్ ట్రాజడీ-విషవాయువు లీకు) ఎండగడుతూ, ప్రజలకు సైన్సును చేరువ చేస్తామని అసంఖ్యాక మేధావులు, కళాకారులు ప్రతినబూనారు. హాజరైనవారికి ఆ ప్రతిజ్ఞ మరచిపోలేని ఓ ఉద్విగ్న జ్ఞాపకం. ఆ ఉత్సాహంతో 1988 ఫిబ్రవరి 28న ఆంధ్రప్రదేశ్ జన విజ్ఞాన వేదిక ఆవిర్భవించిన విషయం విదితమే.



ఈ శాస్త్ర విజ్ఞాన ఉద్యమం ఉత్ప్రేరకంగా బి.జి.వి.ఎస్. సారథ్యంలోనే 1990లో దేశవ్యాప్తంగా అక్షర కళాయాత్రలు నడిచాయి. కొనసాగింపుగా ఎన్నో రాష్ట్రాలు, జిల్లాల్లో, ప్రాంతాల్లో సాక్షరతా ఉద్యమాలు పురుడు పోసుకున్నాయి. రాత్రిబడులు, వయోజన కేంద్రాలు వెల్లువలా ఎక్కడికక్కడ విలసిల్లాయి. 9, 10 తరగతుల విద్యార్థులు కూడా తమ తల్లితండ్రులుకు, పెద్దలకు గురువులై విద్య గరిపిన అనుభవాలు కోకొల్లలు. చదువుకోవడానికి, వయసు పేదరికం అడ్డం కాదని తొంభై ఏండ్ల ముదిసలులు, నిరుపేద వ్యవసాయ కూలీలు సైతం చదువు నేర్చుకుని నిరూపించారు. కేరళ రాష్ట్రంలో సహా పలు జిల్లాలు, ప్రాంతాలు సంపూర్ణ అక్షరాస్యతను సాధించినట్టు అప్పుడు ప్రకటించుకోవడం గమనార్హం.



కె. శాంతారావు
9959745723

తకేవలం చదవడం, రాయడం, సంతకం పెట్టడం వేరు. నిత్య జీవితంలో ఆ చదువును ఉపయోగించుకుని ముందుకు అడుగిడటం వేరు. ఆయా ప్రభుత్వాలతో పాటు అనేక స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు, శక్తులు, ఈ సాక్షరతా మహోద్యమానికి నడుం కట్టాయి. ఆధునిక మానవుని మనుగడకు తిండి, బట్ట, వసతితో పాటు చదువుకూడా ఓ ప్రాథమిక అవసరమని ఐక్యరాజ్యసమితి కూడా ప్రకటించింది. విశేషం ఏమంటే ఆ 1990 సంవత్సరంలోనే మన దేశంలో అధ్వాని రథయాత్ర కూడా నడిచింది. బి.జి.వి.ఎస్. రాష్ట్ర అధ్యక్షులు బి.వి.ఆర్. విఠల్ అక్షర కళాయాత్ర ముగింపు సభలో మాట్లాడుతూ.... ఒక యాత్ర ప్రజలను చీల్చుకుంటూ పోతుంటే, మా యాత్ర చదువుకోసం ప్రజలను కలుపుకుంటూ నడిచిందని తెలిపారు. అన్యాపదేశంగా రథయాత్రను విమర్శించి కళాకారులను ఉత్తేజపరిచారు. ఈ మొత్తం ఉద్యమానికి మూలపురుషుడుగా నిలిచిన శాస్త్రవేత్త ఎం.పి. పరమేశ్వరన్ అనేక సందర్భాల్లో మాట్లాడుతూ... అట్టడుగు శ్రామికవర్గ, ప్రజానీకం, ముందు చదువు నేర్చుకుంటే, ఆ 'చదువు' తమ హక్కుల సాధన ఉద్యమానికి పునాదిగా నిలుస్తుందని చెప్పేవారు.

మూడు దశాబ్దాలు గడిచినా దేశంలో అక్షరాస్యత శాతం పెరుగుతున్నది గాని నాణ్యమైన విద్య (క్వాలిటీ ఎడ్యుకేషన్) నిత్యజీవితంలో ఉపయోగపడే సాక్షరతావిద్య (ఫంక్షనల్ లిటరసీ), అజ్ఞానంధకారాన్ని పారద్రోలే విజ్ఞాన విద్య (సైంటిఫిక్ ఎడ్యుకేషన్) ఇప్పటికీ విద్యార్థులకు అందటం లేదనేది యదార్థం. ఇందుకు పాలకుల విధానాలు ఓ ముఖ్యకారణం. అయితే, పెట్టుబడిదారి వ్యవస్థ అందించే విశృంఖుల అభివృద్ధి పరుగు వల మరో ముఖ్యకారణం. అవధులులేని ఈ అభివృద్ధి పరుగు ప్రకృతిని విషతుల్యం చేస్తున్నది. ఏ విలువలు ఏ ప్రమాణాలు పాటించని వ్యక్తిగత స్వార్థం, భోగలాల సత్యంను విద్యార్థులకు నేర్పుతున్నది.

'అమ్మ... ఆకలి అవుతున్నది అన్నం పెట్టు.' ఎక్కువగా ఉపయోగించే ఈ వ్యాక్యాన్ని సైతం తప్పులు లేకుండా నూటికి పదిమంది ఉన్నత పాఠశాల విద్యార్థులు రాయలేకపోతున్నారు. మాటకు రాతకు సంబంధం తెగిపోయింది. పిల్లలకు సరైన పునాది విద్య (ఫౌండేషన్ లిటరసీ)ను గరపలేకపోతున్నామని చాలామంది ఉపాధ్యాయులు, తల్లి తండ్రులు కూడా బాధపడటం లేదు. చాపకింద నీరులా ఈ విపరిణామం జరిగిపోతున్నది. డిగ్రీలు, పోస్టుగ్రాడ్యుయేషన్, ఇంజనీరింగ్ పట్టాలు మాత్రం విద్యార్థులకు లభిస్తున్నాయి కానీ ఈ పునాది విద్య ఉండదు. తెలుగులో వచ్చిన వస్తున్న అసంఖ్యాక, అమూల్య సాహితీ సంపదంతా వారికి వ్యర్థం. భాష తెలిస్తేగదా సాహితీ మాధుర్యం తెలిసేది. పొడిపొడిగా వాగడం, పేలవంగా మాట్లాడుతూ పరిమితంగా జీవితాన్ని నెట్టుకుంటూ వచ్చేస్తున్నారు. చేసేపని (వృత్తి) వేరు - జీవితం వేరు అన్న విధంగా పరిస్థితి దాపురించింది.

ఈ నేపథ్యంలో ఇందుకు విరుగుడుగా కొన్ని సంస్థలు, వ్యక్తులు కృషిచేయడం అభినందనీయం. అవశ్యం. పిల్లలకు పునాది విద్యనే నేర్పడమే పనిగా పెట్టుకుని ట్యూషన్ సెంటర్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. చిన్నప్పటి నుండే చదవను, రాయను ఆసక్తిగా, ఆకర్షణగా చేయడం పట్ల రకరకాల బోధనా ప్రయోగాలు చేస్తున్నారు. కథలను చదివిస్తున్నారు. రాయిస్తున్నారు. బొమ్మల కథల పుస్తకాలను జట్టుగా కూర్చోపెట్టుకుని చదవడం, చదివించడం, బొమ్మలతో కథలు చెప్పిడం, చెప్పించడం, అసంపూర్ణంగా కథలు వదిలి పూరించమనడం, కథలను రాయించడం, కథలను నాటికలుగా మలచి అభినయించడం చేయిస్తున్నారు. తద్వారా పుస్తకాలతో స్నేహం చేయడం, చదవడాన్ని, రాయడాన్ని ప్రేమించడం, అభ్యసించడం, జీవన మాధుర్యాన్ని తమదైన శైలిలో అనుభవించడం, అభివ్యక్తీకరించడం సాధ్యమయ్యేలా కృషి చేస్తున్నారు. ట్యూషన్ సెంటర్స్‌తో పాటు లైబ్రరీ సెంటర్స్ (గ్రంథాలయ పఠన కేంద్రాలు) ఎక్కడబడితే అక్కడ నెలకొల్పి తోడ్పడాలనే ఉత్సుకతను చూపిస్తున్నారు. మురికివాడలు నుండి అపార్ట్‌మెంట్స్ వరకు ఈ కేంద్రాలు అంకురిస్తున్నాయి. గతంలో అక్షరాస్యతా ఉద్యమంలాగనే ఈ పునాది విద్య ఉద్యమంలా ఏర్పడేందుకు పరిస్థితి డిమాండ్ చేస్తున్నది. అక్షరాస్యతా ఉద్యమంలో ఎక్కడికక్కడ వాలంటీర్స్ ఉద్భవించినట్లే, ఇప్పుడుకూడా ఈ ఉద్యమానికి రిటైర్ వ్యక్తులు, చదువుకున్న గృహిణులు, సాహితీపరులు ముందుకు రావడం ముదావహం. ఆ అక్షరాస్యతా ఉద్యమంలో చదువురాని నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పితే, ఈ ఉద్యమంలో చదువుకుంటున్న, చదువుకున్న వారికి పునాది విద్యను నేర్పవలసిన బాధ్యత ఎర్పడింది. ఈ పునాది విద్యే ఉత్ప్రేరకంగా భవితకు ప్రాణం పోస్తుందనే విషయంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు.


అంతర్జాతీయంగా ద్రవ్యపెట్టుబడి ముదిరి వెర్రితలలు వేస్తూ, ఆధిపత్యం, అణచివేత, హింస, యుద్ధోన్మాదాలకు తెరతీస్తున్నది. ఫలితంగా ప్రజలు, కష్టజీవుల జీవితం కరిమింగిన వెలగపండులా డొల్లగా మారుతున్నది. ఇలాంటి నేపథ్యంలో పౌర సమాజానికి శాస్త్రీయ భావ (వర్గ) చైతన్యాన్ని నూరిపోయడమే ఏకైక మార్గమని రోజాలగ్జంబర్గ్ పేర్కొంటాడు. దట్టంగా పొరలు పొరలు పేరుకుపోతున్న అజ్ఞానాంధకారాన్ని తుత్తునియలు చేయడం అవశ్యమని చెప్పారు. 'ఏం జరుగుతున్నదో బిగ్గరగా చెప్పడమే ఎవరైనా ఎప్పుడైనా చేయగల అత్యంత విప్లవాత్మకమైన పని' అని ఉద్ఘాటిస్తారు.

'జీ హుజూర్'కు కాలం చెల్లింది..!

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) భారత స్వతంత్ర దర్యాప్తు సంస్థ. కానీ ఇటీవల అది స్వతంత్రతలేని దర్యాప్తు సంస్థగా మారిపోయింది. దర్యాప్తు సంస్థల్ని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయడం మన దేశంలో ఉన్నంతగా ఎక్కడా ఉండదేమో. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రత్యర్థి పార్టీలపై అస్త్రాలుగా ఈ స్వతంత్ర సంస్థల్ని వినియోగించుకోవడం ఆనవాయితీ అయిపోయింది. దీంతో అధికారంలో ఉన్నవారికి ఆ సంస్థలు జీ హుజూర్ అనాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. సిబిఐ కేసులతో కేంద్ర మాజీ హోంమంత్రి చిదంబరం జైలుకు వెళ్లారు. ఆయన్ను జైలుకు పంపించడంలో కీలకపాత్ర మాత్రం అమిత్ షాదే. తనను ఒకప్పుడు ఏ సంస్థతో అయితే చిదంబరం జైలుకు పంపించారో, ఇప్పుడు అదే సంస్థతో ఆయన్ను జైలుకు పంపించడంలో షా విజయవంతమయ్యారు. ఎవరు అధికారంలోకి వచ్చినా ఇదే ఒరవడి అనుసరిస్తున్నారు. దీన్ని కొత్తగా వచ్చిన సర్కార్ ఏదైనా మారుస్తుందేమోనని చూసినవారికి నిరాశే ఎదురవుతోంది. కాంగ్రెస్ ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని బీజేపీ అంతకన్నా ఎక్కువగానే రాష్ట్రాలపై ప్రయోగిస్తోంది. ఎందుకంటే ప్రత్యర్థుల ఆటకట్టించడానికి బ్రహ్మాండంగా అక్కరకొచ్చే ఈ బ్రహ్మాస్త్రాలను ఎవరైనా ఎందుకు వదులుకుంటారు? అందుకే బీజేపీ సైతం అదే బాటలో పయనిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీజేపీలో చేరినవారి కేసులకు సంబంధించి ఎలాంటి కష్టాలూ ఉండకపోవడమే ఇందుకు నిదర్శనం. పార్టీలో చేరక ముందు వరకు ఉన్న కేసులు కాషాయ కండువా కప్పుకోగానే పక్కకు వెళ్లిపోతున్నాయి. దీంతో తమ భద్రత దృష్ట్యా పలువురు బీజేపీ బాటపడుతున్నారు. ఇలా దర్యాప్తు సంస్థల బూచితోనే భారత్‌లో రాజకీయాలు కొనసాగుతున్నాయి



నాదెండ్ల శ్రీనివాస్
9676407140



అయితే ఇప్పుడు కేంద్రంలోని ఎన్‌డిఎ సర్కారుకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) డైరెక్టర్ సంజయ్ కుమార్ మిశ్రా పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం మూడోసారి పొడిగించడాన్ని దేశ సర్వోన్నత న్యాయస్థానం తప్పుపట్టింది. ఈ పదవీకాలం పొడిగింపు అక్రమ మంటూ మోడీ సర్కారుకు మొట్టికాయలు వేస్తూ జస్టిస్ బిఆర్ గౌరవ్, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం జులై11, మంగళవారం కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వును కొట్టిపారేసింది. అంతేగాకుండా ఈ నెల 31న సంజయ్ కుమార్ మిశ్రా ఈడీ డైరెక్టర్ పదవికి రాజీనామా చేయాలని కూడా కోర్టు ఆదేశించింది. ఈలోగా ఈడీ నూతన డైరెక్టర్ నియమకాన్ని పూర్తి చేయాలని కేంద్రానికి సూచించింది. దాంతో సంజయ్ మిశ్రా ఈనెలాఖరుకు తన పదవికి రాజీనామా చేయాల్సిన అవసరం ఏర్పడింది. లేదంటే కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఈ ఏడాది నవంబర్ 18 వరకు సంజయ్ మిశ్రా ఈడీ డైరెక్టర్‌గా కొనసాగేవారు. ఈ తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి మరో విషయాన్ని కూడా స్పష్టం చేసింది. సిబిఐ, ఈడీ డైరెక్టర్‌ల నిర్ణాయక రెండేండ్ల పదవీకాలం పూర్తయ్యాక మరో మూడేళ్ల పాటు వారి పదవీకాలాలను పొడిగించేలా కేంద్ర ప్రభుత్వానికి అధికారాలను కట్టబెట్టిన చట్టాలకు సవరణలు జరిగిన విషయాన్ని సుప్రీంకోర్టు గుర్తు చేసింది.

అయితే ఈ తీర్పుపై కేంద్రహోంమంత్రి అమిత్ షా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఎవరన్నది ముఖ్యం కాదని, అక్కడ ఎవరున్నా వంశపారంపర్యంగా రాజ్యాలు ఏలుతున్నవారి అవినీతి కోటలను బద్దలుకొట్టి తీరుతారని చెప్పుకొచ్చారు. ఇప్పుడు మిశ్రా పోయినా, ఆ స్థానంలో వచ్చిన వారు మిమ్మల్ని వదిలి పెట్టరన్న హెచ్చరిక కూడా హోంమంత్రి మాటల్లో వినిపించింది. అయితే ఇక్కడ ఆలోచించాల్సిన విషయమేమంటే మిశ్రా కాకపోతే మరొకరు అని ఇంత సులువుగా తేల్చేసిన అమిత్ షా అదే మిశ్రాకు సుప్రీంకోర్టు కూడదన్నా సరే పొడిగింపులు ఇవ్వడం ఎందుకు? ఆయన కోసమే ఓ ఆర్డినెన్సు తేవడం ఎందుకు? అన్నదే అంతు చిక్కని ప్రశ్న. హోంమంత్రి ప్రవచించినట్టుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వ్యక్తికి అతీతమైన ఉన్నత వ్యవస్థే కావచ్చు కానీ, తమ ఆదేశాలను శిరసావహించే అస్మదీయులకు దానిని అప్పచెప్పినప్పుడే దాని ఔన్నత్యం దిగజారిపోయింది. ప్రభుత్వం అభ్యర్థన మేరకు, అధికారాల బదలాయింపు సవ్యంగా జరిగేందుకు సంజయ్ మిశ్రాను ఈ నెల చివరి వరకూ ఉండనిచ్చింది సుప్రీంకోర్టు. నవంబర్ వరకూ కొనసాగనివ్వాలన్న ప్రభుత్వ అభ్యర్థనకు సరేనంటే తన తీర్పుకే అర్థం లేకుండా పోతుంది.

వ్యక్తి కాదు వ్యవస్థ ముఖ్యం అని ఇప్పుడు హోంమంత్రి గొప్పగా మాట్లాడుతున్నారు కానీ, కేవలం ఈ వ్యక్తి కోసమే ఆయన ప్రభుత్వం అన్ని సంప్రదాయాలను, నిబంధనలను తుంగలో తొక్కింది. పైగా న్యాయవ్యవస్థను, పార్లమెంట్‌ను అవమానపరిచి అస్మదీయుడి పదవీకాలాన్ని తమకు నచ్చినంతకాలం పొడిగించుకున్నది కాక, ఇంకా ఉండాలంటూ న్యాయపోరాటాలు కూడా చేస్తోంది. అవినీతిని చీల్చి చెండాడుతున్న మిశ్రాను తప్పించడానికి అవినీతిపరులంతా ఏకమయ్యారని రాజకీయ వ్యాఖ్యలు చేస్తూ, ఆయనకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లన్నీ రాజకీయ ప్రేరేపితమైనవేనని న్యాయస్థానాల్లో వాదిస్తోంది. డైరెక్టర్‌గా రెండేండ్ల పదవీకాలం పూర్తయిన తరువాత ఆయనను వదిలి పెట్టి ఉంటే, వ్యక్తి కాదు వ్యవస్థ ముఖ్యం అన్న మాటలకు అర్థం ఉండేది. కానీ మరో ఏడాది పొడిగింపు కోసం 2018నాటి నియామక ఉత్తర్వులను మూడేండ్లకు వర్తించేలా వెనక్కుపోయి మరీ సవరించింది. సుప్రీంకోర్టు ఈ చర్యను కాదన కుండానే 2021 నవంబరు 17 తరువాత ఆయన ఆ పదవిలో కొనసాగకూడదని ఆదేశించింది. దీనికి విరుగుడుగా, పార్లమెంట్ శీతాకాల సమావేశాలు పట్టుమని 15రోజుల్లో ఉండగా, రెండు ఆర్డినెన్సులతో ఈడీ, సిబిఐ సంచాలకుల పదవీ కాలాన్ని ఐదేండ్లకు పెంచింది. దానితో పాటు ఏడాదికొకసారి చొప్పున మూడుసార్లు గడువు పొడిగించుకొనే వెసులుబాటు కూడా పాలకులకు కల్పించుకున్నారు. ప్రతిపక్ష నాయకులను ఎంతగా వేధిస్తే అన్ని పొడిగింపులు అందుకోవచ్చన్న సందేశం ఇందులో ఉన్నదని విపక్షాలు అప్పట్లోనే విమర్శించాయి. ఉద్యోగ కాలాన్ని పెంచడం దేశ శ్రేయస్సుకు ఉపకరించేదే అయితే ఆ సవరణలేవో పార్లమెంటులో చర్చించే చేయవచ్చు కదా? అసాధారణ పరిస్థితుల్లోనే ఆర్డినెన్సులు చేయాల్సిన పాలకులు మిశ్రాను నిలబెట్టుకోవడానికే దానిని వాడారన్నది వాస్తవం. ఆయన అధీనంలో రెండు వేలకు పైగా దాడులతో రూ.65వేల కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసి కొత్త సిబిఐగా అవతరించిన మాట నిజమే కానీ, అందులో విపక్షనేతలు, ఆయా పార్టీలతో అనుబంధం ఉన్న సంస్థలు ఎన్నో, బీజేపీ శ్రేయోభిలాషులు, అనుకూల కార్పొరేట్ సంస్థలు కూడా ఎన్నో లెక్క విప్పితే బాగుంటుంది.

ఇప్పటి వరకూ మనీలాండరింగ్ ఆయుధంతో ఈడీ అడుగు పెట్టని విపక్ష రాష్ట్రమంటూ దేశంలో ఏదీ మిగల్లేదు. 2021 తరువాత మిశ్రా కొనసాగింపు అక్రమం, చట్ట వ్యతిరేకమని సర్వోన్నత న్యాయస్థానం నిర్ధారించిన నేపథ్యంలో, అప్పటి నుంచి ఇప్పటి దాకా ఆయన తీసుకున్న నిర్ణయాలు కూడా అక్రమమే అవుతాయి కదా! మిశ్రా తీసుకున్న నిర్ణయాలపై స్వతంత్ర న్యాయవిచారణ జరపాలన్న డిమాండ్ రాజకీయపరమైనదే కావచ్చు కానీ, అర్థం లేనిదైతే కాదు. సివిసి చట్టంలో సవరణలను సుప్రీం కోర్టు సమర్థించిందని పాలకులు గుర్తుచేస్తున్నారు కానీ, ఆ సవరణల వెనుక ఒక వ్యక్తి కొనసాగింపు లక్ష్యం ఉన్న విషయం న్యాయస్థానానికి కూడా తెలుసు, శాసనం చేసుకొనే హక్కును అది కాదనలేక పోవచ్చు కానీ, ఆ వ్యక్తి కొనసాగింపును న్యాయస్థానం తప్పుబట్టడం కేంద్ర ప్రభుత్వానికి అవమాన కరమైనదే. న్యాయస్థానం తీర్పు మిశ్రాకు పరిమితమైన అంశమే కావచ్చు. కానీ, స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఆయా సంస్థలను యస్‌బాస్‌లతో నింపుతూ వాటిని ఆయుధాలుగా వాడుతు న్నారనడానికి మిశ్రా ఉదంతమే ఒక నిదర్శనం.

డిప్రెషన్‌కు గురయ్యా

- ఆత్మహత్య ఆలోచనలు వచ్చాయి
- బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులే కారణం
- మహిళా రెజ్లర్ ఆరోపణలు

న్యూఢిల్లీ : రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళల్లో ఒకరు తనకు ఎదురైన మానసిక వేదనను వెలిబుచ్చారు. తాను డిప్రెషన్‌తో బాధపడుతున్నాననీ, లైంగిక వేధింపుల కారణంగా ఆత్మహత్య ఆలోచనలు వచ్చాయని వివరించారు. బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై గత నెలలో దాఖలు చేసిన చార్జిషీట్‌లో మహిళ ఆరోపణలను పోలీసులు పేర్కొన్నారు. డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ ఐపీసీలోని సెక్షన్ 354, 354ఏ, 354డీ కింద శిక్షార్హుడని పోలీసులు చార్జీషీట్‌లో పేర్కొన్నారు. 1599 పేజీల చార్జిషీట్‌లో ఆరుగురు రెజ్లర్ ఫిర్యాదుదారుల వాంగ్మూలాలు ఉన్నాయి. బ్రిజ్‌భూషణ్ సింగ్ చర్యల కారణంగా తాను డిప్రెషన్‌లోకి వెళ్లి ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలో పడ్డానని వారిలో ఒక మహిళ చార్జిషీట్‌లో పేర్కొన్నది. బ్రిజ్‌భూషణ్ ను కలిసేందుకు నిరాకరించడంతో ప్రధాని మోడీని కలిసేందుకు వెళ్లిన అథ్లెట్ల జాబితా నుంచి తన పేరు తొలగించారని ఆ మహిళ ఆరోపించింది. మరో ఫిర్యాదుదారు 2009లో సింగ్‌తో "రాజీ" చేసుకోవడానికి నిరాకరించినందున రెజ్లింగ్ రంగానికి తిరిగి రాలేకపోయానని వివరించింది. 2021లో తన అడ్వాన్సులను తిరస్కరించిన తర్వాత బ్రిజ్‌భూషణ్ సింగ్ తన కెరీర్‌ను ముగించేస్తానని బెదిరించాడని మరో రెజ్లర్ ఆరోపించారు.

యూపీలో దారుణం

- దళిత బాలుడిపై అమానవీయ చర్య
- తీవ్రంగా కొట్టి.. మలాన్ని చేతితో తొలగించాలంటూ బలవంతం
- కేసు నమోదు చేసిన పోలీసులు

లక్నో : బీజేపీ పాలిత యూపీలో దళితులపై పెత్తందార్ల ఆగడాలు పెరిగిపోతున్నాయి. యోగి పాలనలో మహిళలతో పాటు దళితులకు రక్షణ ఉండటం లేదు. ఏదో ఒక విధంగా వారిపై దాడులు నిత్యకృత్యమవుతున్నాయి. తాజాగా ఒక దళిత బాలుడిపై దాడి జరిగింది. అంతే కాకుండా మలాన్ని చేతితో తీయాలంటూ ఆ బాలుడిని నిందితుడు బలవంతం చేయటం గమనార్హం. ఎటవా జిల్లా సైఫైలో ఈ ఘటన చోటు చేసుకున్నది. ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై దళిత సంఘాల నాయకులు, సామాజిక, ప్రజా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలకు వారు డిమాండ్ చేశారు.

పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు (15) 11వ తరగతి చదువుతున్నాడు. అయితే, ఉదయం జగ్రామ్ యాదవ్ వ్యవసాయ భూమిలో బహిర్భూమికి వెళ్లాడు. అయితే, ఇది గమనించిన జగ్రామ్ యాదవ్.. బాలుడిపై ఆగ్రహంతో ఊగిపోయాడు. బాలుడిని తీవ్రంగా కొట్టాడు. బాలుడి చేతితోనే అతని(బాలుడి) మలాన్ని తీసివేయించాడు. జిల్లాలోని ప్రసన్న పంచాయతీలో ఈనెల 13న ఈ ఘటన చోటు చేసుకున్నది. ఈ ఘటనపై బాధితుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జగ్రామ్ యాదవ్.. ఘటనకు దగ్గర పొలాల్లో పని చేస్తున్న తమ బంధువు ఈ దాడిని ఆపేందుకు యత్నించినందుకు ఆమెపై కూడా దాడికి పాల్పడ్డాడని బాలుడి తండ్రి తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు జిల్లా పోలీసు అధికారి తెలిపారు. జగ్రామ్ యాదవ్ పరారీలో ఉన్నాడనీ, అతనిని అరెస్టు చేయడానికి పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారని చెప్పారు. అయితే, జగ్రామ్ యాదవ్.. కోర్టులో సరెండర్ అప్లికేషన్‌ను దాఖలు చేయటం గమనార్హం.

మణిపూర్ హింసాకాండను నియంత్రించండి

- ప్రజల బాధాకరమైన పరిస్థితుల పరిష్కారానికి తక్షణ చర్యలు అవసరం
- కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కోరిన ఎన్ఎఫ్ఐడబ్ల్యూ



న్యూఢిల్లీ: మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండపై నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాసింది. మణిపూర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను తీర్చేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరింది. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జనరల్ సెక్రెటరీ అన్నీ రాజా, జాతీయ కార్యదర్శి నిషా సిద్ధూలు అమిత్ షాకు రాసిన లేఖపై సంతకం చేశారు. మణిపూర్‌లో రెండు వర్గాల మధ్య మే 3న చెలరేగిన జాతి హింస తీవ్ర అల్లర్లకు కారణమైన విషయం విదితమే. ఈ హింసలో వేలాది మంది నిరాశ్రయులు కాగా, 140 మందికి పైగా మరణించారు.మణిపూర్‌ను చుట్టుముట్టిన హింస ఆ రాష్ట్ర ప్రజలకు అపారమైన బాధను కలిగించిందని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ పేర్కొన్నది. రాష్ట్రవ్యాప్తంగా మే మొదటి వారం నుంచి అనేక మార్చురీలలో క్లెయిమ్ చేయని అనేక కుళ్ళిపోతున్న మతదేహాల బాధాకరమైన పరిస్థితిని లేఖ ఎత్తిచూపింది. మణిపూర్ సంక్షోభం నుంచి ఉత్పన్నమయ్యే అత్యవసర విషయాలను పరిష్కరించడానికి అమిత్ షా తక్షణమే జోక్యం చేసుకోవాలని మహిళా సంస్థ విజ్ఞప్తి చేసింది. గుర్తుతెలియని మృతదేహాలతో సహా అన్నిటికీ పోస్ట్‌మార్టం నిర్వహించేందుకు ప్రముఖ వైద్య సంస్థకు చెందిన స్వతంత్ర ఫోరెన్సిక్ నిపుణుడి నేతృత్వంలో మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని సంస్థ నొక్కి చెప్పింది.చనిపోయినట్టు భయపడుతున్న తప్పిపోయిన వ్యక్తుల కుటుంబాలను సంప్రదించగలిగే అధికారిని నియమించాలని లేఖలో హోం మంత్రికి విజ్ఞప్తి చేశారు. మతుల కుటుంబాలను మణిపూర్‌కు సురక్షితంగా తరలించాలని సదరు సంస్థ కోరింది. కేంద్ర హోం మంత్రి నుంచి సానుకూల స్పందన వస్తుందనే ఆశాభావాన్ని మహిళా సంస్థ వ్యక్తం చేసింది. హింస చెలరేగడం రాష్ట్ర సామూహిక స్పృహపై తీవ్ర ప్రభావాన్ని చూపిందనీ, మణిపూర్ ప్రజలు ఎదుర్కొంటున్న బాధాకరమైన పరిస్థితులను పరిష్కరించడానికి తక్షణ చర్యలు అవసరమని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ వివరించింది.

ఢిల్లీ ఆర్డినెన్స్ అహంకారపూరితం

బీఆర్ఎస్ నేత కేశవరావు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ వ్యవహారాల్లో ఎవరికి అధికారం ఉండాలనే దానిపై ఐదుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ధర్మాసనం ఇచ్చిన తీర్పును కాదని కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావడం అహంకారపూరితమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేశవరావు అన్నారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

న్యాయమూర్తుల కంటే తమకే ఎక్కువ తెలుసు అనే ధోరణిలో కేంద్ర ప్రభు త్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఢిల్లీ విషయం లో మా అభిప్రాయం ఇది మీరు ఏమంటారని ప్రతి పక్షాల అభిప్రాయాలు తీసుకొని ఉంటే బాగుండే దన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్‌కు అధికారాలు కట్ట బెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని, తమిళనాడు గవర్నర్ ఓ మంత్రిని తొలగించిన తీరుపై కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ప్రశ్నించినట్లు తెలిపారు. ప్రతిపక్షాలు ఓ అంశాన్ని లేవనెత్తినప్పుడు దానికి సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే నన్నారు. తన పార్లమెంటరీ జీవితంలో అధికార పార్టీ యే ఆందోళనలు చేయడం ఈ ప్రభుత్వ హయాం లోనే చూస్తున్నానని పేర్కొన్నారు. ప్రధానమంత్రి మణిపూర్ విషయంపై మాట్లాడితే బాగుంటుందని అన్నారు. బెంగళూరులో ప్రతిపక్ష పార్టీల సమావేశానికి వెళ్లలేదంటే తాము బీజేపీతో ఉన్నట్లు కాదన్నారు. ఇండియా కూటమిలో ఉంటే బీజేపీకి వ్యతిరేకమని, లేకుంటే బీజేపీకి మిత్రులనేది ఏం లేదన్నారు. 26 పార్టీలు ఓ వైపు, 38 పార్టీలు మరో వైపు అనే లెక్కలు సరికాదని, సిద్ధాంతపరంగా ఎవరు ఎటు అనేది చూడాలని అన్నారు. ప్రజల అవసరాలు, సమస్యల పరిష్కారం ప్రాతిపదికగా బీఆర్ఎస్ వెళుతుందన్నారు. "కూటములు విఫల ప్రయోగాలు అని గతంలోనే రుజువైంది. ఇప్పుడు కావల్సింది సిద్ధాంతాలు తప్ప,కూటములు కాదు. అదే సమయంలో భిన్నత్వంలో ఏకత్వమనే భారత రాజ్యాంగానికి అనుగుణంగా ఉన్న ఇండియా ముసాయిదాను స్వాగతిస్తున్నాం" అని ఆయన అన్నారు.

మణిపూర్‌పై ప్రధాని ప్రకటన చేయాలి :నామా నాగేశ్వరరావు

మణిపూర్ అంశంపై పార్లమెంట్‌లో చర్చించాలని, ప్రధానమంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేసినట్లు బీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత నామా నాగేశ్వరరావు అన్నారు. ప్రతిపక్ష ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్ల తీరుపై గతంలోనూ లేవనెత్తామని, ప్రస్తుతం ఈ విషయాన్ని సమావేశం ముందు ఉంచనున్నామని తెలిపారు.

ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు శాసనసభలో ఆమోదించిన బిల్లులను గవర్నర్లు అడ్డుకోవడం, తమిళనాడులో ఓ మంత్రిని గవర్నర్ తొలగించిన తీరుపై చర్చించాలని కోరినట్లు చెప్పారు. రైతులు ఆందోళన చేసినప్పుడు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) చట్టం చేస్తామని, వారిపై కేసులు మాఫీ చేస్తామని హామీ ఇచ్చినందున వాటిని నెరవేర్చాలని డిమాండ్ చేశామన్నారు.

నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, మహిళా రిజర్వేషన్ బిలు ఆమోదం, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు, కుల గణన చేపట్టాలని, రాష్ట్ర పునర్విభజన చట్టంలో తెలంగాణ కు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అఖిలపక్ష సమావేశంలో డిమాండ్ చేసినట్లు నామా తెలిపారు. రాష్ట్రానికి రావల్సిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరినట్లు ఆయన చెప్పారు.

ప్రభుత్వ భూముల్లో తాటి,ఈత,ఖర్జూర, గిరకతాటి చెట్లను పెంచాలి

- వాటికి నెంబరింగ్ వేయాలి
- నరికితే మూడేండ్ల జైలు శిక్ష
- టీసీఎస్, టీఎఫ్‌టీ కొత్త లైసెన్స్‌లు
- గీత కార్మికులకు చెట్టు ఎక్కేందుకు ఆధునిక సేఫ్టీ యంత్రాలు : అబ్కారీ శాఖ సమీక్షాసమావేశంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'కల్లు దుకాణాల తరలింపు, రద్దు చేసిన కల్లు దుకాణాల పునరుద్ధరణ అనేది క్షేత్ర స్థాయిలో జరిగేలా చర్యలు తీసుకోవాలి. గీత కార్మికులకు తాటి చెట్టు ఎక్కేందుకు ఆధునిక సేఫ్టీ యంత్రాలను అందించాలి. ప్రభుత్వ భూముల్లో తాటి, ఈత, ఖర్జూర, గిరకతాటి చెట్లను పెంచాలి. చెట్లకు నెంబరింగ్‌ను వేయాలి.వాటిని నరికితే మూడేండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు జరిమానా ఉంటుంది. టీసీఎస్, టీఎఫ్‌టీలకు సంబంధించిన కొత్త లైసెన్స్‌లు మంజూరు చేయాలి. మెజార్టీ సభ్యుల అంగీకారంతో టీఎఫ్‌టీని టీసీఎస్‌గా మార్చుకోవచ్చు' అని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లో సచివాలయంలోని తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో బుధవారం మంత్రి ఉన్నత స్థాయి సమీక్షాసమావేశం నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తాటి, ఈత, ఖర్జూర, గిరకతాటి చెట్లకు నెంబరింగ్‌ను ఆగష్టు31 వరకు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ చెట్లను నరికితే కఠిన చర్యలు తీసుకోవాలని, నరికినవారికి కనీసం మూడేండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు జరిమానా విధించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మెన్ గజ్జెల నగేష్, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ మమ్మద్ ముషారఫ్ ఫారూకి, అదనపు కమిషనర్ అజయ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : మంత్రి జగదీశ్‌రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వర్షాల వల్ల విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారంనాడాయన బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస ప్రాంగణంలో ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి సునీల్ శర్మ, టీఎస్‌ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ జీ రఘుమారెడ్డిలతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో విద్యుత్ నిర్వహణ, సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంతటి భారీ వర్షాలు సంభవించినా సరఫరా నిరంతరం కొనసాగేలా చూడాలని చెప్పారు. విద్యుత్ సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్రేక్ డౌన్ అయితే దాన్ని పునరుద్ధరించేందుకు అత్యవసర సిబ్బందిని, మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

భారత్‌కు ముద్దు...అమెరికాకు వద్దు

- వాషింగ్టన్ నిషేధ జాబితాలో ఇజ్రాయిల్ నిఘా సంస్థలు
- వాటికి ప్రెడేటర్ స్పైవేర్‌తో సంబంధాలు



వాషింగ్టన్ : భారత్ సహా పలు దేశాలలో రాజకీయ ప్రత్యర్థులు, విమర్శకులు, పాత్రికేయులకు సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని రాబట్టుకునేందుకు ఆయా ప్రభుత్వాలు స్పైవేర్‌ను ప్రయోగించడం కొత్తేమీ కాదు. తాజాగా ప్రెడేటర్ స్పైవేర్‌ను అభివృద్ధి చేసి విక్రయిస్తున్న రెండు ఇజ్రాయిల్ నిఘా సంస్థలను అమెరికా వాణిజ్య శాఖ మంగళవారం నిషేధిత జాబితాలో ఉంచింది. అయితే ఇదే ప్రెడేటర్ స్పైవేర్‌ను కొనుగోలు చేసేందుకు మోడీ ప్రభుత్వం ఆసక్తి చూపుతుండడం గమనార్హం. ప్రెడేటర్ అభివృద్ధి కోసం యూరప్ నుండి కార్యకలాపాలు సాగిస్తున్న ఈ రెండు సంస్థలు ప్రపంచవ్యాప్తంగా వ్యక్తులు, సంస్థల సమాచార గోప్యతకు, భద్రతకు ముప్పుగా పరిణమించాయని అమెరికా అభిప్రాయపడింది. తాజా నిషేధం ప్రకారం... గ్రీస్‌లోని ఇంటెలెక్సా, హంగరీలోని సైట్రాక్స్ కంపెనీలతో పాటు ఐర్లాండ్, ఉత్తర మసెడోనియా దేశాలలోని వాటి అనుబంధ సంస్థలు అమెరికా నుండి వస్తువులు, సేవల ఎగుమతి లైసెన్స్ కోసం దరఖాస్తు చేస్తే దానిని తిరస్కరిస్తారు. ఇంటెలిజెన్స్ సంస్థలకు, చట్టాలను అమలు చేసే సంస్థలకు వాణిజ్య స్పైవేర్‌ను విక్రయిస్తున్న కంపెనీలపై బైడెన్ ప్రభుత్వం వేటు వేస్తున్న విషయం తెలిసిందే. ఈ చర్యలలో భాగంగానే తాజా నిర్ణయం వెలువడింది. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ఎన్ఎస్ఓకు చెందిన పెగాసస్ స్పైవేర్‌కు ప్రత్యామ్నాయంగా ఇంటెలెక్సాకు చెందిన ప్రెడేటర్ స్పైవేర్‌ను కొనుగోలు చేసేందుకు భారత్ ఆసక్తి చూపుతోందని మార్చిలోనే వార్తలు వచ్చాయి. పెగాసస్ స్పైవేర్‌ను అమెరికా ప్రభుత్వం గతంలోనే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. ప్రెడేటర్ స్పైవేర్‌ను ఇజ్రాయిల్ సైన్యానికి చెందిన మాజీ సైనికాధికారులు అభివృద్ధి చేశారు.

అదే స్పైవేర్ కొనుగోలుకు భారత్ ఆసక్తి

అప్పుడు పెగాసస్...

పాత్రికేయులు, ప్రతిపక్ష నాయకులు, ప్రభుత్వ విమర్శకులు, హక్కుల కార్యకర్తలు వంటి ప్రముఖులను పెగాసస్ లక్ష్యంగా చేసుకుందని 2021లో వార్తలు వచ్చాయి. వారికి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని యావత్తూ ఆ స్పైవేర్‌లో పెగాసస్ నిక్షిప్తం చేసింది. దానిని కొన్ని ప్రభుత్వాలకు విక్రయించింది. అయితే ఏయే దేశాలకు అమ్మిందీ ఎన్ఎస్ఓ గ్రూపు బయటపెట్టలేదు. పెగాసస్ గూఢచర్యంపై పలు కథనాలు రావడంతో అమెరికా ప్రభుత్వం ఎన్ఎస్ఓ పైన, మరో ఇజ్రాయిల్ సంస్థ కాన్‌డిరూ పైన 2021 నవంబర్‌లో నిషేధం విధించింది. ఎన్ఎస్ఓ మాదిరిగానే ఇప్పుడు రెండు యూరోపియన్ సంస్థలు వ్యవస్థలో చొరబడి ప్రపంచ దేశాలలోని వ్యక్తులు, సంస్థలకు చెందిన సమాచారాన్ని చోరీ చేసి, వాటి భద్రతకు ముప్పు కలిగిస్తున్నాయని అమెరికా వాణిజ్య శాఖ తెలిపింది. ఈ సంస్థల కార్యకలాపాలు అమెరికా జాతీయ భద్రత, విదేశీ విధాన ప్రయోజనాలకు భంగకరంగా ఉన్నాయని వివరించింది.

2017లో కుదిరిన విస్తృత రక్షణ ఒప్పందంలో భాగంగా మన ప్రభుత్వం ఇజ్రాయిల్ నుండి పెగాసస్ స్పైవేర్‌ను కొనుగోలు చేసింది. అయితే దీనిపై దేశంలో రాజకీయ దుమారం రేగింది. ప్రత్యర్థులపై పెగాసస్‌ను ప్రయోగించడాన్ని మానవ హక్కుల సంఘాలు పసిగడతాయని, అలాగే బాధితులను యాపిల్, వాట్సప్‌లు సంప్రదించే అవకాశం ఉన్నదని మోడీ ప్రభుత్వంలోని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.

దుకాణాలు సర్దుకొని...

పెగాసస్‌ను అభివృద్ధి చేసినట్లుగానే ప్రెడేటర్‌ను కూడా ఇజ్రాయిల్ మాజీ సైనికాధికారులే అభివృద్ధి చేశారు. ప్రెడేటర్ స్పైవేర్‌ను కొనుగోలు చేసే విషయాన్ని మోడీ ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోంది. దీనిని సైట్రాక్స్ అభివృద్ధి చేయగా గ్రీస్ సంస్థ ఇంటెలెక్సా విక్రయించింది. ఈ రెండు సంస్థలకూ ఇజ్రాయిల్ దేశానికి చెందిన వేర్వేరు వ్యక్తులు యజమానులు. వీరిలో ఇజ్రాయిల్ సైనిక ఇంటెలిజెన్స్ సెలక్ట్ టెక్నాలజీ యూనిట్ కమాండర్ తాల్ దిలియన్ ఒకరు. ఎన్ఎస్ఓ, కాన్‌డిరూ సంస్థలను నిషిద్ధ జాబితాలో పెట్టడంతో సైబర్ గూఢచర్యానికి పాల్పడుతున్న పలు ఇతర సంస్థలు ఇజ్రాయిల్‌లో దుకాణాలు సర్దుకొని, వేరే ప్రాంతాలకు తరలిపోయి కార్యకలాపాలు ప్రారంభించాయి. అయితే ప్రస్తుతం నిషేధ జాబితాలో చేర్చిన రెండు కంపెనీలు మూట ముల్లె సర్దుకొని విదేశాలకు పోయినా అవి తమ గూఢచర్యాన్ని సజావుగా సాగించలేవని, అవి ఎక్కడ ఉన్నప్పటికీ అమెరికా వదిలిపెట్టదని అధికార వర్గాలు హెచ్చరించాయి.

2021లో వెలుగులోకి...

టొరంటో యూనివర్సిటీకి చెందిన సిటిజన్ ల్యాబ్ 2021 డిసెంబర్‌లో తొలిసారిగా ప్రెడేటర్ స్పైవేర్‌ను వెలుగులోకి తెచ్చింది. అప్పటి వరకూ దాని గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. ఈజిప్ట్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల పరికరాలలో ఈ స్పైవేర్ గూఢచర్య ఉపకరణాన్ని అమర్చిందని ల్యాబ్ గుర్తించింది. గ్రీకు ఇంటెలిజెన్స్ విభాగం పురమాయించినందుకే ప్రెడేటర్ స్పైవేర్ తన ఫోన్‌లోని సమాచారాన్ని తస్కరించిందని ఓ పాత్రికేయుడు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపారు. పాత్రికేయుడు చెప్పింది నిజమేనని గ్రీకు ఇంటెలిజెన్స్ విభాగం అధిపతి పార్లమెంటరీ కమిటీ ఎదుట అంగీకరించారు కూడా. పాత్రికేయులు, ప్రతిపక్ష సభ్యులకు వ్యతిరేకంగా స్పైవేర్‌ను ఎలా ఉపయో గిస్తున్నారంటూ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. అయితే గూఢచర్యం జరుగుతున్న విషయం ప్రభుత్వానికి తెలియదని ప్రధాని మిసోటకిస్ వివరణ ఇచ్చుకున్నారు. యూరోపియన్ యూనియన్ చట్టాలకు విరుద్ధంగా ఇజ్రాయిల్ సంస్థ ఈ స్పైవేర్‌ను ఇతర దేశాలకు అమ్ము కుంటోందని ఆరోపణలు వచ్చాయి.

సెన్సెక్స్ @67వేలు



- 20 వేల చేరువలో నిఫ్టీ
- పిఎస్‌బి షేర్ల మద్దతు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు కొనుగోళ్ల మద్దతుతో పరుగులు పెడుతున్నాయి. బిఎస్ఇ సెన్సెక్స్ చరిత్రలోనే తొలిసారి 67వేల మార్క్‌ను దాటింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 20వేల చేరువలో నమోదయ్యింది. లాభాల్లో సాగుతున్న అమెరికన్ మార్కెట్ల విశ్వాసంతో బుధవారం భారత మార్కెట్లలోనూ కొనుగోళ్ల జోరు చోటు చేసుకుంది. ప్రధానంగా ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల మద్దతుతో బిఎస్ఇ సెన్సెక్స్ 302 పాయింట్లు లేదా 0.45 శాతం పెరిగి 67,097కి చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 84 పాయింట్లు లేదా 0.42 శాతం లాభపడి 19,833 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఏకంగా ఈ సూచీలు ఏకంగా 67,171, 19,892కి చేరి మరో నూతన రికార్డ్‌ను సృష్టించాయి. నిఫ్టీలో ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల సూచీ 2 శాతం ర్యాలీ చేసింది. ఆ తర్వాత మీడియా ఒక్క శాతం పెరగ్గా, ఐటి సూచీ యథాతథంగా నమోదయ్యింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటిసి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్లకు డిమాండ్ నెలకొంది. డాలరుతో రూపాయి మారకం విలువ 82.09గా ఉంది. సెన్సెక్స్-30లో ఎన్‌టిపిసి, బజాజ్ ఫైనాన్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు టిసిఎస్, భారతీ ఎయిర్‌టెల్, మారుతి సుజుకి, హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

మెటా నుంచి ఓపెన్ సోర్స్ ఎఐ



వాషింగ్టన్ : కృత్రిమ మేధ (ఎఐ)పై అనేక మంది ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన పెంచుతున్న క్రమంలో ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా కూడా కొత్తగా ఓపెన్స్ సోర్స్ ఎఐని ఆవిష్కరించింది. దిగ్గజ ఐటి కంపెనీలన్నీ గత కొంతకాలంగా ఎఐ దృష్టి సారిస్తున్నాయి. తాజాగా మెటా కూడా ఈ రంగంలో విస్తరించడానికి సిద్ధం అయ్యింది. తామె కూడా ఓపెన్ సోర్స్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను ప్రారంభిస్తున్నట్లు మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ తెలిపారు. మైక్రోసాఫ్ట్ చాట్ జిపిటి, గూగుల్ బార్డ్ చాట్‌బాట్‌లకు పోటీగా మెటా దీన్ని తెచ్చింది. ఓపెన్ సోర్స్ ఎఐని ఉచితంగా అందించనున్నామని జుకర్‌బర్గ్ తెలిపారు.

వీడియోకాన్ ధూత్ ఖాతాల అటాచ్‌మెంట్



న్యూఢిల్లీ : ఐసిఐసిఐ బ్యాంక్ మాజీ సిఇఒ చందా కొచ్చర్‌తో క్విడ్‌ప్రోకోకు పాల్పడి.. వ్యాపారాలను దివాళాగా మార్చుకున్న వీడియోకాన్ వ్యవస్థాపకుడు వేణు గోపాల్ దూత్‌కు సెబీ భారీ షాక్ ఇచ్చింది. సెబీకి చెల్లించాల్సిన రూ.5.16 లక్షల జరిమానా బకాయిలను రాబట్టుకోవడానికి ఆయన బ్యాంక్, డీమాట్, మ్యూచువల్ ఫండ్ ఖాతాలను, లాకర్లను అటాచ్ చేస్తూ సెబీ ఆదేశాలు జారీ చేసింది. ఆయా ఖాతాల నుంచి ఎలాంటి లావాదేవీలకు అవకాశం కల్పించరాదని సంబంధిత బ్యాంక్‌లు, సంస్థలను ఆదేశించింది. పలు కంపెనీల్లో వేణు గోపాల్ దూత్‌కు ఉన్న పెట్టుబడులను వెల్లడించకుండా.. నిబంధనలు ఉల్లఘించిన కేసులో సెబీ రూ.5 లక్షల జరిమానా చెల్లించగా.. ఆ మొత్తాన్ని చెల్లించడంలో దూత్ విఫలమైనందున తాజాగా చర్యలు తీసుకుంది.

విదేశాల్లో ప్లేస్‌మెంట్ కోసం టామ్‌కామ్ ఆధ్వర్యంలో 21,22 తేదీల్లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

- సంప్రదించాల్సిన నెంబర్లు 9701732697/7893566493

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విదేశాల్లో ప్లేస్‌మెంట్ కోసం ఆయా రంగాల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) ఆధ్వర్యంలో పరిశ్రమల్లో ఉద్యోగ నియామకాలతో పాటు అప్రెంటీస్‌షిప్‌ను అందిస్తున్నదనీ, ఆసక్తి గలవారు దరఖాస్తు చేయించుకోవాలని టామ్‌కామ్ ఒక ప్రకటనలో కోరింది. జూలై 21, 22 తేదీల్లో హైదరాబాద్‌లోని మల్లేపల్లి ఐటీఐ కళాశాలలోని టామ్‌కామ్ కార్యాలయంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపింది. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ పూర్తయిగానీ, ఐటీఐ పూర్తి చేసిగాని ఉండాలని సూచించింది. అయితే, అభ్యర్థులు 28 ఏండ్ల వయస్సు లోపే ఉండాలని పేర్కొంది. మరిన్ని వివరాల కోసం www.tomcom.telangana.gov.inనిసందర్శించాలనీ, 9701732697/7893566493 నెంబర్లను సంప్రదించాలని సూచించింది.

వేంసూరు మండలానికి ప్రభుత్వ జూనియర్ కాలేజీ మంజూరు

- ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే ప్రవేశాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఖమ్మం జిల్లా వేంసూరు మండలంలోని కందుకూరు గ్రామానికి ప్రభుత్వ జూనియర్ కాలేజీని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. బండి సోమకాంతం పేరిట ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ కాలేజీకి భూమి, నిధులు, మౌలిక వసతుల కల్పన పూర్తిగా రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారధి రెడ్డి సమకూరుస్తారని పేర్కొన్నారు. ఆ కాలేజీలో 2023-24 విద్యాసంవత్సరం నుంచే ప్రవేశాలుంటాయని తెలిపారు. దీంతో రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల సంఖ్య 409కి చేరింది.

కర్నాటకలో కేటగిరీల వారీగా వేతనాలు

జీపీ కార్మికులకు మూడు గ్రేడ్లుగా అమలు : గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కర్నాటకలో కేటగిరీల వారీగా మూడు గ్రేడులుగా జీపీ కార్మికులకు వేతనాలు అమల వుతున్నాయని తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్, ప్రధాన కార్యదర్శి ఎస్.యజ్ఞనారాయణ వెల్లడించారు. బుధవారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువ వేతనాలు ఇస్తున్నామని మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, హరీశ్‌రావు ప్రకటించడం పూర్తి అవాస్తమని పేర్కొన్నారు. కర్నాటకలో తెలంగాణ కంటే ఎక్కువ వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. శానిటరీ, బిల్ కలెక్టర్లు, స్వీపింగ్ మిషన్ డ్రైవర్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, పంప్ ఆపరేటర్లు, స్వీపర్లను ప్రతి విభాగంలోనూ కార్మికులను మూడు గ్రేడులుగా విభజించి కనీస వేతనాలు ఇస్తున్నారని ఆధారాలతో చూపించారు.

యుసిసిలో ఏముందో తెలియదు

ముస్లిం పెద్దలతో ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి



అమరావతి : ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి)లో ఏముందో తెలియదని, దానికి సంబంధించి ఇంతవరకు ముసాయిదా రాలేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిమ్ మత పెద్దలకు తెలిపారు. దీనిపై ఆందోళన అవసరం లేదని అన్నారు. ఉమ్మడి పౌర స్మృతి బిల్లు ప్రవేశపెడుతున్న నేపథ్యంలో పలువురు ముస్లిం మత పెద్దలు బుధవారం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో జగన్‌ను కలిశారు. యుసిసిపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. దీనిపై సిఎం మాట్లాడుతూ.. యుసిసిపై భయాందోళనలకు గురికావొద్దని, ముస్లిముల మనసు నొప్పించేలా వైసిపి ప్రభుత్వం ఎప్పుడూ వ్యవహరించదని తెలిపారు. ముసాయిదాలో ఏమున్నాయో తెలియదని, మీడియాలో వచ్చిన అంశాల ఆధారంగా ముస్లిములు తమ మనోభావాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఒక రాష్ట్రానికి పాలకుడిగా తాను ఉన్నానని, ఇదే విషయంలో మీరైతే ఏమిచేస్తారో చెప్పాలని వారిని ప్రశ్నించారు. ముస్లిం ఆడబిడ్డల విషయంలో జరుగుతున్న చర్చను ముస్లిం మత పెద్దలు తిప్పికొట్టాలని కోరారు. మహిళలకు సమాన హక్కుల విషయంలో రాజీలేదని పేర్కొన్నారు. దేశం భిన్నమైందని, అనేక మతాలు, కులాలు, వర్గాలు ఉన్నాయని తెలిపారు. వారి మత గ్రంథాలు, విశ్వాసాలు, ఆచరించే సంప్రదాయాల ఆధారంగా వారికి వారి పర్సనల్ లా బోర్డులు ఉన్నాయని వివరించారు. బోర్డుల ద్వారా చేయాలని అన్నారు.ప్రభుత్వం కలిసి వివిధ మతాలకు చెందిన సంస్థలను, వారి పర్సనల్ లా బోర్డులతో కలిసి అవసరమైతే మార్పు జరగాలే తప్ప వేరే పద్ధతిలో జరిగితే ఇది ఇంత భిన్నత్వం ఉన్న మన దేశంలో తగదని అన్నారు.

28న పీజీఈసెట్ ప్రవేశాల నోటిఫికేషన్

- 31 నుంచి ధ్రువపత్రాల పరిశీలన
- ఆగస్టు 21 నుంచి వెబ్ఆప్షన్ల నమోదు
- 26న మొదటివిడత సీట్ల కేటాయింపు
- షెడ్యూల్ విడుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంఈ/ఎంటెక్‌తోపాటు ఎంఫార్మసీ, ఎంఆర్క్, ఫార్మా-డీ(పీబీ) కోర్సుల్లో ప్రవేశాల కోసం పోస్టు గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీజీఈసెట్) నోటిఫికేషన్ ఈనెల 28న విడుదల కానుంది. బుధవారం హైదరాబాద్‌లో పీజీఈసెట్ ప్రవేశాల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్లు వి వెంకట రమణ, ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, పీజీఈసెట్ ప్రవేశాల కన్వీనర్ పి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం షెడ్యూల్‌ను విడుదల చేశారు. పీజీఈసెట్ మొదటి విడత కౌన్సెలింగ్‌లో భాగంగా ఈనెల 31 నుంచి వచ్చేనెల 18 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌తోపాటు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని వివరించారు. వచ్చేనెల ఏడు నుంచి తొమ్మిది వరకు ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల (ఎన్‌సీసీ, సీఏపీ, పీహెచ్, స్పోర్ట్స్)కు భౌతిక పరిశీలన ఉంటుందని తెలిపారు. అదేనెల 20న అర్హులైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని పేర్కొన్నారు. 21 నుంచి 23 వరకు వెబ్ఆప్షన్ల నమోదుకు అవకాశముంటుందని వివరించారు. 26న మొదటివిడత సీట్లు కేటాయిస్తామని తెలిపారు. 28 నుంచి 30 వరకు కాలేజీల్లో రిపోర్టు చేయాలనీ, ఒరిజినల్ ధ్రువపత్రాలతో ట్యూషన్ ఫీజు చెల్లించాలని కోరారు. సెప్టెంబర్ నాలుగున పీజీఈసెట్ ప్రవేశాల నోటిఫికేషన్‌ను జారీ చేస్తామని పేర్కొన్నారు. అదేనెల 4 నుంచి ఎనిమిది వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌తోపాటు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. 11, 12 తేదీల్లో వెబ్ఆప్షన్లను నమోదు చేయాలని సూచించారు. 16న సీట్లు కేటాయిస్తామని వివరించారు. 19 నుంచి 23 వరకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలనీ, ట్యూషన్ ఫీజు చెల్లించి ఒరిజినల్ ధ్రువపత్రాలను సమర్పించాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ 19 నుంచి పీజీఈసెట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇతర వివరాలకు ఈనెల 28 నుంచి http://pgecetadm.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

పుస్తకాలు అడిగితే పోలీస్ జులుం

ఏపీ ఇంటర్‌బోర్డు వద్ద ఎస్ఎఫ్ఐ ఆందోళన



అమరావతి : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ఆందోళన నిర్వహిం చిన ఎస్ఎఫ్ఐ నాయకులను రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో అరెస్టులు చేయించింది. ఖాళీ అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ బుధవారం ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం వద్ద ధర్నాకు పిలుపునిచ్చింది. బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని బోర్డు వద్దకు చేరుకు న్నారు. అక్కడే బైఠాయించి పుస్తకాలు ఇవ్వాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమానికి అనుమతి లేదని పోలీసులు వారిని బలవంతంగా తరలించేందుకు ప్రయత్నించగా.. నాయకులు ప్రతిఘటించారు. ఈ నేపథ్యంలో అక్కడ స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు వారిని బలవంతంగా ఈడ్చుకెళ్లి వ్యాన్‌లలో పడేశారు. అక్కడ నుంచి మంగళగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లోని విద్యా ర్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. పేద విద్యార్థులకు పుస్తకాలు పంపి ణీకి ప్రభుత్వం నిరాకరిస్తుందంటే వారి చదువును దూరం చేయడమే తప్ప మరొకటి కాదని పేర్కొన్నా రు. అమ్మఒడి బూచి చూపించి ఎగ్గొట్టడం ప్రభుత్వా నికి సిగ్గుచేటు అని ఆగ్రహించారు. జూని యర్ కళా శాలల్లో 3 వేలకు పైగా అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయకపోవడం దుర్మార్గమన్నారు. పుస్త కాలు, అధ్యాపకులు లేకపోవడంతోనే గత విద్యా సంవత్సరం జూనియర్ కళాశాలల్లో 36 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారని, ప్రభుత్వం దీనిని గుర్తుంచుకోవాలని అన్నారు. 474 కళాశాల ల్లో 210 ప్రిన్సిపల్స్ లేరని, 26 జిల్లాలకు రెగ్యులర్ ఆర్ఐఒలు, 13 డిప్యూటీ ఇఒలు లేరని చెప్పారు. దీనివల్ల ఇంటర్మీడియట్ అడ్మినిస్ట్రేషన్ సిలబస్ ప్రణాళిక తూతూ మంత్రంగా నడుస్తుందని పేర్కొ న్నారు. ఇంటర్ విద్యార్థులకు గత ప్రభుత్వం అమలు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం నిలిపే సిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'నేను విన్నాను' అన్న సిఎం జగన్‌కు విద్యార్థుల దగ్గర నుంచి కూడు లాక్కోవడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ఉపాధ్యక్షులు రమేష్, సిహెచ్ వెంకటేశ్వరరావు, నాయ కులు రాజా, ఎం సోమేశ్వరరావు, కుమార స్వామి, రాజు,నవిత, జ్యోతి, రత్నకుమారి, బాలాజీ ఉన్నారు.



అరెస్టులను ఖండించిన సీపీఐ(ఎం)

సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థి నాయకులను అరెస్టు చేయడాన్ని సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కమిటీ ఖండించింది. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం వర్తింపజేయాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టు లను భర్తీ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఒక ప్రకట నలో డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన కోర్కెలు తీర్చాల్సిన ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయో గించి నాయ కులను అరెస్టు చేయడం గర్హనీయమని పేర్కొన్నారు.

అరెస్టయిన వారిని పరామర్శించిన మధు

పోలీసులు అరెస్టు చేసిన వారిని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పి మధు పరామర్శించారు. పోలీస్ స్టేషన్ నుంచి విడుదలైన వారిని మంగళగిరిలోని పరామర్శించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. విద్యారంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న విధానాల వల్ల పేదలకు విద్య దూరమయ్యే దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో ఇప్పటికే ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టడంతో అది చదవలేని పేదలు చదువుకు దూరమవుతున్నారని అన్నారు. మూడు, నాలుగు, ఐదు తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడం వల్ల లక్షల మంది విద్యార్థులు స్కూళ్లకు వెల్లడం లేదని తెలిపారు. టీచర్ పోస్టులను భర్తీ చేయని దృష్ట్యా ఉత్తీర్ణత శాతం తగ్గుతోందని, ఈ అంశాన్ని ప్రభుత్వం విస్మరిస్తోం దని విమర్శించారు. విద్యా రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో నిధులు తగ్గిస్తున్నాయని, పేద లకు విద్యను దూరం చేసే విధానాలను అవలంబి స్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యారంగం లో సమస్యలపై విద్యార్థులు సంఘటితంగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షులు పరమేష్, నాయకులు ఎం బాలాజీ సోమేశ్వరావు, వెంకటేశ్వర్లు, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న పాల్గొన్నారు.

బ్యాంక్‌ల జాతీయికరణపై విస్తృత చర్చ జరగాలి

- పిఎస్‌బిలతోనే సామాజికాభివృద్ధి : ఎఐబిఒసి తెలంగాణ శాఖ వెల్లడి



నవ తెలంగాణ - బిజినెస్ బ్యూరో

భారత ఆర్థిక వ్యవస్థకు ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు వెన్నెముఖలా ఉన్నాయని.. అలాంటి బ్యాంక్‌ల జాతీయికరణపై విస్తృత చర్చను చేపట్టాలని నిర్ణయించామని ఎఐబిఒసి తెలిపింది.

రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు నెలకొన్నప్పటికీ బ్యాంక్‌ల జాతీయికరణ దినోత్సవం సందర్భంగా పలు చోట్లలో బ్యాంక్ అధికారులు మొక్కలు నాటడం, ర్యాలీలు, సదస్సులు నిర్వహించడం చేశారని వెల్లడించింది. హైదరాబాద్‌లోని ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫిడరేషన్ (ఎఐబిఒసి) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జి నాగేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ.. బడుగు బలహీనవర్గాలకు ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు మాత్రమే సేవలందిస్తున్నాయని అన్నారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి దోహదం చేస్తున్నాయన్నారు. స్వాతంత్ర్యం ముందూ, తర్వాత కూడా భారత బ్యాంక్‌లు ప్రయివేటు సంస్థలు, వ్యక్తుల చేతుల్లో ఉన్నాయన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి 1969 జులై 19న అప్పటి కేంద్ర ప్రభుత్వం 14 బ్యాంక్‌లను ప్రభుత్వపరం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 1980లో మరో 8 బ్యాంక్‌లను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొచ్చారన్నారు. ఈ నెల చివరి వరకు బ్యాంక్‌ల జాతీయికరణ పై విస్తృత చర్చ చేపట్టాలని ఎఐబిఒసి కేంద్ర కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ క్రమంలో విద్యా సంస్థల్లో సదస్సులు, ఇతర అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని భావించామన్నారు. పిఎస్‌బిలు దేశ ప్రజల ఆర్థిక అవసరాలను తీర్చుతున్నాయన్నారు. ఈ సమావేశంలో ఎఐబిఒసి నేతలు రాజ్ కుమార్, సతీష్, వెంకన్న, కె అంజనేయ ప్రసాద్, ఎం విక్రమ్, ఐ క్రిష్ణం రాజు, టి హనుమంతరావు, సిఆర్ భీమ్‌సింగ్, టిఎన్ రవి ప్రకాష్, హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో టర్టెల్ వ్యాక్స్ కార్యకలాపాల విస్తరణ



హైదరాబాద్ : చికాగో కేంద్రంగా కార్ కేర్ సేవలనందిస్తున్న టర్టెల్ వ్యాక్స్ హైదరాబాద్‌లో తన కార్యకలాపాలు విస్తరించింది. జెనెక్స్, ఎక్సోడర్, ఇండియన్ డెకార్స్ సహకారంతో మాదాపూర్‌లో నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. బుధవారం దీన్ని టర్టెల్ వ్యాక్స్ గ్లోబల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ లారీ కింగ్, టర్టెల్ వ్యాక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సాజన్ మురళీ పురవంగర లాంచనంగా ప్రారంభించారు. నగరంలో తమకు ఇప్పటికే రెండు స్టూడియోలు ఉన్నాయని సాజన్ మురళీ తెలిపారు. అల్ట్రా మోడ్రన్ టర్టెల్ వ్యాక్స్ డిటైలింగ్ సాంకేతితలతో పాటుగా అత్యున్నత అర్హతలు, సుశిక్షితులైన సేవా సిబ్బందిని కలిగిన ఈ టర్టెల్ వ్యాక్స్ కార్ కేర్ స్టూడియోలు విస్తృత శ్రేణీ కార్ డిటైలింగ్ సేవలు, ఉత్పత్తులను కారు ప్రియుల అభిరుచులకు తగినట్లుగా అందిస్తామన్నారు. సమగ్రమైన ప్రీమియం ఇంటీరియర్ డిజైనింగ్‌లు చేస్తామన్నారు.